# క్రాంతి

లోపలి పేజీల్లో

బుష్ పర్యటన............................8
జాతీయ ఉపాధి పథకం...........13
మావోయిస్టు ప్రతిఘటన..........17
మార్క్సిజం-లెనినిజం.....మధ్యపేజీ
అమరుల చరిత్రలు..................35
పోరాట వార్తలు.......................44
గంగవరం కాల్పులు................48
న్యూడెమోక్రసీపై........................53

సి.పి.ఐ (మావోయిస్టు) ఎ.పి, ఎన్.టి, ఎ.ఒ.బి కమిటీల అధికార పత్రిక

సంపుటి : 30 సంచిక : 2 మార్చి- ఏప్రిల్ 2006 వెల: ఐదు రూపాయలు

## నయా ఉదారవాద విధానాలతో సామ్రాజ్యవాదులకు ఊడిగం చేస్తున్న 2006-07 కేంద్ర బడ్జెట్

కేంద్రంలోని యు.పి.ఎ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రి పళనియప్పన్ చిదంబరం 2006-07కు గాను ఆర్థిక బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టాడు. అభివృద్ధి, సమానత్వం, సాంఘిక న్యాయం అనే సూత్రాలను మనసులో పెట్టుకొని బడ్జెట్ ప్రతిపాదనలను తయారు చేసినట్టు చిదంబరం ప్రకటించాడు. ఈ బడ్జెట్ అసలైన భారతదేశం కోసం రూపొందినదనీ, వ్యవసాయరంగం ఎదుర్కొంటున్న సమస్యలను నివృత్తి చేయడానికీ, మౌలిక వసతుల రంగాన్ని మెరుగు పరచడానికి, దృష్టి కేంద్రీకరించిందనీ అన్నాడు. "దేశ ప్రజలకు శుభవార్త", " ఈ బడ్జెట్‌లో కొత్తగా పన్నులేవీ వేయబోవడం లేదు". అని బడ్జెట్ ప్రసంగంలోనే ప్రకటన చేశాడు. ఇలాంటి ఉదాత్తమైన వ్యాఖ్యానాలు ఎన్నింటినో తన బడ్జెట్ ప్రసంగంలో చిదంబరం ప్రకటించాడు. ఈ ప్రకటనలు చేస్తున్నంతసేపూ పార్లమెంట్‌లో ట్రెజరీ బెంచీల నుండి బల్లలు చరిచి చేసే చప్పుళ్ళూ, కరతాళ ధ్వనులు మారుమోగుతునే వున్నాయి. అవును! ఇలాంటి ప్రకటనల ద్వారా ప్రజలను తెలివిగా మోసం చేయవచ్చు, కనుక వారు తప్పక హర్షధ్వానాలు చేస్తారు. కానీ చిదంబరం ప్రకటించిన బడ్జెట్ ప్రతిపాదనలు తియ్యని పూత పూసిన విషపు గుళికలు. ఈ బడ్జెట్ ప్రజావ్యతిరేక, సామ్రాజ్యవాద, బడావ్యాపార అనుకూల విధానాల కొనసాగింపే. డబ్ల్యు.టి.ఓ, ప్రపంచబ్యాంకు, ఐ.ఎం.ఎఫ్‌ల ఎజెండాను ఎంతో వేగవంతంగా ముందుకు తీసుకు వస్తున్నది. గాలి బుడగల్లాంటి బుల్‌స్టాక్‌ల పెరుగుదలకూ, విదేశీ మదుపులకు తలుపులు బార్లా తెరుస్తున్నది. ఇది గ్రామీణ భారత అభివృద్ధికో, ఎలాంటి పన్నులు లేని బడ్జెట్టో అనుకుంటే మోసపోవడమే అవుతుంది.

ఈ బడ్జెట్ ద్వారా బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, బొగ్గు, మైనింగ్, రేవులు, విమానాశ్రయాలు, రిటైల్ రంగాల్లో విదేశీ పెట్టుబడులను ఆహ్వానించి ప్రైవేటీకరణ, సరళీకరణ ప్రక్రియలను వేగవంతం చేస్తున్నారు. ప్రభుత్వం సెక్యూరిటీలను కొనుగోలు చేసేందుకు విదేశీ మదుపు సంస్థలను (ఫారెన్ ఇన్‌వెస్ట్‌మెంట్ ఇన్వెస్టర్స్ - ఎఫ్.ఐ.ఐ) అనుమతిస్తున్నారు. వీరు దేశంలో పెట్టే పెట్టుబడుల విషయంలో సీలింగ్‌ను ఎత్తివేస్తున్నారు. ప్రస్తుతం 81 సేవలపై వున్న 10శాతం పన్నును 12శాతానికి పెంచారు. కొత్తగా మరో 21 సేవలను పన్ను పరిధిలోకి తెచ్చారు. కార్మిక చట్టాల్లో తీవ్రమైన మార్పులు తీసుకొని రావడానికి యు.పి.ఎ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. బడ్జెట్‌కు ముందు ప్రవేశ పెట్టిన ఆర్థిక సర్వేలో భారతదేశం "కార్మిక సంస్కరణలు" విషయంలో చైనా నుండి నేర్చుకోవాలనీ, అక్కడ నూతన కార్మిక మార్కెట్టును సృష్టించగలిగారని చెప్పింది. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాలకు యిచ్చే బడ్జెట్‌ను 10916.61 కోట్లకు తగ్గించారు. రాజ్యాంగానికి ఉన్న ఫెడరల్ స్వభావాన్ని కూడా మార్చి, కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ద్రవ్య అధికారాలను కేంద్రీకృతం చేయడం వల్ల, రాష్ట్రాలు, ఫైనాన్షియల్ మార్కెట్ పైన, ప్రపంచ బ్యాంక్ లాంటి సంస్థలపైన ఆధారపడే పరిస్థితిని కల్పిస్తున్నది. దేశంలో యు.పి.ఏ ప్రభుత్వం అధికారంలోకి

వచ్చిన, గడిచిన రెండు సంవత్సరాల్లో విదేశీ పెట్టుబడులకు తలుపులు బార్లా తెరవబడి, ఈ పెట్టుబడి కలిగిస్తున్న విషపు పరిణామాలు మన కళ్ళముందుకు వస్తున్నాయి. కళింగనగర్, గంగవరం లాంటి చోట్ల ఈ పెట్టుబడి ప్రజలను నిర్వాసితులను చేస్తున్నది. లక్షలాది మంది ప్రజల తలలపై ఈ కత్తి వేలాడుతున్నది. ఈ పెట్టుబడి విధ్వంసానికి వ్యతిరేకంగా మిలిటెంట్ ఆందోళనలకు దిగిన ప్రజలపై ప్రభుత్వాలు కాల్పులు జరిపి చంపేస్తున్నాయి. దేశంలో ఆర్థిక అసమానతలు చాలా తీవ్రస్థాయిలో పెరిగిపోతున్నాయి.

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై మాటల్లో తియ్యదనం- చేతల్లో చిన్నచూపు

గత సంవత్సరం ఋతుపవనాలు చురుగ్గా వుండి వర్షాలు దేశమంతా కురవడంతో వ్యవసాయ వృద్ధిరేటు 2.3శాతంగా వుంది. అయినప్పటికీ గ్రామీణ ప్రజలు నూనె గింజలు, తిండి గింజల కొరతనెదుర్కొంటున్నారు. మనదేశంలో నూటికి 80శాతం ప్రజలు జీవిస్తున్న గ్రామీణ వ్యవస్థను పాలక వర్గాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. 2 సంవత్సరాల క్రితం అధికారంలోకి వచ్చిన యు.పి.ఏ ప్రభుత్వం దేశంలో రెండవ హరిత విప్లవాన్ని ప్రారంభిస్తామని, వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తామని ప్రజల్లో ఆశలు రేకెత్తించింది. ఈ రెండు సంవత్సరాల్లో ఈ ప్రభుత్వం కూడా గ్రామీణ ప్రాంతాల్ని తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేస్తోంది. బడ్జెట్‌లో రైతులకు స్వల్పకాలిక ఋణాలపై వడ్డీరేటును 9శాతంనుండి 7శాతానికి తగ్గించారు. కానీ ఈ 7శాతం కూడా రైతాంగానికి మోయరాని భారంగానే వుంటుంది.

ఆర్థిక మంత్రి చిదంబరం బడ్జెట్ ప్రకటనలో పేర్కొన్నట్టుగా, జాతీయ నమూనా సర్వే (ఎన్.ఎస్.ఎస్) ప్రకారం మొత్తం వ్యవసాయదారుల్లో 27శాతం మందికి సంస్థాగత ఋణాలు లభిస్తుండగా, 22శాతం మందికి సంస్థాగతయేతర ఋణాలు లభిస్తున్నాయి. అంటే సగానికి పైగా రైతాంగానికి ఏ ఋణం అందుబాటులో వుండడం లేదు. దీనివల్ల బడ్జెట్‌లో వడ్డీరేటు తగ్గించినప్పటికీ అత్యధిక రైతాంగానికి ఉపయోగం లేదు. ప్రభుత్వ బ్యాంకుల్లో భాగమైన గ్రామీణ బ్యాంకులను ప్రభుత్వం మూసివేయడం, ప్రైవేటు బ్యాంకులు అనేక షరతులతో ఋణాలు ఇవ్వడం వలన వడ్డీ వ్యాపారుల దగ్గర సులభంగా దొరికే ఋణం కోసం వెళ్ళి వాళ్ళ కబంధ హస్తాల్లో చిక్కుకొంటున్నారు. వీరు విధించే అత్యధిక వడ్డీరేటుకుతోడు, పంటలకు గిట్టుబాటు ధర లభించక పోయేసరికి, ఋణభారంతో రైతాంగం ఆత్మహత్యలు చేసుకుంటున్నది. యు.పి.ఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2సంవత్సరాల్లో ఆంధ్రప్రదేశ్‌లో 4 వేల మంది, విదర్భలో 2 వేల మంది, కేరళ, కర్నాటకలో కూడా పెద్ద మొత్తంలోనే రైతాంగం ఆత్మహత్యలు చేసుకున్నారు. జాతీయ రైతు కమీషన్ సూచించిన పంటల ధరల హెచ్చుతగ్గుల నుంచి రైతులను రక్షించేందుకు ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయడం, పంటల బీమాను విస్తరించడం వంటి సిఫారసులను వేటినీ ఈ బడ్జెట్‌లో పట్టించుకోలేదు. నూతన పేటెంట్ విత్తన చట్టాలు భారత వ్యవసాయం మీద వినాశకరమైన ప్రభావం చూపిస్తున్నాయి. ఈ రెండూ డబ్ల్యు.టి.ఓ ముందుకు తీసుకు వచ్చినవే. జన్యు మార్పిడితో తయారు చేసిన బి.టి కాటన్ విత్తనాల వలన ఒక వైపు రైతాంగ ఆత్మహత్యలు పెరగ్గా మరోవైపు ఈ పంటలో గల విషపు గడ్డి మొక్కలను తినడం వలన వందలాది మూగజీవులు చనిపోతున్నాయి.

యు.పి.ఎ ప్రభుత్వ విధానాల వలన గ్రామీణ నిరుద్యోగం పురుషుల్లో 5.6శాతం నుండి 9.0శాతం పెరగగా, స్త్రీలలో 5.6శాతం నుండి 9.3శాతంకు పెరిగింది. అలాగే పట్టణ ప్రాంతాల్లో మగ నిరుద్యోగుల శాతం 6.7 నుండి 8.1కి, స్త్రీల నిరుద్యోగ శాతం 10.5 నుండి 11.7కు పెరిగింది. ఈ నిరుద్యోగ సమస్యను పరిష్కరించటానికి యు.పి.ఎ ప్రభుత్వం ఎన్నికల్లో చేసిన వాగ్దానాలు బుట్ట దాఖలయ్యాయి.

మరోవైపు వ్యవసాయ వృద్ధికి పెట్టుబడులు ఏవీ కూడా ఆర్థికమంత్రి ప్రకటించలేదు. నీటి పారుదల లాంటి కీలకమైన రంగానికి కేవలం రూ. 11వేల కోట్లు మాత్రమే కేటాయించారు. దేశంలో 6లక్షల హెక్టార్లకు అదనంగా నీటి వసతి కల్పిస్తామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వపు జల యజ్ఞానికి తమవంతు సహాయం చేస్తామని చెప్పిన మన్మోహన్ ప్రభుత్వం, వీటి కోసం కేటాయించిన డబ్బు ఏ మూలకు సరిపోతుందో ఆలోచించాలి.

గత ఏడాది బడ్జెట్‌లో ఆహార సబ్సిడీకై 26,200 కోట్లను కేటాయించారు. సవరించిన అంచనాల ప్రకారం 23,200 కోట్లను ఖర్చు చేశారు. 2006-07 బడ్జెట్‌లో ఆహార సబ్సిడీలకు 24,200 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇలా ఆహార సబ్సిడీపై కేంద్ర వ్యయం తగ్గించనుంది. జాతీయ ఉపాధి చట్టం రావడంతో పనికి ఆహార పథకం నిధులను ఉపాధి పథకానికి మళ్ళించారు. దీనితో పనికి ఆహార పథకం అదృశ్యమైంది. ఈ రెండు చర్యల వలన గ్రామాల్లో ఆహార సమస్య చాలా తీవ్రమవుతుంది. ప్రభుత్వం చెప్పుకుంటున్నట్లుగా జాతీయ ఉపాధి పథకం ద్వారా వ్యవసాయ కూలీల కొనుగోలు శక్తి పెరిగితే, ఆహారంపై సబ్సిడీలు తగ్గించడం, పనికి ఆహార పథకాన్ని నిలిపి వేయడం వలన ప్రజా పంపిణీ వ్యవస్థ దెబ్బతిని వ్యవసాయ కూలీల పరిస్థితి దుర్భరమవుతుంది.

## ప్రజలపై 'సేవా' పన్ను పోటు-పెట్టుబడిదార్లకు అనేక రాయితీలు


ఈ బడ్జెట్‌లో 'ఎలాంటి పన్నులు వేయబోవడం లేదు' అంటూనే ఆర్థికమంత్రి వివిధ వర్గాల నడ్డి విరిగేలా పన్నులు వడ్డించాడు. ప్రస్తుతం 81 సేవలపై వున్న 10శాతం పన్నులను 12శాతానికి పెంచాడు. కొత్తగా మరో 21 సేవలను పన్ను పరిధిలోకి తెచ్చాడు. ప్రజలపై 11,500 కోట్ల అదనపు భారాన్ని మోపాడు. దీని మూలంగా మధ్య తరగతికి అందుబాటులో వున్న లాండ్ ఫోన్, మొబైల్ ఫోన్, అపార్ట్ మెంట్ కొనాలనుకుంటే, బట్టల డ్రై క్లీనింగ్, కేబుల్ టి.వి, కొరియర్, బీమా, కేటరింగ్‌లు వంటి సేవలు మరింత ప్రియం అవుతున్నాయి. ఎక్సైజ్ సుంకాలు తగ్గించడం వలన కార్ల ధర రూ. 20వేలకు తగ్గింది. కూల్‌డ్రింక్‌లపై సుంకాలు తగ్గించారు. ఇవి ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడేవి కావు. దేశీయంగా ఉత్పత్తి అవుతోన్న ముడి చమురుపై సెస్సును పెంచారు. ఇది చమురు కంపెనీల ఆర్థిక స్థితిని దెబ్బతీస్తుంది. కాల క్రమేణా ఈ పెరిగిన సెస్సు భారాన్ని చమురు వినియోగదారులే భరించాల్సి వుంటుంది. ఇలా ఆర్థికమంత్రి కంటికి కన్పించేలా ఎటువంటి పన్ను భారాన్ని ప్రజలపై మోపకుండానే, మరో విధంగా పన్ను పెంపుతో ఆదాయ వనరులు పెంచడానికి ప్రయత్నించాడు. ఇదే 'చిదంబర' రహస్యం.


కస్టమ్స్, ఎక్సైజ్ సుంకాల్లో రాయితీలు ఇవ్వడం వలన పెట్టుబడిదారులకు గణనీయంగా లాభాలు చేకూరుతున్నాయి. చిన్న కార్లు, ప్యాకేజ్డ్ ఫుడ్, ఫుడ్ ప్రాసెసింగ్, సిమెంట్, ఎరువుల కంపెనీలకు, చెప్పులు, బూట్లు, మందులు, టెక్స్‌టైల్, మౌలిక రంగంలోని కంపెనీలకు మార్చి 2009 వరకు రాయితీలను ఇచ్చాడు. స్టీల్, విద్యుత్ కంపెనీలకు సుంకాల్లో రాయితీలను ఇచ్చాడు. దీని వలన ఈ కంపెనీలకు కోట్లాది రూపాయల లాభాలు చేకూరుతున్నాయి. బడ్జెట్‌లో 6వేల కోట్ల పన్ను ప్రతిపాదనలతో కేంద్ర ప్రభుత్వానికి 2006-07లో వచ్చే మొత్తం ఆదాయం రూ. 72,012 కోట్లు పెరిగింది. 2005-06తో పోలిస్తే ఇది 19.5శాతం ఎక్కువ. ప్రత్యక్ష పన్నుల ప్రతిపాదన ద్వారా 4వేల కోట్లు, పరోక్ష పన్నుల ద్వారా 2వేల కోట్ల ఆదాయం లభిస్తుంది.

ఆదాయపు పన్ను, కార్పోరేట్ పన్నురేట్లలో ఎలాంటి మార్పు చేయలేదు. కంపెనీలు తమ ఉద్యోగులకిచ్చే సదుపాయాలపై విధించే ఫ్రింజ్ బెనిఫిట్ టాక్స్ (ఎఫ్.బి.టి)ని కార్మిక వర్గం చేపట్టిన ఆందోళనల వల్లనే సరళతరం చేశారు. పర్యాటకం, ప్రయాణ వ్యయాలపై ఎఫ్.బి.టిని 20శాతం నుండి 5శాతానికి తగ్గించారు. తిండి, వసతి ఏర్పాట్లకు 5శాతం పన్నునే వసూలు చేస్తారు. వైద్యంను పన్నునుండి మినహాయించారు. ముఖ్యంగా ఫించన్ పథకంపై పన్ను మినహాయింపు పరిమితిని లక్ష నుండి 2 లక్షలకు పెంచారు.

స్టాక్ మార్కెట్ లావాదేవీలపై విధించే సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ పన్నును 25శాతం పెంచారు. కస్టమ్స్ సుంకాలను ఆసియాన్ స్థాయికి తేవడంలో భాగంగా వ్యవసాయేతర ఉత్పత్తులకు గరిష్ట కస్టమ్స్ రేటును 15 నుంచి 12.5 శాతానికి తగ్గించారు. కార్పోరేట్ లాభాలపై ప్రత్యామ్నాయ పన్నును(మ్యాట్) 7.5శాతం నుంచి 10శాతానికి పెంచారు.

2006-07 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ. 5,63,991 కోట్లు ఖర్చు చేస్తుంది. ఇందులో ప్రణాళికేతర వ్యయం రూ. 3,91,263 కోట్లుగా వుంది. ప్రభుత్వ ఆదాయ వ్యయాలను ఈ కింది పట్టికల ద్వారా అర్థం చేసుకోవచ్చు.




2006-07సంవత్సరానికి స్థూల దేశీయోత్పత్తి(జి.డి.పి)లో రెవిన్యూ లోటును 2.1శాతానికి, ద్రవ్యలోటును 3.8శాతానికి తగ్గిస్తారు. ప్రపంచబ్యాంకు, ఐ.ఎం.ఎఫ్ ఆదేశాల మేరకు

ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ బడ్జెట్ మేనేజిమెంట్ యాక్ట్ (FRBMA) లో భాగంగా ఈ చర్యలను ఎన్.డి.ఎ చేపట్టింది. వీటిని యు.పి.ఎ కూడా కొనసాగిస్తోంది. 2008-09 ఆర్థిక సంవత్సరంలోగా రెవిన్యూ లోటును పూర్తిగా అదృశ్యం చేస్తానని చిదంబరం చెబుతూ వస్తున్నాడు. అంటే ప్రజలపై మోయరాని భారం పడుతుందని అర్థం చేసుకోవచ్చు.

మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు మండిపోతున్నాయి. అన్నింటిలోకి ప్రజలు నేడు తీవ్రంగా ఎదుర్కొంటున్న సమస్య చుక్కలనంటుతున్న ధరలే. ప్రభుత్వాలు ద్రవ్యోల్బణాన్ని 5 శాతం కంటే తక్కువగా చూపుతున్నాయి. కాని నిత్యావసర వస్తువుల ధరలు ద్రవ్యోల్బణాన్ని రెండంకెలుగా చూపెడుతున్నది. దేశ ఆర్థిక అభివృద్ధి రేటు 8శాతానికి చేరిందని, దీన్ని 10శాతంకు పెంచాలని చెబుతున్నాయి. విదేశీ మారక ద్రవ్య నిల్వలు సమృద్ధిగా వున్నాయని చెబుతున్నాయి. కాని దేశంలో ఆర్థిక అసమానతలు తీవ్రస్థాయిలో పెరిగి ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురి అవుతున్నారు. బడ్జెట్‌లో చిన్నకార్లు, సాఫ్ట్‌డ్రింక్‌లు లాంటి ఆడంబర వస్తువులపై సుంకాలు తగ్గించి, నిత్యావసర వస్తువులపై ధరలు విపరీతంగా పెంచుతున్నాయి. మెజారిటీ ప్రజలపై పన్నుల భారాన్ని మోపుతున్నాయి.

### విదేశీ పెట్టుబడులకు ఊతం ఇస్తున్న యు.పి.ఎ బడ్జెట్

సి.పి.ఐ, సి.పి.ఎంతో కూడిన వామపక్షాల మద్దతుతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం సామ్రాజ్యవాదుల పెట్టుబడుల కోసం అర్రులు చాస్తున్నది. ఈ ప్రభుత్వం అధికారం చేపట్టగానే డిజిన్‌వెస్ట్‌మెంట్ మంత్రివర్గ శాఖను రద్దు చేసినప్పటికీ, దేశంలో ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు (ఎఫ్.డి.ఐ) ప్రవాహంలా చొచ్చుక వస్తున్నాయి. సంవత్సరానికి 700 కోట్ల డాలర్ల పెట్టుబడి వివిధ సంస్థల ద్వారా మన దేశానికి చేరుతున్నది. ఈ పెట్టుబడి ఎల్.ఐ.సి, బ్యాంకులు, విమానాశ్రయాల ప్రైవేటీకరణ, పోర్టుల ప్రైవేటీకరణ, గనులు, మైనింగ్, రిటైల్ రంగాల్లోకి వస్తున్నాయి. వామపక్షాలకు, కాంగ్రెస్ పార్టీకి ఈ ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులను పై రంగాల్లో అనుమతించడంలో భేదాభిప్రాయాలు వున్నట్లుగా అగుపించినప్పటికీ, వీళ్ళందరికీ ఈ పెట్టుబడులపై ఒకే అవగాహన వుంది. వామపక్షాలు దేశ ప్రజలను మోసగించడానికి కాంగ్రెస్‌తో పెనుగులాట సాగిస్తూనే చివరకు రాజీ పడటంతో పాటు తాము అధికారంలో వున్న పశ్చిమ బెంగాల్‌లో కూడా పెద్దయెత్తున ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులను షరతులకు లోబడి తెచ్చుకుంటున్నారు.

'విద్యుత్, బొగ్గు, టెలికాం, నౌకా రవాణా, పౌర విమానయాన రంగాల్లో పెట్టుబడులకు పెద్ద ఊతం ఇస్తున్నాం. రిటైల్ రంగంలో కూడా కొద్దిగా ద్వారాలు తెరిచాం' అని చిదంబరం ప్రకటించాడు. అందులో భాగంగానే సింగిల్‌బ్రాండ్ విదేశీ కంపెనీలు మన దేశంలో రిటైల్ కేంద్రాలను ప్రారంభించుకొనేందుకు అనుమతిస్తూ కేంద్రం నిర్ణయించింది. భవిష్యత్తులో మొత్తం రిటైల్ వ్యాపారంలోని అన్ని రంగాల్లోనూ విదేశీ పెట్టుబడులను అనుమతించేందుకు ఇది తొలి అడుగుగా చెప్పవచ్చు. 3.95 కోట్ల మంది అసంఘటిత రిటైల్ వ్యాపారంలో ఉపాధి పొందగా, కేవలం ఐదు లక్షలమంది రిటైల్ వ్యాపారంలో పని చేస్తున్నారు. విదేశీ పెట్టుబడిదారులైన వాల్‌మార్ట్ లాంటి సంస్థలు అతి తక్కువమంది ఉద్యోగులతో ఎక్కువ వ్యాపారం చేస్తాయి. అందువల్ల 10లక్షల మంది జనాభా గల 35 భారతీయ నగరాల్లో గనుక వాల్‌మార్ట్ స్టోర్స్ ఏర్పాటు చేస్తే అతి తక్కువమందితో అతి ఎక్కువ వ్యాపారం చేయడం వలన సుమారు 4.32 లక్షల మంది దేశంలో ఉపాధి కోల్పోతారు. ఒక వేళ భారతదేశంలోని మొత్తం రిటైల్ వ్యాపారంలో గనుక వాల్‌మార్ట్ లాంటి సంస్థలు కేవలం 20శాతం వాటాను పొందగలిగినా కూడా 8 కోట్ల మంది జీవనాన్ని కోల్పోతారు.

షేర్ మార్కెట్‌లో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సెన్సెక్స్ సూచిక ఎన్నడూ లేని విధంగా 12 వేల పాయింట్లను దాటి తారాజువ్వలా ఎగుస్తున్నది. పెట్టుబడిదారులు, షేర్ హోల్డర్స్, బ్రోకర్స్ అందరూ సంబరాలు జరుపుకున్నారు. ఈ పెరుగుదలకు మన దేశ ఆర్థిక వ్యవస్థ పెరుగుదలకు సరాసరి సంబంధమేమీ లేదు. సెన్సెక్స్ పెరిగిందంటే దేశ ఆర్థిక వ్యవస్థ పెరిగిందని అర్థం కాదు. షేర్ మార్కెట్ ఒక జూదం లాంటిది. ఈ షేర్ మార్కెట్‌ను విదేశీ మదుపు సంస్థలు శాసిస్తున్నాయి. ప్రతిరోజూ 14వందల బిలియన్ డాలర్లు ఎఫ్.ఐ.ఐల ద్వారా దేశం సరిహద్దులు దాటి ఎక్కువ లాభాలు వచ్చే చోటికి పరుగులు తీస్తున్నాయి. మన దేశానికి లక్షన్నర కోట్ల రూపాయలకు పైగా ఈ పెట్టుబడి చేరింది. ఈ పెట్టుబడి స్టాక్ ఎక్స్ఛేంజి సూచికను అనూహ్యంగా పెంచడం, దెబ్బతీయడం రెండూ చేయగలుగుతుంది. ప్రభుత్వం ఎఫ్.ఐ.ఐలకు భారీ పన్ను వెసులుబాటు ఇవ్వడం వలన మన దేశంలోకి చొచ్చుక వస్తున్నాయి. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వ సెక్యూరిటీస్‌లో ఎఫ్.ఐ.ఐ పెట్టుబడుల పరిమితిని 175 కోట్ల డాలర్ల నుండి 200 కోట్ల డాలర్లకు పెంచారు. విదేశాల్లో ట్రేడ్ అయ్యే కొన్ని ఫండ్స్‌లో 100కోట్ల డాలర్ల వరకు పెట్టుబడి పెట్టేందుకు కొన్ని ఎంపిక చేసిన మ్యూచ్‌వల్ ఫండ్స్‌కు అనుమతినిచ్చారు. ఇవి చాలా ప్రమాదకరమైన చర్యలు. దీనివల్ల దేశీయ సేవింగ్స్ అన్నీ దెబ్బ తింటాయి. ఎఫ్.ఐ.ఐలకు అడ్డూ అదుపూ వుండదు.

ఇక చిన్న తరహా పరిశ్రమల విషయానికొస్తే గత

సంవత్సరం బడ్జెట్ లాగానే ఈ సారి కూడా చిన్న తరహా పరిశ్రమలకు రిజర్వు చేసిన ఉత్పత్తుల జాబితా నుండి 118 వస్తువులను తొలగించారు. దీనివల్ల ఈ రంగాల్లోకి పెద్ద యెత్తున విదేశీ పెట్టుబడి ప్రవేశిస్తుంది. ఈ చర్యల వల్ల చిన్న తరహా పెట్టుబడిదారులతో పాటు కార్మిక వర్గం తీవ్రంగా దెబ్బతింటుంది.

## సంక్షేమ పథకాలకు తూట్లు పొడుస్తున్న బడ్జెట్

యు.పి.ఎ ప్రభుత్వం ప్రతిష్టగా తీసికొని ఉమ్మడి కనీస కార్యక్రమంలో భాగంగా ప్రకటించిన ఎనిమిది పతాక సంక్షేమ కార్యక్రమాలకు పెద్ద మొత్తంలో బడ్జెట్ నిధులు కేటాయించామని చిదంబరం ప్రకటించాడు. గత సంవత్సరం 34,927 కోట్లు కేటాయించగా, ఈ సంవత్సరం 50,015 కోట్లు కేటాయించినట్టుగా ప్రకటించాడు. వాస్తవంగా ఈ కేటాయింపులను ఇతర ఉపాధి పథకాలకు గండికొట్టి డబ్బును మళ్ళించడంగా చూడవచ్చు. ఉదాహరణకు జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని ఈ పతాక కార్యక్రమంలో ప్రభుత్వం చేర్చింది. గతంలో అమలులో వున్న ఉపాధి పథకాల కేటాయింపులను ఈ పథకానికి మళ్ళించి తయారు చేసింది. అలాగే ప్రభుత్వం గొప్పగా చెప్పుకొంటున్న సర్వశిక్షా అభియాన్ కార్యక్రమానికి వాగ్దానానికి తక్కువ కేటాయింపులు చేసింది. ఈ కార్యక్రమాన్ని కూడ విదేశీ ఏజన్సీ అయిన డిఎఫ్‌డిఇ నిధులతో నిర్వహిస్తున్నారు. పనికి ఆహార పథకాన్ని అటకెక్కించారు. ఆహార సబ్సిడీలను గణనీయంగా తగ్గించారు. మరోవైపు బడ్జెట్‌లో ఈ సంవత్సరం సబ్సిడీలను తగ్గించారు. గత సంవత్సరం సబ్సిడీలకుగాను 47,432 కోట్లు కేటాయించగా, ఈ సంవత్సరానికి 46,123 కోట్లకు పరిమితం చేశారు.

పై విషయాలను పరిశీలిస్తే ఆచరణలో కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని నామమాత్రం చేస్తున్నారనే విషయం అర్థమౌతుంది. కనీస ఉమ్మడి కార్యక్రమం ప్రాతిపదిక మీద సమైక్య ప్రగతిశీల కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నామనే సి.పి.ఎం దివాళాకోరు రాజకీయాల్ని ఈ బడ్జెట్‌కు వాళ్ళ ఆమోదం తెలపడాన్ని బట్టి సులువుగా గ్రహించవచ్చు.

దళారీ పాలక వర్గాలు అధికారాన్ని చేపట్టిన నుండి రక్షణ, పోలీసు వ్యవస్థ కోసం బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు చేస్తూనే ఉన్నారు. 2006-07కు గాను గత సంవత్సరంతో పోల్చితే ఎక్కువగా కేటాయించి 89 వేల కోట్లకు పెంచారు. దేశ అంతర్గత భద్రతకు ముప్పు మావోయిస్టులతోనే ఉందని ప్రధాన మంత్రి ప్రకటించాడు. ఈ ముప్పును ఎదుర్కోవడానికి పోలీసులకు మరిన్ని నిధులు పెంచారు. ఈ నిధుల్లో చాలా బాగాన్ని ప్రస్తుతం నక్సలిజాన్ని అణచడానికి ఉపయోగిస్తారు. తక్కిన డబ్బును సైనిక కొనుగోళ్ళకు భారీగా కేటాయించారు. రోడ్ల నిర్మాణానికి ఉపయోగిస్తున్నారు.

ఈ బడ్జెట్ ద్వారా యుపిఎ సర్కార్ దళారీ పెట్టుబడిదారులకు, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలు నెరవేర్చడానికి దృఢ నిశ్చయంతో ఉన్నట్టుగా అర్థమవుతున్నది. ఆర్థిక సంస్కరణలకు మానవీయత ఉండాలనీ, గ్రామీణ భారతాభివృద్ధికి కట్టుబడి ఉన్నామనీ, రెండవ హరిత విప్లవం తెస్తామని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుండి మొన్నటి జనవరిలో జరిగిన ఏఐసిసి ప్లీనరీ సమావేశంలో కూడ ఘోషిస్తూనే వున్నారు. కాని ఆర్థిక రంగంలో అసమాన పంపిణీ వలన, అధిక పన్నుల వలన ప్రజలను తమ స్వంత భూముల నుండి ఖాళీ చేయించడం వలన, ప్రజలకు చెందిన సహజ వనరులను సామ్రాజ్యవాదులు దోపిడి చేయడం వలన ప్రజలు మిలిటెంట్ పోరాటాల్లోకి తెగించి కదులుతున్నారు. కేంద్రంలో వామపక్షాల అండతో ప్రగతిశీల ముసుగు వేసుకొన్న యుపిఎ అసలు రంగును బయటపెడుతూ, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడడం ద్వారానే ఈ బడ్జెట్ అసలు స్వరూపాన్ని బహిర్గతం చేయగలం. ❐

*ఏదో ఒక రకం ప్రజా సంఘాలు రద్దు చేయబడవచ్చుగాక, చట్టబద్ధ ట్రేడ్ యూనియన్లను వేధించవచ్చుగాక, విప్లవ ప్రతీఘాత వ్యవస్థలో కార్మికుల చొరవగల ప్రతీ బహిరంగ చర్యనూ పోలీసులు ఏదో ఒక సాకుతో ధ్వంసం చేయవచ్చుగాక, కానీ రష్యా ఇప్పటికే అయిన మాదిరి పెట్టుబడిదారీ దేశంలో కార్మిక జనాల సమీకరణను ఏ శక్తీ నివారించలేదు. ఏదో ఒక విధంగా, చట్టబద్ధంగానో, అర్ధ చట్టబద్ధంగానో, బహిరంగంగానో ప్రచ్ఛన్నంగానో కార్మికవర్గం తన స్వంత కేంద్రాలు కనుక్కుంటుంది.*

*'దారిలో' వ్యాసంనుండి*

*లెనిన్*

# ప్రపంచ బ్యాంక్ నీలినీడల్లో 2006-07 రాష్ట్ర బడ్జెట్

రెండు సంవత్సరాల క్రితం వై.ఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడి పాత్రలో ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ప్రపంచ బ్యాంక్ పాలేరుగా అభివర్ణించాడు. తను ముఖ్యమంత్రి అయిన సంవత్సర కాలంలోనే తానే ప్రపంచ బ్యాంక్ పాలేరుగా అవతారమెత్తాడు. రాష్ట్ర ప్రజల్లో ప్రపంచ బ్యాంకు విధానాలపై ఉన్న తీవ్ర వ్యతిరేకతను సొమ్ము చేసుకోవడానికి వై.ఎస్ ఆరోజు ప్రపంచ బ్యాంక్ ఎలాంటి షరతులకైనా లొంగేది లేదని చెప్పాడు. కాని అధికారంలోకి వచ్చిన 8 నెలల్లోనే ప్రపంచ బ్యాంక్ అధ్యక్షుడు విల్ఫోవుట్జ్‌కు ఎర్ర తివాచి పరిచి స్వాగతం చెప్పాడు. ఆయన మన్నన కోసమే మావోయిస్టు పార్టీ మీద నిషేధాన్ని విధించాడు. రాష్ట్రంలో పచ్చి ఫాసిస్టు నియంతృత్వాన్ని అమలు చేస్తున్నాడు. ప్రపంచబ్యాంకును మళ్ళీ ప్రసన్నం చేసుకోవడానికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు యూజర్ చార్జీలు, ప్రభుత్వ పశు ఆసుపత్రుల్లో పశు వైద్యానికి యూజర్ చార్జీలను తొలగించిన చేత్తోనే ప్రవేశపెట్టాడు. ప్రపంచ బ్యాంకు షరతులకు తలొగ్గి కొత్తగా వ్యవస్థాగత సర్దుబాటు కింద 800 మిలియన్ డాలర్ల (3700 కోట్లు) అప్పు తెచ్చాడు. రాష్ట్రంలో ప్రపంచ బ్యాంక్ కార్యక్రమాలన్నీ యధావిధిగానే కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి 21న రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి కొణిజేటి రోశయ్య శాసన సభలో ప్రవేశపెట్టిన 2006-07 రాష్ట్ర బడ్జెట్, రాష్ట్రంలో మళ్ళీ ప్రపంచ బ్యాంక్ పాలన కొనసాగుతున్న దానికే నిలువెత్తు నిదర్శనంగా ఉంది.

రాష్ట్ర బడ్జెట్ (2006-07)లో ప్రణాళికేతర వ్యయం కింద 40,624.24 కోట్లు, ప్రణాళిక పద్దు కింద 22,903.50 కోట్లు ఖర్చు చేస్తారని అంచనా వేశారు. దీని వల్ల రెవెన్యూలోటు 995.84 కోట్లుగా తేలుతుంది. ద్రవ్యలోటు 8,147.20 కోట్లు ఉండగలదని అంచనా. జడిపిలో రెవెన్యూలోటు 0.40శాతం కాగా ద్రవ్యలోటు 3.25శాతం ఉండవచ్చు. ఈ సంవత్సరం (2005-06) రాష్ట్ర వార్షిక వృద్ధిరేటు 7.55శాతంగా నమోదయింది. రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు పడడంతో ఈ సంవత్సరం వ్యవసాయ రంగం 5.72శాతం వృద్ధి సాధించనుంది. ఇది జాతీయ స్థాయి ప్రాథమిక రంగం అభివృద్ధిపై సుమారు 2శాతం కన్నా చాలా అధికం. ఆహార ధాన్యాల ఉత్పత్తి 2004-05 లో 134 లక్షల టన్నులు కాగా ఈ సంవత్సరం 18 లక్షల టన్నులు అధిక ఉత్పత్తి జరిగి 152 లక్షల టన్నులకు పెరిగింది. వ్యవసాయరంగం అభివృద్ధి పైననే ఆధారపడి ఈ సంవత్సరం రాష్ట్ర వార్షిక వృద్ధిరేటు పెరిగిందనేది వాస్తవం. రాష్ట్రంలో ప్రస్తుత ధరల వద్ద 2004-05లో 23 వేల 153 రూపాయలు ఉన్న తలసరి ఆదాయం 2005-06లో 25,526 రూపాయలకు చేరుతోందని అంచనా వేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో సమర్పించిన ఈ లెక్కలు చూస్తే రాష్ట్రాభివృద్ధి బాగానే జరిగినట్టుగా తెలుస్తుంది. కానీ ఇక్కడొక్క విషయం మనం మరిచిపోవద్దు. ఉత్పత్తి అయిన సంపద ఎలా పంపిణీ చేయబడుతోంది అనేది అసలు సమస్య. 1999-2000లో సర్వే ప్రకారం రాష్ట్రంలో ఆర్థిక అసమానతలు తీవ్రంగా పెరిగిపోయిన విషయం అర్థం అవుతుంది. ఈ 5 సంవత్సరాల కాలంలో ఈ అంతరం మరింతగా పెరిగిపోయిందనే విషయం కూడ సులువుగానే అర్థం చేసుకోవచ్చు. గ్రామాల్లో కింది వర్గాలకు చెందిన 30శాతం ప్రజల తలసరి నెల వ్యయం రూ॥168 ఉంటే, ఉన్నతవర్గాలకు చెందిన 30శాతం ప్రజల వ్యయం రూ॥ 435వుంది. అలాగే నగర వాసుల్లో కింది వర్గాలకు చెందిన 30శాతం ప్రజల తలసరి వ్యయం రూ॥221 ఉంటే, ఉన్నతవర్గాలకు చెందిన 30శాతం ప్రజల వ్యయం రూ॥ 819గా వుంది.

రాష్ట్ర బడ్జెట్‌లో వివిధ రంగాలకు భారీ కేటాయింపులు చేసారు. ఇందులో సాగునీటి రంగానికి 2006-07గాను అత్యధికంగా 10వేల కోట్ల రూపాయలు కేటాయించారు. మౌలిక సదుపాయాల కల్పనకు రూ॥1222 కోట్లు, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధికి రూ॥1602 కోట్లు, పట్టణాభివృద్ధికి రూ॥1024 కోట్లు, విద్యకు రూ॥556 కోట్లు, వైద్యరంగానికి రూ॥ 535 కోట్లు, సంక్షేమ రంగానికి రూ॥1545కోట్లు, బలహీన వర్గాల గృహ నిర్మాణానికి రూ॥ 1161 కోట్లు కేటాయించారు. ఈ భారీ కేటాయింపులను చూపి ఆర్థిక మంత్రి రోశయ్య తమ ప్రభుత్వం సాధించిన గొప్పతనంగా చెప్పుకున్నాడు. అయితే ఇందులో బడ్జెట్ అసలు స్వరూపాన్ని మనం విశ్లేషించాలి.

రాజశేఖర్ రెడ్డి "భారీ ఎత్తున" జల యజ్ఞాన్ని అమలు చేయాలనుకుంటున్నాడు. దీని కోసం బడ్జెట్‌లో భారీ కేటాయింపు చేసారు. కాని ఆదాయంలో పెరుగుదల లేకుండా ఏదో ఒక రంగానికి అధికమొత్తం కేటాయించడం వలన ఇతర రంగాల అభివృద్ధి దెబ్బతింటుంది. ఉదాహరణకు గ్రామీణ అభివృద్ధికి గత ఏడాది 773 కోట్లు కేటాయించితే ఈసారి కేటాయింపు 660 కోట్లకు తగ్గింది. వ్యవసాయం దాని అనుబంధ రంగాలకు 2004-05లో మొత్తం కేటాయింపుల్లో 6.9 శాతం తగ్గగా, 2006-07 3.99 శాతం తగ్గింది. మొత్తం బడ్జెట్ కేటాయింపుల్లో విద్యారంగం వాటా 10.11 శాతం నుండి 9.93 శాతం తగ్గింది. ఇది మొత్తం ప్రభుత్వ వ్యయంలో

కేవలం 0.3శాతం మాత్రమే.

ఇక సాగునీటి కోసం కేటాయింపుల్లో ప్రాంతీయ అసమానతలు స్పష్టంగా కనబడుతున్నాయి. పోలవరం, పులిచింతల ప్రాజెక్టులకు భారీగా కేటాయింపులు చేయగా తెలంగాణాకు ఉపయోగపడే ప్రాజెక్టులయిన ప్రాణహిత, ఎల్లంపల్లి, దేవాదుల, దుమ్ముగూడెం ప్రాజెక్టుల ప్రస్తావన లేకుండా గోదావరి రివర్ అథారిటి పేరుమీద గంపగుత్తగా 1240 కోట్లను మాత్రమే కేటాయించారు. విద్యుత్ రంగానికి గత ఏడాది 1600 కోట్లు కేటాయించితే, ప్రస్తుత బడ్జెట్ కేటాయింపుల్లో 1450 కోట్లకు తగ్గింది. విద్యుత్ రంగానికి కేటాయింపులు తగ్గడం వలన ఉచిత విద్యుత్ విధానంపై ప్రభావం పడుతుంది.

ఈ బడ్జెట్‌లో మౌలిక సౌకర్యాల కల్పనకోసం ఎక్కువ కేటాయింపులు చేసినట్టుగా కనపడినప్పటికీ, ఆ కేటాయింపులను నిశితంగా విడదీసి విశ్లేషిస్తే ఆ కేటాయింపులు అంతర్జాతీయ నిర్మాణ, సలహా, యంత్ర పరికరాల సంస్థలకు, వాటి దేశీయ మిలాఖత్ దార్లకు లాభం చేకూర్చేవితప్ప ప్రజా జీవనం మెరుగుపరిచేవి కావు. ఈ మార్గదర్శకత్వం అంతా ప్రపంచబ్యాంకు ఆదేశాల మేరకు సాగుతుంది. అలాగే ఈ బడ్జెట్‌లో సంక్షేమ రంగాల వ్యయాన్ని తగ్గించారు. విద్యా, ఆరోగ్యరంగాల్లో, ప్రభుత్వ సబ్సిడీల్లో కేటాయింపులు తగ్గించారు. వీటి ప్రభావం ప్రజలపై నెగటివ్‌గా వుంటుంది. దక్షిణాది రాష్ట్రాల్లో మన రాష్ట్రమే విద్యలో వెనుకబడి ఉంది. ముఖ్యంగా చదువుకున్న వారిలో బాలికల శాతం చాలా తక్కువగా వుంది. ఇక దేశంలోనే మన రాజధాని హైదరాబాద్ సూపర్ వైద్యానికి పేరెన్నిక గలదైతే దానికి 300 కి.మీ.ల దూరంలో గల ఆదిలాబాద్ నుండి విశాఖపట్నం వరకూ ఏజెన్సీలో నివసిస్తున్న ఆదివాసులకు మలేరియా, డైయేరియా వ్యాధులతో చికిత్స దొరకక ప్రతి సంవత్సరం వందలాది మంది చనిపోతున్నారు. మొత్తం రాష్ట్రంలో పేద ప్రజలకు మేలైన వైద్యం అందుబాటులో లేక గునియా, మెదడువాపు లాంటి రకరకాల విషపు జ్వరాలతో చనిపోతున్నారు. విద్యుత్ పై సబ్సిడీలు తగ్గించి ఉచిత విద్యుత్ పథకాన్ని నీరుకారుస్తున్నారు. గిట్టుబాటు ధరలు లేక, పంటల బీమా పాలసీ, ప్రభుత్వ రుణాలు అందుబాటులో లేక రాజశేఖర్ రెడ్డి పరిపాలనలో రాష్ట్రంలో నాలుగు వేల రైతాంగం ఆత్మహత్యలు చేసుకుంది. ప్రణాళికేతర వ్యయంలో భాగంగా వివిధ ఉద్యోగవర్గాల జీతభత్యాలు పెరగడం లేదు. ఎన్నో మిలిటెంట్ ఆందోళనలు చేసిన తదుపరి కొద్దిమేరకు జీతాల్లో పెరుగుదల ఉంటున్నది. ఇది దిన దినం పెరుగుతున్న ద్రవ్యోల్బనంతో సరితూగక నిజవేతనాల్లో ఎలాంటి పెరుగుదల లేకుండా వున్నది. మొత్తంగా చూస్తే ప్రపంచ బ్యాంకు ఉక్కుపాదాల కింద రాష్ట్ర ప్రజలు నలిగిపోతున్నారు.

ఇక అసలు విషయానికొస్తే బడ్జెట్‌లో చేసిన భారీ కేటాయింపులు నిలబడుతాయని నమ్మకమేమీ లేదు. ఉదాహరణకు 2005-06 బడ్జెట్‌లో అంచనా వేసినదానికన్నా ఆదాయం 5,000 కోట్లు, ఖర్చు 5400 కోట్లు తగ్గింది. అలాగే 2005-06 సం॥లో బడ్జెట్‌లో అంచనా వేసినదానికి సవరించిన అంచనాలనాటికి ఆదాయం 6,000 కోట్లు, ఖర్చు 5,200కోట్లు తగ్గింది. ఈ బడ్జెట్‌లో భారీ కేటాయింపులకు కూడా ఇదే గతిపట్టక తప్పదు.

కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేనాటికి 50 వేల కోట్లకు పైగా ఉన్న రుణభారం ఇప్పటికే 82 వేల 719.97 కోట్లకు చేరింది. ఈబడ్జెట్‌లో రూ॥8196.67 కోట్లు పాతరుణాల అసలు, వడ్డీల చెల్లింపులకే పోతుంది. అది మొత్తం రెవెన్యూ వసూల్లలో 18శాతం. అంటే రాష్ట్రం అప్పుల వలయంలో చిక్కుకుంది.

ఆర్థిక సంస్కరణలకు, సంక్షేమ కార్యక్రమాలకు పేర్లు మార్చినప్పటికి వాటి దిక్కు మాత్రం మారలేదు. జన్మభూమి పథకం పేరుమారి ప్రజాపథం, ఇందిరమ్మ పథకాలైనప్పటికీ వాటి సారాంశం ఒక్కటే. ఇవన్నీ ప్రపంచ బ్యాంక్ ఆదేశాలమేరకు నడుస్తున్నవే. వైఎస్ఆర్ సాగునీటి పథకాలను ముందుపెట్టి రైతు బిడ్డగా ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం కళ్ళల్లో దుమ్ముకొట్టడానికి ప్రయత్నించినప్పటికీ ఫ్యాబ్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం, గంగవరం పోర్టులాంటి ప్రాజెక్టులన్నీ రాష్ట్రంలో హైటెక్ పరిపాలనను తలపింప చేస్తున్నాయి. రాష్ట్రంలో ఆర్.టి.సి, సింగరేణి సంస్థలను కూడా ప్రైవేటీకరించడానికి తీవ్రప్రయత్నాలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ తాను అధికారంలోకి రావడానికి ప్రజలకిచ్చిన వాగ్దానాలను వేటినీ నెరవేర్చడానికి ప్రయత్నించకపోవడమే కాక ప్రజలు తమ దైనందిన జీవితంలో ఆందోళనలు చేస్తే వాళ్ళ ఒంటిపై లాఠీలు ప్రయోగించడంతోపాటు, వారిపై కాల్పులు చేసి హత్యలు చేస్తున్నది. మరోవైపు విప్లవకారులపై తీవ్రమైన అణచివేత కొనసాగిస్తున్నది. ఎన్‌కౌంటర్‌లు నిత్యకృత్యమైనాయి. సాధారణ ప్రజలు ఎవరూకూడా రాత్రుల్లో బయట తిరగలేని ఫాసిస్టు పాలన రాష్ట్రంలో నేడు నెలకొంది. కాంగ్రెస్ పార్టీ పాలన తెలుగుదేశం పార్టీ పాలనకు భిన్నంగా ఏమీలేదు. కొన్ని విషయాల్లో చంద్రబాబుకంటే వైఎస్ఆర్ కొన్ని ఆకులు ఎక్కువే చదివాడు.

రాష్ట్రంలో ప్రపంచ బ్యాంక్ ఆదేశిక విధానాలను అమలుచేసే బడా భూస్వామ్య, దళారీ నిరంకుశ వర్గాలను అధికారం నుండి కూలదోసి కార్మికవర్గ నాయకత్వంలో జనతా ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని ఏర్పరుచుకొన్నప్పుడే విశాల ప్రజారాశుల నిజమైన ప్రయోజనాలను నెరవేర్చగలిగే ప్రజా బడ్జెట్‌లను రూపొందించుకోగలం. ❐

# వ్యూహాత్మక ప్రయోజనాల కోసమే ప్రపంచ ప్రజల ప్రప్రథమ శత్రువు జార్జ్‌బుష్ భారత పర్యటన

దేశ ప్రజలే కాదు, ప్రపంచ పీడిత ప్రజలందరూ యుద్ధోన్మాది అనీ, నరహంతకుడనీ, రక్తపిపాసి అనీ అసహ్యించుకుంటున్న జార్జిబుష్‌కు భారత పాలకవర్గాలు సాష్టాంగపడి స్వాగతం చెప్పాయి. ఇటువంటి వాడు భూమి మీద ఉండడం భూమండలానికే సిగ్గుచేటని ప్రజలు భావిస్తుంటే, అతడు మన భూమి మీద బూటుకాలు మోపినందుకు పాలకులు మురిసిపోతున్నారు. ప్రపంచానికి ప్రప్రథమ శత్రువని ప్రజలు భావిస్తుంటే పాలకులు మాత్రం అతడి కౌగిలింతకూ, కరచాలనానికీ ఉబ్బితబ్బిబ్బవుతున్నారు.

మన దేశ ప్రజలెందరో 'నువ్వు మా దేశానికి రావొద్దు' అని ఆందోళన చేస్తున్నా అదేమీ పట్టనట్టు వచ్చాడు బుష్. అలా వచ్చిన వాడిని విశిష్ట అతిథిగా పేర్కొని సత్కరించారు పాలకులు. రావొద్దని కోరుకున్నా, రావొద్దని చెప్పినా వచ్చేవారు దోపిడీ దొంగలో, దురాక్రమణదారులో అవుతారు గానీ విశిష్ట అతిథులు కారు. ప్రజలు ఛీకొడుతున్నా, చిద్విలాసంగా జార్జిబుష్ మన దేశానికి వచ్చింది ఈ ఉద్దేశ్యంతోనే.

**ప్రజలు ఎందుకు ఇంతగా ఛీకొట్టారు ?**

ప్రపంచాన్నంతా తన గుప్పిట్లో పెట్టుకోవాలనుకునే ఏకైక లక్ష్యం అమెరికాది. ఆ లక్ష్యసాధనకు అది చేయని కుటిలయత్నం లేదు. అప్పుల పేరుతో, పెట్టుబడుల పేరుతో, ఎగుమతులూ దిగుమతుల పేరుతో, సహకారం పేరుతో పేద దేశాల ఆర్థిక వ్యవస్థలను పతనం గావిస్తూ తన ప్రయోజనాలను నెరవేర్చుకుంటోంది. పేద దేశాల ఆర్థిక వ్యవస్థలను తన చెప్పుచేతల్లో ఉంచుకోవడం కోసం అది ఆ దేశాల రాజకీయ విధానాల్లో సహితం జోక్యం చేసుకుంటున్నది. అలా అది ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా తన మీద ఆధారపడే వెన్నెముక లేని దేశాలుగా మార్చుతోంది. దాని పెత్తనాన్ని ఒప్పుకోని దేశాలపై ఆంక్షలు విధించి, యుద్ధాలు చేసి ఆ దేశాలను అస్తవ్యస్తతకూ, అస్థిరతకూ గురిచేస్తున్నది. ప్రభుత్వాలనే మార్చివేస్తున్నది. ఇజ్రాయిల్ వంటి లేని దేశాలను సృష్టిస్తున్నది. నాజీలను తలదన్నేంత క్రూరమైన జియోనిస్టులకు ప్రాణం పోస్తున్నది. పాలస్తీనీయులకు తమదంటూ చెప్పుకోవడానికి దేశమే లేకుండా చేస్తున్నది. ప్రజలు ఎన్నుకున్న పాలస్తీనా హమాస్ ప్రభుత్వాన్ని గుర్తించను పొమ్మంటున్నది. వెనిజులా, బొలీవియాలలో కూడ ఆ దేశాల ఆంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకుంటున్నది.

గత యుద్ధ చరిత్రనంతా పక్కనపెట్టినా ఈ దశాబ్దంలోనే అఫ్ఘాన్, ఇరాక్‌లపై అది చేసిన హేయమైన దాడులనూ, సృష్టించిన రక్తపాతాన్ని ప్రపంచ ప్రజలందరూ ముక్తకంఠంతో వ్యతిరేకించారు. గ్వాంటనామోబే, అబూఘ్రయిజ్ జైళ్లలో యుద్ధ ఖైదీలపై అది పాల్పడిన హేయాతి హేయమైన చిత్రహింసల్ని ప్రపంచమంతా ఖండించింది.

సెప్టెంబర్ 11 తర్వాత ప్రపంచ ప్రజలనూ, దేశాలను అణచిపెట్టడానికీ దేశాల మీద చేసే దాడులను సమర్థించుకోవడానికీ దానికి టెర్రరిజం అనే ఆయుధం దొరికింది. ప్రపంచంలోనే అత్యంత టెర్రరిస్ట్ దేశమైన అమెరికా, టెర్రరిజంపై యుద్ధం చేస్తాననడాన్ని మించిన క్రూరమైన జోక్ మరొకటి ఉండదు. టెర్రరిజంపై యుద్ధం పేరుతో అది ముస్లిం దేశాలను బెదిరిస్తున్నది. ప్రపంచంలోని ముస్లిం ప్రజలందరినీ అభద్రతలోకి నెట్టింది. వివిధ దేశాల్లోని అనేక ముస్లిం సంస్థలను టెర్రరిస్ట్ సంస్థలుగా ప్రకటించి నిషేధిస్తోంది. ఈ నేపథ్యంలో భారతదేశంతో సహా అనేక దేశాల్లో ముస్లింలను కాల్చిచంపి టెర్రరిస్ట్‌లని ప్రకటిస్తున్నాయి సంబంధిత దేశ ప్రభుత్వాలు. అంతేగాక విప్లవోద్యమాల్ని నడుపుతున్న విప్లవ సంస్థలను, టెర్రరిస్ట్ సంస్థలుగా ముద్రవేస్తున్నది. భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్ట్), నేపాల్ కమ్యూనిస్ట్ పార్టీ (మావోయిస్ట్), ఫిలిప్పైన్ కమ్యూనిస్ట్ పార్టీ మొదలైన వాటిని టెర్రరిస్ట్ సంస్థలుగా ప్రకటించడం దీంట్లో భాగమే. ఈ 'టెర్రరిస్ట్' సంస్థలను అణచివేయడానికి ఆయా ప్రభుత్వాలకు పథకాలను రూపొందించి ఇస్తోంది, నిధులనూ సమకూర్చుతోంది.

తాజాగా అది అణ్వస్త్రాలను తయారు చేస్తున్నదనే నెపంతో ఇరాన్‌పై యుద్ధ సన్నాహాలు చేస్తోంది. తన మాట వినడం లేదని సిరియా, ఉత్తర కొరియా వంటి దేశాలనూ బెదిరిస్తోంది. యురేనియం శుద్ధి కార్యక్రమాన్ని ఆపివేయాలని అమెరికా జేబు సంస్థ అయిన ఐక్య రాజ్యసమితి ఇరాన్‌కు తుది గడువు కూడా విధించింది. ఇరాన్ అణ్వస్త్రాలను తయారు చేస్తుందా ? చేయదా ? అన్నది వేరే విషయం. కానీ, చేయొద్దని చెప్పడానికి అమెరికాకున్న అధికారం ఏంటి ? కనీసం దానికి నైతిక అర్హత అయినా వుందా ? దాని దగ్గర దాదాపు పదివేల అణ్వస్త్రాలున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా దానికున్న 702 స్థావరాల్లో వీటిని మోహరించి ఉన్నది.

ఇందులో రెండువేల అణ్వాయుధాలు పావుగంట వ్యవధిలో ఎక్కడయినా దాడిచేయడానికి సర్వసన్నద్ధంగా ఉంటాయి. దాని తొత్తు రాజ్యాలకు అది అణ్వాయుధాలను సరఫరా చేస్తున్నది. (ఇజ్రాయిల్ దగ్గర రెండువేల అణ్వాయుధాలున్నాయి). అణ్వాయుధ దాడులకు పాల్పడిన చరిత్ర దానికున్నది. (ఇంత వరకూ అణ్వాయుధ దాడులకు పాల్పడిన ఏకైక దేశం అమెరికానే) తనకున్న ఆయుధ బలంతో ప్రపంచాన్నంతా బెదిరిస్తున్నదది. ఇటువంటి చరిత్ర కల్గిన అమెరికాకు, ఇరాన్‌నైనా, మరో దేశాన్నయినా అణ్వాయుధాలు తయారు చేయొద్దని చెప్పే అర్హత ఎక్కడుంది ? అధికారం, అర్హతా లేకపోయినా ప్రపంచానికి రారాజుగా తనను తాను భావించుకుంటున్న అమెరికా ఇరాన్‌ను శాసిస్తోంది.

ఇలా అమెరికా తన హంతక దాడుల, యుద్ధాల చరిత్ర ద్వారా ప్రపంచ ప్రజలకు ప్రథమ శత్రువుగా మారింది. ఇరాక్ తర్వాత, ఇరాన్ వ్యవహారం బుష్‌ను ప్రపంచ ప్రజలు మరింత చీదరించుకునేలా చేస్తోంది. అందుకే ఇటీవలి భారత , పాకిస్థాన్ పర్యటనలను ఆయా దేశాల ప్రజలూ, ప్రజాస్వామికవాదులు వ్యతిరేకించారు.

## ప్రజలు ఛీకొడుతున్నా, బుష్ ఎందుకు వచ్చినట్లు ?

ఎవరూ కోరుకోకపోయినా దోపిడీ దొంగలూ, దురాక్రమణదారులు వస్తారు. రావడమే వాళ్ళ నైజం. బుష్ అందుకే వచ్చాడు.

మనకు దేశమంటే మనుషులు, వారి మధ్య ఉండే సంబంధాలు, వారి బాగోగులు. కానీ జార్జిబుష్‌కు భారతదేశమంటే ఒక పెద్ద మార్కెట్, వాళ్లకు కావాల్సిన సంపదను అందించే గని, వాళ్లకు పనికిరాని చెత్తను పారవేసే పెంటకుప్ప. అమెరికా నేడు ఎదుర్కొంటున్న తీవ్రమైన సంక్షోభం నుంచి బయటపడాలంటే దానికి ఈ 'మార్కెట్', ఈ 'గని', ఈ 'పెంటకుప్ప' అవసరం. వీటి మీద తను ఇదివరకే చేజిక్కించుకున్న అధికారాన్ని మరింత కట్టుదిట్టం చేసుకోవడం కోసం, ఇక్కడి పాలకవర్గాలను మరింతగా తనకు దళారీలుగా మార్చుకోవడం కోసం తన మార్కెట్‌ను మరింత విస్తరింప చేయడం కోసం ఈ 'గని'ని మరింతగా తవ్వుకుపోవడం కోసం జార్జిబుష్ ఇప్పుడు మన దేశానికి వచ్చాడు.

అమెరికా ఈ ప్రయోజనంతోనే సరిపెట్టుకోదల్చలేదు. అది మన దేశం నుంచి మరింత వ్యూహాత్మక ప్రయోజనాన్ని ఆశిస్తోంది. ఏక ధృవ ప్రపంచాన్ని నెలకొల్పాలనే లక్ష్యసాధనలో అది నేడు తీవ్రమైన ప్రపంచ వ్యతిరేకతను ఎదుర్కొంటున్నది. టెర్రరిజంపై పోరు అనే దాని ముసుగును ఎవరూ నమ్మడం లేదు. తన టెర్రరిస్ట్ చర్యల ద్వారా రోజు రోజుకూ అది ఒంటరి అవుతున్నది. అంతేగాక ఒక బలమైన ఆర్థిక శక్తిగా ముందుకొస్తున్న యురోపియన్ యూనియన్ దానికి గట్టి పోటీనిస్తోంది. ఈ పరిస్థితిని అధిగమించడానికి దానికి మద్దతుదారులు అవసరం. దాని ఆర్థిక విధానాలను సమర్థించే మద్దతుదారులూ అవసరం, దాని టెర్రరిజం పై పోరును సమర్థించే మద్దతుదారులు అవసరం. ఈ మద్దతును అది భారతదేశం నుంచి కోరుతున్నది. దక్షిణాసియాపై తన పట్టు బిగించాలంటే కూడా భారతదేశం మద్దతు దానికి అవసరం.

ఈ మద్దతును అమెరికా ఇప్పటికే సాధించింది. ఎన్‌డిఎ పాలనలో, బి.జె.పి. కున్న దళారీ స్వభావంతో పాటు దానికున్న ముస్లిం వ్యతిరేకత వల్లకూడా అది 'టెర్రరిజంపై పోరు'కు గట్టి మద్దతునిచ్చింది. ఇప్పుడు మన్మోహన్ ఆ మద్దతును మరింతగా పెంచుతూ, మరింతగా దాసోహం అంటున్నాడు. (పార్లమెంట్ సభ్యులతో పాటు దేశ ప్రజానీకం బుష్ పర్యటనను వ్యతిరేకిస్తుంటే ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి విమానాశ్రయానికి వెళ్లి బుష్‌కు స్వాగతం చెప్పడంలోనే మన్మోహన్ స్వామిభక్తి అర్థమౌతున్నది). అయితే ఈ మద్దతును మరింత దృఢపరుచుకోవడం అవసరం. అంతేగాక ఆసియాలో జపాన్, చైనాల ఆధిపత్యాన్ని దెబ్బతీయాలంటే, భారత్‌ను వాటికి పోటీగా నిలబెట్టి తన ప్రయోజనాన్ని నెరవేర్చుకోవాలనే వ్యూహం అమెరికాది. అందుకోసం భారత్‌తో అది తన బంధాన్ని మరింత దృఢపరుచుకోవడం అవసరం. బుష్ పర్యటన అసలు ఉద్దేశ్యం ఇది కాగా దానికి అణు ఒప్పందం, పరస్పర సహకారం అనే ముసుగులు వేసింది అమెరికా.

## అమెరికా విదిల్చిన ఎంగిలి మెతుకు అణు ఒప్పందం

గత సం॥ జూలై 18న మన్మోహన్ అమెరికా పర్యటనలోనే అణు ఒప్పందం జరిగింది. ఇప్పుడు బుష్ పర్యటన సందర్భంగా ఆ ఒప్పందంపై ఒక అవగాహన కుదిరింది.

1998లో మన దేశం రెండవసారి అణుపరీక్షలు జరిపిందని, అణుసంబంధ విషయంలో అమెరికా మన దేశంపై ఆంక్షలు విధించింది. ఇప్పుడు ఈ ఒప్పందం వల్ల ఆనాటి ఆంక్షలు తొలగిపోతాయి.

భారత్‌ను అణువ్యాప్తి నిరోధక ఒప్పందం (నాన్‌ప్రొలిఫరేషన్ ట్రీటి - ఎన్.పి.టి) పై సంతకం చేయమని అమెరికా మొదటి నుంచీ వత్తిడి చేస్తోంది. అదొక అసమ ఒప్పందం కనుక, భారత్ దానిపై సంతకం చేయకపోవడాన్ని దేశ ప్రజలు గట్టిగా సమర్థిస్తున్నారు. అదే ప్రజలు, భారత్ అణు ప్రయోగాలు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు.

దక్షిణాసియాపై ఆధిపత్యం కోసమే అణుప్రయోగాలు జరిపిందని భావించారు. అయితే ముందే చెప్పుకున్నట్టు అమెరికాకు అలా వ్యతిరేకించే నైతిక అర్హత లేదు. ఒకవేళ దానికంత వ్యతిరేకత ఉంటే అది సహకరించడం మానెయ్యొచ్చు. కానీ ప్రపంచ దేశాలేవీ భారత్‌కు అణు ఇంధనాన్ని అమ్మొద్దనీ, పరిశోధనల్లో సహకరించవద్దనీ హుకూం జారీచేసే అధికారం దానికి లేదు. ప్రపంచ దేశాల మీదా, అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఇంటర్నేషనల్ ఆటమిక్ ఎనర్జీ ఏజన్సీ-ఐ.ఎ.ఇ.ఎ) మీద అది చెలాయిస్తున్న పెత్తనం వల్ల అది ఆంక్షలు విధించగల్గింది. ప్రపంచ దేశాల మీద దాని ఆధిపత్యమే లేకుంటే అది విధించిన ఆంక్షలకూ ప్రాముఖ్యత ఉండేది కాదు, ఆంక్షల ఎత్తివేతకూ ప్రాముఖ్యత ఉండేది కాదు. అదొక్కటి సహకరించక పోయినా మిగతా దేశాలెన్నో ఉన్నాయి కాబట్టి. ఇన్నాళ్లూ ఏ అధికారమూ అర్హతా లేకుండా ఆంక్షలు పెట్టిందనే ఆగ్రహం పాలకవర్గాల్లో లేకపోగా ఇప్పటికైనా అమెరికా దయతలిచిందని సంతోషపడుతున్నాయి.

అయితే ఈ ఆంక్షలనేమీ బేషరతుగా ఎత్తివేయలేదు. అణురియాక్టర్లను పౌర, మిలటరీ రియాక్టర్లుగా విభజించి, పౌర రియాక్టర్లను ఐఎఇఎ పర్యవేక్షణలోకి తేవాలని షరతుపెట్టింది. దానికి మన్మోహన్ ఒప్పుకున్నాడు. అంటే భారత్ అణుకార్యక్రమంపై ఇక మీదట అమెరికా పర్యవేక్షణ ఉంటుందన్నట్లే. ఎన్‌పిటి మీద సంతకం చేయకుండానే ఈ ఒప్పందాన్ని సాధించడం గొప్ప విజయమని మన్మోహన్ తనను తాను పొగుడుకున్నాడు. కానీ ఈ పర్యవేక్షణకు ఒప్పుకోవడం ద్వారా ఎన్.పి.టి పై సంతకం చేయకుండానే దాని షరతులకు లోబడినట్టయింది. భారత్‌ను ఐ.ఎ.ఇ.ఎ, ఎన్.పి.టి పరిధిలోకి తేవాలనే అమెరికా ప్రయత్నం ఫలించింది. అంతేకాదు ఇకమీదట దేశ అవసరాలకు అనుగుణంగా పౌర రియాక్టర్లను మిలటరీ రియాక్టర్లుగా మార్చుకునే అవకాశాన్ని భారత్ శాశ్వతంగా కోల్పోతుంది. ఇంతా చేస్తే భారత్‌ను అణురాజ్యంగా గుర్తించడానికి అమెరికా ఒప్పుకోలేదు. (అలా గుర్తింపు పొందడం వల్ల అణు విషయంలో మరికొన్ని ప్రయోజనాలుంటాయి).

ఈ ఒప్పందాన్ని ఎరగావేసి అమెరికా పొందిన, ఈ ఒప్పందం కోసం భారత్ బలిపెట్టిన, ప్రయోజనాలు ఎన్నెన్నో.

ఇరాన్ విషయంలో వ్యతిరేకతను ఎదుర్కొంటున్న తనకు భారత్ మద్దతు ఇవ్వాలనీ ఐఎఇఎలో ఇరాన్‌కు వ్యతిరేకంగా ఓటు వేయాలని షరతు పెట్టింది. వేయకపోతే జూలై 18 నాటి అణు ఒప్పందం మీద ఆశలు వదుకోవాలని అమెరికా రాయబారి మల్‌ఫోర్డ్ బహిరంగంగానే బెదిరించాడు. అంటే భారతదేశ స్వతంత్రనూ, సార్వభౌమత్వాన్నీ, నిర్ణయాత్మకతనూ (ఏమన్నా మిగిలుంటే) పణంగా పెట్టమని అడిగినట్లు అమెరికా. దానికి లోబడే ఇరాన్‌కు వ్యతిరేకంగా ఓటు వేశాడు మన్మోహన్. ఈ విషయంలో పార్లమెంట్‌లోనూ, దేశంలోనూ విమర్శలు వచ్చాయి. తన చర్యను సమర్థించుకుంటూ పొరుగునే ఉన్న ఇరాన్ దగ్గర అణ్వాయుధాలుంటే మనకు ప్రమాదమని మాట్లాడాడు మన్మోహన్. మరి అమెరికా దగ్గరున్న అణ్వాయుధాలు ప్రపంచమంతటికీ ప్రమాదమే. మరి వీటి సంగతేంటీ ?

భారతదేశం ఒకానొక ముఖ్యమైన ప్రయోజనాన్ని కోల్పోయింది ఈ ఒప్పందం వల్ల. ఇరాన్ నుంచి పాకిస్థాన్ మీదుగా గ్యాస్ పైప్ లైన్‌ను వేయాలని పదేళ్లకు ముందే ఒక ఒప్పందం జరిగింది. ఖనిజ వాయువు కొరత ఎదుర్కొంటున్న మన దేశానికి ఈ ఒప్పందం ఎంతో ప్రయోజనకరమైనది. ఇరాన్‌ను ఏకాకిని చేయడంలో భాగంగా ఆ పైప్‌లైన్ ప్రణాళికను వదులుకోవాలని మరొక షరతు పెట్టింది అమెరికా. భారత్ దీనికి ఒప్పుకుంది. అంటే భారత విదేశాంగ విధానాన్ని అమెరికా ఎంతగా నియంత్రిస్తున్నదో  అర్థం చేసుకోవచ్చు. ఇందులో భాగంగానే 'ఆహారం కోసం చమురు' కుంభకోణంలో ఎందరికో ప్రమేయం ఉన్నప్పటికీ, ఈ పైప్‌లైన్ కోసం కృషిచేస్తున్న మునుపటి విదేశాంగ మంత్రి నట్వర్ సింగ్‌ను మాత్రమే వోల్కర్ కమీషన్ పేరిట మంత్రి వర్గం నుంచి సాగనంపారని విమర్శకుల ఆరోపణ. ప్రస్తుతం మన్మోహన్ విదేశాంగ శాఖను చేపట్టి అమెరికా దారిని మరింత సుగమం చేస్తున్నాడు. అంతేగాక ఈ పైప్‌లైన్ ప్రతిపాదనను గట్టిగా సమర్థిస్తున్న  మణిశంకర్ అయ్యర్‌ను కూడా పెట్రోలియం శాఖ నుండి తప్పించారనేది మరొక విమర్శ. ఇట్లా అమెరికా ప్రయోజనాలకు అనుగుణంగా  అలవోకగా మన విధానాలను మార్పు చేస్తున్నారు పాలకులు. అమెరికా భారత్ నుంచి కోరుకుంటున్న దాస్యం ఇదే.

### అమెరికా 'సహకారం'తో వ్యవసాయ రంగానికి మరింత ముప్పు

అణు ఒప్పందం ఆశచూపి అమెరికా కోరిన మరొక బలి భారత వ్యవసాయ రంగం. దాన్నీ అర్పించాడు ప్రధానమంత్రిగా పిలువబడే దళారీ మన్మోహన్‌సింగ్.

న్యూఢిల్లీలో తన పని ముగించుకున్న బుష్ హైదరాబాద్‌లోని ఎన్.జి. రంగా విశ్వవిద్యాలయానికి వచ్చాడు. దీని ఆవరణలో బుష్ తిలకించడం కోసం ఒక నమూనా గ్రామాన్ని నిర్మించారు. అసలు మొదట మహబూబ్‌నగర్‌లోని ఒక గ్రామాన్ని సందర్శించాలనేది బుష్ పర్యటనలో ఉండిందట. కానీ భద్రతా కారణాలరీత్యా దాన్ని విరమించారు. అంటే నాలుగు వలయాల అమెరికా, భారత భద్రతా సిబ్బందీ, అణువణువునా మోహరించిన

పోలీసు బలగాలూ, డేగల్లా పరిశీలిస్తూ పైన ఎగిరే నాలుగైదు హెలికాప్టర్లూ, అమెరికా కుక్కలూ... ఇవేవీ తెలంగాణ పల్లెమీద అడుగుపెట్టే ధైర్యాన్ని బుష్‌కు ఇవ్వలేకపోయాయి. అందుకే ఆ పల్లెనే పట్టణానికి తీసుకువచ్చారు. అయితే ఈ పల్లె ఎంతో ఆధునికంగా వుండి ఉంటుందనడంలో సందేహం లేదు. ఇక్కడ బుష్ రైతులతో మాట్లాడాడనీ, పిల్లల్ని ఎత్తుకున్నాడనీ, పనసకాయల్నీ, గుమ్మడి కాయల్ని ముట్టుకున్నాడనీ, నాగలి (గంధంతో చేసిందీ, బరువు తక్కువదీ సుమా!) ని భుజాన పెట్టుకున్నాడనీ పత్రికలు అపురూప విషయాలుగా రాసాయి. బుష్ వ్యవసాయరంగానికి ప్రాధాన్యతను ఇస్తున్నాడని వై.ఎస్. పదే పదే పొగిడాడు.

కానీ బుష్ వచ్చింది వ్యవసాయ రంగాన్ని కబలించడానికి కూడా. నాగలిని భుజాన పెట్టుకొని చిందించిన చిరునవ్వు వెనుక ఆ నాగలికి రైతును దూరం చేసే దుష్ట తలంపు వుంది. వ్యవసాయ రంగాన్ని కబలించే ఒక ఒప్పందానికి మన్మోహన్ అమెరికా పర్యటనలోనే అంగీకారం కుదిరింది. అయితే దేశ వ్యవసాయ మంత్రిత్వశాఖకు గానీ, వ్యవసాయ శాస్త్రవేత్తలకు గానీ, జాతీయ వ్యవసాయశాస్త్ర అకాడమీకి గానీ ఈ విషయం తెలియదు. ఇప్పుడు బుష్ పర్యటన సందర్భంగా ఆ ఒప్పందం జరిగిపోయింది. ఆ ఒప్పందం పేరు 'ఇండో అమెరికన్ నాలెడ్జ్ ఇనీషియేటివ్ ఆన్ అగ్రికల్చర్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్'. వ్యవసాయ విద్య, పరిశోధనలో ఇకమీదట అమెరికా భారతదేశంతో సహకారాన్ని పంచుకునే ఉద్దేశ్యం పేరిట ఈ ఒప్పందం జరిగింది. ఏ సామ్రాజ్యవాద దేశమైనా ఒక వెనుకబడిన దేశానికి సహకరించడమంటే అర్థమేంటో స్పష్టమే. ఇప్పటికే సామ్రాజ్యవాద దేశాల జోక్యంతో దేశ వ్యవసాయరంగం సంక్షోభంలో పడింది. రైతుల ఆత్మహత్యలు సర్వ సాధారణ అంశమైపోయాయి. ఇప్పుడు తాజాగా ఈ ఒప్పందం మరింత హానికి దారితీస్తుంది.

ఈ ఒప్పందంలో మూడు అంశాలున్నాయి. మొదటిది, జీవ సాంకేతిక రంగంలో అమెరికా సహకారం. ఈ పేరుతో అమెరికా జన్యుమార్పిడి విత్తనాలను మనదేశంపై రుద్దుతుంది. జన్యుమార్పిడి పంటవల్ల జరిగే దుష్ఫలితాల పట్ల ప్రపంచవ్యాప్తంగా వ్యతిరేకత వచ్చింది. ఐరోపా దేశాలు నిషేధించాయి కూడా. మన దేశంలోకి మొట్టమొదట ప్రవేశించిన జన్యుమార్పిడి బీటి పత్తి విత్తనం ఘోరంగా విఫలమై వందలాది పత్తి రైతుల ఆత్మహత్యలకు దారితీసింది. ఈ విషయాన్ని మన రాష్ట్ర ప్రభుత్వం కూడా గుర్తించి ఇది తయారు చేసిన మోన్‌శాంటో కంపెనీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టింది. అయితే మొన్న జరిగిన వ్యవసాయ ఒప్పంద సమావేశంలో మోన్‌శాంటో కంపెనీ కూడా పాల్గొంది. అంటే రైతుల భవిష్యత్తూ, వ్యవసాయం భవిష్యత్తూ, మొత్తంగా దేశ భవిష్యత్తు ఎలా ఉండబోతుందో ఊహించుకోవచ్చు. ఈ 'సహకారం'లో భాగంగా విత్తనాలనే కాక జన్యుమార్పిడి ఉత్పత్తులను కూడా మన దేశంపై రుద్దుతుంది. ఈ ఉత్పత్తుల వల్ల కలిగే దుష్పరిణామాలను గుర్తించి ఐరోపా దేశాలు నిషేధించాయి. దాని వ్యవసాయ ఉత్పత్తులను మన దేశానికి ఎగుమతి చేయడానికి వీలుగా అన్ని ఆంక్షలనూ ఎత్తివేయాలని అమెరికా వత్తిడి చేస్తోంది. ఇదే జరిగితే నిషేధించబడిన, దాని దగ్గర పేరుకుపోయిన చెత్తనంతా (ఉత్పత్తులను) మనదేశం దిగుమతి చేసుకోవాలి.

రెండవది, ఇరుదేశాల శాస్త్రజ్ఞులు చేసే పరిశోధనలకు వీలుగా మన ప్రయోగశాలలూ, వనరులను యధేచ్ఛగా వాడుకోనివ్వాలి. అమెరికాలో జీవ సాంకేతికతకు అవసరమైన జన్యు వనరులు ఎక్కువగా లేవు. అందుకని మన దేశంలోని వనరులనూ, ప్రయోగశాలలనూ, శాస్త్రవేత్తలనూ ఏ ఆంక్షలు లేకుండా అమెరికా వాడుకోదల్చుకుంది. అందుకు ఈ ఒప్పందం వీలు కల్గిస్తుంది.

ఇక, మన దేశం అన్ని హంగులూ సమకూర్చితే వచ్చే ఫలితాల మీద మేధోపర హక్కులకు సంబంధించిన అంశం మూడవది. అవి, ఇరుదేశాలకూ సమానంగా ఉంటాయనుకుంటే అమాయకత్వమే! మేధోపర హక్కులు పూర్తిగా అమెరికావే. ఈ ఇండో అమెరికన్ ఇనీషియేటివ్‌కు 400 కోట్ల పెట్టుబడి అవసరమవుతుంది. తాను ఒక్కపైసా కూడా పెట్టనని అమెరికా తెగేసి చెప్పేసింది. కనుక మొత్తం పెట్టుబడిని మనదేశమే సమకూర్చుతున్నది. ఇందులో అమెరికా శాస్త్రవేత్తల పర్యటన ఖర్చులను కూడా మనదేశమే భరించాలి.

అంటే మన ఖర్చుతో, మన వనరులతో, మన ప్రయోగశాలల్లో, మన శాస్త్రవేత్తల సహకారంతో తయారుచేసిన విత్తనాలు వగైరాల మీద మనకు హక్కులేదు. మన భూమిలో పండిన విత్తనాలను మనం అమెరికా నుండి కొనుక్కోవాలి. అదీ మనకు అవసరం లేకపోయినా, అవి మనకు వినాశకరమైనవని తెల్సినా కొనుక్కోవాలి. ఇంతకంటే దాస్యం ఇంకేముంటుంది ?

## భారత ఆర్థిక వ్యవస్థను మరింత దెబ్బతీస్తున్న అమెరికా

బుష్ పర్యటనలోని మరొక ముఖ్య అంశం వాణిజ్య ఒప్పందం. బుష్ వస్తూ వస్తూ ఒక భారీ పెట్టుబడిదారుల బృందాన్ని వెంటేసుకొని వచ్చాడు.(పెట్టుబడిదారుల బృందమే బుష్‌ను తీసుకొని వచ్చిందనడం సరిగ్గా ఉంటుంది) అంటేనే వాళ్ల ప్రయోజనాల కొరకు ఒప్పందాలు జరిగాయనడంలో సందేహం లేదు. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో పెట్టుబడిదారులతో బుష్ సమావేశమయ్యాడు. వచ్చే మూడేళ్ళలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలని ఒప్పందం జరిగింది. (ద్వైపాక్షికత అంటే

అమెరికా పక్షమేనని ఇక్కడ అర్థం). ఇందుకోసం పెట్టుబడి అవరోధాలను తొలగించాలనీ, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ప్రోత్సహించాలని నిర్ణయం జరిగింది. అనేక కీలకరంగాల్లో 'పరస్పర సహకారాన్ని' పెంపొందించుకోవాలని కూడా ఈ ఒప్పందంలో ఉన్నది. ఇప్పటికే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులతో, సామ్రాజ్యవాద జోక్యంతో కూనరిల్లుతున్నది భారత ఆర్థిక రంగం. ఆ పరిణామాలు ప్రజల జీవితాలపై విషతుల్యంగా ప్రతిఫలిస్తున్నాయి. ఇక తాజా ఒప్పందం మరింత దుర్భరమైన పరిస్థితులను తెచ్చిపెడుతుందనడంలో సందేహంలేదు.

### అసాధారణమైన భద్రత

మనల్ని దోచుకోవడానికి వచ్చిన బుష్‌కు కల్పించిన భద్రత అంతా యింతా కాదు. ఇండియన్ మార్క్ భద్రతపట్ల బుష్‌కు ఏమాత్రం నమ్మకం లేదు. అందుకే భద్రతను పర్యవేక్షించిందంతా అమెరికానే. బుష్ చుట్టూ ఏర్పాటు చేసిన నాలుగు వలయాల భద్రతా సిబ్బందిలో లోపలి రెండు వలయాలూ అమెరికా భద్రతా సిబ్బందితో ఏర్పడినవే. ఇక ఆయన బసచేసిన ఢిల్లీలోని హోటల్ మౌర్యాషెరటాన్‌ను రెండు నెలల క్రితమే అమెరికా భద్రతాధికారులు తమ అధీనంలోకి తీసుకున్నారు. ఆయన భద్రత కోసం అమెరికా నుండి పలు హెలీకాప్టర్లు, కార్లు, పర్యటన కంటే ముందుగానే మన దేశానికి వచ్చాయి. చివరికి మన కుక్కలు కూడా పనికి రాలేదు. వాటిని కూడా అమెరికా నుండే తీసుకువచ్చారు. బుష్ ఎక్కడెక్కడ పర్యటిస్తాడో అక్కడంతా అణువణువునా భూతలం నుంచీ, గగనతలం నుంచి తనిఖీలు చేశారు. అందులో భాగంగా పార్లమెంటు తలమీద కూడా హెలీక్యాప్టర్లు ఎగిరాయి. ప్రజల రాకపోకలపై కఠినమైన ఆంక్షలు విధించారు. పిల్లలు గాలి బుడగలూ, గాలిపటాలు కూడా ఎగరెయ్యొద్దని ఆంక్షలు విధించారు. అంతేకాదు బుష్ ఎక్కిన విమానం మన దేశానికి రాబోయేముందు విమానాశ్రయంలోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఎటిసి)ని స్వాధీనం చేసుకోవాలని అమెరికా అధికారులు ప్రయత్నించారు. దానికి భారత అధికారులు పూర్తిగా ఒప్పుకోకుండా కొందరు అమెరికా అధికారులను ఎటిసిలోకి అనుమతించారు. సాధారణంగా విమానాశ్రయంలోని అత్యంత కీలక విభాగమైన ఎటిసిలోకి సంబంధిత అధికారులను తప్ప మరెవ్వరినీ అనుమతించకూడదు. విదేశీయులను మరెంత మాత్రమూ అనుమతించకూడదు. ఇది దేశ భద్రతకు సంబంధించిన విషయం. ఇక్కడా భారత్ లొంగుబాటును ప్రదర్శించక తప్పలేదు.

మరి ఇంత పకడ్బందీ భద్రతకు అయిన భారీ ఖర్చు బుష్ జేబులోంచో, మన్మోహన్ రాజశేఖర్‌ల జేబులోంచో పెట్టరు కదా, బుష్ రాకను చీదరించుకున్న ప్రజల నెత్తినే రుద్దుతారు.

### 'బుష్ గో బ్యాక్' అని నినదించిన జనం

క్లింటన్ పర్యటన సందర్భంగా బలహీనంగా వినిపించిన నిరసన స్వరాలు ఈసారి బలంగా వినబడ్డాయి. ఒక దేశ అధ్యక్షుడు మరో దేశ పర్యటనకు వెళ్లినప్పుడు ఇంతటి నిరసన వెల్లువెత్తడం ఇది మెదటిసారి. విప్లవ పార్టీలూ, ప్రజాస్వామిక సంఘాలు, కవులూ, రచయితలూ, కళాకారులూ, ప్రజాస్వామికవాదులూ, సాధారణ ప్రజానీకం ఈ నిరసనలో పాలుపంచుకున్నారు. సి.పి.ఐ, సి.పి.యం, సమాజ్‌వాద్ వంటి పార్టీలకూ ప్రజల వాణిని వినిపించక తప్పలేదు. పార్లమెంట్‌లో బుష్ ప్రసంగించడానికి వీలులేదని ఈ పార్టీలు ప్రకటించాయి. పర్యటన రోజు పార్లమెంట్ వద్ద ధర్నా చేసి నాలుగు గంటల పాటు కార్యక్రమాలను స్తంభింపచేసాయి. ప్రపంచవ్యాప్తంగా బుష్ కొనసాగిస్తున్న ముస్లిం వ్యతిరేక దమనకాండ ఫలితంగా ముస్లిం పార్టీలూ, సంస్థలూ పెద్ద ఎత్తున నిరసన తెల్పడం విశేషం. సభలూ, సమావేశాలూ, ఊరేగింపులూ, ధర్నాలూ, దిష్టిబొమ్మల దగ్ధాలూ, బుష్ వేషధారణలోని గాడిదను ఊరేగించడం వంటివి జరపడం, నల్ల గాలిపటాలూ, నల్లబెలూన్లు ఎగరేయడం వంటి అనేక వినూత్న రూపాల్లో ఈ నిరసన కార్యక్రమాలు జరిగాయి.

ఈ నిరసన ఏ కొన్ని రాష్ట్రాలకో పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా బలంగా కొనసాగింది. బుష్ పాకిస్తాన్ పర్యటన సందర్భంగా ఆ దేశంలోనూ నిరసన వెల్లువెత్తింది. ప్రజల్లో పెరుగుతున్న సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యానికి నిదర్శనం ఈ నిరసన.

ఈ నిరసనను మరింత బలోపేతం చేసి దానికి సరైన కార్యాచరణ రూపాన్ని ఇచ్చినప్పుడు సామ్రాజ్యవాదాన్ని తప్పక ఓడించగలం. ❐

**సామ్రాజ్యవాదం నశించాలి!**

**ప్రపంచ కార్మిక వర్గపోరాటాలు వర్థిల్లాలి!!**

**మేడే దినోత్సవానికి విప్లవ జేజేలు!!!**

# జాతీయ ఉపాధి హామీ పథకం నిజంగా పేదరికాన్ని నిర్మూలించగలదా!?

కొన్ని నెలల పాటు సాగిన చర్చలు, వాదోపవాదాల తరువాత భారత ప్రభుత్వం 2005 సెప్టెంబర్ 7న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005 (నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ ఆక్ట్- ఎన్.ఆర్.ఇ.జి.ఏ-2005) ను జారీ చేసింది. ఇక దీన్ని ప్రారంభించడానికి ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా బండ్లపల్లి గ్రామాన్ని ఎంచుకున్నది. ఈ సంవత్సరం ఫిబ్రవరి 2వ తేదీన ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకుల కోలాహలం మధ్య మన్మోహన్ సింగ్, సోనియాగాంధీల సమక్షంలో ఈ పథకాన్ని ఆర్భాటంగా ప్రారంభించారు. పేదరిక నిర్మూలన కోసం చేపడుతున్నట్లు ప్రభుత్వం చెప్పుకుంటున్న అనేక పథకాలలో మరొక కొత్త పథకం చేరింది. 2004లోనే లోక్ సభలో బిల్లు ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని మీడియా, రాజకీయ పార్టీలు, వ్యాఖ్యాతలు ఒక మహత్తర సంఘటనగా కీర్తిస్తున్నారు. ఈ పథకం ప్రకారం పేదవాళ్లు తమకు పనికావాలి అని సంబంధిత అధికారులకు తెలియచేస్తే 15రోజుల లోపల వారికి పని కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వంపై వుంది. (పథకం లోని) ఈ నిబంధన చాలా ఆకర్షణీయంగా కన్పిస్తున్నది. విచిత్రమైన విషయమేమిటంటే ఈ పథకం ఎవరి కోసమైతే ఉద్దేశించబడిందో వాళ్ళలో చాలా నామమాత్రంగా స్పందన వుంది. "దరిద్రులు దరఖాస్తు ఇయ్యబోతే ఆఫీసు తలుపులు మూసుకు పోతాయి" అని ఒక గ్రామీణుడు వ్యాఖ్యానించాడు (E.P.W. Oct 2005). ఈ చట్టం పట్ల ఇలాంటి సంశయాలు నిరాధారమైనవేమీ కావు.

రాష్ట్ర ప్రభుత్వాలు ఒక ఆర్థిక సంవత్సరంలో 100రోజుల పాటు గ్రామీణ కుటుంబంలో ఒకరికి నైపుణ్యం అవసరం లేని పనిని కల్పించాలని ఈ చట్టం నిర్దేశిస్తున్నది.

దీని కోసం ఉద్దేశించిన పథకాలనూ, కార్యక్రమాలను ఈ చట్టం అమల్లోకి వచ్చిన రోజునుండి 6నెలల లోపల రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధం చేయాలి. అప్పటి వరకు సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన లేదా జాతీయ పనికి ఆహార పథకం లాంటి ఉపాధి హామీ పథకాలు అమలు జరుగుతూవుంటే ఆ పథకాలకు సంబంధించిన వార్షిక కార్యక్రమ ప్రణాళిక వివరాలు (జాతీయ ఉపాధి హామీ చట్టంలోని విధానంలో లాగ) ప్రకటించాలి.

## ఈ చట్టంలోని వివిధ అంశాలు

పేద కుటుంబంలో దరఖాస్తు పెట్టుకున్న ఒకరికి ప్రతి ఆర్థిక సంవత్సరంలో 100 రోజుల పాటు తప్పనిసరిగా పని కల్పించాలి. రోజుకు రూ. 60లు లేదా ఆ ప్రాంతంలో వున్న కనీస వేతనం గానీ ఈ రెండింటిలో ఏది ఎక్కువగా వుంటే అది వేతనంగా చెల్లించాలి. ఈ పథకం కింద కల్పించిన పని చేసిన ప్రతి ఒక్కరికీ, దినసరి వేతనం లెక్కన వారం రోజులకొక్కసారి లేదా పని పూర్తయిన 15 రోజుల లోపు వేతనం చెల్లించాలి.

కేవలం దరఖాస్తు పెట్టుకుంటే ఈ పథకానికి లబ్ధిదారులుగా ఎంపిక అవుతారు. అంటే ఈ పథకం స్వయం ఎంపిక లాంటిది(Self elective).

ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుంది. జిల్లా పాలనా యంత్రాంగానికి, మండల పరిషత్, గ్రామ పంచాయితీలకు నిర్దిష్టమైన బాధ్యతలు వున్నాయి. మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఈ పథకాన్ని అమలు చేస్తారు. మండలాధికారి లేదా ప్రత్యేకంగా నియమించబడిన కార్యక్రమాధికారి (నోడల్ అధికారి) ఈ పథకం అమలుకు బాధ్యులుగా వుంటారు. ఈ అధికారి ఇటు గ్రామ పంచాయితీకీ అటు జిల్లా పరిపాలనా విభాగానికి జవాబుదారీగా వుంటారు.

దరఖాస్తుదారులకు 15 రోజుల లోపల పని కల్పించలేకపోతే వారికి నిరుద్యోగ భృతి పొందే హక్కు వుంటుంది. నిరుద్యోగ భృతి రోజుకు ఎంత వుండాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలి. నిరుద్యోగ భృతి, ఆ ఆర్థిక సంవత్సరంలోని మొదటి 30రోజుల దిన వేతనంలో నాల్గవ వంతుకంటే, మిగతా రోజుల దిన వేతనంలో సగం కన్నా తక్కువ వుండకూడదు.

ఈ కింద పేర్కొన్న పరిస్థితుల్లో నిరుద్యోగ భృతి నిలిపివేయబడుతుంది.

--గ్రామ పంచాయితీ లేదా కార్యక్రమ అధికారి ఆజ్ఞాపించిన వెంటనే దరఖాస్తుదారులు స్వయంగా కానీ లేదా వారి కుటుంబంలోని వయోజనులెవరైనా ఒకరు గానీ పనికి హాజరు కాకపోయినప్పుడు.

--దరఖాస్తుదారు కుటుంబంలోని వయోజనులకు సంవత్సరంలో 100 రోజుల పాటు పని లభించి వున్నట్లయితే, దరఖాస్తుదారు కుటుంబ వేతనమూ నిరుద్యోగ భృతి ద్వారా పొందుతున్నదీ రెండూ కలిపి 100రోజుల వేతనానికి సమానంగా ఉన్నట్లయితే.

పై సందర్భాలలో దరఖాస్తుదారులు ఈ పథకానికి అనర్హులవుతారు.

ఈ పథకం ద్వారా నీటి సంరక్షణ, పంటకోత; కరువు నివారణ; నీటి పారుదల; సాంప్రదాయ నీటి వనరులను మెరుగు పరచడం; బంజరు భూముల అభివృద్ధి; వరద నియంత్రణ, సంరక్షణ; గ్రామీణ ప్రాంతంలో రహదారుల అభివృద్ధి వంటి రంగాలకు వరుస క్రమంలో ప్రాధాన్యతనిచ్చి ఉత్పాదకతను పెంచడానికి శ్రద్ధ వహించాలి.

ఈ పథకం కింద జరిగే పనులలో లబ్ధిదారులకు(నైపుణ్య, అర్ధ నైపుణ్య శ్రామికుల వేతనాలతో కలిపి) 40శాతం, పెట్టుబడికి (ముడి సరుకులు, ఇతరములు) 60శాతం వుండాలని నిర్దేశించటం జరిగింది.

ఈ పథకం కింద జరిగే పనులలో మొత్తం వేతనాలనూ, అలాగే పెట్టుబడిలో నాలుగింట మూడు వంతులు( మొత్తం వ్యయంలో 90 శాతం ) కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది. మిగతా పది శాతం రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలి.

ఈ పథకం సమాచార హక్కు చట్టం పరిధిలోకి వస్తుంది. ప్రజలు ఈ పథకం కింద జరిగిన పనులకు సంబంధించిన రికార్డులను, సమాచారాన్ని పరిశీలించవచ్చు.

పేదరికాన్ని తగ్గించటానికి ప్రభుత్వమే ఉపాధి (స్వయం ఉపాధి, వేతన ఉపాధి) కల్పించాలనే ఆలోచన కొత్తదేమీ కాదు. బ్రిటీష్ పరిపాలనా కాలంలో కరువు, అనావృష్టి సహాయక చర్యలలో భాగంగా ప్రభుత్వమే పనులు కల్పించాలన్న నిబంధన వుండేది. 1947 తరువాత భారత ప్రభుత్వం పంచవర్ష ప్రణాళికలో భాగంగా ఇటువంటి ఎన్నో పథకాలను ప్రారంభించింది. జాతీయ గ్రామీణ ఉపాధి కార్యక్రమం (ఎన్.ఆర్.ఇ.పి), భూమిలేని గ్రామీణుల ఉపాధి హామీ కార్యక్రమం (ఆర్.ఎల్.ఇ.జి.టి) వంటి పథకాలు ఇటువంటివే. ఈ రెండింటిని కలిపి తర్వాత జవహర్ రోజ్‌గార్ యోజన (జె.ఆర్.వై)గా మార్చారు. ఉపాధికి హామీ ఇవ్వక పోయినప్పటికీ సమీకృత గ్రామీణ అభివృద్ధి పథకం కూడా ఇటువంటిదే. ఈ పథకం ఉత్పత్తిని అభివృద్ధి చేయడం కన్నా ఉత్పాదితాలను ప్రజలకు బదలాయించాలని ఉద్దేశించినది. 1970లలో పనికి ఆహారం లాంటి చాలా కార్యక్రమాలు తీసుకున్నారు. ఇప్పుడు చేసిన ఉపాధి హామీ చట్టం 1979 జనవరి 26న మహారాష్ట్ర ప్రభుత్వం, ఆ రాష్ట్రంలో అమలు చేయడం కోసం చేసిన మహారాష్ట్ర ఉపాధి హామీ పథకానికి నకలు వంటిది. ఇప్పుడు 10వ ప్రణాళికలో భాగంగా స్వయం ఉపాధికి ఎస్.జి.ఆర్.వై (సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన) పైనా, మరోవైపు పనుల ద్వారా ఉపాధి కల్పన ఎన్.ఆర్.ఇ.జి.ఎ(జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం) పైనా కేంద్రీకరిస్తున్నారు.

ఈ చట్టం వల్ల ఎటువంటి ఉపయోగాలున్నాయో చూడటం కన్నా ముందు ఈ చట్టం ద్వారా నిర్మూలించాలనుకుంటున్న పేదరికం ఎంత విస్తృతంగా వుందో చూద్దాం.

భారతదేశంలో నిరుద్యోగం ఏ విధంగా పెరిగిపోతున్నదో ఒక్కసారి గణాంకాలను పరిశీలిస్తే మన తల తిరిగిపోతుంది. జాతీయ నమూనా సర్వే సంస్థ ( నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ - ఎన్ఎస్ఎస్ఓ) ప్రకారం 1999-2000లో నిరుద్యోగ వృద్ధి రేటు 4.4 శాతం, పాక్షిక నిరుద్యోగం 7.2 శాతం. ఇతర సంస్థల పరిశీలన ప్రకారం పాక్షిక నిరుద్యోగం 13.3 శాతం. దీని ప్రకారం నిరుద్యోగం, పాక్షిక నిరుద్యోగం కలిపి మొత్తం 17.7 శాతం( 4.4% + 13.3%).

ఈ గణాంకాలు కూడా నిరుద్యోగ తీవ్రత అసలు స్వరూపాన్ని చూపించడం లేదు. ఎందుకంటే భారతదేశంలాంటి ఆర్థిక వ్యవస్థలో నిరుద్యోగ భృతి సౌకర్యం లేదు కనుక ఏపనీ చేయకుండా బతికే అవకాశం మెజారిటీ ప్రజలకు లేదు. కాబట్టి కూటి కోసం కోటి విద్యలన్నట్టు ఏదో ఒక పని చేయడం వల్ల, సాంకేతికంగా పెద్ద సంఖ్యలో ఉపాధి లభిస్తున్నట్లుగా కన్పిస్తున్నప్పటికీ సగానికన్నా తక్కువ మందికి లభించే వేతనాలు చాలా స్వల్పం. మొత్తం ఉపాధిగల వారిలో స్వయం ఉపాధి లేదా వేతనంపై పనిచేసే వాళ్ళే 84 శాతంగా వున్నారు. రోజువారీ వేతనంపై పని చేసుకునే వాళ్ళు 30 శాతం కంటే ఎక్కువ మంది దారుణ పేదరికంలో మగ్గుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి లభించే మార్గాలన్నీ నాశనమైపోయాయి. మిగతా రంగాలలో కూడా నిరుద్యోగం త్వరత్వరగా పెరుగుతున్నది. 90ల మధ్యనుండి ఈ పరిస్థితి తీవ్రమవుతున్నది.

ఈ పరిస్థితులలో యు.పి.ఎ ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తెచ్చింది. మా ప్రోద్బలం వల్లనే ఈ చట్టం వచ్చిందని రివిజనిస్టు సి.పి.ఐ, సి.పి.ఎంలు ప్రచారం చేసుకుంటున్నాయి. దేశాన్ని పీడిస్తున్న, పెరుగుతున్న నిరుద్యోగాన్ని, తీవ్రతరమవుతున్న పేదరికాన్ని ఈ చట్టం ఏమైనా పరిష్కరించగలదా?

ఈ చట్టంలో చెబుతున్నట్లుగా ఈ చట్టానికి పేదరికాన్ని నిర్మూలించగలిగే శక్తి వుందా అని మొట్టమొదట ప్రశ్నించాల్సి వుంది.

ఈ చట్టం ప్రకారం రోజుకు రూ. 60ల చొప్పున సంవత్సరానికి 100 రోజులపాటు పని లభిస్తుంది. కుటుంబంలోని సభ్యుల సంఖ్య సరాసరి 5 అని అనుకుంటే సంవత్సరంలో ఒక్కొక్కరికి రోజుకు లభించేది రూ. 3.28పైలు. పేదరిక నిర్మూలన అనే పెద్ద మాటను పక్కకు పెట్టి, బతకడానికి సరిపోయే ఉపాధి అని దీన్ని అనగలమా?! కుటుంబం(House hold) అనే పదం చాలా సందేహాత్మకంగా వుంది. ఒకే రేషన్ కార్డు వుండి, ఒకే ఇంటిలో వుంటూ కలిసి వండుకుంటున్న అందరూ కూడా ఒకే కుటుంబమని నిర్వచించారు.

గ్రామీణ ప్రాంతంలోని ఉమ్మడి కుటుంబాలు ఒకే రేషన్ కార్డు కలిగి వుండి ఒకే ఇంటిలో కలిసి వుంటూ కలిసే వండుకుంటారు. ఇటువంటి సందర్భాలలో ఆ ఉమ్మడి కుటుంబంలో ఒకరికే పని లభిస్తుంది. ఈ చట్టంలోని ఇంకొక నిబంధన ఏమిటంటే దారిద్ర్యరేఖకు దిగువన వున్న కుటుంబంగా నమోదు చేసుకుని రేషన్ కార్డు కలిగి వున్న కుటుంబాలకే లబ్ది చేకూరుతుంది. ప్రభుత్వ జాబితాలు ఎంత బాగా నిర్వహిస్తారో, పేదలకు రేషన్ కార్డు లభించడం ఎంత కష్టమో మనందరికీ తెలుసు.

ఇప్పుడు ఈ పథకం ఏ విధంగా అమలు జరుగుతున్నదో చూద్దాం. పేదరిక నిర్మూలన కోసం పనులు కల్పించడం లేదా ఉపాధి హామీ పథకాల నిర్వహణ కొత్తేమీ కాదు. ఈ పథకాల కోసం కేటాయిస్తున్న నిధులలో 'రూపాయిలో 15 పైసలు మాత్రమే ప్రజల వద్దకు చేరుతున్నాయి' అని ఒకప్పటి ప్రధానమంత్రే బహిరంగంగా ఒప్పుకున్నాడు. ఉపాధి హామీ కార్యక్రమానికి ముందస్తుగా 2004 అక్టోబర్ 2న ప్రధానమంత్రి జాతీయ పనికి ఆహార పథకాన్ని 150 జిల్లాల్లో ప్రారంభించాడు. ఈ పథకం నామమాత్రంగానే అమలు జరిగింది. నిజమైన పేదలకు లబ్ది చేకూరే విధంగా ఏ మాత్రం నూతన పద్ధతుల్లో సమర్థవంతంగా అమలు జరగలేదు. ఈ చట్టానికన్నా ముందు గత రెండు దశాబ్దాలుగా మహారాష్ట్రలో అమలవుతున్న ఉపాధి హామీ పథకం కింద పని కల్పించలేక పోయినప్పుడు ఇవ్వాల్సిన నిరుద్యోగ భృతి యిప్పటివరకు పైసా కూడా చెల్లించలేదు. మహారాష్ట్రకు చెందిన ఒక అధికారి "నష్టపరిహారం ఇవ్వడం అనేది పక్కకు పెట్టండి; ఎందుకివ్వలేదని కూడా ఎవర్నీ అడగనివ్వం" అని బహిరంగంగానే ప్రకటించాడు. అంటే నిరుద్యోగ భృతి అనే నిబంధన ఉపయోగం లేనిదిగానే మిగిలిపోయింది. ఇక ఎవరైనా ఈ పథకం మిగతా వాటికన్నా భిన్నమైనదని ఎలా భావించగలరు? ఎందుకంటే సమాచార హక్కు చట్టం చెబుతున్నట్లు ఆ చట్టం కూడా వాస్తవంగా అధికార దుర్వినియోగాన్ని ప్రశ్నించలేదు. అధికార దుర్వినియోగాన్ని ప్రశ్నించగలిగే పరిస్థితి లేనప్పుడు ఈ నిబంధన వల్ల ఉపయోగం ఏముంటుంది? గ్రామ సభలు, పంచాయితీ సమితులలో ఇప్పటివరకు భూస్వాముల ఆధిపత్యమే కొనసాగుతున్నది. ఈ చట్టం వల్ల భూస్వాముల ఆధిపత్యం, అధికారుల దాష్టీకం మరింత పెరుగుతుంది. అధికార పక్షంలోని వాళ్ళకు సమాజంలో మరింత పట్టును పెంచుకోవడానికి ఈ పథకం తోడ్పడుతుంది.

మరో ముఖ్యమైన విషయమేమంటే యు.పి.ఎ ప్రభుత్వం ఈ పథకానికి అవసరమైన ఆర్థిక వనరులను నిర్దిష్టంగా కేటాయించలేదు. ఈ పథకం అమలు చేయటానికి దాదాపు 40,000 కోట్ల రూపాయలు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు. ఇందులో 90శాతం కేంద్ర ప్రభుత్వం, 10శాతం రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలి. గత అనుభవాన్ని బట్టి అర్థమయ్యేదేమంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరినొకరు నిందించుకోవడానికి మరో అవకాశంగా మారేటట్టుగా వుందీ పథకం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేరువేరుగా నిర్దిష్టమైన గడువులోగా అప్పులు లేదా గ్రాంటు (సహాయం)ల రూపంలో నిధులు ఏర్పాటు చేయాలని పార్లమెంటు నిర్దేశించింది. ఇప్పుడీ పథకాన్ని ప్రారంభిస్తూ 2006-07 బడ్జెట్‌లో కేటాయించింది రూ. 10,170 కోట్లు. ఇప్పటివరకు గ్రామీణ ఉపాధి హామీ పథకాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయిస్తున్న 17,000 కోట్ల రూపాయలు తప్ప ఆర్థికమంత్రి దగ్గర వేరే నిధులు లేవు. అంటే అవే నిధులు ఈ పథకానికి మళ్ళిస్తారు. ఈ మొత్తం కూడా మొదటి దశలో అమలవుతున్న 200 జిల్లాలకే అవసరమవుతాయి. 40,000 కోట్ల అంచనాకుగాను కేటాయించింది 10,170 కోట్ల రూపాయలేనంటే ఇక ముందు ముందు ఈ సంఖ్య ఎంత గిడసబారి పోతుందో, పథకం అమలు ఎలా వుంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈ పథకానికి 10,170 కోట్లు కేటాయించినప్పటికీ అదే సమయంలో సంక్షేమ పథకాలకు పెట్టే ఖర్చులో 9,000 కోట్లు కోత పడింది. సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన కేటాయింపు 4,950 కోట్లకు తగ్గిపోయింది. ఇక పనికి ఆహార పథకం మొత్తానికే అదృశ్యమైంది. రేపు ఇది కూడా అదే బాటలో పయనిస్తుందనటంలో ఆశ్చర్యం లేదు.

ఉత్పాదకతను పెంచే పనులను మాత్రమే చేయాలన్న నిబంధన వల్ల పెద్దఎత్తున అవినీతి జరిగే అవకాశం వుంది. చేయవలసిన పనుల్ని స్థానిక ప్రజలచే గుర్తించటం కాకుండా కాంట్రాక్టర్లకు లాభాలు చేకూర్చే అవకాశముండే విధంగా రాజధానిలోని 'నిపుణులు' ఎంపిక చేస్తారు. 150 జిల్లాల్లో అమలయిన జాతీయ పనికి ఆహార పథకం కింద జరిగిన పనుల జాబితాను ఒకసారి పరిశీలిస్తే డబ్బులు మిగుల్చుకొని ఆస్తులు పెంచుకోవడానికి అవకాశమున్న పనులనే చేశారు.

ఎంతో ఆకర్షణీయంగా రూపొందించినప్పటికీ ఈ పథకం అమలు జరిగే అవకాశాలకన్నా పెద్ద ఎత్తున ప్రచారం చేసుకోవడానికి పాలకులకే ఎక్కువగా ఉపయోగపడేలా వుంది. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా బండ్లపల్లిలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, సోనియాగాంధీలు హెలికాప్టర్‌లో దిగి ఆర్భాటంగా ప్రారంభించిన ఉపాధి హామీ పథకం, ఇప్పుడు ఆ ఊరిలో అడ్రస్ లేకుండా పోయింది. బోలెడంత హామీ పొందిన ఆ ఊరి వలస కూలీలకు ముగ్గురి పేరన మూడు శిలాఫలకాల్ని మిగిల్చి, హామీ వలసపోయింది. ప్రారంభించిన ఊరిలోనే ఉపాధి హామీ పథకానికి ఈ గతి పడితే ఇక మిగిలిన ప్రాంతం గురించి అనుకోవడానికేముంటుంది.

ఇంకొక నిబంధన ఏమిటంటే అవినీతి జరిగిందన్న ఫిర్యాదు వస్తే తక్షణమే జిల్లా అంతటికీ నిధులు నిలిపివేయబడతాయి. మొదలు కాకుండానే నిలిచిపోవడానికి ఎంతగా అవకాశముందో ఈ నిబంధన వల్ల స్పష్టంగా అర్థమవుతున్నది.

**అన్నింటికంటే ముఖ్యమైన విషయమేమిటంటే ఇది కూడా మిగతా పథకాలలాగే సంస్కరణ పథకమే. మౌలిక సమస్యలైన నిరుద్యోగ, పేదరికాల నిర్మూలనకు ఉద్దేశించినది కాదిది. మరో ముఖ్యమైన, మరింత ప్రమాదకరమైన విషయమేమిటంటే అన్ని సంస్కరణ పథకాలకున్నట్లే భూస్వామ్య, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే ప్రస్తుత వ్యవస్థకు చట్టబద్ధతను చేకూర్చే రాజకీయ లక్ష్యం దీని వెనక కూడా వుంది. కొన్ని ప్రలోభాలు కల్పించి ప్రజలను వర్గపోరాట మార్గం నుంచి దారి మళ్ళించాలన్న ఉద్దేశ్యమే ఈ పథకానిది కూడా. ఈ విషయంలో యు.పి.ఎ, ఎన్.డి.ఎల ఉద్దేశ్యాలకూ సి.పి.ఐ, సి.పి.ఎంల ఉద్దేశ్యాలకూ ఎటువంటి తేడా లేదు. ఈ చట్టంపై జరుగుతున్న వివాదాలు నిజమైన వివాదాలు కావు; ఏవో కొన్ని సాంకేతిక పరమైన అంశాలకు సంబంధించినవే. ప్రభుత్వ విధానాల పట్ల ఎటువంటి వివాదాలు లేవు. పాలకవర్గాలు అవలంభిస్తున్న 'అభివృద్ధి కార్యక్రమాల' వల్ల పేదలు మరింత పేదలుగా మారుతున్నారు. ప్రభుత్వం అవలంభిస్తున్న ఎల్.పి.జి (సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ) ఆర్థిక విధానాల వల్ల సంఘటిత రంగంలో పెద్దఎత్తున ఉద్యోగులను తొలగిస్తున్నారు. చిన్న తరహా పరిశ్రమలు వాస్తవానికి ఎప్పుడో నాశనమై పోయాయి. వ్యవసాయ రంగంలో అభివృద్ధి రేటు నకారాత్మకం (నెగటివ్)గా వుంది. ముఖ్యంగా 1990 మధ్య నుండి నూతన ఉపాధి కల్పనా మార్గాలు పూర్తిగా మూసుకు పోగా ఉన్న ఉద్యోగాలను కూడా పెద్దయెత్తున తొలగిస్తున్నారు. అభివృద్ధి కోసం అవలంభిస్తున్న వ్యూహాన్ని గురించి మాట్లాడకుండా ఉపాధి కల్పన గురించి మాట్లాడటమంటే పరిహాసమే అవుతుంది.**

ఈ పథకం ఉద్దేశ్యం ఉపాధి కల్పన, పేదరిక నిర్మూలనకన్నా విప్లవ పోరాటాలనుండి ప్రజలను పక్కదారి పట్టించడానికేననడానికి కావలసినంత ఆధారం వుంది. ఎందుకంటే ఈ పథకం అమలు చేయడానికి మొదట ఎంపిక చేసిన 150 జిల్లాలలో తీవ్రంగా వర్గపోరాటాలు జరుగుతున్న ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ (ఎ.పి); బస్తర్, దంతేవాడ, కాంకేర్ (ఛత్తీస్‌ఘడ్); గుమ్లా, ఛాత్రగర్వా, లతేహార్, పలామూ(ఝార్ఖండ్); కోరాపుట్, మల్కన్‌గిరి (ఒరిస్సా); మిద్నాపూర్ (బెంగాల్) వుండడం వల్ల ఈ విషయం స్పష్టంగా అర్థమవుతున్నది. చాలా ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే యు.పి.ఎ ప్రభుత్వం, సి.పి.ఎంలు రెండూ కూడా నక్సలైట్లు అంతర్గత భద్రతకు ముప్పుగా పరిణమించారని సామాజిక, ఆర్థిక కారణాల వల్లనే నక్సలిజం పెరుగుతున్నదని మాట్లాడుతున్నాయి. ప్రస్తుత చట్టం తీసుకురావడంలో ఈ అంశం కూడా ఒక ప్రధానమైన కారణం. వియత్నాం చేతిలో అమెరికా ఓడిపోయిన తర్వాత, తిరుగుబాట్లను ఎదుర్కోవడానికి అనుసరిస్తున్న తక్కువ స్థాయి యుద్ధ వ్యూహం (లో ఇన్‌టెన్సిటీ కాన్‌ఫ్లిక్ట్ - ఎల్.ఐ.సి)లో భాగంగా సామ్రాజ్యవాదులు ఇటువంటి సంస్కరణలు చేపడుతున్నారు. ఈ విధానం పట్ల యు.పి.ఎ, ఎన్.డి.ఎ, సి.పి.ఐ లేక సి.పి.ఎంలలో ఎటువంటి వివాదం లేదు. ప్రస్తుత ఉపాధి హామీ పథకం తేవడం వెనుక ప్రభుత్వానికి వున్న ఉద్దేశ్యాలను అనుమానించడానికి స్పష్టమైన కారణాలున్నాయి. మొత్తంగా అభివృద్ధి చెందడానికి అనుసరించే వ్యూహంలో భాగంగానే ఉపాధి కల్పన జరగాలిగానీ ఇటువంటి పథకాల వల్ల ఉపయోగం లేదు. నిజంగా అభివృద్ధి చేయడానికి అనుసరించే వ్యూహంలో భాగంగా కాక వర్గపోరాటాలను నీరుగార్చాలనే ఉద్దేశ్యంతో ఇటువంటి పథకాలు చేపట్టే దోపిడీ ప్రభుత్వాల సహజమైన వ్యూహం ఫలితంగా అవి నిరుపయోగమౌతున్నాయి. ❐

**ఏప్రిల్ 22న కామ్రేడ్ లెనిన్ 136వ జన్మదినోత్సవ విప్లవ శుభాకాంక్షలు!**

**మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వర్ధిల్లాలి!!**

# పాలకవర్గాల పాశవిక అణచివేతకు జవాబుగా మావోయిస్ట్ ఉద్యమ ప్రతిఘటన

తమ సామ్రాజ్యవాద అనుకూల విధానాలను దేశంలో నిరాటంకంగా అమలు చేయడం కోసం మావోయిస్ట్ ఉద్యమంపై తీవ్రమైన అణచివేతకు పాల్పడుతున్నాయి పాలకవర్గాలు. జె.ఓ.సి ఆధ్వర్యంలో సమన్వయంతో కూడిన దాడులకు పాల్పడుతున్నాయి. ఈ అణచివేతకు మావోయిస్ట్ ఉద్యమం వీరోచిత ప్రతిఘటన ద్వారా సమాధానం చెప్తున్నది. ఈ ప్రతిఘటనలో వేలాది మంది ప్రజలు అత్యంత ధైర్యసాహసాలతో పాల్గొంటూ విప్లవోద్యమం పట్ల అంకితభావాన్నీ, పాలకవర్గాల పట్ల కసినీ ప్రదర్శిస్తున్నారు. మావోయిస్టు ఉద్యమం వెనుక ప్రజలు లేరనే శత్రువు చేసే దుష్ప్రచారాన్ని తుత్తునియలు చేస్తున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో దేశవ్యాప్తంగా జరిగిన కొన్ని ముఖ్యమైన ప్రతిఘటనా చర్యలను సమాచారం ఉన్నమేరకు ఇక్కడ ప్రచురిస్తున్నాం.

### ఆర్. ఉదయగిరిపై పి.ఎల్.జి.ఎ.సాహసోపేతమైన దాడి

ఆంధ్రా ఒరిస్సా సరిహద్దు ప్రత్యేక జోన్ (ఏఓబి)కి చెందిన మావోయిస్టులు ఒరిస్సాలోని గజపతి జిల్లా, ఆర్. ఉదయగిరి పట్టణంలో పోలీస్ అవుట్‌పోస్ట్, జైలు, కలెక్టర్ గెస్ట్‌హౌజ్ మీద ఏకకాలంలో దాడి చేసారు. మార్చి 22న జరిగిన ఈ దాడిలో గెరిల్లాలు దాదాపు 35 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆయుధాల్లో 3 ఎల్.ఎం.జిలు, 20 ఎస్.ఎల్.ఆర్‌లు, రెండు స్టెన్‌గన్లు ఉన్నాయి.

ఈ దాడిలో ముగ్గురు పోలీసులు చావగా, అసిస్టెంట్ జైలర్‌నూ, మరొక అధికారినీ కిడ్నాప్ చేశారు. జైల్లోని ఖైదీలందరినీ విడిపించారు.

జె.ఓ.సిలో భాగంగా విప్లవోద్యమ అణచివేతలో ఒరిస్సా రాష్ట్రం చురుగ్గా ముందుకొస్తున్నది. పెద్ద ఎత్తున క్యాంపులనూ, బలగాలనూ, ఆధునిక ఆయుధాలను పెంచుకుంటూ విప్లవోద్యమంపై దాడులకు పాల్పడుతున్నది. దాని దూకుడు చర్యలకు బుద్ధి చెప్పడానికీ, విప్లవోద్యమానికి అవసరమైన ఆయుధ సంపత్తిని పెంచుకోవడానికీ ఏఓబి కామ్రేడ్స్ ఈ దాడికి పాల్పడ్డారు.

అంతేగాక విప్లవోద్యమ అణచివేతలో భాగంగా పార్టీ, పి.ఎల్.జి.ఎ. ప్రజాసంఘాల సభ్యులనూ, సానుభూతిపరులనూ అరెస్టులు చేయడమనేది ఒరిస్సాలో విచ్చలవిడిగా సాగుతోంది. ఇలా అరెస్టు చేసిన వారిని కనీస విచారణ లేకుండా ఏండ్ల తరబడి జైళ్లలో మగ్గిపోయేలా చేయడం సర్వసాధారణమైపోయింది. బారిపాదొరొ, మంద్రబాజు వంటి సంఘటనల్లో నిందితులకు యావజ్జీవ శిక్షలు వేసి వివిధ సెక్షన్ల ప్రజల నుంచి వ్యతిరేకతనూ, నిరసననూ ఎదుర్కొన్న చరిత్ర కూడా ఒరిస్సా ప్రభుత్వానికి వుంది. జైలు ద్వారాలను బద్దలుకొట్టి ఖైదీలను విడిపించడం తప్పమరే చట్టబద్ధ, న్యాయబద్ధ పరిష్కారం లేకుండా పోయిందిక్కడ.

అందుకే విప్లవకారులు జైలు గేటును పేల్చివేసి ఖైదీలకు విముక్తిని కలిగించారు. ఈ ఘటన పాలకవర్గాల్లో ఉలికిపాటును కల్గించగా ప్రజల్లో, విప్లవ శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపింది.

### కంభం ఎమ్మెల్యే లక్ష్యంగా డైరెక్షనల్ మైన్ పేల్చిన పి.ఎల్.జి.ఎ

ప్రకాశం జిల్లా కంభం నియోజక వర్గానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాస్ రెడ్డి లక్ష్యంగా నల్లమల డివిజనల్ కమిటీకి చెందిన మావోయిస్టులు ఏప్రిల్ 8వ తేదీన అర్ధవీడు మండలం కాకర్ల గ్రామ సమీపంలో డైరెక్షనల్ మైన్ పేల్చారు. ఈ దాడి నుంచి ఎమ్మెల్యే సురక్షితంగా బయటపడ్డప్పటికీ ఈదాడి ప్రభుత్వ, పోలీసు వర్గాల్లో తీవ్ర ఆందోళనను కల్గించింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నక్సలిజాన్ని పూర్తిగా అణచివేసిందనీ దేశవ్యాప్తంగా కూడా అణచివేయడానికి నాయకత్వం వహించగలదని పాలకవర్గాలు భావిస్తున్నాయి. అందుకే ఉద్యమ ప్రభావం అధికంగా ఉన్న రాష్ట్రాలతో ఏర్పడిన కమాండ్‌కు ఆంధ్రప్రదేశ్‌లో 'విజయం సాధించిన' స్వరణ్‌జిత్‌సేన్‌ను నాయకుడిగా నియమించాయి. ఈ గర్వంతో వైయస్, స్వరణ్‌జిత్‌లు తమకు ఎదురులేనట్టుగా విర్రవీగుతున్న సమయంలో మావోయిస్టులు తమ బలాన్ని చాటారు. గెరిల్లాలు కొట్టిన దెబ్బలో ఎమ్మెల్యే చావకపోవచ్చుగానీ, ప్రభుత్వ అహం మాత్రం దెబ్బతిన్నది. ఈ దాడి కారణంగా ప్రజాపథంలో పాల్గొనడానికి భయపడుతున్న 'ప్రజాప్రతినిధులకు' చాలా ధైర్యాన్ని నూరిపోయాల్సి వచ్చింది. వీరికి భద్రతనూ పెంచవలసి వచ్చింది. కనుక రాజకీయంగా మంచి ప్రభావాన్ని వేసిన దాడి ఇది.

## విశాఖ ఏజెన్సీలో పేలిన మందుపాతర

ఈస్ట్ డివిజన్‌లోని విశాఖ జిల్లా జి.కొత్తవీధి మండలం పెదపాడు గ్రామ సమీపంలో ఏప్రిల్ 23వ తేదీన మావోయిస్టులు పేల్చిన మందుపాతరలో గ్రేహౌండ్స్‌కు చెందిన ఇద్దరు కానిస్టేబుల్లూ, ఇక హోంగార్డు గాయపడ్డారు.

ఈ ఘటన కూడా నక్సల్స్‌ను అణచివేయడంలో సమర్థురాలిగా భావిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికే కాక అణచివేతలో ముఖ్యమైన సాధనంగా భావిస్తున్న గ్రేహౌండ్స్ బలగాలకు ఒక పెద్ద షాక్ నిచ్చింది. విచ్చలవిడిగా కూంబింగులకు పాల్పడుతున్న గ్రేహౌండ్స్‌కు ఒక సవాల్‌ను విసిరింది.

## వరంగల్ జిల్లా గుండాల మండలం దుబ్బగూడెం-సాయనపల్లి దారిలో అంబుష్

పాలగండి అంబుష్‌తో రెచ్చిపోయిన పోలీసులు మందుపాతర వెలికి తీయడానికి, తిరిగి గెరిల్లా దళాలపైన దాడులు చేయడానికి మళ్ళీ రెండు జిల్లాల పోలీసులు సిద్ధమై గంగారం - చెట్టుపల్లి గ్రామాల మధ్య గుట్టల్లో మైన్స్ వెలికి తీశారు. అదే ఉత్సాహంతో డిసెంబర్ 17నాడు లింగాల, దుబ్బగూడెం, దామెరతోగు, వెంకటాపురం, సామరపల్లి అటవీ ప్రాంతానికి గ్రేంహౌండ్స్ బలగాలు ఎంగేజ్ అయినాయి. క్లెమోర్‌మైన్ పెట్టి మాటుగాసిన గెరిల్లాలు గ్రేహౌండ్స్ పార్టీలోని ముందు బ్యాచ్ పై మైన్స్ పేల్చారు. ఈ దాడిలో పోలీసులకు ఏమికాలేదు. ఉత్తర తెలంగాణలో ఇంత కాలంగా చాలా తేలిగ్గా అడవుల్లో సంచరిస్తూ దాడులు నిర్వహించిన పోలీసులకు ఎక్కడికక్కడ జరుగుతున్న మందు పాతరల పేలుళ్ళు మరింత భయాన్ని పెంచాయి. దీనితో శత్రువు దాడులను తాత్కాలికంగా నెలరోజుల పాటు ఆపుకున్నాడు.

## రైలును హైజాక్ చేసి తమ సత్తాను చాటిన గెరిల్లాలు

ఝార్ఖండ్ రాష్ట్రంలోని పాలము జిల్లాలో జరిగిన ఒక ఎన్‌కౌంటర్లో సి.పి.ఐ.(మావోయిస్ట్) కమాండర్ కా॥ జగన్నాధ్ కొయిరి అమరుడయ్యాడు. ఈ ఎన్‌కౌంటర్‌కు నిరసనగా పార్టీ బంద్ పిలుపునిచ్చింది. ఈ బంద్ సందర్భంగా తమ నిరసనను తెలియజేయడానికి మావోయిస్టులు మార్చి 13న గోమా నుంచి మొఘల్‌సరైకు వెళుతున్న రైలును హైజాక్ చేశారు. రైలుతో అన్ని సంబంధాలను తెగ్గొట్టారు. హైజాక్ చేసిన సమయానికి ఆ రైలులో 100 మంది ప్రయాణీకులు ఉన్నారు. రైలును తమ ఆధీనంలో 12 గం॥లు వుంచుకొని ఆ తర్వాత వదిలేశారు. మావోయిస్ట్‌లు తమతో మర్యాదగా వ్యవహరించారని ప్రయాణీకులు తెలియజేశారు.

మావోయిస్ట్ పార్టీ చరిత్రలో ఇలా రైలును హైజాక్ చేసిన ఘటన ఇదే మొదటిది. పురోగమిస్తున్న ఉద్యమం కొత్త కొత్త పోరాట రూపాలను సృష్టించుకుంటుందని ఈ ఘటన ద్వారా అర్థమవుతుంది.

ఒక రైలును తమ ఆధీనంలోకి తెచ్చుకొని 12 గంటలు తమ దగ్గరే వుంచుకోగల్గారంటే అది మావోయిస్టుల శక్తి సమర్థతలను చాటుతుంది. అంతేకాదు ఈ ఘటన ద్వారా వారి నిరసన ఎంత బలమైనదో కూడా అర్థమౌతుంది.

## మావోయిస్టులచేత వైశాలి పట్టణ దిగ్బంధనం

బీహార్‌లోని జిల్లా కేంద్రమైన వైశాలి పట్టణాన్ని ఏప్రిల్ 28న మావోయిస్టులు చుట్టుముట్టి దిగ్బంధనం చేశారు. ఈ ఘటనకు పోలీసులూ ప్రభుత్వ యంత్రాంగమూ దిగ్భ్రాంతి చెంది చేష్టలుడిగిపోయారు. వాళ్లు దిగ్భ్రాంతి నుండి తేరుకోకుండానే ఒక బ్యాంకులోని నగదును తీసుకొని నక్సల్స్ సురక్షితంగా తిరిగి వెళ్లిపోయారు. ఈ సంఘటనలో మూడు నాలుగు గంటలపాటు పట్టణం పూర్తిగా మావోయిస్టుల ఆధీనంలో వుంది. ఇది జహనాబాద్ దాడిని తలపింపజేసిందని మీడియా వ్యాఖ్యానించింది.

పట్టణ ప్రాంతాల్లో విజయవంతమౌతున్న ఇటువంటి దాడులు పార్టీ శ్రేణుల్లో, ప్రజల్లో ఉత్సాహాన్ని నింపుతున్నాయి.

> "కమ్యూనిస్టులు కార్మికవర్గం యొక్క తక్షణ లక్ష్యాలను సాధించడానికి తాత్కాలిక ప్రయోజనాలను అమలు పరచడానికి పోరాటం చేస్తారు. కాని వాళ్ళు వర్తమాన ఉద్యమంలో ఆ ఉద్యమం యొక్క భవిష్యత్తును ప్రతిబింబిస్తూ, ఆ భవిష్యత్తు పట్ల కూడా శ్రద్ధ వహిస్తారు."
>
> -'కమ్యూనిస్టు ప్రణాళిక'

# సల్వాజుడూంను తిప్పికొడుతూ దండకారణ్యంలో వెల్లువెత్తుతున్న ప్రజాప్రతిఘటన

సల్వాజుడూం పేరుతో దండకారణ్య ప్రజలపై ఫాసిస్టు అణచివేతను అమలుచేసి మావోయిస్ట్ ఉద్యమాన్ని అంతం చేయాలని పాలకవర్గాలు దుష్ట పథకం వేశాయి. అయితే ఆ పథకాన్ని భగ్నం చేస్తూ, వెల్లువెత్తుతున్న ఉద్యమ ప్రతిఘటన ప్రజలకు నైతిక శక్తినీ బలాన్నీ ఇస్తున్నది. వారినీ మరింత వీరోచితంగా ప్రతిఘటనలో భాగస్వాములను చేస్తోంది. తెగించి పోరాడితే విజయం తప్పదన్న విశ్వాసాన్ని వారిలో నింపుతోంది.

సల్వాజుడూం మొదలైనప్పటి నుండి ప్రతిఘటన తీవ్రంగానే ఉన్నది. సల్వాజుడూం గూండాలనూ పోలీసులను తరిమి కొట్టిన సంఘటనలూ, పట్టుకొని శిక్షించిన సంఘటనలూ చాలనే జరిగాయి. మైన్‌ప్రూఫ్ వాహనాన్ని పేల్చి, ప్రజల ప్రతిఘటన ముందు ఎంత అత్యాధునిక యుద్ధ సామాగ్రి అయినా తుత్తునియలు కావాల్సిందేనని చాటిన వీరోచిత ఘటన కూడా జుడూం ప్రారంభ దశలోనే జరిగింది. ఈ ఘటలో 24 మంది సిఆర్‌పిఎఫ్ జవానులు కుక్కచావు చచ్చారు.

అయితే జనవరి ఆఖరు నుంచీ ఈ ప్రతిఘటనలో గుణాత్మకమైన మార్పు వచ్చింది. ప్రతిఘటన జరగని రోజూ, శత్రువును దెబ్బతీయని రోజూ ఒక్కటి కూడా లేదంటే అతిశయోక్తి కాదు. అందులోనూ వెంట వెంటనే ఒక గొలుసులాగా జరిగిన భారీ ఘటనలు శత్రువుకు దిమ్మతిరిగేలా చేశాయి. ఉద్యమ ప్రాంతానికి దూరంగా ఉన్న ప్రజలకు కూడా ఇన్నాళ్లూ ప్రసారమాధ్యమాలు తొక్కిపెట్టిన, రంగు పులిమిన సల్వాజుడూం అసలు స్వభావాన్ని అర్థం చేయించాయి. సర్వత్రా జుడూం పట్ల వ్యతిరేకతను పెంచాయి. అంతేకాదు ఈ ప్రతిఘటనా చర్యలు సల్వాజుడూంకు తాత్కాలికంగానైనా అడ్డుకట్టలు వేశాయి.

అటువంటి చర్యల్లో కొన్నింటిని ఇక్కడ చూద్దాం.

### జుడూం గూండాల గంగలూరు అడ్డాపై అర్ధరాత్రి మెరుపులా విరుచుకుపడిన వందలాది మిలీషియా

జుడూం గూండాల కోసం అన్ని పోలీస్ స్టేషన్ల, క్యాంపుల పరిసరాల్లోనే ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నారు. వీరికి రక్షణగా పోలీసులతో పాటుగా ఎస్.పి.ఓలు ఉంటున్నారు. వీటికి అందుబాటులోనే దాడులతో ప్రజలను భయభ్రాంతులను చేసి వారిని నిర్బంధంగా తీసుకువచ్చి వారిని వుంచడం కోసం ఏర్పాటుచేస్తోన్న శిబిరాలూ ఉంటున్నాయి. ప్రభుత్వం వాటిని రాహత్ శిబిరాలు (సహాయ శిబిరాలు) అని వ్యవహరిస్తున్నది. నిజానికవి నాజీల కాన్సెంట్రేషన్ క్యాంపులను తలపించే విధంగా ఉంటాయి. గూండాలూ, అన్ని రకాల పోలీసులు ఈ సహాయ శిబిరాలపై బడి నానా అరాచకాలు చేస్తుంటారు. వీరి చేత వెట్టి చాకిరీ చేయిస్తారు. ఏమాత్రం తేడా వచ్చినా మంచినీళ్లు తాగినంత సులువుగా ప్రాణాలు తీస్తారు. ఈ శిబిరాల్లో మహిళలపై చేసే అకృత్యాలకు లెక్కేలేదు. గూండాల, పోలీసుల వికృత లైంగిక వాంఛలు తీర్చే లైంగిక సాధనాలుగా చూస్తారీ మహిళల్ని. ఈ మానవ మృగాల అత్యాచారానికి గురికాని మహిళలు ఒక్కరు కూడా ఈ శిబిరాల్లో లేరంటే ఎంత మాత్రమూ అతిశయోక్తి కాదు. అంతేకాదు తాము గ్రామాలపై చేసే దాడులకు ఇందులోని ప్రజల్ని తీసికెళ్తూ వారిని మానవకవచాలుగా వాడుకుంటున్నారు.

ఈ విధంగానే దంతెవాడ జిల్లాలోని గంగలూరు అనే ఊర్లో పోలీస్ స్టేషనూ, క్యాంపు, గూండాల క్యాంపు , 'సహాయ శిబిరాలు' ఉన్నాయి. ఈ సహాయ శిబిరాల్లోని అకృత్యాలను భరించలేకపోయిన ప్రజలు ఈ గూండాలను శిక్షించాలని కోరుకున్నారు. ఆ శిబిరాల్లో నలిగిపోతున్న ప్రజలు అందించిన సమాచారం, సహకారంతో జనవరి 29న అర్ధరాత్రి గెరిల్లాలు, మిలీషియా, ప్రజలూ కలిసి వందల సంఖ్యలో ఈ క్యాంపుపై దాడి చేశారు. పోలీసుల కాల్పులను ప్రతిఘటిస్తూనే, డజన్లకొద్దీ గూండాలను, ఎస్.పి.ఓలను పట్టుకొన్నారు. వీరిలో పరమ క్రూరులైన ఐదుగురు గూండాలూ, నలుగు ఎస్.పి.ఓలను చంపి, మిగతా వారిని శిక్షించి, హెచ్చరించి వదిలేశారు.

నిర్బంధంగా 'సహాయ శిబిరాల్లో' పడివుంటున్న చాలా మంది ప్రజలు దాడి మొదలు కాగానే సంతోషంగా ఆ శిబిరాల్ని వదిలి తమ గ్రామాలకు వచ్చేశారు.

ఈ ఘటనలో, శత్రువు జరిపిన దాడిలో కా॥ ఎంకి (సెక్షన్ డిప్యూటి కమాండర్), కా॥ సన్ను(మిలీషియా ప్లాటూన్ సెక్షన్ కమాండర్), కా॥ రాజు, పాండు (మిలీషియా సభ్యులు) అమరులయ్యారు.

### పరమ క్రూరులైన నాగా పోలీసులపై కసి తీర్చుకున్న ప్రజానీకం

సల్వాజుడూంను ముందుకు తీసుకుపోవడానికి 20 వేల రాష్ట్ర సాయుధ బలగాలకు తోడు 9 బెటాలియన్ల సి.ఆర్.పి.ఎఫ్. ఒక బెటాలియన్ గుజరాత్ రాష్ట్ర సాయుధ బలగాలు, ఒక బెటాలియన్ నాగాలాండ్ సాయుధ బలగాలు వున్నాయి. క్రూరమైన,

హేయమైన, జుగుప్సాకరమైన చర్యల ద్వారా ప్రజల్లో భయోత్పాతాన్ని కల్గించే నాగా పోలీసుల మీద సర్కారు చాలా ఆశలు పెట్టుకుంది. సల్వాజుడూం పాశవిక దాడిలో వీళ్లను ఎదురులేని 'హీరో'లుగా భావించి ప్రచారం చేసింది. కానీ ప్రజా ఉద్యమ శక్తి ముందు ఇటువంటి 'హీరోలు' ఉత్త జీరోలేనన్న నగ్నసత్యాన్ని దండకారణ్య విప్లవోద్యమ చరిత్ర మరోసారి చాటింది.

పశ్చిమ బస్తర్‌లో విధ్వంసాన్ని సృష్టించిన జుడూం దక్షిణ బస్తర్‌లోకి ప్రవేశించడం మొదలుపెట్టింది. అయితే ప్రారంభదశలోనే దంతెవాడ జిల్లాలోని బెజ్జి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్త చెరువు వద్ద నాగా పోలీసులు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఫిబ్రవరి 6వ తేదీన గెరిల్లాలు మందుపాతరతో పేల్చివేయడంతో 9 మంది నాగాలు అక్కడికక్కడే చచ్చారు. మరో ఇద్దరు ఆసుపత్రిలో చచ్చారు. 9 మంది గాయపడ్డారు.

ఈ ఘటనతో ప్రజలు తమ కసి తీరిందని సంతోషపడితే ప్రభుత్వం మాత్రం దిమ్మతిరిగిపోయి ఈ ప్రాంతంలో 'సల్వాజుడూం'ను కొద్ది రోజులు నిలిపివేసింది. ఫలితంగా గెరిల్లాలకు ఒక విలువైన వెసులుబాటు కాలం దొరికింది.

### విజయవంతమైన 'ఆపరేషన్ ఆకాశ్'

సల్వాజుడూంను ఎదుర్కోవడానికి ఆయుధాలు, మందుగుండు, విస్ఫోటన సామాగ్రిని సమకూర్చుకోవాల్సిన అవసరం మరింత పెరిగింది అక్కడి ఉద్యమానికి. అందుకే జపాన్ సామ్రాజ్యవాదుల దోపిడీకి ప్రముఖ సాధనంగా పనిచేస్తున్న దంతెవాడలోని జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్.ఎమ్.డి.సి)కి చెందిన విస్ఫోటన గోదాంపై దాడి చేయాలని పార్టీ తలపెట్టింది.

ఫిబ్రవరి 9 వ తేదీన దాదాపు 900 మంది పి.ఎల్.జి.ఎ బలగాలు (ఇందులో దాదాపు 800 మంది మిలీషియానే) రాత్రి గం. 7.50 ని॥లకు ఎన్.ఎమ్.డి.సిపై మెరుపులా దాడి చేశారు. ప్రతిఘటించిన 8 మంది పోలీసులను గెరిల్లాలు చంపేశారు. లొంగిపోయిన వారిని ప్రాణాలతో వదిలేశారు. 20 టన్నుల పేలుడు పదార్థం, 14 ఎస్.ఎల్.ఆర్‌లు, దాదాపు 3వేల తూటాలు, ఒక 9 ఎం.ఎం పిస్టల్, రెండు వైర్‌లెస్ బేస్‌సెట్‌లు, రెండు హ్యాండ్ పీసులు, పెద్ద ఎత్తున డిటోనేటర్లు, కార్డెక్స్ వైరు బండిల్స్ గెరిల్లాల స్వాధీనమయ్యాయి.

ఈ దాడిలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్న మిలీషియా సభ్యులు అరగంటలో నాలుగు గదుల్లో ఉన్న 20 టన్నుల పేలుడు పదార్థాన్ని ఖాళీ చేశారు. ముందే జంటలుగా ఏర్పడిన వీరు, ప్రతి జంటా 50 కిలోల పెట్టెల్ని కావడితో మోస్తూ దుర్గమమైన కొండల్లో ప్రయాణించి తెల్లవారేసరికి గమ్యాన్ని చేరుకొని ఆపరేషన్ ఆకాశ్‌ను (ఎన్.ఎమ్.డి.సి ఎత్తయిన కొండల్లో ఆకాశపుటంచుల్లో ఉంటుంది అందుకే ఈ దాడికి ఈ పేరు పెట్టారు) విజయవంతం చేశారు.

### విజ్ఞప్తులను ఖాతరు చేయని ప్రభుత్వానికి దర్భాగూడెంలో 'మందుపాతర'ను వినిపించిన ప్రజలు

సల్వాజుడూంను నిలిపివేయాలని వరుసగా ఇక్కడి ప్రజలు, పి.ఎల్.జి.ఎ, సి.పి.ఐ (మావోయిస్టు) అన్ని పార్టీల రాజకీయ కార్యకర్తలకూ, ప్రభుత్వానికీ విజ్ఞప్తులు చేసింది. జుడూం దారుణాలను చిత్రీకరించిన సిడిలను కూలంకషంగా వివరించిన బుక్‌లెట్స్‌నూ రాష్ట్ర విధాన సభలో విస్తృతంగా పంచారు, మీడియాకు ఇచ్చారు. అయినా ఈ దారుణాల మీద ఏ ఒక్కరూ చలించలేదు. ప్రజల జీవితాల్లో చోటుచేసుకున్న భయంకర సత్యాలను తెలుసుకోవడానికి 'ప్రజా ప్రతినిధులెవ్వరూ రాలేదు' సల్వాజుడూంను ఆపే చర్యలు ఎక్కడా అగుపించలేదు.

పైగా ఈ ఫాసిస్టు హింసాకాండను విస్తరింపచేయడం కోసం ఫిబ్రవరి 27వ తేదీన దంతెవాడ జిల్లాలోని దోర్నపాల్‌లో సభను జరిపారు. దానికి ముఖ్యమంత్రి రమణ్‌సింగ్, సల్వాజుడూం నాయకులు మహేంద్రకర్మ, కేదార్ కాశ్యప్, డి.జి.పి ఎం.డబ్ల్యు అన్సారీలు హాజరయ్యారు. బలవంతంగా తరలించిన జనం ముందు వేదికలెక్కి మాట్లాడారు. ఆతర్వాత సల్వాజుడూం గూండాలకు, చుట్టుపక్కల గ్రామాల్లో చేయాల్సిన బీభత్సానికి పథకాలు రూపొందించి వెళ్లిపోయారు. ఈ సభ నుంచి గూండాలు ట్రాక్టర్లలో కోంట గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలో గెరిల్లాలు పేల్చిన మందుపాతరలో గూండాలు, ఎస్.పి.ఓలు కల్సి 26 మంది అక్కడికక్కడే చచ్చారు. మరొకరు ఆసుపత్రిలో చచ్చారు. దాదాపు 50 మంది గాయపడ్డారు.

ఈ సంఘటన సల్వాజుడూం నిర్వాహకులకు పిడుగుపాటయ్యింది. దేశవ్యాప్తంగా సంచలనాన్ని సృష్టించింది. ఈ చావులకు బాధ్యత ప్రభుత్వానిదేనని అందరూ అన్నారు. సల్వాజుడూంను ఆపాలని డిమాండ్లు వచ్చాయి.
ఈ గూండాలను శిక్షించిన కోయ భూంకాల్ మిలిషియా, పి.ఎల్.జి.ఎకు ప్రజలు సంతోషంతో విప్లవాభివందనాలు తెల్పారు.

### బాసగూడెం గూండాలపై బదులు తీర్చుకున్న ప్రజలు

గంగలూరు వలెనే దంతెవాడ జిల్లాలోని బాసగూడెం కూడా పోలీస్ స్టేషన్, గూండాల అడ్డాలు, ఎస్.పి.ఓల క్యాంపు 'సహాయ శిబిరాలు' ఉన్న ఊరు. ఈ ఊరిని కేంద్రంగా చేసుకొని

చుట్టుపక్కల గ్రామాల్లో బీభత్సాన్ని సృష్టిస్తున్నారు సల్వాజుడూం గూండాలూ, పోలీసులు. అందుకే ఈ గ్రామాల ప్రజలందరికీ ప్రతీకారం తీర్చుకోవాలని బలంగా వుండింది. కనుక చుట్టుపక్కల గ్రామాల స్త్రీ-పురుషులంతా కల్సి 4 వేల మంది జమకూడారు. వీరిలో మిలీషియా, నూతనంగా ఏర్పడిన కోయ భూంకాల్ మిలీషియాకు చెందిన వారే ప్రధానంగా ఉన్నారు. వీరంతా పిఎల్‌జిఎ ప్రధాన బలగాల నాయకత్వంలో మార్చి 4వ తేదీన బాసగూడంను చుట్టుముట్టి తెల్లవార్లూ దిగ్బంధించారు. 100 మంది పోలీసులతో ఉన్న స్టేషన్, గూండాల అడ్డాలు, ఎస్.పి.ఓల క్యాంపు, సహాయ శిబిరాలు, అన్నింటినీ చుట్టుముట్టారు. పోలీసులు కాల్పులు చేస్తున్నప్పటికీ గూండాలనూ, ఎస్.పి.ఓలను పట్టుకొని విచారించారు. వీరిలో నలుగురిని ఖతం చేసి, 20 మందిని కఠినంగా శిక్షించారు. మిగతావారిని హెచ్చరించారు.

ఈ దాడికి ప్రతీకారంగా అదనపు బలగాలు దిగుతాయని గెరిల్లాలు భావించినట్టుగానే మార్చి 5 నాడు వచ్చిన పోలీసులను, గూండాలను మురుదండ వద్ద మాటుదాడి జరిపి అడ్డుకున్నారు.

## మురుకునారు ఔట్ పోస్ట్‌పై గెరిల్లాల వీరోచిత దాడి

దంతెవాడ జిల్లాలోని బీజాపూర్ - ఆవుపల్లి రోడ్డు పైనే మురుకునార్ గ్రామం వుంటుంది. గ్రామంలోని పోలీస్ స్టేషన్‌లో ఛత్తీస్‌ఘడ్ స్పెషల్ పోలీసులకు చెందిన ఒక ప్లాటూన్‌తోపాటు 15 మంది ఎస్.పి.వోలూ కలిసి 50 మంది ఉన్నారు. ఏప్రిల్ 17న ఆవుపల్లి - బీజాపూర్ మార్గంలో ఉ. 10 గం॥ల సమయంలో వెళ్లే ప్రయివేట్ ప్రయాణీకుల బస్‌ను ఎక్కి వెళ్లిన గెరిల్లాలు స్టేషన్‌పై ఊహించని దాడి చేశారు. ఈ దాడిలో పోలీస్ ప్లాటూన్ డిప్యూటీ కమాండర్, ఇద్దరు హెడ్ కానిస్టేబుల్లు, ఒక కానిస్టేబుల్, ఏడుగురు ఎస్.పి.ఓలు చచ్చారు. మొత్తం 49 వివిధ రకాల తుపాకులూ, రెండు వేలకుపైగా తూటాలు, కొన్ని గ్రేనెడ్స్, కొన్ని మోర్టార్స్ షెల్స్ గెరిల్లాల స్వాధీనమయ్యాయి. ఈ తుపాకుల్లో ఒక 2 ఇంచ్ మోర్టార్, ఒక ఎల్.ఎం.జి, ఒక ఇన్సాస్, నాలుగు ఎ.కె 47లు, పద్నాలుగు ఎస్.ఎల్.ఆర్‌లు, రెండు స్టెన్లు, ఇరవైఐదు .303 రైఫిల్లు, ఒక 9 ఎం.ఎం పిస్టల్ ఉన్నాయి.

## గెరిల్లాలకు పట్టుబడి మరణశిక్షకు గురైన సల్వాజుడూం గూండాలు

ఏప్రిల్ 10-16 తేదీల్లో సల్వాజుడుం గూండాలు కర్మ నేతృత్వంలో కుంట ప్రాంతంలో విరుచుకుపడ్డారు. అత్తుల్‌గూడ, పాలెం, ఆర్లెంతో పాటు 10 గ్రామాలను తగులబెట్టారు. ఈ దాడిలో పాల్గొన్నవారిలో మణికుంట గ్రామానికి చెందిన వారిని తమ గ్రామానికి వెళ్లి విధ్వంసం సృష్టించి, ఇండ్లను తగులబెట్టి, తమ సామానులు తెచ్చుకొమ్మని చెప్పి పంపారు పోలీసులు. వాళ్లకు మద్దతుగా తాము దగ్గర్లోనే తిరుగుతామని నమ్మబలికి పంపారు. పోలీసులిచ్చిన ధైర్యంతో ఎస్.పి.ఓలూ, గుండాలు మణికుంట గ్రామానికి చేరారు. గ్రామంలో వీరంతా ఇండ్ల తాళాలు పగులగొట్టి తమకు ఇష్టం వచ్చిన సామాన్లను దోచుకోవడం, మేకలు, పందులు, కోళ్లను తరిమి తరిమి చంపి పట్టుకోవడం, ఇండ్లను కూలగొట్టడం చేయసాగారు. ఇంతలో అటుగా వెళ్తున్న పి.ఎల్.జి.ఎ సభ్యులకు వీరి కేకలు, అరుపులు వినబడడంతో వారు గ్రామంలోకి వెళ్లి గూండాలను పట్టుకున్నారు. వారిని విచారిస్తే అందులో 20 మంది వరకూ ఎస్.పి.ఓలు, గూండాలు ఉన్నారని అర్థమైంది. అందులో గ్రామ పెత్తందార్లు కూడా ఉన్నారు. ప్రజల్లో రేగిన కసిలో అందులోని ఇద్దరు వెంటనే చచ్చారు. తర్వాత 2 వేల మంది ప్రజలతో జన అదాలత్ జరిపారు. ఇందులో వీరంతా అన్ని రకాల విధ్వంసంతో పాల్గొన్నట్టు ఒప్పుకున్నారు. ఆ తర్వాత ప్రజల తీర్పుమేరకు ఏప్రిల్ 28న 13 మందిని పి.ఎల్.జి.ఎ చంపింది.

ఈమధ్య కాలంలో దండకారణ్యవ్యాప్తంగా దాదాపు 50 మంది పార్టీ, పి.ఎల్.జి.ఎ, ప్రజాసంఘాల సభ్యులు సల్వాజుడూం దాడిలోనూ, పోలీసులతో జరిగిన ఎదురుకాల్పుల్లోను అమరులయ్యారు. ఆ అమరుల నెత్తుటి బాకీని తీర్చుకోవడం కోసం పైన పేర్కొన్నటువంటి వీరోచిత ఘటనలతో విజయాలతో దండకారణ్య ప్రజాయుద్ధం సాగుతూ దేశవ్యాప్తంగా ఉత్తేజకరమైన ప్రభావాన్ని వేస్తోంది. ❑

**చారిత్రాత్మకమైన నేపాల్ ప్రజల పోరాటానికి విప్లవ జేజేలు!**

**నేపాల్ నూతన ప్రజాస్వామిక విప్లవం వర్ధిల్లాలి!!**

**ప్రపంచ సోషలిస్టు విప్లవం వర్ధిల్లాలి!!!**

# కొండపర్తి, బొప్పాపురంలో సాధారణ జనంపై పోలీసుల విచ్చలవిడి కాల్పులూ, రాలిన రెండు నిండు ప్రాణాలు

ఆంధ్రప్రదేశ్‌లో పేపర్లు చదివేవారికీ, వార్తలు వినేవారికీ ఒక కథను పదేపదే చదివిన, విన్న అనుభవం ఉంటుంది. ఆ కథ.... 'పోలీసులకు నక్సలైట్లు తారసపడ్డారు, లొంగిపొమ్మని పోలీసులు హెచ్చరించారు, వినిపించుకోకుండా నక్సలైట్లు కాల్పులు జరిపారు, ఇక గత్యంతరం లేక పోలీసులూ కాల్పులు జరిపారు, ఆ కాల్పుల్లో నక్సలైట్లు చనిపోయారు.

అయితే పోలీసులు దీన్ని కథ అని చెప్పరు. నిజంగా జరిగిన ఒక సంఘటన అని చెప్తారు. కానీ ప్రజలు మాత్రం దీన్ని పోలీసుల కట్టు కథ అని ఎప్పటికప్పుడు తేల్చిపడేస్తూనే ఉన్నారు. అయినా పోలీసులు విసుగులేకుండా ఆ కథను చెపుతూనే ఉన్నారు. ఆ కథ ఎంత కట్టుకథో కొండపర్తి, బొప్పాపురం సంఘటనల ద్వారా ఆంధ్రరాష్ట్ర ప్రజలకు మరోసారి రూఢీగా అర్థమైంది.

వరంగల్ జిల్లాకు చెందిన తగిడి నాగేశ్వర్ రావు (35) అనే బ్యాండ్ మేళం వాయిద్యకారుడు, తాడ్వాయిలో జరిగిన రామనవమి ఉత్సవాల్లో బ్యాండ్ మేళం వాయించి, మరోముగ్గురు తమ గ్రామస్తులతో కలిసి తమ ఊరికి ఏప్రిల్ 7వ తేదీన రాత్రి తిరిగొస్తున్నాడు. వీళ్ల నలుగురూ రెండు సైకిళ్లపై, సైకిళ్లకు డప్పుల్ని తగిలించుకొని వస్తున్నారు. కంకర రోడ్డు నుంచి దిగి తమ ఊరికి వెళ్లే సన్నని మట్టిరోడుపై వెళ్తున్న వీరిని నక్సల్స్ కోసం కాపువేసిన పోలీసులు చూసి, నక్సల్స్‌గా అనుమానించి తూటాలు కురిపించారు. ఈ సంఘటనలో నాగేశ్వర్ రావు అక్కడికక్కడే మృతిచెందగా, లక్ష్మయ్య అనే మరొక యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు.



పోలీసుల దాష్టీకంపై రెచ్చిపోయి వెంటపడి తరుముతున్న గిరిజన గ్రామస్థులు

మరో సంఘటనలో, ఇదే రాత్రి మెదక్ జిల్లాలోని బొప్పాపురం గ్రామవాసి అయిన 14 ఏళ్ల లవాకర్ అనే బాలుడు తమ పొలానికి నీళ్లు పెట్టడం కోసం మరో నలుగురైదుగురితో వెళుతున్నాడు. వీళ్లూ సైకిళ్లపైనే వెళ్తున్నారు. నక్సల్స్ వేటకు వెళ్లి చెరకు తోటలో కాపువేసుకొని కూర్చున్న పోలీసులు వీరిని చూసీ, నక్సలైట్లుగా అనుమానించి తూటాలు కురిపించారు. ఇందులో లవాకర్ చనిపోయాడు.

పై రెండు సంఘటనల్లోనూ సైకిళ్ల మీద వెళ్తున్న వారిని నక్సల్స్‌గా భావించే ఆస్కారమే లేదు. ఎందుకంటే రెండు చోట్లా కూడా పోలీసులు కాపేసుకుని కూర్చున్న స్థలానికీ, సైకిళ్ల వెళ్తున్న పిల్లదారికి మధ్య పెద్ద దూరం లేదు. వెన్నెల రాత్రి కాబట్టి స్పష్టంగా కనపడే అవకాశమే వుంది. అయినప్పటికీ నక్సల్స్ అనే అనుమానం వచ్చివుంటే వాళ్లను ఆగమని హెచ్చరించి నిర్ధారించుకోవచ్చు. ఇకవేళ నిజంగా నక్సల్స్ అనే అనుకుని వుంటే కూడా వాళ్లు చెప్పే 'కథ' ప్రకారం లొంగిపొమ్మని హెచ్చరించి వుండాల్సింది. ఎదుటివాళ్లు లొంగిపోకుండా కాల్పులు జరిపినప్పుడు మాత్రమే పోలీసులు కాల్పులు జరపాల్సింది. కానీ ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం అటువంటి హెచ్చరికలేవీ చేయలేదు. పైగా 'మేం అన్నలం' కాదు అని మొత్తుకుంటున్నా కాల్పులు ఆపలేదని కొండపర్తి సంఘటనలో గాయపడ్డ లక్ష్మయ్య చెప్పాడు.

ఇక తాము చంపింది నక్సలైట్లను కాదని అర్థమయ్యాక పోలీసులేం పెద్దగా కంగారు పడలేదు. అప్పటికే చనిపోయిన లవాకర్‌ను చూసి ఏం కాదులే చిన్న దెబ్బే తగిలింది అని అతనితో పాటు వెళుతున్న ప్రసాద్‌తో లవాకర్‌ను మోసుకురమ్మని చెప్పారు. ప్రసాద్ 'నేను మోయలేను' అని అంటే అతన్ని తుపాకీ మడమతో కొట్టి వాళ్ల క్రూరత్వాన్ని మరింత చాటుకున్నారు.

ఆ తర్వాత నక్సల్స్‌కూ తమకూ హోరాహోరి కాల్పులు జరుగుతుంటే మధ్యలోకి వచ్చినందుకు వీరికి తూటాలు తగిలాయని చిత్రీకరించబోయారు. కొండపర్తి దగ్గరయితే యుద్ధ ప్రాతిపదికమీద రోడ్డుకు మరోవైపు ఒక 'నక్సల్స్ డెన్'ను రూపొందించారు. కిట్టుబ్యాగులనూ, ఒక తుపాకీని పెట్టేసి విలేఖరులను పిలిపించి ఫోటోలు కూడా తీయించారు. అయితే ప్రజలకు విషయం తెల్సి వెల్లువలా ఉరుకొచ్చి చేతికందిన కర్రా, రాయితో పోలీసులపై ప్రతిఘటించారు. ఈ ప్రతిఘటనలో మహిళలు ప్రధాన పాత్ర వహించారు. వాళ్లు ఏర్పాటు చేసిన 'నక్సల్స్ డెన్'ను తీసి పారేశారు. దానితో పోలీసుల కథ అడ్డం తిరిగింది.

లవాకర్ కాల్చివేతకు కూడా ప్రజల్లో వ్యతిరేకత తీవ్రంగా

వచ్చింది. భూపల్లి వద్ద రాస్తారోకో చేసి నాలుగు గంటల పాటు ట్రాఫిక్‌ను స్థంబింపజేసారు. అయితే రాస్తారోకో చేస్తున్న ప్రజలపై సహితం పోలీసులు దురుసుగా ప్రవర్తించి లాఠీ చార్జి చేశారు.

ఇక పోలీసులు చేసిన ఈ 'ఎన్‌కౌంటర్ల' నిజానిజాలు ఇంత తేటతెల్లంగా కనబడుతున్నా, ప్రజల్లో ఇంత ప్రతిఘటన వెల్లువెత్తిన తర్వాత కూడా నాగేశ్వర్ రావు శరీరంలోని తూటా పోలీసుల తూటానా, నక్సల్స్ తూటానా అన్నది పరిశీలించాలని వరంగల్ ఎస్పీ మాట్లాడితే, లవాకర్ శరీరంలోని తూటా పోలీసుల తూటానా, జనశక్తి నక్సల్స్ తూటానా అన్నది పరిశీలించాలని సిద్దిపేట డీఎస్పీ అన్నాడు.

ఇక డి.జి.పి మరో నాలుగు ఆకులు ఎక్కువ చదివిన వాడు కాబట్టి, 'రాత్రిపూట తిరిగితే నక్సలైట్లో, ప్రజలో ఎలా తెలుస్తుంది'? అన్నాడు. 'కల్లోలిత ప్రాంతంలో, అదీ రాత్రిపూట జరిగిన కాల్పులు కాబట్టి పోలీసుల్ని పూర్తిగా తప్పుపట్టలేం' అని కూడా అన్నాడు. అంటే రాత్రిపూట ఉద్యమ ప్రాంతాల్లో తిరగొద్దని డి.జి.పి హెచ్చరిస్తున్నాడు. మరి రాష్ట్రవ్యాప్తంగా రైతులకు అర్ధరాత్రే కరెంట్ సరఫరా చేస్తున్నారు. అంటే రైతులు 'ఎన్‌కౌంటర్లకు' సిద్ధపడి తమ పొలాలకు నీళ్లు పెట్టడానికి వెళ్లాలన్న మాట. ఇకమీదట పొలాల్లో నీళ్లకు బదులు రైతుల రక్తం పారే అవకాశం వుందన్న మాట.

పై రెండు సంఘటనల్లో ఆమాటకొస్తే ఏ ఎన్‌కౌంటర్లో అయినా పోలీసులు చేసింది హత్యానేరాలు. కానీ ఇంత బాగా సమర్థించి, రక్షించే పై అధికారులుంటే ఆ సంబంధిత సి.ఐలకు, ఎస్.ఐలకు కనీస శిక్షలయినా పడుతాయా ? నిజానికి శిక్షలంటూ వేస్తే ముందుగా శిక్షించాల్సింది ఈ పై అధికారులనే. ఎందుకంటే వాళ్లే బాధ్యులు కనుక.

ఈ సంఘటనల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతకు జడిసిన ముఖ్యమంత్రి, పోలీసులను కొంచెం 'కోప్పడ్డాడు' కాల్పులు జరిపేముందు నక్సలైట్లో, కాదో నిర్ధారించుకోవద్దా అని 'మందలించాడు'. (నక్సలైట్లయితే కాల్చి పారెయ్యొచ్చనే అర్థం!)

కానీ కాల్పులు జరిపే ముందు నిర్ధారించుకునేంత శ్రమ పోలీసులు ఎందుకు తీసుకుంటారు ? కాల్చిపారేసి శవాల్ని చూసి నిర్ధారించుకుంటారు. నక్సల్స్ అయితే ప్రమోషన్ వస్తుంది, ఒకవేళ కాకపోయిన నక్సల్స్ అని చిత్రీకరించవచ్చు. అట్లా చిత్రీకరించడం సాధ్యం కాకపోయినా పెద్ద నష్టం లేదు. సైకిళ్ల మీద ప్రయాణించేది పెద్ద డబ్బున్న వాళ్లయివుండరు. అటువంటి వాళ్లను చంపేసినా సదరు పోలీసుల ఉద్యోగాలకొచ్చే నష్టం ఏం లేదు. ఇదీ పోలీసుల ధైర్యం, పోలీసులకు పాలకవర్గాలు నూరిపోస్తున్న ధైర్యం.

ఈ ధైర్యం వల్లే రెండు ప్రాణాల్ని సునాయసంగా తీసారు. నాగేశ్వర్ రావు కుటుంబపు పెద్ద. లవాకర్ కుటుంబ సభ్యులందరికీ రేచీకటి ఉండడం వల్ల అర్ధరాత్రి వచ్చే కరెంటు కోసం పడిగాపులుపడి పొలానికి నీరు పెట్టలేని అశక్తులు వారంతా. కనుక చిన్నవాడయిన లవాకర్ పెద్దదిక్కుగా మారి పొలానికి నీళ్లు పెట్టడం కోసం రాత్రిపూట వెళ్తున్నాడు. అంటే నాగేశ్వర్ రావు, లవాకర్ ఇద్దరూ కూడ వారి వారి కుటుంబాలకు మూలాధారాలు. అంటే పోలీసులు తీసిన రెండు ప్రాణాలు రెండు కుటుంబాలను కుప్ప కూల్చాయి.

ఇటువంటి దుర్మార్గాలు మనం కొత్తగా ఏమీ వినడం లేదు. హద్దూ అదుపూ లేని రాజ్యహింస అసంఖ్యాకమైన కుటుంబాల్లో చిచ్చు పెడుతున్నది. అయితే ఈ హింసకు వ్యతిరేకంగా ప్రజల్లో ప్రతిఘటన రోజు రోజుకూ పెరుగుతున్నది. పై రెండు సంఘటనల్లో వెల్లువెత్తిన ప్రతిఘటనే ఇందుకు తార్కాణం. ఈ ప్రతిఘటన మరింత పెరిగి ఇటువంటి హింసకు కారణమవుతున్న రాజ్యాన్ని కుప్పకూల్చాలి. అప్పుడే తుపాకీ మోతలు వినబడని సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది. ❑

---

*( 56వ పేజీ తరువాయి.....)*

చేస్తూ ఈ ప్రాంతంలో విప్లవోద్యమాన్ని అడ్డుకోవడానికి పూనుకోగా దానికి ప్రతిఫలంగానే బీరోని మడుగు ప్రజలు మావోయిస్టు పార్టీ అండతో ఈ సాయుధ గూండాల ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. వాస్తవం ఇది కాగా మావోయిస్టు పార్టీ చర్చలకని మా అశోక్ దళాన్ని పిలిచి ఆయుధాలు లాక్కొని, సభ్యులను చిత్రహింసలు పెట్టారని పెద్ద ఎత్తున న్యూడెమోక్రసీ పార్టీ ప్రచారం చేస్తున్నది. విప్లవ ముసుగులో న్యూడెమోక్రసీ సాయుధ గూండాలు చేస్తున్న అరాచకాలను అడ్డుకొని ప్రజలు ఎక్కడికక్కడ ప్రతిఘటిస్తున్నారు. ప్రజల ప్రతిఘటనకు మా పార్టీ నాయకత్వం వహిస్తుంది. వారి చేతుల్లో వున్న తుపాకులు పోలీసులు, రాజ్యానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టకుండా ప్రజలపై ఎక్కుపెడితే వాటిని లాక్కోవడానికి ప్రజలకు ఆ హక్కు వుంటుంది. ఇల్లెందు, బయ్యారం ప్రాంతాల్లో న్యూడెమోక్రసీ పార్టీ మావోయిస్టు పార్టీపై, ప్రజలపై జరుపుతున్న గూండా రాజకీయాలను, గోబెల్స్ తరహాలో చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు దీన్ని ఖండించాలి.

❍

# తెలంగాణా వ్యతిరేకతకు, పోలీసు దురహంకారం తోడైన ఫలితమే ఉస్మానియాలో మేధావుల పైన దాడి !

రాష్ట్రంలో పోలీసులు తమ అధికారాలను ఎంత విచ్చలవిడిగా దుర్వినియోగం చేస్తున్నారో హోలీ పండుగనాడు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన ఉదంతం ఒక నిదర్శనం.

హోలీ పండుగ సందర్భంగా తెలంగాణావాదులైన కొందరు ప్రొఫెసర్లూ, మేధావులూ, జర్నలిస్టులూ, రాజకీయ నాయకులూ, విద్యార్థులతో కలిసి ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆవరణలో వేడుకలు జరుపుకుంటున్న సమయంలో యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌కు చెందిన సి.ఐ, ఎస్.ఐల నాయకత్వంలో పోలీసులు దాడిచేసి వారిపట్ల దురుసుగా ప్రవర్తించి అరెస్ట్ చేశారు. వీరంతా తెలంగాణావాదులు కనుక తెలంగాణా పాటలు పాడుతూ, నినాదాలు చేస్తూ వేడుకలు జరుపుకుంటున్నారు. అట్లా పాడటం, నినాదాలు చేయడం చట్ట వ్యతిరేకమేమీ కాదు. కానీ సి.ఐ 'తెలంగాణా పేరెత్తితే తోలుతీస్తా' అని దుర్భాషలాడాడు. అరెస్ట్ విషయం తెల్సి పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన పాత్రికేయులతోను దురుసుగా ప్రవర్తించాడు.

హోలీ సందర్భంగా ప్రతి సంవత్సరం ఇలా వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నదే. పైగా అలా జరుపుకోవడానికి వి.సి అనుమతి కూడా తీసుకున్నారు. దీంట్లో పోలీసులు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఏమీ లేదు. వేడుకలు జరుపుకుంటున్నది సమాజంలో బాధ్యతాయుతమైన విధుల్లో ఉన్నవారు. ఇందులో శాంతి భద్రతలకు భంగం కల్గేదేమీ లేదు. వీరు చట్టానికి లోబడే వేడుకలు జరుపుకుంటుండగా పోలీసులే చట్టాన్ని అతిక్రమించారు. ఎందుకంటే విశ్వవిద్యాలయ ఆవరణలోకి ప్రవేశించాలంటే వి.సి అనుమతి పోలీసులకు ఉండాలి. చట్టాన్ని పాటించే అలవాటు ఎప్పుడూ ఉండదు కనుక పోలీసులు ఎటువంటి అనుమతీ తీసుకోలేదు.

కరడుగట్టిన తెలంగాణా వ్యతిరేకతకు పోలీసు సహజమైన దురహంకారం తోడైన ఫలితమే ఈ దాడి. తెలంగాణా విద్యార్థులపట్ల ఈ సి.ఐ మొదటి నుండీ వ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి. దీన్ని తెలంగాణా సంస్కృతిపై, ప్రజలకున్న సాంస్కృతిక, వ్యక్తిగత స్వేచ్ఛపై జరిగిన దాడిగా భావించాలి. తమ తెలంగాణా వ్యతిరేకత వల్ల సమాజంలో పేరు ప్రతిష్టలున్న వ్యక్తుల పట్లనే ఇంత దురుసుగా ప్రవర్తించిన పోలీసులు, సాధారణ తెలంగాణా ప్రజలపట్ల ఎలా ప్రవర్తిస్తారన్నది ఊహించుకోవడం కష్టం కాదు. తెలంగాణా గడ్డమీద బతుకుతూ, తెలంగాణా వ్యతిరేకతను ప్రదర్శించే ఇటువంటి దురహంకారులను తెలంగాణా నుంచి తన్ని తరిమెయ్యాలి.

అయితే ప్రభుత్వంలో ఈ సంఘటనపట్ల కనీస స్పందన లేదు. ఈ సంఘటన అన్ని రకాల ప్రసార మాధ్యమాల్లో ప్రముఖంగా చోటుచేసుకున్నది. సంఘటన జరిగిన వెంటనే కేశవరావు జాదవ్, జానారెడ్డికి ఫోన్‌చేసి విషయం చెప్పారు. పోలీసుల చర్య ప్రభుత్వానికి తప్పుగా అన్పించకపోయినా కనీసం సంఘటన పట్ల వెల్లువెత్తిన నిరసనను చూసయినా, దాడి జరిగింది మేధావుల పైన అయినందుకైనా అది, వెంటనే పోలీసు అధికారులను సస్పెండ్ చేసి విచారణకు ఆదేశించాల్సింది. కానీ అటువంటి చర్యలేమి తీసుకోకుండానే మరుసటి రోజు అసెంబ్లీకి వెళ్లాడు జానారెడ్డి. శాసనసభలో టి.ఆర్.ఎస్ తదితర పక్షాలు ఈ విషయంపై పెద్ద ఎత్తున గొడవ చేసినప్పటికీ వెంటనే చర్య తీసుకోలేదు. సి.ఐ నుంచి సమాచారం సేకరించలేదనీ, టి.వి. క్లిప్పింగులు చూసి పరిశీలిస్తానని జానారెడ్డి మాట్లాడాడు. అంతేకాదు ఉరిశిక్ష విధించే వాళ్లనయినా వివరణ అడుగుతారు అనే అసంబద్ధమైన వాదన చేశాడు. ఉరిశిక్ష వెయ్యడానికో, జైలుశిక్ష వెయ్యడానికో, కనీసం ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించడానికో అయితే పూర్తి విచారణ అవసరం గానీ సస్పెండ్ చేయడానికి ఇంత తాత్సారం చేయాల్సిన అవసరం లేదు.

ఎట్టకేలకు సి.ఐ, ఎస్.ఐలను సస్పెండ్ చేస్తూ, 'ఘర్షణలను నివారించడానికే పోలీసులు ఈ చర్యకు పాల్పడ్డారనీ, అయితే మరికొంత సంయమనాన్ని పాటించాల్సిందనీ పలువురు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు' అని జానారెడ్డి మాట్లాడాడు. అంటే ఒక రకంగా పోలీసులకు క్లీన్‌చిట్ ఇచ్చినట్టే. అట్లా జానారెడ్డి తన తెలంగాణా వ్యతిరేకతనూ, పోలీసు పక్షపాతాన్ని బయటపెట్టుకున్నాడు.

ఎన్నికలకు ముందు తెలంగాణా సాధిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తెలంగాణా పేరెత్తితేనే సహించలేక పోతున్నది. ఇటువంటి నిరంకుశ వైఖరిని ప్రజలు ఎంతోకాలం భరించలేరు. తన వైఖరికి ప్రభుత్వం తప్పక మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ✿

# సామ్రాజ్యవాద కనుసన్నల్లో మరిన్ని ఉద్యమ అణచివేత చర్యలు ప్రధాన మంత్రి సమావేశం ద్వారా వెల్లడి

దేశాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలు ఎన్నెన్నో. కోట్లాది ప్రజలకు తినడానికి తిండి లేదు. తాగడానికి నీళ్లు లేవు. వంటిని కప్పుకోవడానికి గుడ్డల్లేవు. తలదాచుకోను నీడలేదు. రోగాలొస్తే మందుల్లేవు. చేద్దామంటే పనుల్లేవు. అయినా ప్రభుత్వాలకు ఇవేం పెద్ద సమస్యలు కావు. ప్రస్తుతం ప్రభుత్వాలు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య ఏంటంటే దుర్భరమైన తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రజలు ప్రయత్నిస్తుండడమే !

స్వాతంత్ర్యం వచ్చిందని చెప్తున్నప్పటికీ తమ మౌలిక సమస్యలు పరిష్కారం కాకపోవడాన్ని గమనించిన ప్రజలు తమకు వచ్చింది నిజమైన స్వాతంత్ర్యం కాదని అర్థం చేసుకున్నారు. తమ సమస్యల పరిష్కారంకై పోరుబాట పట్టసాగారు. ఆ ప్రజల పోరాటాలకు 'నక్సల్బరీ' ఒక సరైన మార్గాన్ని నిర్దేశించింది. ఆ మార్గంపై విశ్వాసం ఏర్పడ్డ ప్రజలు 'నక్సల్బరీ' లోంచే పుట్టిన సి.పి.ఐ.(మావోయిస్ట్) పార్టీ ఆధ్వర్యంలో దృఢంగా పోరాడుతున్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కించిత్తు ప్రయత్నం చేయని ప్రభుత్వాలు ఆ సమస్యల్లోంచి పుడుతున్న పోరాటాలను అణచడానికి మాత్రం చేయని ప్రయత్నం అంటూలేదు. అరెస్టులూ, చిత్రహింసలూ, జైలు శిక్షలూ, బూటకపు ఎన్‌కౌంటర్లూ, విషప్రయోగాలూ, చుట్టుముట్టి ఏకపక్ష కాల్పులూ, కోవర్టులూ, నిషేధాలు...... వంటి క్రూర, అమానుష పద్ధతులెన్నో అది అవలంభిస్తున్నది. అయినప్పటికీ ఇంత క్రూర నిర్బంధం నడుమ సహితం సమస్యలు ప్రజల్ని పోరాటాల్లోకి నడిపిస్తూనే వున్నాయి. అందుకే ఇంత నిర్బంధాన్ని ప్రతిఘటిస్తూ సి.పి.ఐ.(మావోయిస్ట్) ముందుకు పోతూ పాలకవర్గాల ఉనికికి ఒక సవాల్‌గా మారింది.

దేశ పాలకవర్గాల ఉనికికే కాక, సామ్రాజ్యవాద ఉనికికి సహితం సవాల్‌గా మారింది. అందుకే అమెరికా సామ్రాజ్యవాదానికి అత్యంత దళారీగా పనిచేస్తున్న మన్మోహన్ ప్రభుత్వానికి, దేశంలో నక్సలిజమే అన్నింటికంటే తీవ్రమైన సమస్యగా కనబడుతున్నది. ఈ సమస్యను అణచివేయడానికి జె.ఓ.సి. ఆధ్వర్యంలో తీవ్ర అణచివేతను అమలుచేయసాగింది. అయినప్పటికీ ఆ అణచివేతను తిప్పికొడుతూ ప్రతిఘటన మరింత పెరిగింది. మధుబన్, జహనాబాద్, గిరిడీ, ఆర్. ఉదయగిరి వంటి దాడులు ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఉద్యమాన్ని సమూలంగా తుడిచిపెట్టాలనే లక్ష్యంతో దండకారణ్యంలో అది తీసుకువచ్చిన సల్వాజుడూంను తిప్పికొడుతూ అక్కడి ఉద్యమం ప్రతిఘటిస్తున్న తీరుకూడా దానికి ఊపిరి సలుపనివ్వడం లేదు. ఎన్.ఎమ్.డి.సిపై దాడి చేసి సామ్రాజ్యవాదులకూ సవాల్ విసిరేప్పటికి ప్రభుత్వాలకు వెర్రెత్తిపోయింది. అంతేకాదు ఈ మొత్తం దాడుల్లో కదిలిన వందలాది జనాన్ని చూసి కూడా అది జడుసుకుంది. ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, బెంగాల్‌లలో తీవ్రతరమవుతున్న పి.ఎల్.జి.ఎ ప్రతిఘటనతో ఇక ఎంతమాత్రం నక్సల్ ఉద్యమాన్ని ఉపేక్షించడానికి వీల్లేదనుకుంది.

అందుకే సామ్రాజ్యవాదపు కనుసన్నల్లో, మావోయిస్ట్ పార్టీని అణచడానికి క్రూర విధానాలను రూపొందించడం కోసం, మార్చి 31న కేంద్ర హోంశాఖ కార్యదర్శి వి.కె. దుగ్గల్ నాయకత్వంలో మావోయిస్ట్ పార్టీ ఉద్యమం నడుస్తోన్న 13 రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతోనూ, పోలీసు ఉన్నతాధికారులతోనూ ఒక సమావేశం జరిగింది. అదే విధంగా ఏప్రిల్ 13వ తేదీన ఆరు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, బీహార్, జార్ఖండ్ ముఖ్యమంత్రులతో మన్మోహన్ నాయకత్వంలో మరొక సమావేశం జరిగింది. ఈ సమావేశాల్లో ఉద్యమ అణచివేతకు అనేక క్రూర నిర్ణయాలు జరిగాయి.

వాటిలో భాగంగా ఇప్పటికే కేటాయించిన 26 బెటాలియన్ల సి.ఆర్.పి.ఎఫ్ బలగాలు, భారత రిజర్వు బలగాలకు తోడు మరిన్ని భారత రిజర్వ్ బలగాలను ఉద్యమ ప్రాంతాలకు పంపాలని నిర్ణయించారు. ఉద్యమ తీవ్రతను బట్టి కొన్ని రాష్ట్రాలకు ఒక్కొక్క బెటాలియన్‌ను పంపాలనీ, మరికొన్ని రాష్ట్రాలకు రెండేసి బెటాలియన్లను పంపాలని నిర్ణయించారు. మొత్తం బలగాల ఆయుధ సంపత్తిని ఆధునీకరించాలని కూడా నిర్ణయించారు. ఇప్పటికే నిత్య కూంబింగులతో విచ్చలవిడిగా సంచరిస్తున్న బలగాలు ఉద్యమ ప్రాంత ప్రజల్లో తీవ్ర భయాందోళనలనూ, అభద్రతనూ కల్గిస్తున్నాయి. ఈ బలగాలు పాల్పడుతున్న హింసకు లెక్కలేదు. ప్రజల్ని చిత్రహింసలు పెట్టడం, అరెస్టులు చేయడం, చంపటం మహిళలపై అత్యాచారాలకు పాల్పడటం సర్వసాధారణ విషయంగా మారింది. ఇక ఈ బలగాలు పెరిగితే పరిస్థితి మరింత విషమిస్తుంది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలుచేసిన అణచివేత విధానాల

వంటి వాటిని, అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలనేది కూడా ఈ సమావేశం నిర్ణయించింది. ఉద్యమ అణచివేతకు హేయాతి హేయమైన, నీచాతి నీచమైన పద్ధతులను అవలంభించిన క్రూర చరిత్ర ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలది. విప్లవకారుల రక్తంతో తడవని నేలంటూ ఆంధ్రప్రదేశ్‌లో లేదు. విప్లవకారుల రక్తం చిందని రోజు కూడా లేదు. కేంద్రకమిటి సభ్యుల నుండీ సానుభూతిపరుల వరకూ దొరికిన ప్రతి ఒక్కరినీ హత్యచేసి దేశ ప్రజల వ్యతిరేకతనే కాదు, ప్రపంచ విప్లవ ప్రజానీకం వ్యతిరేకతను కూడా ఎదుర్కొంది ఇక్కడి ప్రభుత్వం. ఈ హింసను ప్రశ్నించిన హక్కుల సంఘాల, ప్రజాసంఘాల కార్యకర్తలపై, కళాకారులపై హత్యలకూ, హత్యాయత్నాలకూ పాల్పడింది. కోవర్టులను ప్రోత్సహించి నల్లదండు ముఠాలను కట్టి ప్రజల్లో తీవ్ర ఏవగింపుకు గురైంది. మొత్తంగా కనీస ప్రజాస్వామిక వాతావరణం కూడా లేకుండా రాష్ట్రాన్ని చీకటిమయం చేసింది. ఇటువంటి దారుణ విధానాలను దేశమంతా అమలు చేస్తే దేశ పరిస్థితి మరింత దుర్భరంగా తయారవుతుంది.

ఆంధ్రప్రదేశ్‌లోని గ్రేహౌండ్స్ తరహాలో అన్ని రాష్ట్రాల్లోనూ ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించారు. గ్రేహౌండ్స్ పొందిన 'ఖ్యాతి' అంతా యింతా కాదు. పేరుకు తగ్గట్టు తోడేళ్లలా మనుషుల్ని పీక్కుతినే ఈ బలగాల క్రూరత్వాన్ని సాధారణ ప్రజలే కాదు, పోలీసులే చీదరించుకున్న సందర్భాలు ఉన్నాయి. ఇక దీని తరహాలో అన్ని రాష్ట్రాల్లో బలగాలను తయారు చేయడమంటే దేశమంతటా ఒక భయానక వాతావరణాన్ని సృష్టించడమే.

ఉమ్మడి ఆపరేషన్లకోసం ఉమ్మడి కమాండ్‌ను ఏర్పాటుచేయాలని కూడా నిర్ణయం జరిగింది. ఈ కమాండ్‌కు ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర ఉద్యమ అణచివేత విధానాలను అవలంభించిన స్వరణ్‌జిత్ సేన్ నాయకుడిగా వ్యవహరిస్తాడు.

ఈ చర్యలతోపాటు సాధారణ జనం తిరగబడ్డే, వారిని ప్రోత్సహించాలనీ, ఆ తిరుగుబాటుకు మద్దతునిచ్చి ముందుకు తీసుకుపోవాలని కూడా నిర్ణయించారు. నిజానికి సాధారణ జనం తమంతట తామే నక్సల్స్‌కు తిరగబడే పరిస్థితి ఎన్నటికీ రాదు. ఈ ముసుగులో ప్రభుత్వాలే సల్వాజుడూం వంటి అణచివేత విధానాలను తీసుకువస్తున్నాయి. సాధారణ జనం తిరుగుబాట్ల పేరుతో, ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం తయారుచేసిన నల్లదండు ముఠాల వంటి వాటిని దేశవ్యాప్తంగా తయారుచేయాలని కూడా ప్రభుత్వ పథకం. నల్లదండు ముఠాలు ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత దారుణమైన హింసను సృష్టించి రాష్ట్రంలో బీభత్స వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. వీటివల్ల ప్రజల్లో తీవ్రమైన నిరసన వెల్లువెత్తుతుండగా వీటిని దేశవ్యాప్తంగా వ్యాపింపచేయాలని ప్రభుత్వాలు తలపెట్టాయి. ప్రభుత్వం పశుబలంతో నక్సలిజాన్ని అణచివేస్తుందన్న అపప్రధ రాకుండా చూసుకోవాలని మన్మోహన్ రాష్ట్రాలకు చెప్పడం ఇక్కడ గమనించదగినది. అంటే దాని ఉద్దేశ్యం 'ప్రజల తిరుగుబాటును' మరింత ఎక్కువ చేయడమే.

నక్సల్స్‌పై పోరాటంలో పాల్గొనే పోలీసులపై అనవసరపు వేధింపులు లేకుండా చూడాలని కూడా మన్మోహన్ ఈ సమావేశంలో మాట్లాడాడు. ఇప్పటికే పోలీసులకు మితిమీరిన అధికారాలను ఇచ్చింది ప్రభుత్వం. వారు చేసే విచ్చలవిడి హింసపట్ల కనీస జవాబుదారీ తనం లేకుండా పోతున్నది. ఇక తాజా నిర్ణయం ప్రకారం పోలీసులు ఇటీవలి కొండపర్తి, బొప్పాపురం, తాడ్వాయి వంటి ఘటనలకు పాల్పడి, సాధారణ పౌరుల ప్రాణాలు తీసినా, ఆ పోలీసులపై ప్రభుత్వం ఈగకూడా వాలనివ్వదు (ఇప్పటికే పెద్దగా వాలనివ్వడం లేదు) అంటే ఇంక ఇటువంటి ఘటనలు తిరిగి తిరిగి పునరావృతం కావడమే.

గూఢచార, సమాచార వ్యవస్థలను మరింత పకడ్బందీగా తయారు చేసుకోవడం, కొన్ని కొత్త అనుబంధ గూఢచారి వ్యవస్థలను ఏర్పాటు చేయడం, అన్నింటి మధ్య సమన్వయాన్ని సాధించడం కూడా ఈ సమావేశంలో జరిగిన ఒక నిర్ణయం.

ఇక ఈ కార్యక్రమాన్ని అమలు చేయడానికి కావాల్సిన నిధులను కేంద్రం రాష్ట్రాలకు ఇవ్వాలని కూడా నిర్ణయించారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు నిధులు లేవని చెప్పే ప్రభుత్వాలు ఉద్యమాన్ని అణచడానికి ఎన్ని నిధులను ఖర్చు పెట్టడానికైనా వెనుకాడటం లేదు.

ఇవన్నీ ఉద్యమాన్ని ప్రత్యక్షంగా అణచివేసే చర్యలు కాగా, ఉద్యమానికి ప్రజల మద్దతును లేకుండా చేయడం కోసం కూడా విధానాలను రూపొందించింది.

నక్సల్స్ సమస్యను రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యగా చూస్తూ ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడం కోసం అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించారు. ఉద్యమ అణచివేతలో భాగంగా సంస్కరణలను చేపట్టడం సామ్రాజ్యవాద వ్యూహరచనలో ఒక భాగంగా ఎప్పటినుంచో వస్తున్నదే.

అయితే పాలకవర్గాల దృష్టిలో అభివృద్ధి అంటే ఏమిటి అనే దాన్నిబట్టి, దాని అభివృద్ధి కార్యక్రమాలు ఉంటాయి. రోడ్లు వేయడం, ప్లాంటేషన్లు వేయటం, గనులు తవ్వటం వాటిల్లో ఈ

ప్రజలను కూలీలుగా మార్చడం ఇవీ పాలకవర్గాల దృష్టిలో అభివృద్ధి కార్యక్రమాలు. సామ్రాజ్యవాదులకు దాసోహం అయిన పాలకవర్గాల దృష్టిలో అభివృద్ధి కార్యక్రమాలంటే సామ్రాజ్యవాదులకు ఉపయోగపడే కార్యక్రమాలే.

ఇటువంటి కార్యక్రమాలు తాత్కాలికంగా ప్రజలను భ్రమల్లో పెడుతాయేమోగానీ అంతిమంగా అవి ప్రజలకు తీవ్రమైన హానిని కల్గిస్తాయి. కాబట్టి మొత్తంగా ఇటువంటి అణచివేత విధానాలను ప్రజలూ, ప్రజాస్వామికవాదులూ తీవ్రంగా వ్యతిరేకించాలి.

దేశంలో మౌలిక సమస్యలేవీ పరిష్కారం కాకుండా, ఎన్ని అణచివేత, 'అభివృద్ధి' విధానాలను రూపొందించినా విప్లవోద్యమాన్ని అడ్డుకోవడం సాధ్యం కాదు. వాటి విధానాలతో ప్రభుత్వాలు తాత్కాలికంగా ఉద్యమాన్ని నష్టపర్చగలవేమో కానీ, ఆ విధానాల వల్ల ప్రజల్లో పెరిగే వ్యతిరేకత విప్లవవెల్లువగా మారి పాలకవర్గాల అంతిమ వినాశనానికి దారి తీస్తుంది. ❐

---

# మే 25,26,27 తేదీలలో దేశవ్యాప్త ఆర్థిక దిగ్బంధనాన్ని విజయవంతం చేయండి!

సామ్రాజ్యవాదులకు దాసోహం అయిపోయిన భారత దళారీ పాలకవర్గాలు, ఆ సామ్రాజ్యవాదులకు దేశాన్ని దోచి పెడుతున్నాయి. అందులో భాగంగా దేశ ప్రాకృతిక సంపదను ధారాదత్తం చేస్తున్నాయి. ఈ దోపిడీని మరింత తీవ్రం చేయడం కోసం ప్రకృతితో పెనవేసుకొని అటవీ ప్రాంతాల్లో నివసిస్తోన్న ఆదివాసీలను అడవి నుంచి తరిమేసి మొత్తంగా అడవినీ, అందులోని ఖనిజ, జల, జన్యు సంపదలను సామ్రాజ్యవాదుల చేతుల్లో పెట్టడానికి పెద్ద ఎత్తున పథక రచన చేస్తూవున్నాయి. దోచుకున్న సంపదను వేగంగా తరలించుకు పోవడానికి కూడా పెద్ద ఎత్తున భూ, జల, వాయు, రవాణా మార్గాలను వేస్తూ పేద, ఆదివాసీ ప్రజలను నిర్వాసితులను చేస్తున్నాయి. పాలకవర్గాల ఈ లూటీ చర్యలు ఆదివాసీ ప్రజానీకంతో పాటు దేశ ప్రజలందరికీ మొత్తంగా దేశానికే పెద్ద ముప్పుగా పరిణమిస్తున్నాయి. పర్యావరణానికి కూడా హాని చేస్తున్నాయి. తన దోపిడీ చర్యలను సుగమం చేసుకోవడానికే ఆదివాసీ ప్రాంతాల్లో ఉద్యమిస్తున్న మావోయిస్టు పార్టీపై సామ్రాజ్యవాద కనుసన్నల్లో తీవ్ర అణచివేతకు పాల్పడుతున్నాయి.

ఈ దళారీ పాలకవర్గాల లూటీ చర్యలకు వ్యతిరేకంగా మే 25, 26, 27 తేదీల్లో దేశవ్యాప్తంగా ఆర్థిక దిగ్బంధనం చేయాలని మావోయిస్టు పార్టీ పిలుపునిస్తోంది.

అందులో భాగంగా రవాణా, కమ్యూనికేషన్, విద్యుత్ సరఫరా నిలిపివేత చర్యలనూ, పరిశ్రమలు, మార్కెట్ల మూసివేత చర్యలనూ పార్టీ తలపెట్టింది. వీటన్నింటిని మూసి వేయాలని పై సంస్థలను హెచ్చరిస్తోంది.

ఈ పిలుపుకు స్పందించి పెద్ద ఎత్తున ప్రజలు కదిలి ఆర్థిక దిగ్బంధన చర్యల్లో పాల్గొని సామ్రాజ్యవాదుల పట్లా, భారత దళారీ పాలకవర్గాలపట్ల తమ కసిని ప్రదర్శించాలని పార్టీ ప్రజలకూ, ప్రజాస్వామికవాదులకు విజ్ఞప్తి చేస్తోంది.

పోలిట్ బ్యూరో
సి.పి.ఐ(మావోయిస్టు)

దండకారణ్య ప్రకటన

## ఆంధ్రప్రదేశ్ పోలీసులకు విజ్ఞప్తి

# న్యాయమైన మా పోరాటాన్ని అణచడానికి మీ తుపాకులను సరిహద్దులు దాటనీయకండి !

పోలీసులారా ! వర్గ సోదరులారా !

2005 జూన్ నుండి దంతెవాడ జిల్లాలో సల్వాజుడుం పేరుతో తీవ్ర భయ బీభత్స విధ్వంసకాండ కొనసాగుతోంది. పేద ఆదివాసీ ప్రజలను, వీరిని సంఘటితపరుస్తూ ప్రజాసమస్యలపై పోరాడుతున్న ప్రజాసంఘాలను లక్ష్యంగా చేసుకొని సల్వాజుడూం సైనిక అభియాన్ కొనసాగుతోంది. ఛత్తీస్‌ఘడ్‌లోని భారతీయ జనతాపార్టీ ప్రభుత్వం, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలు సంయుక్తంగా ఈ అభియాన్‌ను నడిపిస్తున్నాయి. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ నాయకుడు, స్థానిక భూస్వామి, మధ్య యుగాల దారుణాలను తలపింపజేసే హంతకుడు మహేంద్రకర్మ దీనికి ప్రత్యక్షంగా నాయకత్వం వహిస్తున్నాడు. ఈ అభియాన్‌లో స్థానిక భూస్వామ్య-పెత్తందారీ శక్తులు, లంపెన్ శక్తులు, పోలీసు - పౌర ఉన్నతాధికారులు నానా గోత్రీకులంతా కలిసి దీనిని కొనసాగిస్తున్నారు. అత్యంత ప్రమాదకర రాజ్య, రాజకీయ, సాయుధ ఉగ్రవాద సంస్థ సల్వాజుడూం సృష్టించిన విధ్వంసకాండలో ఇక్కడ వందలాది గ్రామాలు వల్లకాడులైనాయి. వేలాది ఇండ్లు కాలి బూడిదైనాయి. కోట్లాది రూపాయల పేదల చిరు ఆస్తులు ధ్వంసమైనాయి. వందలాది రైతాంగం ఊచకోతకు బలై నిర్దాక్షిణ్యంగా ఘోరంగా ప్రాణాలు కోల్పోయారు. డజనుల కొద్దీ మహిళలు జుడూం గూండాల, పోలీసుల అత్యాచారానికి బలై ఎందరో ప్రాణాలు కోల్పోగా, మరెందరో గర్భం ధరించి జీవచ్ఛవాల్లా జీవిస్తున్నారు. ఈ సల్వాజుడూం కేవలం బస్తర్‌కే పరిమితం కాకుండా సరిహద్దులోని ఖమ్మం జిల్లా ప్రజలపై కూడా దాడులు చేస్తోంది. దీనికి వ్యతిరేకంగా అన్ని సెక్షన్‌ల ఖమ్మం జిల్లా ప్రజానీకం తెగించి రోడ్ల మీదకు వస్తున్న వార్తలు తెలుగు పత్రికల ద్వారా మీరు చూస్తూనే ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మీరు, సరిహద్దులు దాటి దంతెవాడ జిల్లాలోకి రావడం అంటే సల్వాజుడూం హంతకులను సంరక్షించడానికే. జుడూం దారుణాలన్నింటికీ పూర్తి రక్షణ కల్పిస్తున్న ఇక్కడి పోలీసులతో తుపాకులు కలిపి వారి పాపాలన్నింటిలో, ప్రజా వ్యతిరేక దుశ్చర్యలన్నింటిలో పాలుపంచుకోవడమే కాగలదు. కాబట్టి మీరు దయచేసి ఈ హత్యాకాండలో భాగస్తులు కావడానికి ఇక్కడకు రాకండి.

విప్లవోద్యమ నిర్మూలన పేరుతో దండకారణ్య నక్సలైట్లను ఆంధ్రప్రదేశ్‌కు తరిమికొట్టాలన్న నినాదాలతో జుడూం గూండాలు గ్రామాల పై దాడులు చేస్తున్నారు. గ్రామ గ్రామాన కాలం చెల్లిన తెగపెద్దల దోపిడీ వ్యవస్థను తిరిగి స్థాపిస్తామనీ, నలుగురేసి మహిళలను పెళ్లాడుతామనీ, సామ్రాజ్యవాదం జిందాబాద్ అనీ బహిరంగంగా, నిస్సిగ్గుగా నినాదాలు చేస్తున్నారు. మీరు ఇక్కడికి వస్తే ఈ గూండాలతో కలిసి ప్రజలపై దాడులు చేయకతప్పదు. వీరితో గొంతుకలిపి నినాదాలూ ఇవ్వక తప్పదు. ఈ నీచత్వానికి ఒడిగట్టడానికి మీరు ఇక్కడకు రాకండి.

మా బస్తర్ అపారమైన ప్రకృతి సంపదలకు నిలయం, అనేక రకాల గనులూ, ఖనిజాలూ పుష్కలంగా ఉన్నవి. వీటిని ఇప్పటికే దళారీ నిరంకుశ పెట్టుబడిదారులూ, సామ్రాజ్యవాదులూ విచ్చలవిడిగా దోచుకుపోతున్నారు. మరీ ముఖ్యంగా ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, లిబరలైజేషన్ ఆర్థిక విధానాలు దేశంలో తీవ్రతరమవుతున్న కొద్దీ వీరి దోపిడీ తీవ్రతరమౌతోంది. బస్తర్ సంపదలను తరలించుకుపోవడానికి టాటా, బిర్లా, ఎస్సార్, జిందాల్, రిలయన్స్ లాంటి పలు సంస్థలు ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వంతో కోట్లాది రూపాయల ఒప్పందాలు కుదుర్చుకొన్నాయి. వీరి దోపిడీని మేం వ్యతిరేకిస్తున్నాం. కేవలం మేము మాత్రమే కాదు దేశవ్యాప్తంగా ఆదివాసీ ప్రజానీకం ఎంతటి త్యాగాలకైనా వెనుదీయకుండా వీరి దోపిడిని అడ్డుకుంటున్నది. ఇందుకు ఒరిస్సాలోని కళింగనగర్, కాశీపూర్‌లు, బస్తర్‌లోని బేలర్‌లు తాజా ఉదాహరణలు. తమ న్యాయమైన సమస్యలపై ఈ దోపిడి శక్తులతో పోరాడుతూ తమ అడవులనూ, ప్రాకృతిక సంపదలనూ, ఇండ్లూ, భూములను కాపాడుకోవాలని పోరాడుతున్న ఆదివాసీ ప్రజలపైకి పోలీసులు తుపాకులు ఎక్కుపెట్టి నిలువునా కాల్చి చంపుతున్నారు. ముష్టి పునరావాసం ముందుపెడుతూ తరతరాల ప్రజల రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక జీవనాన్ని ధ్వంసం చేస్తున్న ప్రభుత్వ కుటిల నీతులతో ధైర్యంగా పోరాడుతున్న ప్రజలను హతమార్చడానికి

మీరు మీ తుపాకులతో సరిహద్దులు దాటి బస్తర్‌లోకి అడుగు పెట్టకండి. దోపిడీ శక్తుల ప్రయోజనాలకోసం, జీతపురాళ్ల కోసం మా ప్రాణాలు తోడెయ్యడానికి మీరు ఇక్కడకు రాకండి.

**పోలీసులారా ! వర్గ సోదరులారా !**

మేం ఆదివాసులం, నిరుపేదలం, అర్ధాకలితో, అర్ధనగ్నంగా అడవులపై జీవిస్తూ పిడిపిడీలు(తరతరాలు)గా దోపిడీ ప్రభుత్వాల నిర్లక్ష్యానికి బలవుతూ జీవిస్తున్నవాళ్లం. ఈ దారుణ జీవితాల్లో మాకు కనీస భారత రాజ్యాంగ హక్కులు కూడా వర్తించకుండా పోయాయి. ఆదివాసీ ప్రజల ఉద్ధరణ అనీ ప్రభుత్వాలు మొసలికన్నీరు కారుస్తూ చేసే బూటకపు ప్రచారంలోని నిజమెంతో మీ ప్రాంతాలలోని పేద, పీడిత ప్రజల జీవితాలను సన్నిహితంగా పరిశీలిస్తే మీకు తెలుస్తుంది. ఈ జీవితాలతో వేగలేక మేం భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) నాయకత్వంలో పోరాడుతున్నాం. ప్రభుత్వాలు (కేంద్ర, రాష్ట్ర) కుమ్మక్కై మాకు నాయకత్వం వహిస్తున్న పార్టీని, మా ప్రజా సంఘాలను నిషేధించాయి. ఇంతే కాకుండా కొత్తగా ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం ప్రజాభద్రతా చట్టాన్ని తెచ్చింది. అలాగే ఆంధ్ర గ్రేహౌండ్స్ తరహాలో ఇక్కడా ఒక ప్రత్యేక పోలీసు బలగాన్ని నిర్మిస్తామంటున్నారు. మేం ఈ అణచివేత చర్యలను ఎదుర్కోవడానికే ఈ మధ్య ఫిబ్రవరిలో కోయ భూంకాల్ మిలిషియాను ఏర్పర్చుకున్నాం. తెగించి సాయుధంగా పోరాడుతున్నాం. మా ప్రజలను కాపాడుకోవడానికీ, మా ఆస్తులను రక్షించుకోవడానికి మేం ఎంతో నెత్తురు ధారబోస్తున్నాం. ఇంకెంతటి త్యాగాలకైనా మేం సిద్ధమే. ఇలాంటి పరిస్థితుల్లో మీరు బస్తర్ రావద్దని, మాపై అత్యాచారాలకు, హత్యలకూ పూనుకోవద్దనీ విజ్ఞప్తి చేస్తున్నాం. ఆంధ్ర ప్రజానీకం మా పోరాటాలకు తమ పూర్తి అండదండలనందిస్తుందని పూర్తి విశ్వాసంతో ఉన్నాం.

పోలీసులారా! వర్గసోదరులారా! మీరూ పేదలే. మీరు అనేక సమస్యలతో సతమతమౌతున్నారు. మనం సమైక్యంగా దోపిడీ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలి. మనం ఒకరిపై మరొకరం తుపాకులు ఎక్కుపెట్టుకోవద్దు. మన తుపాకులు దోపిడీ శక్తుల పైకి ఎక్కుపెట్టాలి.

మా విజ్ఞప్తిని బేఖాతర్‌చేసి, ప్రభుత్వ హుకూంలకు తలొగ్గి సరిహద్దుల్లో సంయుక్త సైనిక చర్యలకు మీరు దిగితే మా ఆత్మరక్షణ కోసం మేం మీతోనూ పోరాడక తప్పదు. అవి గ్రేహౌండ్స్ బలగాలైనా, మరెంతటి ఆధునిక బలగాలైనా తాత్కాలికంగా భీకర హత్యాకాండతో విధ్వంసకాండను సృష్టించగలవేమో కానీ శాశ్వతంగా ప్రజా పోరాటాలను అణచలేవు. ఈ సత్యాన్ని గ్రహించండి.

**దండకారణ్య ఆదివాసీ కిసాన్ మజ్దూర్ సంఘ్, క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘటన్, చేతనా నాట్యమంచ్, ఆదివాసీ బాలల సంఘం, జనతన సర్కార్**

-దండకారణ్యం
తేది : 27-04-2006

*( 34 వ పేజీ తరువాయి.....)*

అనుకోవడం ప్రగాఢమైన పొరపాటు. మనం ఇప్పుడు సైద్ధాంతిక రంగంలో మాత్రమే అనగా మార్క్సుకు చేసే సిద్ధాంత సవరణల మీద వివాదాలే తరచుగా అనుభవించేది, రివిజనిస్టులతో ఎత్తుగడల విభేదాలుగానూ, ఈ ప్రాతిపదికమీద చీలికలుగానూ, కార్మికోద్యమంలోని విడి విడి పాక్షిక సమస్యల మీద మాత్రం ఇప్పుడు ఆచరణలో తల ఎత్తేది - ఇది, కార్మికవర్గ విప్లవం వివాదాస్పద సమస్యలన్నింటినీ తీవ్రతరం చేసినప్పుడు, జనాల ప్రవర్తనను నిర్ణయించడంలో అత్యంత తక్షణ ప్రాముఖ్యం గల అంశాల మీద విభేదాలనన్నిటినీ కేంద్రీకరించినప్పుడు, పోరాటం మధ్యలో మిత్రుల నుండి శత్రువులను వేరు చేయడమూ, శత్రువుల మీద నిర్ణయాత్మకమైన దెబ్బలు కొట్టడానికి చెడ్డ పొత్తుదార్లను గెంటివేయడమూ అవసరమయ్యేటట్లు చేసినప్పుడు, పోలికే లేనంత విస్తృతమైన ప్రమాణంలో కార్మిక వర్గం అనుభవించక తప్పదు.

19వ శతాబ్ది అంతంలో రివిజనిజం మీద విప్లవ మార్క్సిజం చేసిన సిద్ధాంత పోరాటం, పెటీ బూర్జువా వర్గపు ఊగిసలాటలూ, బలహీనతలు ఎన్ని వున్నప్పటికీ తన లక్ష్యం యొక్క సంపూర్ణ విజయం వైపు పురోగమిస్తున్న కార్మికవర్గం యొక్క విప్లవ మహా యుద్ధాలకు నాంది మాత్రమే.

సిద్ధాంత వ్యాసం

# మార్క్సిజమూ,

*('మార్క్సిజం, రివిజనిజం' అన్న వ్యాసంలో, రెండవ ఇంటర్‌నేషనల్‌కి చెందిన అవకాశవాదుల సిద్ధాంతాన్నీ, ఎత్తుగడలనీ లెనిన్ విమర్శిస్తాడు. లెనిన్ ఈ వ్యాసాన్ని, మార్క్స్ 25వ వర్ధంతి సందర్భంగా 1908 మార్చి ద్వితీయార్థ భాగంలో ప్రచురించబడిన "కార్ల్ మార్క్స్(1818-1883)" అన్న సంకలనం కోసం రచించాడు. లెనిన్ తన ఈ వ్యాసానికి విషయాంశంగా రివిజనిజానికి వ్యతిరేకంగా జరపవల్సిన పోరాట సమస్యలను ఎంచుకోవడం వీటిని ఆ దశకు చెందిన అతి ముఖ్య సమస్యలుగా పరిగణించడం అన్నది ప్రాముఖ్యం కలిగిన విషయం.*

*మార్క్సిజం పెరుగుదలా, కార్మికవర్గంలో మార్క్సిస్టు భావాల వ్యాప్తీ అనివార్యంగా మార్క్సిజంపై ప్రతికూల సిద్ధాంతాలు చేసే దాడులను పెంచుతాయని రాసాడు లెనిన్. మార్క్సిజంపై రెండు దిశల నుంచి దాడులు జరుగుతున్నాయి: ఒక వంక మార్క్సిజాన్ని ఖండించాలనీ, నాశనం చేయాలనీ విఫల ప్రయత్నం చేసే అధికారిక బూర్జువా విజ్ఞాన శాస్త్రం జరిపే ప్రత్యక్ష దాడులు; మరోవంక రివిజనిస్టులు అనుసరించే రహస్య పోరాట పద్ధతులు. రివిజనిజంలోని ప్రమాదం ఎందులో ఉందంటే, సవరణల మాటున, మార్క్సిస్టు సిద్ధాంతాన్ని సంస్కరించడం మాటున, అది లోపలి నుంచి మార్క్సిజం వెనుక గోతులు తవ్వుతుంది. లెనిన్, రివిజనిస్టు అభిప్రాయాల సారాంశాన్ని బహిర్గతం చేసి, రివిజనిస్టుల సైద్ధాంతిక "పరిశోధనలు" ప్రధానంగా కాలం చెల్లిపోయిన, అరిగిపోయిన బూర్జువా భావజాలపు పిడిసూత్రాల పునశ్చరణ మాత్రమేననీ, రివిజనిజం అన్నది సారాంశంలో ఉదారవాద బూర్జువా అభిప్రాయాల్లో ఒక రకమేననీ నిరూపించాడు.*



*కార్మికవర్గపు అంతిమ లక్ష్యాన్నీ, సోషలిజం విజయం కోసం జరిగే పోరాటాన్నీ పరిత్యజించడమే రివిజనిజం సారాంశం. ఊహించిన, తక్షణ ప్రయోజనాల కోసం కార్మికవర్గ మౌలిక ప్రయోజనాలను రివిజనిస్టులు బలిపెడతారు. రివిజనిజం ఒక అంతర్జాతీయ ధోరణి, పెట్టుబడిదారీ సమాజంలో దానికి లోతైన వర్గమూలాలు వున్నాయి. అలాంటి రివిజనిజం కార్మికోద్యమంలో వ్యాప్తి చెందకుండా నిరంతరాయమైన, క్రమబద్ధమైన, పట్టుదలతో కూడిన పోరాటం జరపడం పార్టీ కర్తవ్యమని లెనిన్ బోధిస్తాడు.*

*ఈ యుగానికి అభివృద్ధి చెందిన కార్మికవర్గ సిద్ధాంతమే మార్క్సిజం-లెనినిజం-మావోయిజం. ఈ సిద్ధాంతం నిరంతరం రివిజనిజంతో పోరాడుతూ, ఎప్పటికప్పుడు దాన్ని ఓడిస్తూనే అభివృద్ధి చెందుతూ ఉంది. ఈ సిద్ధాంతాన్ని స్వీకరించి మన దేశంలో విప్లవోద్యమం నడుపుతున్న సి.పి.ఐ(మావోయిస్ట్) విప్లవోద్యమాన్ని నూతన స్థాయికి తీసుకెళ్తున్న సమయంలో ఈ ఉద్యమంపై భారత పాలకవర్గాలు దీర్ఘకాలిక ప్రణాళికలతో తీవ్ర అణచివేతకు పూనుకొంటున్నాయి. ఈ పాలకవర్గాలతో గొంతు కలుపుతూ రివిజనిస్టు పార్టీలైన సి.పి.ఐ(ఎం), సి.పి.ఐ, సి.పి.ఐ(ఎం.ఎల్)లిబరేషన్, న్యూడెమోక్రసీ లాంటి పార్టీలు విప్లవోద్యమంపై విషంగక్కుతూ, దాడులకు పాల్పడుతున్నాయి. ఈ పార్టీల సైద్ధాంతిక పునాదిని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుందనే ఉద్దేశ్యంతో లెనిన్ 136వ జన్మదినోత్సవం సందర్భంగా ఈ వ్యాసాన్ని అందిస్తున్నాం - సంపాదకవర్గం)*

రేఖాగణిత సూత్రాలు మానవ ప్రయోజనాలను ప్రభావితం చేస్తే వాటిని పూర్వపక్షం చేసే ప్రయత్నాలు తప్పక జరుగుతాయని ఒక ప్రసిద్ధమైన నానుడి ఉంది. మతశాస్త్ర సైద్ధాంతిక పాత దురభిప్రాయాలతో ఘర్షించే ప్రకృతి శాస్త్రీయ సిద్ధాంతాలు అత్యంత ఉన్మత్త వ్యతిరేకతను ప్రేరేపిస్తాయి, ఇంకా ప్రేరేపిస్తున్నాయి. కనుక, ఆధునిక సమాజంలోని పురోగామి వర్గాన్ని విజ్ఞాన ప్రబుద్ధం చేసి, సంఘటితపర్చి, ఈ వర్గాన్ని ఎదుర్కొనే కర్తవ్యాలను సూచించి, (ఆర్థికాభివృద్ధి కారణంగా) ప్రస్తుత వ్యవస్థను కొత్త వ్యవస్థ అనివార్యంగా తొలగిస్తుందని నిరూపించే మార్క్స్ సిద్ధాంతం తన మార్గంలోని ప్రతి ముందడుగు కొరకూ పోరాటం చేయవలసి రావడంలో ఆశ్చర్యం లేదు.

ఆస్తిపర వర్గాల కొత్త తరానికి మత్తెక్కించడానికీ, ఆంతరంగిక శత్రువులనూ, పరాయి శత్రువులనూ ఎదుర్కోవడానికి "శిక్షణ"

# రివిజనిజమూ

ఇప్పుడానికి అధికారిక ప్రొఫెసర్ల చేత అధికారికంగా నేర్పబడే బూర్జువా విజ్ఞానశాస్త్రానికీ, తత్వశాస్త్రానికీ ఇది వర్తిస్తుందని చెప్పనక్కరలేదు. ఈ విజ్ఞాన శాస్త్రం మార్క్సిజంను చెవిలో కూడా వడనివ్వదు, అది పూర్వపక్షం చేయబడిందనీ, నిర్మూలింపబడిందనీ ప్రకటిస్తుంది. సోషలిజంను పూర్వపక్షం చేయడం ద్వారా తమ భవిష్యత్తును నిర్మించుకొనే యువ పండితులూ, రకరకాల కాలం చెల్లిన "వ్యవస్థల" సాంప్రదాయాన్ని నిలబెడుతున్న ముసలి తొక్కులూ సమానమైన ఉత్సాహంతో మార్క్స్ మీద దాడి చేస్తారు. మార్క్సిజం పురోగతీ, దాని భావాలు కార్మికవర్గంలో వ్యాపిస్తూ దృఢమైన పట్టు సంపాదిస్తూ ఉండడమూ అనివార్యంగా మార్క్సిజం మీద ఈ బూర్జువా దాడుల పౌనఃపున్యాన్నీ, తీవ్రతను పెంచుతాయి; అధికారిక విజ్ఞాన శాస్త్రంచేత ప్రతిసారీ "నిర్మూలింపబడిన" తర్వాత మార్క్సిజం మరింత బలంగా, కరకుగా, జీవవంతంగా ఉంటుంది.

కానీ, కార్మికవర్గ పోరాటంతో సంబంధం కలిగి, ప్రధానంగా కార్మికవర్గంలో ప్రచారంలో వున్న సిద్ధాంతాలలో కూడా, మార్క్సిజం ఒక్కదెబ్బతో తన స్థానాన్ని దృఢపర్చుకోలేదు. తన అస్తిత్వంలోని మొదటి అర్ధశతాబ్దిలో (1840ల నుండి) మార్క్సిజం మౌలికంగా తనకు వ్యతిరేకమైన సిద్ధాంతాలతో పోరాటం చేయడంలో నిమగ్నమై ఉండింది. 1840 దశకపు మొదటి సంవత్సరాల్లో మార్క్సూ, ఎంగెల్సూ, తాత్విక భావవాద దృక్పథం గల తీవ్రవాద యువ హెగెలియన్లను ఓడించినారు. నలభైల అంతంలో ఆర్థిక సిద్ధాంతాల రంగంలో, ప్రూడనిజం మీద పోరాటం ప్రారంభమైంది. కల్లోలపు సంవత్సరమైన 1848లో ఉద్భవించిన పార్టీలనూ, సిద్ధాంతాలనూ విమర్శించడంతో ఈ పోరాటం యాభైలలో అంతమైంది. అరవైలలో పోరాటం సాధారణ సిద్ధాంతపు రంగం నుండి ప్రత్యక్ష కార్మికోద్యమానికి మరింత సన్నిహితమైన రంగానికి మారింది: ఇంటర్నేషనల్ నుండి బకూనినిజంను గెంటివేయడం తదుపరి, తొలి డెబ్బైలలో పాజిటివిస్ట్ డ్యూరింగ్ రంగం ఆక్రమించినారు. కానీ శ్రామికవర్గం మీద ఈ ఇద్దరి ప్రభావమూ అప్పటికే తృణప్రాయంగా ఉండింది. మార్క్సిజం కార్మికోద్యమంలో ఇతర భావజాలాలన్నింటి మీద అప్పటికే నిర్వివాదమైన విజయం పొందుతూ ఉండింది.

తొంబైల నాటికి ఈ విజయంలో ప్రధాన భాగం పూర్తయ్యింది. ప్రూడనిజం సంప్రదాయాలు అన్నింటికంటె దీర్ఘకాలం పట్టుకలిగి ఉండిన లాటిన్ దేశాలలో కూడా, కార్మిక పార్టీలు వాస్తవానికి తమ కార్యక్రమాలనూ, ఎత్తుగడలను మార్క్సిస్టు పునాదుల మీద నిర్మించినాయి. పునరుద్ధరింపబడిన కార్మికోద్యమం అంతర్జాతీయ సంస్థ - అప్పుడప్పుడు జరిగే అంతర్జాతీయ మహాసభల రూపంలో - మొట్టమొదటి నుండి, దాదాపు ఏ పోరాటమూ లేకుండా, అన్ని ముఖ్య విషయాలలోనూ మార్క్సిస్టు దృక్పథం అవలంబించబడింది. కానీ, మార్క్సిజం తనకు వ్యతిరేకమైన, దాదాపు అఖండమైన సిద్ధాంతాలన్నింటినీ తొలగించిన తర్వాత, ఈ సిద్ధాంతాలలో వ్యక్తీకరింపబడిన ధోరణులు ఇతర మార్గాలు చూసుకోసాగినాయి. పోరాటరూపాలూ, పోరాట కారణాలు మారినాయి, కానీ పోరాటం కొనసాగింది. మార్క్సిజం అస్తిత్వపు రెండవ అర్ధశతాబ్ది మార్క్సిజంలోని మార్క్సిజంకు వ్యతిరేకమైన ధోరణి చేసే పోరాటంతో (1890 దశకంలో) ప్రారంభమైంది.

ఒకప్పుడు సాంప్రదాయక మార్క్సిస్టు అయిన బెర్న్‌స్టైన్, మార్క్స్‌కు సవరణలను - రివిజనిజంను - అందరికంటే పెద్ద గోలతోనూ, అత్యంత ఉద్దేశ్యపూర్వకంగా వ్యక్తీకరించడంతోనూ ముందుకు రావడం వల్ల ఈ ధోరణికి అతని పేరు వచ్చింది. ఆర్థిక వెనుకబాటుతనం మూలంగానూ, మార్క్సిస్టేతర సోషలిజం సహజంగా అన్నింటికంటె దీర్ఘకాలం పట్టుకలిగి వుండిన రష్యాలో కూడా, అది మన కండ్ల ఎదుటనే స్పష్టంగా రివిజనిజంగా మారుతున్నది. వ్యవసాయ సమస్యలోనూ(సమస్త భూమినీ మున్సిపలీకరించే కార్యక్రమం), కార్యక్రమానికీ, ఎత్తుగడలకూ సంబంధించిన సాధారణ సమస్యలోనూ, మన సోషల్ నరోద్నిక్కులు తమ స్వంతపద్ధతిలో అఖండంగా, మార్క్సిజంకు మౌలికంగా వ్యతిరేకంగా ఉండిన తమ పాత వ్యవస్థ యొక్క మరణోన్ముఖమైన, పాతబడిపోతున్న అవశేషాల స్థానంలో అంతకంతకూ ఎక్కువగా మార్క్స్‌కు "సవరణలు" పెడుతున్నారు.

మార్క్స్ పూర్వసోషలిజం ఓడింపబడింది. అది తన స్వంత స్వతంత్ర రంగంలో కాకుండా, మార్క్సిజం యొక్క సాధారణ రంగంలో, రివిజనిజంగా, పోరాటం కొనసాగిస్తున్నది. రివిజనిజం యొక్క సైద్ధాంతిక సారాంశాన్ని పరీక్షిద్దాం.

తాత్విక రంగంలో బూర్జువా ప్రొఫెసర్ల "విజ్ఞానశాస్త్రం" యొక్క అడుగుజాడలను అనుసరించింది. ప్రొఫెసర్లు "వెనక్కి కాంటు వద్దకు" వెళ్ళినారు. ఇక రివిజనిజం నయా కాంటియన్ల వెంట అడుగులు ఈడ్చుకుంటూ వెళ్లింది. తాత్విక భౌతికవాదానికి వ్యతిరేకంగా మత గురువులు వెయ్యిసార్లు వల్లించిన పడికట్టు పదాలను ప్రొఫెసర్లు పునశ్చరణ చేసినారు - రివిజనిస్టులు

ఉదారమైన చిరునవ్వులతో, భౌతికవాదం ఏనాడో "పూర్వపక్షం"చేయబడిందని (తాజా పాఠ్య గ్రంథంలోని మాటలను మక్కీకి మక్కీగా) గొణిగినారు. ప్రొఫెసర్లు హేగెల్‌ను "చచ్చిన కుక్క"లాగా తృణీకరించినారు; వాళ్లు ఒక వైపున తామే భావవాదాన్ని, హేగెల్ భావవాదం కంటే వేయిరెట్లు చిల్లరదీ, చౌకబారుదీ అయినదాన్ని బోధిస్తూ, గతితర్కాన్ని ఏవగింపుతో తృణీకరించినారు - ఇక రివిజనిస్టులు వాళ్ల వెనుక విజ్ఞానశాస్త్రపు తాత్త్విక వికృతీకరణ అనే అడుసులో పడి, "నిగూఢ" (విప్లవకర కూడా) గతితర్కం స్థానంలో "సరళ" (ప్రశాంత కూడా) "పరిణామా"న్ని పెట్టినారు. ప్రొఫెసర్లు తమ భావవాద వ్యవస్థలనూ, "విమర్శనాత్మక" వ్యవస్థలనూ ప్రాబల్యంలో ఉన్న మధ్యయుగ "తత్వశాస్త్రానికి" (అనగా మత శాస్త్ర సిద్ధాంతానికి) అనుగుణంగా సర్ది, తమ ఆధికారిక జీతాలకు తగిన ప్రతిఫలం ఇచ్చినారు - ఇక రివిజనిస్టులు వాళ్లకు దగ్గరకు జరిగి, మతాన్ని "సొంత వ్యవహారం"గా, ఆధునిక రాజ్యానికి సంబంధించి కాదు, పురోగామి వర్గం యొక్క పార్టీకి సంబంధించి, చేయడానికి ప్రయత్నించినారు.

వర్గ పరిభాషలో మార్క్స్‌కు అలాంటి "సవరణ"ల అర్థం ఏమైందీ చెప్పనక్కర లేదు - అది స్వయం వ్యక్తం. ఒకటి మాత్రం గమనించాలి - అంతర్జాతీయ సోషల్ డెమోక్రటిక్ ఉద్యమంలో, రివిజనిస్టుల నమ్మశక్యం కాని పడికట్టు మాటలను స్థిరమైన గతితార్కిక భౌతికవాద దృక్పథం నుండి విమర్శించిన ఏకైక మార్క్సిస్టు ప్లెహానొవ్. దీనిని మరింత కంఠోక్తిగా నొక్కి చెప్పాలి; ఎందుకంటే, ఎత్తుగడల విషయంలో ప్లెహానొవ్ అవకాశవాదాన్ని విమర్శించే పేరుతో, పాత, ప్రగతి వ్యతిరేక తాత్త్విక చెత్తను దొంగచాటుగా ప్రవేశపెట్టడానికి మహా పొరపాటైన ప్రయత్నాలు ఈనాడు జరుగుతున్నాయి.

అర్థశాస్త్రానికి వస్తాను. మొదట గమనించవల్సింది ఏమిటంటే, ఈ రంగంలో రివిజనిస్టుల "సవరణ"లు ఎక్కువ సర్వగ్రాసిగానూ, సందర్భగతంగానూ వున్నాయి; "ఆర్థికాభివృద్ధిని గురించిన కొత్త వాస్తవాల"తో ప్రజలను ప్రభావితం చేయడానికి ప్రయత్నాలు జరిగినాయి. సాంద్రీకరణా, భారీ ఉత్పత్తిలో సన్నకారు ఉత్పత్తిని తొలగించడమూ వ్యవసాయంలో బొత్తిగా జరగవనీ, వాణిజ్యంలోనూ, పరిశ్రమలలోనూ అతి నిదానంగా జరుగుతాయని అన్నారు. సంక్షోభాలు ఎక్కువ అరుదూ, దుర్బలమూ అయినాయనీ, పెట్టుబడి వాటిని పూర్తిగా తొలగించేటట్లు కార్టెల్‌లూ, ట్రస్టులూ చేస్తాయని అన్నారు. వర్గవైరుధ్యాలు ఎక్కువ తేలికా, తక్కువ తీవ్రమూ అయ్యే ధోరణి మూలంగా పెట్టుబడిదారీ వ్యవస్థ పతనం వైపు పరుగెడుతున్నదనీ "పతన సిద్ధాంతం" సరైనది కాదని అన్నారు. చివరి విషయం, బ్యోమ్-బావెర్క్‌ను అనుసరించి మార్క్స్ విలువ సిద్ధాంతాన్ని కూడా దిద్దడం తప్పు కాదని అని అన్నారు.

ఈ సమస్యల మీద రివిజనిస్టులతో పోరాటం అంతర్జాతీయ సోషలిజంలో సిద్ధాంత యోచన పునరుద్ధరణను, దానికి ఇరవై ఏండ్ల ముందు డ్యూరింగ్‌తో ఎంగెల్స్ వివాదం కలిగించినంత ఫలప్రదమైనదానిని, కలిగించింది. రివిజనిస్టు వాదాలు వాస్తవాల, అంకెల సహాయంతో పరిశీలింపబడినాయి. రివిజనిస్టులు క్రమపద్ధతిగా ఈనాటి సన్నకారు ఉత్పత్తిని అందంగా చిత్రిస్తున్నారని రుజువు చేయబడింది. పరిశ్రమలలోనే కాక వ్యవసాయంలో కూడా సన్నకారు ఉత్పత్తి మీద భారీ ఉత్పత్తి యొక్క సాంకేతిక, వాణిజ్య ఆధిక్యం నిర్వివాదమైన వాస్తవాల చేత రుజువు చేయబడింది. కానీ వ్యవసాయంలో సరుకు ఉత్పత్తి చాలా తక్కువగా అభివృద్ధి అయ్యింది. వ్యవసాయం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోని మారకం క్రమంలోకి అంతకంతకూ ఎక్కువగా లాగబడుతున్నదని వ్యవసాయంలోని ఏ ప్రత్యేక శాఖలు (ఒక్కోసారి వ్యవసాయ పనులు కూడా) సూచిస్తాయో వాటిని ఏరుకోవడంలో ఆధునిక గణాంకవేత్తలూ, అర్థశాస్త్రజ్ఞులు అంత నేర్పరులు కాదు. నిత్యం క్షీణించే ఆహారమూ, పని దినాన్ని పెంచడమూ, పశువుల నాణ్యమూ, పోషణా క్షీణించడమూ - ఒక్క మాటలో చెప్పాలంటే, పెట్టుబడిదారి ఉత్పత్తికి వ్యతిరేకంగా చేతి పనుల ఉత్పత్తి ఏ విధంగా తన్ను తాను నిలుపుకుందో ఆ విధంగా సన్నకారు ఉత్పత్తి - స్వయం పోషక ఆర్థిక వ్యవస్థ శిథిలాల మీద తన్ను తాను నిలుపుకుంటుంది. విజ్ఞాన శాస్త్రంలోనూ, సాంకేతిక శాస్త్రంలోనూ, జరిగే ప్రతి పురోగతీ పెట్టుబడిదారీ సమాజంలోని సన్నకారు ఉత్పత్తి పునాదులను అనివార్యంగా, తప్పనిసరిగా దుర్బలపరుస్తుంది; తరచు జటిలమూ, చిక్కైనదీ అయిన ఈ క్రమాన్ని అన్ని రూపాలలోనూ పరిశోధించడమూ, పెట్టుబడిదారీ వ్యవస్థలో తన స్థితిని నిలుపుకోవడం అసాధ్యమనీ, రైతు వ్యవసాయం నిరర్థకమనీ, కార్మిక దృక్పథం అవలంబించడం రైతుకు అవసరమనీ సన్నకారు ఉత్పత్తిదారునికి నిరూపించడమూ సోషలిస్టు ఆర్థిక విధాన కర్తవ్యం. మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థకు సంబంధం లేకుండా, ఒక పార్శ్వానికి సంబంధించిన వాస్తవాల మీద ఆధారపడిన పైపై సాధారణీకరణల ద్వారా రివిజనిస్టులు, శాస్త్రీయ అర్థంలో, పాపం చేసినారు. రాజకీయంగా వాళ్లు చేసిన పాపం ఏమిటంటే, వాళ్లు అలా అనుకున్నా, అనుకోక పోయినా రైతును విప్లవ శ్రామికుని దృక్పథం అవలంబించమని ప్రేరేపించే బదులు ఆస్తిపరుని దృక్పథం (అనగా బూర్జువావర్గ దృక్పథం) అవలంబించమని అనివార్యంగా ఆహ్వానించినారు, లేదా ప్రేరేపించినారు.

సంక్షోభాల సిద్ధాంతానికీ, పతన సిద్ధాంతానికీ సంబంధించిన విషయంలో రివిజనిజం మరింత అధ్వాన్నంగా ఉంది. కొద్ది సంవత్సరాల పారిశ్రామిక పునరుజ్జీవన, వికాసాల యొక్క ప్రభావం కింద మార్క్స్ సిద్ధాంత పునాదులను మార్చాలని ఎవరైనా కొద్ది కాలంపాటు మాత్రమే, అదైనా బొత్తిగా దూరదృష్టి లేనివారు మాత్రమే, అనుకోగలరు. సంక్షోభాలు గత కాలపు వాస్తవాలు కాదనే వాస్తవాలు రివిజనిస్టులకు అతి త్వరలో స్పష్టం చేసినాయి. వికాస స్థితివెంట సంక్షోభం వచ్చింది. విడివిడి సంక్షోభాల రూపాలూ, అనుక్రమమూ, వాటి స్వరూపం మారినాయి, కానీ సంక్షోభాలు పెట్టుబడిదారి వ్యవస్థలో అనివార్యమైన భాగంగా నిలిచినాయి. కార్టెల్‌లూ, ట్రస్టులూ ఉత్పత్తిని ఏకం చేస్తూ, అదే సమయంలో అందరికీ తేటతెల్లమైన పద్ధతిలో, ఉత్పత్తిలోని అరాచకత్వాన్నీ, కార్మికుల జీవిత భద్రతా రాహిత్యాన్నీ, పెట్టుబడి పీడననూ తీవ్రతరం చేసి, తద్వారా వర్గ వైరుధ్యాలను ఎన్నడూ లేనంత స్థాయికి పెంచినాయి. విడివిడి రాజకీయ, ఆర్థిక సంక్షోభాల అర్థంలోనూ, మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థ పతనం అనే అర్థంలోనూ కూడా పెట్టుబడిదారీ వ్యవస్థ విచ్ఛిత్తి వైపు దారితీస్తున్నదని సరిగ్గా ఈ కొత్త రాక్షస ట్రస్టుల వల్ల విస్తృతమైన స్థాయిలో మరీ స్పష్టమైంది. అనేక లక్షణాలు సూచిస్తున్నట్టి ఆసన్న పారిశ్రామిక సంక్షోభం మాట అటుంచి, ఇటీవలి అమెరికాలోని ఫైనాన్షియల్ సంక్షోభమూ, యూరప్ అంతటా దారుణంగా పెరిగిన నిరుద్యోగమూ - వీటి ఫలితంగా రివిజనిస్టుల ఇటీవలి "సిద్ధాంతాలను" అందరూ మరచిపోయినారు, రివిజనిస్టులలో చాలా మంది మరిచిపోయినట్లు వున్నారు. కానీ మేధావుల ఈ అస్థిరత్వం కార్మికవర్గానికి నేర్పిన గుణపాఠాలను మరచిపోకూడదు.

విలువ సిద్ధాంతానికి సంబంధించి, ఇది మాత్రం చెప్పవలసి వుంది: బ్యోమ్-బావెర్క్ పద్ధతిలో అత్యంత అస్పష్టమైన సూచనలూ, నిట్టూర్పులూ తప్ప, రివిజనిస్టులు ఈ సిద్ధాంతానికి బొత్తిగా ఏమీ చేర్చలేదు, అందువలన శాస్త్రీయ యోచన అభివృద్ధి మీద వాళ్ల గుర్తులు ఎలాంటివీ లేవు.

రాజకీయ రంగంలో, రివిజనిజం మార్క్సిజం పునాదిని, అనగా వర్గపోరాట సిద్ధాంతాన్ని, సవరించడానికి నిజంగా ప్రయత్నించింది. రాజకీయ స్వేచ్ఛా, ప్రజాస్వామ్యమూ, సార్వజనీన ఓటుహక్కూ వర్గపోరాట కారణాన్ని తొలగిస్తాయట, కార్మికులకు స్వదేశం అనేది లేదు అనే "కమ్యూనిస్టు ప్రణాళిక"లోని పాత సూత్రాన్ని అబద్ధంగా చేస్తాయట. ఎందుకంటే, ప్రజాస్వామ్యంలో "అధిక సంఖ్యాకుల అభీష్టం" చెల్లుతుంది కనుక రాజ్యాన్ని వర్గపరిపాలన అంగంగా పరిగణించకూడదట, ప్రగతి నిరోధకులకు వ్యతిరేకంగా ప్రగతిశీల, సంఘ సంస్కరణవాద బూర్జువాలతో పొత్తులను నిరాకరించకూడదట.

రివిజనిస్టుల ఈ వాదాలు బాగా సమతూకంగల అభిప్రాయాల వ్యవస్థకు అనగా పాత, సుప్రసిద్ధ ఉదారవాద బూర్జువా అభిప్రాయాలకు, సమానమనేది నిర్వివాదం. ఓటు హక్కూ, దేశం యొక్క పరిపాలనలో పాల్గొనే హక్కూ వివక్ష లేకుండా పౌరులందరికీ ఉన్నాయి కనుక, బూర్జువా పార్లమెంటరిజం వర్గాలనూ, వర్గ విభజనలను నిర్మూలిస్తుందని ఉదారవాదులు ఎప్పుడూ అన్నారు. అలాంటి అభిప్రాయాలు ఎంత అసంబద్ధమైనదీ, 19వ శతాబ్ది ఉత్తరార్ధంలో మొత్తం యూరప్ చరిత్రా, ఇరవైయ్యవ శతాబ్ది తొలి భాగంలో మొత్తం రష్యన్ విప్లవ చరిత్రా స్పష్టంగా తెలుపుతాయి. "ప్రజాతంత్ర" పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క స్వేచ్ఛలో ఆర్థిక విభేదాలు తగ్గిపోలేదు సరికదా, ఇంకా తీవ్రమైనాయి. వర్గపీడన అంగాలుగా అత్యంత ప్రజాస్వామికమైన బూర్జువా రిపబ్లిక్కుల అంతర్గత స్వభావాన్ని కూడా పార్లమెంటరిజం తొలగించదు సరికదా, బట్టబయలు చేస్తుంది. గతంలో రాజకీయ ఘటనలలో క్రియాత్మకంగా పాల్గొన్నంత కంటే అపారమైన ప్రజాసముదాయాలను విజ్ఞాన ప్రబుద్ధం చేయడానికీ, సంఘటిత పరచడానికి తోడ్పడడం ద్వారా, పార్లమెంటరిజం సంక్షోభాలనూ, రాజకీయ విప్లవాలనూ తొలగించడానికి కాక, అలాంటి విప్లవాలలో అంతర్యుద్ధాన్ని ఎంతో ఎక్కువ తీవ్రం చేయడానికి దారి తీస్తుంది. ఈ తీవ్రకరణ ఎలా అనివార్యంగా జరిగేదీ **1871** వసంతంలో ప్యారిస్‌లోని ఘటనలూ, **1905** శీతాకాలంలో రష్యాలోని ఘటనలూ సాధ్యమైనంత స్పష్టంగ చూపించినాయి. శ్రామికవర్గ ఉద్యమాన్ని నలిపి వేయడానికి ఫ్రెంచ్ బూర్జువా వర్గం ఒక క్షణం కూడా తటపటాయించకుండా మొత్తం జాతి యొక్క శత్రువుతో, స్వదేశాన్ని నాశనం చేసిన విదేశీ సైన్యంతో ఒప్పందం చేసుకుంది. పార్లమెంటరిజం, బూర్జువా ప్రజాస్వామ్యవాదాల అనివార్య అంతర్గత తర్కాన్నీ - గతంలో కంటె ఎక్కువగా కూడా సామూహిక హింసతో వాదాన్ని తేల్చుకునేటట్లు చేసేదాన్ని - అర్థం చేసుకోని వాడెవడైన ఇలాంటి ''వాదాల''లో విజయోపేతంగా పాల్గొనడానికి కార్మిక జనసామాన్యాన్ని నిజంగా సిద్ధం చేసే, సూత్రబద్ధమైన ప్రచారాందోళనలను ఈ పార్లమెంటరిజం ఆధారం మీద ఎన్నడూ సాగించజాలడు. పశ్చిమ దేశాలలో సాంఘిక సంస్కరణవాద ఉదారవాదులతోనూ, రష్యన్ విప్లవంలో ఉదారవాద సంస్కరణవాదుల (కాడెట్ల) తోనూ పొత్తుల, ఒప్పందాల, బ్లాకుల అనుభవం నమ్మకంగా నిరూపించింది ఏమిటంటే: పోరాట సామర్థ్యం అతి తక్కువగా ఉన్నవాళ్లూ, ఎక్కువ ఊగిసలాడేవాళ్లూ,

ద్రోహులు అయినవాళ్లతో యోధులను లంకించడం ద్వారా, ఈ ఒప్పందాలు జనాల చైతన్యాన్ని కేవలం మొద్దుబారుస్తాయి, జనాల పోరాటం యొక్క వాస్తవ ప్రాముఖ్యాన్ని పెంచకుండా, బలహీనపరుస్తాయి. ఫ్రాన్స్‌లో మిలెరానిజం-విస్తారమైన, నిజంగా జాతీయమైన ప్రమాణంలో రివిజనిస్టు రాజకీయ ఎత్తుగడలు ప్రయోగించడంలో అత్యంత పెద్ద ప్రయోగం - రివిజనిజం గురించిన ఆచరణగత అంచనాను, ప్రపంచమంతటా శ్రామికవర్గం ఎన్నడూ మరచిపోనిదాన్ని, సమకూర్చింది.

రివిజనిజం యొక్క ఆర్థిక, రాజకీయ ధోరణులకు సహజమైన ఒక చేర్పు ఏమిటంటే, సోషలిస్టు ఉద్యమం యొక్క అంతిమ లక్ష్యం పట్ల దాని వైఖరి. "ఉద్యమమే సర్వమూ, అంతిమ లక్ష్యం ఏమీ కాదు'' అన్న బెర్న్‌స్టైన్ చెప్పిన ఈ పడికట్టు మాట అనేక దీర్ఘ వివరణలకంటే రివిజనిజం యొక్క సారాన్ని బాగా వ్యక్తం చేస్తుంది. తన ప్రవర్తనను ప్రతి సందర్భానికీ విడివిడిగా నిర్ణయించుకోవడం, ఆనాటి ఘటనలకూ, అస్థిరమైన క్షుద్ర రాజకీయాలకూ అనుగుణంగా తన్ను తాను మలచుకోవడమూ, శ్రామిక వర్గ ప్రాథమిక ప్రయోజనాలనూ మొత్తం పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క, సకల పెట్టుబడిదారీ పరిణామం యొక్క మౌలిక లక్షణాలను విస్మరించడమూ, ఈ ప్రాథమిక ప్రయోజనాలను ఉద్యమం యొక్క నిజమైన, లేదా ఊహించబడిన సౌకర్యాల కొరకు బలి చేయడమూ - ఇదీ రివిజనిజం విధానం. ఈ విధానం యొక్క స్వభావం నుండే స్పష్టంగా ఏర్పడేదేమిటంటే అది అనంతమైన రకాల రూపాలు ధరించవచ్చుననీ అంతో ఇంతో "కొత్తదైన'' ప్రతి సమస్యా, అంతో ఇంతో ఎదురు చూడనిదీ, ముందు ఊహించనిదీ అయిన ప్రతి పరిస్థితీ, అది మౌలిక అభివృద్ధి పంథాను తృణప్రాయంగా మాత్రమే, అత్యంత స్వల్ప కాలంపాటు మాత్రమే మార్చినప్పటికీ, ఏదో ఒకరకం రివిజనిజంను సర్వదా అనివార్యంగా ఉత్పన్నం చేస్తుంది.

రివిజనిజం యొక్క అనివార్యతకి ఆధునిక సమాజంలో దాని వర్గపు మూలాలే కారణం. రివిజనిజం అంతర్జాతీయ ఘటన. జర్మనీలో సాంప్రదాయికులకూ, బెర్న్‌స్టైనియన్లకూ, ఫ్రాన్స్‌లో గెడిస్టులకూ, జోరేసిస్టులకూ(ఇప్పుడు ముఖ్యంగా బ్రుసిస్టులకూ), గ్రేట్ బ్రిటన్‌లోని సోషల్ డెమోక్రటిక్ ఫెడరేషన్‌కూ, ఇండిపెండెంట్ లేబర్ పార్టీకీ, బెల్జియంలో బ్రూకేర్‌కూ, వాండెర్ వెల్డెకూ ఇటలీలో ఇంటెగ్రలిస్టులకూ, రిఫార్మిస్టులకూ, రష్యాలో బోల్షవిక్కులకూ, మెన్షవిక్కులకూ గల సంబంధం, ఈ దేశాలన్నింటిలోనూ ప్రస్తుత స్థితిలో జాతీయ పరిస్థితులలోనూ, చారిత్రక లక్షణాలలోనూ అపార వైవిధ్యం ఉన్నప్పటికీ, ప్రతిచోటా సారంలో ఒకే విధమైనదని, ఏమాత్రమైనా విషయ పరిజ్ఞానం గల, యోచించే సోషలిస్టులకు ఎవరికైనా అణుమాత్రం కూడా సందేహం ఉండజాలదు. వాస్తవంలో, ప్రస్తుత అంతర్జాతీయ సోషలిస్టు ఉద్యమంలోని "విభజన'' ప్రపంచంలోని వివిధ దేశాలన్నింటిలోనూ ఇప్పుడు ఒకే మార్గాలలో జరుగుతున్నది; ముప్పై నలభై ఏండ్లనాటి పరిస్థితితో పోలిస్తే ప్రచండమైన పురోగతి జరిగినట్లు ఇది సాక్ష్యం చెబుతుంది; ఆనాడు వివిధ దేశాలలోని ఏక స్వభావం లేని ధోరణులు ఒకే ఒక అంతర్జాతీయ సోషలిస్టు ఉద్యమంలో తన్నుకులాడుకుంటూ ఉండినాయి. లాటిన్ దేశాలలో "విప్లవ సిండికాలిజం''గా రూపుదాల్చిన ఆ "వామపక్ష రివిజనిజం'' కూడా మార్క్సిజంకు అనుగుణంగ తన్ను తాను మలుచుకుంటున్నది, మార్క్సిజంను "సవరిస్తూ'' ఇటలీలో లబ్రియోల, ఫ్రాన్స్‌లో లగార్డెల్ తరచుగా తప్పుగా అర్థం చేసుకోబడిన మార్క్స్ నుండి సరిగా అర్థం చేసుకోబడిన మార్క్స్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు.

అవకాశవాద రివిజనిజం అభివృద్ధి అయిన స్థాయికి ఇంకా చాలా దూరంలో వున్న ఈ రివిజనిజం యొక్క సిద్ధాంత సారాన్ని పరిశీలించడానికి ఇక్కడ మేము ఆగజాలం: అది ఇంకా అంతర్జాతీయం కాలేదు, ఏ ఒక్క దేశంలోని సోషలిస్టు పార్టీతోనూ ఒక్కగానొక్క పెద్ద ఆచరణగత యుద్ధ పరీక్షను కూడా ఇంకా తట్టుకు నిలబడలేదు. కనుక, పైన వర్ణించబడిన "దక్షిణపక్ష రివిజనిజం''కు మేము పరిమితం అవుతాం.

పెట్టుబడిదారీ సమాజంలో దాని అనివార్యత ఎందులో వుంది? జాతీయ విలక్షణాలలోనూ, పెట్టుబడిదారీ అభివృద్ధి స్థాయిలలోనూ ఉన్న భేదాలకంటే అది ఎందుకు ప్రగాఢమైంది? ఎందుకంటే, ప్రతి పెట్టుబడిదారీ దేశంలోనూ, కార్మికవర్గం పక్కనే, పెటీ బూర్జువాల, సన్నకారు యజమానుల విస్తారమైన పొరలు ఎల్లప్పుడూ వున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ సన్నకారు ఉత్పత్తి నుండి ఉద్భవించింది, నిత్యం ఉద్భవిస్తున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ మళ్లీ మళ్లీ అనివార్యంగా కొన్ని "మధ్య పొరల''ను ఉత్పన్నం చేస్తుంది (ఫ్యాక్టరీ అనుబంధాలూ, ఇంటి వద్ద పనీ, సైకిల్, మోటార్ పరిశ్రమల లాంటి పెద్ద పరిశ్రమల అవసరాలు తీర్చడానికి దేశమంతటా వెదజల్లబడిన చిన్న కార్ఖానాలూ, వగైరా). ఈ కొత్త సన్నకారు ఉత్పత్తిదారులు మళ్లీ అంతే అనివార్యంగ కార్మిక వర్గ శ్రేణులలోకి తోయబడతారు. విశాలమైన కార్మిక పార్టీలలో పెటీ బూర్జువా దృక్పథం మళ్లీ మళ్లీ తలెత్తడం చాలా సహజం. ఇది ఇలా ఉండవలసి రావడమూ, కార్మికవర్గ విప్లవంలో అదృష్టాలు మారిందాక ఎల్లప్పుడు ఇలాగే ఉండబోవడమూ చాలా సహజం. ఎందుకంటే, అలాంటి విప్లవం సాధించడానికి ప్రజానీకంలో మెజారిటీని "సంపూర్ణ'' కార్మికవర్గీకరణ చేయడం అత్యవసరం

*(తరువాయి 29వ పేజీలో.....)*

# కర్తవ్య నిర్వహణలో మహోన్నత త్యాగాల చాలుబోసిన అమరులకు ఎర్రెర్రని జోహార్లు!

భారతదేశంలో నూతన విప్లవ పార్టీగా సి.పి.ఐ(మావోయిస్ట్) ఆవిర్భవించిన తర్వాత దేశంలో ఇతర ప్రాంతాలకు విస్తరిస్తున్న విప్లవోద్యమాన్ని దెబ్బతీయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2005 జనవరి నుండి దేశవ్యాప్త బహుముఖ దాడిని మొదలుపెట్టి, ఫాసిస్టు నిర్బంధకాండను తీవ్రతరం చేస్తున్నాయి. ఇందులో భాగంగా 13 రాష్ట్రాల సమన్వయంతో జాయింట్ ఆపరేషన్ కమాండ్‌ను ఏర్పరిచి బలగాల సమన్వయంతో దాడులు కొనసాగిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా దాడి చేసి ఖమ్మం, దంతెవాడ సరిహద్దులో ఉద్యమాన్ని దెబ్బతీసి, ఆ తర్వాత దండకారణ్య ఉద్యమాన్ని దెబ్బతీయడానికి రంగం సిద్ధం చేశాయి. ముఖ్యంగా ఆంధ్ర, ఉత్తర తెలంగాణా, ఎ.ఓ.బిలలో ఉద్యమాన్ని నిర్మూలించాలని శత్రువు అనేక పద్ధతులలో తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నాడు. బూటకపు ఎన్‌కౌంటర్లు, కోవర్టు ఆపరేషన్లు, అన్నంలో విషం కలిపించడం లాంటి నీచమైన ఎత్తుగడలతో విప్లవకారులను నిర్మూలించే ప్రధాన లక్ష్యంతో శత్రు దాడి కొనసాగుతున్నది. ఇది ఎంత తీవ్రంగా ఉందంటే అనుమానం వచ్చిన వెంటనే వెనుకా ముందు చూడకుండా రాత్రులందు పనుల మీద వెళ్ళే సామాన్య జనాన్ని కూడా నక్సలైట్లనీ కాల్చిచంపి ఎన్‌కౌంటర్ కథలల్లుతున్నారు. సామ్రాజ్యవాదుల అండదండలు, గైడెన్స్‌తో దోపిడి పాలకవర్గాలు విప్లవోద్యమంపై సాగిస్తున్న ఈ ఫాసిస్టు దాడిలో జిల్లా కమిటీ సభ్యుల నుండి దళ సభ్యుల వరకు విలువైన కామ్రేడ్స్ ఎందరో అమరులయ్యారు.

ఇందులో ఉత్తర తెలంగాణా ఉద్యమానికి చెందిన జిల్లా కమిటీ సభ్యులు కా॥ గిరి రవీందర్ (జనార్ధన్, సూర్యం), కా॥ అగ్గిల ఇస్తారి(సలీం), అహిరి ఎల్.ఒ.ఎస్. డిప్యూటి కమాండర్ కా॥ భగవాన్(సోమ్‌జీ), ఎల్.జి.ఎస్ కమాండర్ కా॥ సహదేవ్ (సంపత్), ఉత్తర తెలంగాణా జె.ఎస్.ఎం. బాధ్యుడు కా॥ శ్యాం, చెన్నూరు ఎల్.ఓ.ఎస్ కమాండర్ కా॥ ఆకునూరి స్వామి(సుధాకర్), ఏరియా కమిటీ సభ్యుడు కా॥ మల్లెబోయిన సత్తెన్న(భరత్), మంగి ఏరియా మిలీషియా కమాండర్ (ఎ.సి.ఎం) కా॥ కరణ్, దళ సభ్యులు కా॥ ఎడ్ల పెంటన్న(కొండన్న), కా॥ భీమా, కా॥ కోరం రమాదేవి(రజిత), కా॥ సింగిడి జ్యోతి(వసంత), కా॥ అలీసా(మమత), కా॥ రాధ, కా॥ విజయ, కా॥ పార్వతి, కా॥ రాణి, కా॥ కుమారి, మరొక దళ సభ్యుడు ఉన్నారు. డి.సి.ఎం గార్డు(ఎ.సి.ఎం) కా॥ నీరటి లచ్చన్న(వినయ్) అనారోగ్యంతో అమరుడయ్యాడు. 1981 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో ఆదివాసీలపై కాల్పుల జరిపిన పోలీసును మట్టికరిపించిన కా॥ ఇస్రుబాయి వృద్ధాప్యంతో మృతి చెందింది.

అలాగే ఆంధ్రప్రదేశ్ ఉద్యమం నుండి కడపజిల్లా సుండుపల్లె మండలం శేషాచలం అడవుల్లో 2006 ఏప్రిల్ 28న కోవర్టు విద్రోహం వల్ల జరిగిన శత్రుదాడిలో అనంతపూర్ జిల్లా కమిటీ సభ్యుడు కా॥ రామ్మోహన్, ఎ.సి కార్యదర్శి కా॥ క్రాంతి, కా॥ అరుణతో సహా 9మంది ప్రజా గెరిల్లా యోధులు అమరులయ్యారు. వీరిలో ఆరుగురు మహిళా కామ్రేడ్స్ వున్నారు. ఫిబ్రవరి 5న కడపజిల్లా మైదుకూరులో పట్టుకుని గిద్దలూరు అటవీ ప్రాంతంలో జరిపిన బూటకపు ఎన్‌కౌంటర్లో నల్లమల డివిజన్‌కు చెందిన కా॥ శ్రీధర్‌తో పాటు సభ్యులు కా॥ ఈశ్వరమ్మ(సావిత్రి 45సం.), కా॥ ఆంజనేయులు(సుధాకర్); ఫిబ్రవరి 26న మహబూబ్ నగర్ జిల్లా గోపాల్ పేట వద్ద పట్టుకుని బుద్ధారం అడవుల్లో చేసిన బూటకపు ఎన్‌కౌంటర్లో ఎల్.ఓ.ఎస్ కమాండర్ కా॥ కర్రెం నర్సప్ప(సత్తెన్న)తో పాటు సానుభూతి పరుడు అమర్‌నాథ్‌రెడ్డి; ఏప్రిల్ 30న నల్గొండ జిల్లా కృష్ణానది ఒడ్డున పెడికల పెండెం దగ్గర జరిపిన బూటకపు ఎదురుకాల్పుల్లో ఎల్.ఓ.ఎస్ కమాండర్ కా॥ బోడ సాయిలు(కుర్మన్న), దళ సభ్యులు కా॥ బానుపాక దేవి(ఝాన్సీ), కా॥ సీతా నాగేష్(రఘు), కా॥ ఘనమారి శంకర్(వినయ్); అదేరోజు తెల్లవారు జామున శ్రీశైలం దగ్గర్లోని పెద్ద ఆరుట్ల పెంట వద్ద జరిపిన బూటకపు ఎదురు కాల్పుల్లో గుంటూరు జిల్లాకు చెందిన సహచరులు కా॥ సాల్మన్(విక్రమ్), కా॥ ఉమ; మే15న ప్రకాశం జిల్లా పెద్ద అర్ధవీడు సమీపంలోని అటవీ ప్రాంతంలో జరిపిన బూటకపు ఎన్‌కౌంటర్లో కా॥ ఉమ అమరులయ్యారు.

ఈ కామ్రేడ్స్ విప్లవోద్యమాన్ని, ప్రజా యుద్ధాన్ని అభివృద్ధి చేస్తూ కర్తవ్య నిర్వహణలో తమ అమూల్యమైన ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించి మహోన్నత త్యాగాలు చేశారు. వారి త్యాగాలు ఎన్నటికీ వృధా కావు. వారు మన ముందు లేకున్నా వారి ఆశయాలు, మిగిల్చిన కర్తవ్యాలు మన ముందు కదలాడుతూనే వుంటాయి. అమరుల ఆశయ సాధనకై నిర్దిష్ట వస్తుగత పరిస్థితిని మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సైద్ధాంతిక వెలుగులో విశ్లేషించుకొని తగిన కర్తవ్యాలు రూపొందించుకొని సాహసంగా పోరాడుతూ విప్లవోద్యమాన్ని మరింత ముందుకు తీసుకుపోదామని శపథం చేద్దాం. వారి అమరత్వానికి వినమ్రంగా జోహార్లర్పిద్దాం.

### కా॥ అగ్గిల ఇస్తారి( సలీం )(డి.సి.ఎం)

నవంబర్ 19, 2005 నాడు అదిలాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం మాలిని గ్రామ పంచాయితీ పరిధిలోని జోగాపూర్, మారేపెల్లి అటవీ ప్రాంతంలో రాత్రి 6.30గంటలకు జరిగిన ఎన్‌కౌంటర్‌లో కా॥ సలీం అలియాస్ అగ్గిల ఇస్తారి (జిల్లా కమిటి సభ్యుడు) అమరుడైనాడు.

మండల కేంద్రం అయిన బెజ్జూరుకు 10 కి॥ దూరంలో ఉన్న కాటేపల్లి గ్రామంలో పేద ఆదివాసి కుటుంబంలో జన్మించాడు. చిన్న తనంలోనే తల్లి పోచక్క చనిపోవడంతో తండ్రి పోచయ్య పెంచి పెద్ద చేశాడు. చిన్నప్పటి నుండి కూలిపని చేస్తూ, అడవికి పోయి బంక తీసుకవచ్చి అమ్ముకోవడం, సంవత్సరంలో కొద్ది రోజులు మంచిర్యాల, రామగుండం, గోదావరిఖని లాంటి పారిశ్రామిక ప్రాంతాలలో బ్రతకడం కొరకు కూలి పనిచేస్తూ జీవనం

కొనసాగించాడు.

చిన్నప్పటి నుండి పార్టీతో, దళంతో సంబంధాలు వున్నాయి. 1990 వెసులుబాటు కాలంలో జరిగిన "భూ ఆక్రమణల'' కార్యక్రమంలో కా॥ ఇస్తారి తమ గ్రామంలో మక్తదారుల భూములను ఆక్రమించుకునే పోరాటంలో పాల్గొన్నాడు. చిన్నప్పటి నుండి కూడ మక్తదార్ల, జంగ్లాతు అధికారుల దోపిడి, దౌర్జన్యాలను ప్రత్యక్షంగా అనుభవించాడు. ఈ క్రమంలోనే గ్రామంలో సంఘ కార్యక్రమాలలో పాల్గొంటూ, నిర్బంధం పెరుగుతున్న క్రమంలోనే 1992లో 16 సంవత్సరాల వయసులో దళంలోకి రిక్రూట్ అయినాడు.

1992లో పార్టీ మీద నిషేధం,రాష్ట్ర వ్యాపితంగా పెద్ద ఎత్తున నిర్బంధం కొనసాగుతున్న కాలంలో కూడా చురుకుగా పనిచేశాడు. ఆ నిర్బంధం మధ్య ధైర్యంగా వుంటూ ఇన్‌ఫార్మర్స్‌ను శిక్షించడంలో, ఎన్‌కౌంటర్స్‌కు నిరసనగా దాడులను కొనసాగించడంలో మిలిటెంట్‌గా వుండేవాడు. 1993లో గణపతి అనే కానిస్టేబుల్‌ను హతమార్చడంలో, ముగ్గురు బిఎస్ఎఫ్ జవాన్లు కుక్కచావు చచ్చి జిల్లా వ్యాపితంగా మంచి ప్రభావం వేసిన దరోగపల్లి ఆంబుష్‌లో అత్యంత చురుకుగా పాల్గొని విజయవంతం చేయడంలో తన వంతు కృషి చేశాడు.

ఇంటి దగ్గర చదువు రాకున్నా పార్టీలోకి వచ్చి క్రమంగా చదువు నేర్చుకొని, రాజకీయాలను అధ్యయనం చేశాడు. ముఖ్యంగా మిలటరీ విషయాల మీద దృష్టి పెట్టి మిలటరీ జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకున్నాడు. ఆయుధాల రిపేరింగ్ మీద పట్టు సాధించాడు.

1994 ఏప్రిల్ నెలలో దళం మీద దాడి జరిగినప్పుడు కా॥ ఇస్తారి కొత్త అయినప్పటికీ ధైర్యంగా కాల్పులు చేస్తూ రిట్రీట్ అయ్యాడు. కా॥ ఇస్తారి ఎన్‌కౌంటర్ సంఘటనలు, అంబుష్‌లలో ధైర్యంగా వుంటూ, తన తోటి వారిని కూడా ధైర్యంగా నిలబెడుతూ వుండేవాడు.

1996లో ఇంద్రవెల్లి ఏరియాకు మారి ఆ ఏరియా ఉద్యమంలో క్రియాశీలంగా పని చేసి, అక్కడే ఎ.సి మెంబర్ అయ్యాడు. ఇతర ఆదివాసీ తెగ ప్రజలతో మమేకమవుతూ, వారి భాషను క్రమంగా నేర్చుకున్నాడు. వర్గ శత్రువుల పట్ల ఖచ్చితంగా వుండే వాడు. బోథ్ ఏరియాలో సోనాల గ్రామం దగ్గర జరిగిన అంబుష్‌లో పాల్గొని శత్రు ఆయుధాన్ని ధైర్యంగా స్వాధీనం చేసుకున్నాడు. కోసాయి రైల్వే పోలీసుల మీద దాడి చేసి నాలుగు ఆయుధాలను స్వాధీనం చేసుకుని తిరిగి వస్తున్న క్రమంలో దేడ్రా గ్రామం దగ్గర జరిగిన పోలీసుల దాడిని తిప్పికొట్టాడు. 1999లో ఏర్పాటు చేసిన ఎస్.జి.ఎస్ డిప్యూటి కమాండర్ అయినాడు. (1999 నవంబర్) 2000 జనవరిలో సలుగుపెల్లి అంబుష్, కాగజ్‌నగర్ డి.ఎస్.పి ఆఫీసు మీద రైడ్ మొదలైన మిలిటరీ దాడులలో పాల్గొని చర్యలను విజయవంతం చేయడంలో కా. సలీం ముందు భాగాన వున్నాడు. 2001 జనవరిలో ఏర్పాటు చేసిన 16వ పి.ఎల్ సెక్షన్ కమాండర్ అయినాడు.

2001 తరువాత శత్రు అణిచివేత పెరుగుతున్న క్రమంలో ఉద్యమాన్ని విడిచిపెట్టి కొంతమంది దిగజారి, మరికొంత మంది అమరులైనప్పటికీ కా. సలీం ఉద్యమంలో ధైర్యంగా వుంటూ తనతోటి కామ్రేడ్స్‌ను కూడా ఉత్సాహపరుస్తూ, ఉద్యమంలో నిలబెట్టడానికి తీవ్రంగా కృషి చేశాడు. 2002, 2004లో జరిగిన మిల్ట్రీ క్యాంపులలో కా. సలీం కూడా విద్యార్థిగా పాల్గొని, మిలిటరీ జ్ఞానాన్ని పెంపొందించుకొని, కమాండర్‌గా అభివృద్ధి కావడానికి కృషి చేశాడు.2002లో 7వ పి.ఎల్ సెక్షన్ కమాండర్ అయినాడు. 2003 అక్టోబర్‌లో పి.ఎల్ రద్దు చేసిన తరువాత 2004 జనవరిలో ఎస్.జి.ఎస్ కమాండర్ అయినాడు. 2004 జూలై నుండి ప్రొటక్షన్ ఎస్.జి.ఎస్ కమాండర్‌గా(డి.సి స్థాయి) తన బాధ్యతలు నిర్వహిస్తూ, అంబుష్ కమాండర్‌గా గ్రేహౌండ్స్ బలగాలను ఎదిరిస్తూ యుద్ధరంగం మధ్యనే అమరుడైనాడు. ఈ మరణవార్తతో జిల్లా వ్యాప్తంగా తాను పని చేసిన పల్లెలు, ఆదివాసీ గూడాలు కన్నీటి పర్యంతం అయినాయి. కామ్రేడ్ సలీం అంత్యక్రియలు స్వగ్రామమైన కాటెపల్లిలో కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జరిగాయి. ఆదివాసీ ప్రజానీకం కళ్ళ నీళ్ళు పెట్టుకొని మౌనంగా 'రగల్ లాల్ సలాం' చెప్పారు. నీ నెత్తుటి బాకి తీర్చుకుంటామని శపథం చేశారు.

## కా॥ గిరి రవీందర్ (జనార్దన్, సూర్యం)

2005 నవంబర్ 21నాడు ఉదయం 9 గం॥లకు ఆదిలాబాద్ జిల్లా కాగజ్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలోని మాలిని అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురు కాల్పులలో కా॥ సూర్యం (గిరి రవీందర్), కా॥ సోంజీ (కుడుమెత భగవాన్) శత్రువుతో పోరాడుతూ అమరులయినారు.

విప్లవోద్యమంలో ప్రధాన భూమిక నిర్వహించిన కరీంనగర్ జిల్లా, ముత్తారం మండలం కేశనపల్లికి చెందిన గిరి రవీందర్ (జనార్దన్, సూర్యం) మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 10వ తరగతి చదువుతున్న సమయంలో ఉద్యమంపట్ల ఆకర్షితుడైనాడు. గ్రామీణ ప్రాంతాల్లో భూస్వామ్య, పెత్తందారీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతూ కూతురు పుట్టిన మూడు నెలలకే పసిగుడ్డును వదిలేసి గిరి రవీందర్ ఉద్యమంలోకి వచ్చాడు. 14 సం॥ల ఉద్యమ జీవితంలో పేద ప్రజలతో కష్ట సుఖాలు పంచుకున్నాడు.

1990లో వచ్చిన వెసులుబాటు కాలంలో కా॥ గిరి రవీందర్ మంథని ప్రాంతంలో గ్రామ సంఘ నాయకుడిగా పనిచేస్తూ అనేక కార్యక్రమాలలో పాల్గొన్నాడు. ముఖ్యంగా భూ ఆక్రమణ పోరాటం, సారా వ్యతిరేక పోరాటాలు, పెత్తందార్లకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో అత్యంత చురుకుగా పాల్గొన్నాడు. మంథనిలో జరిగే బహిరంగ సభకు ప్రజలను కదిలించాడు. గ్రామంలో చురుకైన కార్యకర్తగా పని చేస్తూ నిర్బంధం పెరుగుతున్న క్రమంలో పోలీసులకు లొంగిపోయి గ్రామ కాంగ్రెస్ కార్యకర్తగా పనిచేస్తూ తన స్వంత గ్రామంలో సాధారణ జీవనం గడుపుతూ తిరిగి పార్టీలో చేరాడు.

కా॥ జనార్ధన్ (గిరి రవీందర్) మంథని, ముత్తారం, మల్హార్ ప్రాంతాల్లో, హుస్నాబాద్, మల్యాల, జగిత్యాల దళాల్లో పని చేశాడు. 2001లో ఏసి కార్యదర్శి అయినాడు. 2003 ఫిబ్రవరిలో డి.సిలోకి వచ్చాడు. సుదీర్ఘ కాలం పనిచేసి జగిత్యాల ప్రాంతంలో పార్టీని నిలబెట్టడంలో చాలా ముఖ్యమైన పాత్ర వహించాడు. బీర్‌పూర్, రేచ్‌పల్లి, మల్యాల ప్రాంతంలో, మల్లాపూర్ ప్రాంతాల్లో రహస్యంగా సంఘాలు నిర్మిస్తూ పనిని కొనసాగించాడు. గుట్ట క్రింది గ్రామాలలో బీర్‌పూర్, దోనూర్, రేచ్‌పల్లి, భూస్వాముల మామిడి తోటల ఆక్రమణ పోరాటాలలో ప్రజలను

కదిలించాడు. ఇన్‌ఫార్మర్స్ నెట్‌వర్క్‌ను దెబ్బతీయడంలో చాకచక్యంగా వ్యవహరించాడు. ఉద్యమానికి వ్యతిరేకంగా ముందుకు వచ్చిన కొంత మంది భూస్వాములను, ఇన్‌ఫార్మర్స్‌ను మట్టుబెట్టాడు. జనార్ధన్‌కు "జగిత్యాల జనార్ధన్" అనే పేరు ప్రజల్లో స్థిర పడింది.

శత్రువు దాడి పెరిగి కొంత మంది దిగజారిపోయారు. కొంతమంది అమరులు అయినారు. జిల్లా కార్యదర్శి కా॥ పద్మక్క(రజిత), కా॥ ఆర్.కె (రామకృష్ణ), డి.సి మెంబర్ కా॥ భాస్కర్ అమరులు అయినప్పటికి ఏరోజూ కూడా అధైర్య పడకుండ, పట్టుదలతో ఉద్యమాన్ని ముందుకు తీసుకపోవడానికి కృషి సల్పాడు. 1999లో తన స్వగ్రామంలో పార్టీ ఇన్‌ఫార్మర్స్‌ను చంపితే, దీనికి కౌంటర్‌గా పోలీసులూ, జడల నాగరాజు ముఠా మిలాఖతై కేశనపల్లిలో తన స్వంత తండ్రిని, తమ్ముడిని చంపివేసినప్పటికీ కా॥ జనార్ధన్ ఒకవైపు బాధను తట్టుకుంటూనే మరొకవైపు వర్గకసిని మరింత పెంచుకుని నిబ్బరంగా ఉద్యమంలో నిలబడుతూ ముందుకు సాగాడు. నిజామాబాద్ డివిజన్ పరిధిలో పోలీసులు 'కోవర్ట్ పద్ధతి'లో పార్టీని దెబ్బకొట్టడానికి తీవ్రప్రయత్నాలు చేశారు. కోవర్టులను ముందే పసిగట్టి 'మానాల కోవర్ట్'లను దెబ్బ తీయడంలో తనవంతు పాత్ర నిర్వహించాడు. మైదాన ప్రాంతంలో పని చేయడంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటూ పనిని కొనసాగించాడు. జగిత్యాల ప్రాంతంలో వివిధ "ఎన్‌కౌంటర్ ఘటనల" నుండి చాకచక్యంగా తప్పించుకున్నాడు.

ఉద్యమ అవసరాల రీత్యా పార్టీ పంపగా 2004 జూలైలో నిజామాబాద్ డివిజన్ నుండి అదిలాబాద్ జిల్లాకు కా॥ సూర్యం(జనార్ధన్)గా వచ్చి చనిపోయేంత వరకు అక్కడనే పనిచేశాడు.

2004 చర్చల కాలంలో సిర్పూర్ - చెన్నూర్ ప్రాంతంలో ఉద్యమాన్ని పటిష్టం చేయడానికి పార్టీ, ప్రజా సంఘాల నిర్మాణాలు చేయడంలో, అమరవీరుల స్థూప నిర్మాణాలు, బహిరంగ సభలకు ప్రజలను కదిలించడంలో చాలా కృషి చేశాడు. ఆదివాసీ ఉద్యమాన్ని, ఆదివాసి క్యాడర్‌ను అర్థం చేసుకొని, గతంలో ప్రజలకు వ్యతిరేకంగా వున్న టిడిపి నాయకులను చర్చల కాలంలో పార్టీకి సరెండర్ అయ్యేటట్లు చేశాడు. దహిగాం మండల పరిషత్ అధ్యక్షుడు చిలువేరు సత్యనారాయణను ఖర్జి గ్రామంలో ప్రజాకోర్టు నిర్వహించి ప్రజల సమక్షంలో తప్పులు ఒప్పించి శిక్షించిన సంఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

కా॥ గిరి రవీందర్(జనార్ధన్, సూర్యం) ఉద్యమంలో వచ్చిన అనేక ఆటుపోటుల మధ్య పనిచేస్తూ ఉద్యమాన్ని నడిపించాడు. తాజాగా నిజామాబాద్ డివిజన్ కమిటీ సభ్యుడిగా పార్టీ అప్పగించిన బాధ్యతలను చేపట్టక ముందే కా॥ గిరి రవీందర్ జోగాపూర్ ఎన్‌కౌంటర్‌లో చనిపోవడం నిజామాబాద్ డివిజన్ ఉద్యమానికి ఎంతో నష్టం. విప్లవం పట్ల అతని పట్టుదల, వర్గకసిని మనం ఆదర్శంగా తీసుకొని, ఆయన ఆశయ బాటలో మరింత పట్టుదలతో కృషి చేస్తామని శపథం చేద్దాం.

## కా॥ కుడుమేత భగవాన్ (సోంజీ)

ఆదిలాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం మాలిని అటవీ ప్రాంతంలో 21 నవంబర్ నాడు ఉదయం 9గం.లకు జోగాపూర్ నుండి మాలిని గుట్టెక్కుతున్న క్రమంలో గ్రేహౌండ్స్ బలగాలు వీరి రాకను ముందే గమనించి గుట్టపై నుండి కాల్పులు చేయగా కా. సూర్యంతో పాటు కా.సోంజీ అక్కడికక్కడే అమరుడైనాడు.

కామ్రేడ్ కుడుమేత భగవాన్ (సోంజీ) మహారాష్ట్రలోని గడ్‌చిరోలి జిల్లా అహిరి తాలూక కపువంచ గ్రామంలో పేద ఆదివాసీ కుటుంబంలో జన్మించాడు. గత 25సంవత్సరాల నుండి దండకారణ్య ఉద్యమం కొనసాగుతున్న, కా. పెద్ది శంకర్ అమరుడైన ఇదే అహిరి ప్రాంతం నుండి కా. భగవాన్ కూడా వచ్చాడు.

కా. సోంజీ 1999లో రిక్రూట్ అయి అహిరి ఏటపెల్లి, భామ్రాగడ్, పెరిమిలి దళాలలో పని చేశాడు. అనేక ప్రతిఘటన చర్యలలో పాల్గొన్నాడు. అహిరి ఏరియా ఎల్.ఓ.ఎస్ డిప్యూటి కమాండర్‌గా పని చేస్తున్నాడు.

ఉత్తర తెలంగాణాలో ప్రతిఘటన కర్తవ్యం కోసం గడ్చిరోలి డివిజన్ నుండి ఒక ఎల్.జి.ఎస్ ఆదిలాబాద్ జిల్లాకు వచ్చే క్రమంలో కా. సోంజీ అమరుడు కావడం జరిగింది.

గమనిక - ఈ కామ్రేడ్ జీవిత చరిత్ర వివరాలు అందని కారణం చేత వివరంగా రాయలేక పోయాము.

## కా॥ సింగిడి జ్యోతి (వసంత)

కా॥ జ్యోతి(17సం॥) నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం బాచన్‌పల్లి గ్రామంలోని సింగిడి రాజయ్య, లక్ష్మి దంపతుల పెద్ద కుమార్తె. కా॥ జ్యోతి 5వ, తరగతి వరకు చదువుకుంది.

కా. జ్యోతి పెరిగి పెద్దదవుతున్న కొద్ది తన జ్ఞానాన్ని కూడా పెంచుకుంటూ వచ్చింది. ఇంటి పేదరికాన్ని అర్థం చేసుకొని వేడి నీళ్ళకు చన్నీళ్ళు తోడైనట్లు చిన్నప్పటి నుండే బీడీలు చేస్తూ కుటుంబ పోషణలో తన వంతు బాధ్యతను నెరవేర్చింది. ఈ క్రమంలోనే కా. జ్యోతి తల్లికి పిచ్చిలేవగా తానే ఇంటికి పెద్ద దిక్కు అయి కుటుంబ భారాన్ని మోసింది.

తండ్రీ, తాను రెక్కలు ముక్కలు చేసుకుని శ్రమించినా కుటుంబం గడవడమే గగనమవుతుండడానికి, ఎలాంటి కష్టం చేయని బీడీల శేట్లు సుఖ జీవితం గడపడానికి కారణాన్ని అన్వేషిస్తున్న క్రమంలో ఆప్రాంతంలో కొనసాగుతున్న వర్గపోరాటం సహజంగానే జ్యోతిని పోరాట బాట పట్టించింది.

తండ్రి ప్రోద్బలంతో, విప్లవోత్సాహంతో జనవరి 25, 2005న పూర్తి కాలం కార్యకర్తగా విప్లవోద్యమంలోకి అడుగుపెట్టింది. కా. జ్యోతి వసంతగా పేరు మార్చుకుని దళాల్లో చేరిన తర్వాత కొద్ది రోజులకే దేశవ్యాప్త బహుముఖ దాడి ప్రారంభమై జిల్లాలో ఎన్నడూ కనీవిని ఎరుగనంత నిర్బంధం పెరిగి మానాల హత్యాకాండలో 10మంది కామ్రేడ్స్ అమరులైనా, ఈ హత్యాకాండ, కూంబింగ్‌లకు భయపడి తనకంటే కొద్ది మాసాల ముందు రిక్రూట్ అయినవారు పదుల సంఖ్యలో దిగజారి పోయినా, కా. వసంత చెక్కుచెదరకుండా ధృఢంగా విప్లవోద్యమంలో నిలబడింది. కష్టభరితమైన గెరిల్లా జీవితానికి, శత్రు దాడులకు బెదరకుండా ధైర్యంగా తిరిగింది.

2005 జనవరిలో రిక్రూట్ అయిన కా. వసంత కామారెడ్డి, ఆదిలాబాద్ జిల్లా సిర్పూర్, చెన్నూరు ప్రాంతంలో తిరిగింది. జూలై నుంచి సెప్టెంబర్

వరకు ఎల్లారెడ్డి దళం సభ్యురాలిగా పని చేసింది. అక్టోబర్ నుంచి తాను అమరత్వం పొందే వరకు కామారెడ్డి, సిరిసిల్లా దళం సభ్యురాలిగా కొనసాగుతున్నది. డివిజన్ కమిటి తీసుకున్న నిర్ణయంలో భాగంగా ప్రతిఘటనా దాడులలో పాల్గొంటూ, నవంబర్ 19న జోగాపూర్ అడవుల్లో దళం మకాంపై జరిగిన దాడిలో వీరోచితంగా ప్రతిఘటించి రిట్రీట్ అయింది. విడిపోయిన దళం కలుసుకునేందుకు వస్తున్న క్రమంలో మానిగడ్ కొండల్లో మళ్ళీ జరిగిన ఎన్‌కౌంటర్‌లో నవంబర్ 22 సాయంత్రం 5గం.లకు కా. జ్యోతి(వసంత) నులి వెచ్చని నెత్తురు ధారబోసి అమరురాలైంది.

ఒకవైపు దిగజారడాలు, ఇంకోవైపు అమరత్వం, మరొకవైపు తన తల్లి పిచ్చిదై, పోలీసు వేధింపులతో తండ్రి బొంబాయి వలస పోయిన ఫలితంగా తన చెల్లెలు, తమ్ముడు దిక్కులేని వారైనప్పటికీ కా. వసంత ఏ రోజు కూడా విప్లవ ధృఢత్వాన్ని, పట్టుదలను చెక్కు చెదరనివ్వలేదు. అమరుల అమరత్వాన్ని ఎత్తి పట్టింది. దిగజారుడు గాళ్ళను అసహ్యించుకుంది. తన కుటుంబాన్ని ప్రజల్లో భాగంగా చూచిన త్యాగశీలి. చెరగని నవ్వుతో గలగల మాటలతో కొత్తవారైనా ఇట్టే కలిసిపోయేది. తన భావాలను అభిప్రాయాలను దాచుకోకుండా నిర్మొహమాటంగా మాట్లాడేది. పని పద్ధతులు తెలియని కారణంగా తన నుండి జరిగే తప్పులను తోటి సభ్యులుగాని, నాయకత్వం గానీ గుర్తు చేస్తే శషబిషలు లేకుండా స్వీకరించి మార్చుకోవడానికి తీవ్రంగా కృషి చేసేది. అలాగే తోటి సభ్యుల నుండి గాని, నాయకత్వం నుండి గాని లోపాలు జరిగితే సూటిగా విమర్శించేది. తనకు తెలియని విషయాలను తెలుసుకోవడానికి నిరంతరం కృషి చేసేది. దళంలో ఎవరికైనా జ్వరం వచ్చినా అనారోగ్యానికి గురైనా కన్న తల్లిలా సపర్యలు చేసేది. తనను వ్యతిరేకించే వారితోనైనా కలిసిపోయే మంచి స్నేహశీలి. కా. వసంత పితృస్వామ్యాన్ని సహించకపోయేది. ఇన్ని సుగుణాలు కలిగిన కా. జ్యోతి (వసంత)ని కోల్పోవడం దెబ్బతిన్న నిజామాబాద్ విప్లవోద్యమానికి మరింత లోటే. కా. జ్యోతిలోని పట్టుదల, త్యాగశీలత, నిర్మొహమాటం, సూటిదనం, మాతృ ప్రేమ, స్నేహశీలతను పుణికి పుచ్చుకొని దోపిడి వ్యవస్థను నిర్మూలించడమే కా. జ్యోతికి మనమర్పించే నిజమైన నివాళి.

## కా॥ నీరటి లచ్చన్న (వినయ్)

2005 నవంబర్‌లో ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి డివిజన్ కమిటి సభ్యుని గార్డు నీరటి లచ్చన్న (వినయ్) తీవ్ర అనారోగ్యంతో అమరుడైనాడు.

కత్తుల వంతెన లాంటి కరీంనగర్ జిల్లా సిరిసిల్లా ప్రాంతంలోని చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో పేద దళిత కుటుంబంలో కా॥ లచ్చన్న జన్మించాడు. పేదరికం మూలంగా చిన్నప్పుడు కనీస ప్రాథమిక చదువుకు కూడా నోచుకోలేదు. చిన్నప్పటి నుండి రెక్కలు ముక్కలు చేసుకుంటూ కూలీ, నాలీ పనులు చేస్తూ కుటుంబ పోషణలో తాను సైతం భాగస్వామి అయ్యాడు. ఎంత కష్టం చేసినా పూటగడవని పరిస్థితి గల్గిన కా. లచ్చన్నను ఆ ప్రాంతంలో సాగుతున్న వర్గ పోరాటం సహజంగానే ఆకర్షించింది. తన స్వంత గ్రామం సి.పి.ఐ (ఎమ్.ఎల్) జనశక్తి పార్టీ రాజకీయాలకు బలమైన కేంద్రంగా వుండేది. ఆ పార్టీ యొక్క మితవాద, అవకాశవాద రాజకీయాలను వ్యతిరేకించి 2003 సం..లో సి.పి.ఐ (ఎమ్.ఎల్) పీపుల్స్ వార్ నాయకత్వంలోని సిరిసిల్లా దళాన్ని వెతికి పట్టుకొని గ్రామ విప్లవ రైతుకూలి సంఘాన్ని నిర్మించి అందులో పని చేయనారంభించాడు. గ్రామంలో పార్టీ ఇచ్చే ప్రతి కార్యక్రమంలో చురుకుగా కదిలేవాడు. ఈ క్రమంలో కా.లచ్చన్న 2003 డిసెంబర్‌లో పూర్తికాలం కార్యకర్తగా రిక్రూట్ అయ్యాడు.

కా. లచ్చన్న రిక్రూట్ అయ్యేనాటికి జిల్లా ఉద్యమ పరిస్థితి సరెండర్లు, అమరత్వాల మూలంగా చాలా దెబ్బతిని వుంది. అయినప్పటికీ పట్టుదలతో విప్లవోద్యమంలో పని చేస్తానని రిక్రూట్ అయినాడు. కొద్ది రోజులు దళంలో తిరిగి తర్వాత గెరిల్లా జీవితంలో కష్టభరితమైన పరిస్థితులను సరిగా అర్థం చేసుకోలేక ఇంటికి వెళ్ళినా శత్రువుకు మాత్రం లొంగి పోక, తిరిగి 2004 ప్రారంభంలో తన తప్పులను అంగీకరించి స్వయం విమర్శ చేసుకొని విప్లవోద్యమంలోకి చేరాడు.

కార్మిక వర్గ దృక్పథం కలిగిన కా. లచ్చన్న (వినయ్) ఏ రోజూ స్థానికతత్వానికి లోను కాలేదు. జిల్లా కమిటి ఏ ప్రాంతానికి పంపినా, ఏ పనులు అప్పగించినా గానీ శషబిషలు లేకుండా చేపట్టాడు. అలా 2004 ప్రారంభంలో రిక్రూట్ అయిన కా. వినయ్ జగిత్యాల, కామారెడ్డి, సిర్నాపల్లి, భీంగల్ దళాల్లో పని చేశాడు. సిర్నాపల్లి, భీంగల్, ఎల్లారెడ్డి, బాన్సువాడ దళాలలోఎల్.ఓ.ఎస్ కమిటీ సభ్యునిగా బాధ్యతలు నిర్వర్తించాడు. 2005 అక్టోబర్ నుంచి నవంబర్‌లో తాను అమరుడయ్యే వరకు జిల్లా కమిటి సభ్యునికి గార్డు బాధ్యతలు నిర్వర్తిస్తూ వచ్చాడు.

మృధు స్వభావి అయిన లచ్చన్న తోటి సభ్యులతో, ప్రజలతో కలగలిసి పోయేవాడు. పేదరికం మూలంగా ఇంటి దగ్గర చదువుకోనప్పటికీ పార్టీలోకి వచ్చిన తర్వాత ప్రాథమిక విద్య నేర్చుకొని అభివృద్ధి చేసుకున్నాడు. ఎంత కష్టమైన పనినైనా ఓపికతో చేసేవాడు.

పెరిగిన నిర్బంధంలో శత్రువు ముందు లొంగి పోయిన వారిని అసహ్యించుకున్నాడు. తన స్నేహితులు సిరిసిల్లా బూటకపు ఎన్‌కౌంటర్లో అమరులైనప్పుడు గానీ కోవర్టు ద్రోహంతో జరిగిన మానాల హత్యాకాండలో జిల్లా కార్యదర్శితో పాటు 10 మంది కామ్రేడ్స్ అమరులు అయినప్పుడు గానీ గుండె చెదిరిపోలేదు. కడుపులోని బాధను, కండ్లలోని నీటిని కసిగా మార్చుకొని వర్గ యుద్ధంలో తన చివరి శ్వాస వరకు ముందుకే సాగాడు.

చిన్ననాటి నుంచే శారీరక బలహీనతతో వున్న కా. వినయ్ మలేరియా మూలంగా తీవ్ర అనారోగ్యానికి గురైనాడు. ఒకవైపు చికిత్స జరుగుతుండగానే తుదిశ్వాస విడిచి అమరుడైనాడు. తీవ్ర శత్రు నిర్బంధం మూలంగా కా. వినయ్ భౌతికకాయాన్ని డివిజన్ కమిటి కుటుంబ సభ్యులకు అందించలేక పోయినప్పటికీ కా. వినయ్ అంతిమ సంస్కారాలు ప్రజల మధ్య జరిపి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.

కార్మిక వర్గ తత్వం, పట్టుదల, కష్టపడేతత్వం, స్నేహశీల స్వభావం కలిగిన కా. వినయ్ అమరుడు కావడం దెబ్బతిన్న నిజామాబాద్ జిల్లా ఉద్యమానికి మరింత లోటే. అనుసరణీయమైన కా. వినయ్‌లోని

సుగుణాలన్నింటినీ విప్లవ శక్తులు పుణికి పుచ్చుకొని ముందుకు సాగడమే ఆ ప్రియమైన కామ్రేడ్‌కు అర్పించే నిజమైన నివాళి.

## ఆవుడం అమర వీరులకు విప్లవ జోహార్లు

### కా. ఆకునూరి స్వామి (సుధాకర్)

ఆదిలాబాద్ జిల్లా నెన్నెల మండలంలోని ఆవుడం అడవి ప్రాంతంలో 2005 డిసెంబర్ 23నాడు ముందుగా ఇన్‌ఫార్మర్స్ ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు అడవి అంచునున్న చెఱువు దగ్గర అంబుష్ ఏర్పాటు చేసి, జరిపిన కాల్పుల్లో ఉదయం 6.30గంటలకు కా॥ సుధాకర్, కా॥ భరత్, కా॥ కొండన్నలు అమరులైనారు.

కరీంనగర్ జిల్లా కమలాపూర్ మండలం వంగపల్లి కా॥ సుధాకర్ స్వగ్రామం. ఇదే ప్రాంతం కన్నూరు గ్రామానికి చెందిన అమరుడు కా. పల్లె కనకయ్య (సుధాకర్) పేరు పెట్టుకొని కా. స్వామి (సుధాకర్) కూడా అదే చెన్నూరు ప్రాంతంలో కమాండర్‌గా పనిచేస్తూ అమరుడు కావడం విశేషం.

కా. స్వామి(సుధాకర్) ఆకునూరి అంకూస్, సారమ్మల మూడవ సంతానం. ఇంటర్ మీడియట్ వరకు చదివాడు. పూరి గుడిసె తప్ప సెంటు భూమి కూడ లేని కటిక దారిద్ర్యంతో పూట గడవని స్థితిలో కా. సుధాకర్ గ్రామ సమీపంలోని ఇటుక బట్టిలో కూలి పని చేసి, తల్లి దండ్రులను పోషించేవాడు. ఆదర్శ భావాలు కలిగిన స్వామి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షునిగా పని చేస్తూ శ్రమదానం వంటి కార్యక్రమాలు నిర్వహించాడు. ఒకప్పుడు వంగపల్లి గ్రామం మావోయిస్టు పార్టీ



కార్యకలాపాలకు, పోరాటాలకు కేంద్రం. అమరులు కా. అనుపురం కొమురయ్య(ఏ.కె), కా. ధర్మల మల్లిఖార్జున్ (శ్రీను), కా. పల్లె కనకయ్యల ప్రభావం కా. స్వామి మీద వుండేది. స్థానిక భూస్వాముల, పెత్తందార్ల అణిచివేతలను ప్రత్యక్షంగా చూశాడు. వీటన్నింటి నేపథ్యంలో కా. సుధాకర్ విప్లవోద్యమం పట్ల ఆకర్షితుడై సింగరేణిలో వున్న మిత్రుల ద్వారా పార్టీ కాంటాక్టులోకి వచ్చి 2003 ఆగస్టులో పార్టీలోకి రిక్రూట్ అయినాడు.

రిక్రూట్ అయిన మరునాడే దళం మీద జరిగిన దాడిలో కా. సుధాకర్ కొత్త అయినప్పటికీ భయపడకుండా ఫైరింగ్ చేస్తూ, దళంతో రిట్రీట్ అయి నిబ్బరంగా వున్నాడు. దుర్మార్గులైన ఫారెస్టు అధికారులను, ఇన్ ఫార్మర్‌లను శిక్షించడంలో చురుకుగా వుండేవాడు.

2004 జనవరిలో కా. సుధాకర్ ఎస్.జడ్.సి మెంబర్‌కు గార్డుగా బాధ్యతలు చేపట్టాడు. 2004 జూన్‌లో పార్టీ సభ్యత్వం పొందాడు. 2004 సెప్టెంబర్‌లో జరిగిన మిలటరీ క్యాంపులో కా. సుధాకర్ కూడా మెంబర్‌గా పాల్గొని, బూబీట్రాప్ పరీక్ష చేస్తున్న క్రమంలో యాక్సిడెంటల్‌గా ఎలక్ట్రికల్ డెటోనేటర్ పేలిపోవడంతో చేతికి గాయాలైనా కా. సుధాకర్ ధైర్యంగా వున్నాడు. 2005 జూన్‌లో గార్డు బాధ్యతల నుండి రిలీవ్ అయి చెన్నూరు ఎల్.ఓ.ఎస్ కమాండర్‌గా, ఎ.సి సభ్యునిగా ప్రమోట్ అయ్యాడు.

ఆదర్శ భావాలుగల కా. సుధాకర్ దళ జీవితంలో సాధారణంగా వుంటూ పార్టీ రాజకీయాలు అభివృద్ధి చేసుకుంటూ, అందరితో కలగలిసి పోయి నాయకత్వానికి, క్యాడర్‌కు నమ్మకంగా వుంటూ గార్డు బాధ్యతలు నిర్వహిస్తూ తొందరలోనే అభివృద్ధి అయ్యాడు. నిత్య నిర్బంధం మధ్య నిబ్బరంగా వుంటూ కొంతమంది దిగజారిపోయినా, మరి కొంతమంది అమరులైనా చలించకుండా నమ్మిన ఆశయం కొరకు తుదిశ్వాస వరకు పోరాడుతూ అమరుడయ్యాడు.

కా॥ స్వామి శవయాత్రకు చుట్టు ప్రక్కల గ్రామాల నుండి 3,4వేల మంది ప్రజలు కదిలి వచ్చారు. స్వామి మృత దేహంపై ఎర్రని గుడ్డ కప్పి పలువురు నివాళులు అర్పించారు. కా॥ స్వామి శవయాత్రకు మండలంలోని ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు కూడా హాజరయ్యారు. కా. సుధాకర్ ఆశయం మనందరి ముందు వుంది. అతని ఆదర్శ భావాలు, పార్టీపట్ల అంకిత భావం స్ఫూర్తిగా తుదివరకు పోరాడుతామని శపథం చేద్దాం.

### కా. మల్లెబోయిన సత్తెన్న(భరత్)

కా. భరత్ ఆదిలాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలం కడంబ గ్రామంలోని నిరుపేద కుటుంబంలో ఇద్దరు తోడున జన్మించాడు. కాగజ్‌నగర్‌లో పది వరకు చదువుకున్నాడు. సారంలేని చదువులకు స్వస్తి చెప్పి పార్టీని కలుస్తూ అనుకోడ గ్రామంలో విద్యా వాలంటీర్‌గా పని చేశాడు.

పార్టీ అప్పజెప్పిన పనులను పట్టుదలతో చేసేవాడు. 2000సంవత్సరంలో కా. భరత్‌కు పార్టీ ప్రచార కార్యక్రమం అప్పజెప్పగా ఆ పనులు చేస్తున్న క్రమంలో కా. భరత్‌ను పోలీసులు అరెస్టు చేసి విపరీతంగా కొట్టి పార్టీ విషయాలు అడిగినా పెదవి విప్పలేదు. కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పుతూ వేధించారు. కా. సత్తెన్న పోలీసుల వేధింపులు భరించలేక విద్యావలంటీర్ ఉద్యోగాన్ని వదులుకొని కాగజ్‌నగర్ పోయి లారీ డ్రైవర్‌గా పని చేసి కుటుంబాన్ని పోషించాడు.

సత్తెన్న నిరంతరం పార్టీకి కలవాలని, సహకరించాలని అనుకునేవాడు. తల్లి బలవంత పెట్టి పెళ్ళి చేసినా, ఫుల్ టైమర్‌గా పని చేయాలనే తన అభిప్రాయాన్ని పార్టీకి చెప్పి, 2003 అక్టోబర్‌లో దళంలోకి రిక్రూట్ అయ్యాడు. తనూ మరొక సభ్యుడు అన్నం కోసం గ్రామంలోకి పోగా, టి.డి.పి సభ్యుడు కోట భీమయ్య నేతృత్వంలోని పోలీసులు తయారుచేసిన మైత్రీ సంఘం దళానికి అన్నం పెడతామని నమ్మించి తనతో వచ్చిన సభ్యుణ్ణి కొట్టి ఆయుధం గుంజుకొని పోలీసులకు అప్పగించారు. సతెన్న తప్పించుకుని దళాన్ని చేరాడు.

ఈ సంఘటన జరిగిన తర్వాత తనతో వచ్చిన దళ సభ్యుడు దళంకు చెప్పకుండానే వెళ్ళిపోయి పోలీసులకు అనుకూలంగా మారి హోంగార్డుగా పని చేస్తున్నా కా. భరత్ అధైర్య పడక సిర్పూర్ దళంలో సభ్యునిగా పని

చేశాడు. పోలీసులు వాళ్ళ గ్రామంలో క్యాంపువేసి సత్తెన్న కుటుంబాన్ని వెళ్ళగొట్టినా సత్తెన్న చలించలేదు. ప్రజలే కుటుంబాన్ని ఆదుకుంటారని పేద ప్రజల కోసం పోరు చేస్తానంటూ శత్రువుతో సవాల్ విసిరాడు. కా. భరత్ తన ఏరియాలోకి పోయాక బాష రాకున్నా ప్రజలల్లో చొచ్చుకుపోయి ఆదివాసీలలో కలిసిపోయేవాడు. ఏరియా ప్రజల సాదక బాధలను తెలుసుకునేవాడు. 2005 జనవరిలో పార్టీ సభ్యత్వం పొందాడు. సెప్టెంబర్‌లో ఏసి మెంబర్‌గా తీసుకోవడం జరిగింది. తను అందరితో కలిసి మెలిసి వుంటూ కమాండర్ చెప్పిన బాధ్యతలు నెరవేర్చేవాడు.

జోగాపూర్ ఫైరింగ్ సమయంలో ముగ్గురు టీంతో పనిమీద వెళ్ళి, శత్రువు మకాం మీద దాడి చేయడంతో తుపాకుల శబ్దాలు విని డెన్ను మీద దాడి జరుగుతున్నదని గ్రహించి తోటి కామ్రేడ్స్‌ను ఆర్వీకి తీసుకుపోయాడు. ఆవుడం చెరువు కట్టవద ఆంబుష్‌లో చిక్కుకుని శత్రువు జరిపిన కాల్పుల్లో కా॥ కొండన్న(ఎడ్ల పెంటన్న) అమరుడయ్యాడు.

## కా॥ కొండన్న (ఎడ్ల పెంటన్న)

సిర్పూర్ (టి) మండలం భూపాలపట్నం గ్రామం ఆదివాసీ నిరుపేద కుటుంబంలో జన్మించాడు. 10వ తరగతి చదువుకున్నాడు. తన తండ్రి చిన్నప్పుడే చనిపోయాడు. తన బావ పార్టీలోకి రావడంతో అక్కకు పిల్లలను పెంచడం కష్టమవుతుందని చదువు మానివేశాడు. తన బావ ఏలేటి ధర్మన్న(కొండన్న) పార్టీలోకి వచ్చి అమరుడు కావడంతో వర్గకసిని పెంచుకొని అమరుల ఆశయాన్ని కొనసాగించాలని బ్రతకలేని చదువులకు బందీ కావద్దని, ప్రజలే పోరు మార్గం అంటూ దళంలో చేరాడు.

అమరుల పాటలు ప్రజల దగ్గరికి తీసుకువెళ్ళి వినిపించాలని చాలా ఇష్టపడేవాడు. కా.కొండన్న అందరితో కలిసిమెలిసి వుంటూ, బరువులు మోయడంలో కూడా ముందుండేవాడు. జోగాపూర్ అడవుల్లో నలుగురు కామ్రేడ్స్ అమరులైనప్పటికీ అధైర్యపడకుండా ధైర్యంగా వుంటూ గ్రామాలకు పోయి ఎప్పటికప్పుడు సమాచారం తీసుకు రావడం, తిండి సామాను తీసుకురావడం చేసేవాడు. కా. కొండన్న, కా. సుధాకర్, కా. భరత్‌లు అమరులు కావడం సిర్పూరు, చెన్నూరు ప్రాంత ఉద్యమానికి ఎంతో నష్టం.

## కా॥ కోరం రమాదేవి (రజిత)

2006 జనవరిలో గోవిందరావుపేట మండలం, సోమలగడ్డ అటవీ ప్రాంతంలో బొంతగుట్ట దగ్గర బూటకపు ఎదురుకాల్పుల్లో కా॥ రజిత అమరురాలైంది.



కా॥ రజిత కరీంనగర్ జిల్లా ముక్కునూర్ గ్రామం నిరుపేద కుటుంబంలో జన్మించింది. రజిత ఇంటికి పెద్దకూతురు. 6వ తరగతి వరకు చదువుకొని, పేదరికం వల్ల పైచదువులు చదవలేక పోయింది. రజితకు బాల్యం నుండి పార్టీపైన విశ్వాసం, గౌరవం ఉండేది. చిన్నతనం నుండి పార్టీ గీతాలు ఆలపిస్తూ తనతోటి మహిళలకు పార్టీ రాజకీయాలు, పద్ధతులు చెపుతుండేది.

కా॥ రజిత 15వ ఏట సంఘనాయకుడైన గౌరన్నను పెండ్లి చేసుకొని ఇద్దరూ పార్టీలోకి రావాలని అనుకున్న సమయంలో గౌరన్న అనారోగ్యం వల్ల చనిపోవడంతో రజిత కూడా అనారోగ్యానికి గురై కష్టాలపాలు కావడంతో మధ్యలోనే ఆగిపోయింది.

కా॥ రజిత 2004 డిసెంబర్‌లో దళంలోకి రిక్రూటయి ఎల్.జి.ఎస్ దళ సభ్యురాలుగాను దళంలో టీచర్‌గా, డాక్టర్‌గాను పార్టీ ఇచ్చిన పనులు పట్టుదలతో చేయటంలో ముందు వరుసలోనే ఉండేది. తోటి కామ్రేడ్స్‌తో కలుపుగోలుగా ఉంటూ చిరునవ్వుతో అందరిని పలుకరిస్తూ ఉండేది. సహచర కామ్రేడ్స్‌తో పోటీపడి రాత్రీపగలు అనకుండా ఓపికా పట్టుదలతో దృఢవిశ్వాసంతో పనిచేస్తుండేది.

తనతో రిక్రూట్ అయిన వారు శత్రువు ముందు మోకరిల్లితే పదిమందీ పనిచేయాలి అని తపన పడేది. చదువురాని తోటి వారికి సహాయం, రానిపనిని పట్టుదలతో చేయడలాంటి నేర్పరితనం ఉండేది. కా॥ రజిత భౌతికంగా లేకపోయిన రజితలో వున్న ఓపికా, పట్టుదల, దృఢ విశ్వాసం, నేర్పరితనం రజిత నుండి నేర్చుకొని ఆ కామ్రేడ్ స్ఫూర్తిని ముందుకు తీసుకొని పోదాం .

## కా॥ సహదేవ్ (సంపత్)

వరంగల్ జిల్లా చిట్యాల మండలం, పోరాటాలకు, త్యాగాలకు మారుపేరైన దూల్‌పెల్లి గ్రామంలో విప్లవాభిమానం గల మధ్యతరగతి రైతు కుటుంబంలో లక్కాకుల రాజయ్య, లక్ష్మీల 12 మంది సంతానంలో 10వ వాడు సహదేవ్. చిన్న తనం నుండే గ్రామంలో జరుగుతున్న భూస్వామ్య వ్యతిరేక పోరాటాలకు ఉత్తేజితుడయ్యాడు. గిట్టుబాటు ధరలు లేక తన కుటుంబంతో పాటు రైతులు పడే బాధలు, రైతాంగ ఆత్మహత్యలు చూసి చిరు ప్రాయంలోనే చలించిపోయేవాడు.

చురుకైన బాలునిగా చిన్నతనం నుండే వ్యవసాయ పనులలో తండ్రికి చేదోడువాదోడుగా ఉండే సహదేవ్ స్కూల్లో కూడా తెలివైన విద్యార్థి. క్రమశిక్షణ కలిగి చదువులో ముందుంటూ తోటి విద్యార్థులకు సహాయపడుతూ విద్యార్థుల, ఉపాధ్యాయుల అభిమానం చూరగొన్నాడు. విద్యార్థి ఉద్యమాలలో చురుగ్గా పాల్గొనేవాడు. 10వ తరగతి చదువుతున్నప్పుడు 1996లో సహదేవ్ పెద్దక్క లక్కాకుల జ్యోతి పార్టీలోకి రావడంతో ప్రభావితుడై తను కూడా యాక్టివ్‌గా గ్రామంలో పని చేస్తూ దళానికి మంచి కొరియర్‌గా పని చేశాడు.

10వ తరగతిలో ఫస్ట్‌క్లాస్‌లో పాసైన కొద్దిరోజులకే 2000 మార్చిలో కొకొండ గుట్టల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో తన పెద్దన్న కూతురైన స్వప్న మరణించగా స్వప్న ఆశయాన్ని సాధించడానికి చిట్యాల ఎల్.జి.ఎస్ సభ్యునిగా దళంలో చేరాడు. ఆతర్వాత పట్టుబట్టి ప్లాటూన్‌కు మారి క్రమశిక్షణ, పట్టుదలతో తనకు అప్పజెప్పిన ఎంతటి పనైనా వెనుకాడకుండా చేసిన అలుపూ సొలుపులేని అజరామరయోధుడు కా॥ సంపత్. ప్లాటూన్ సభ్యునిగా వుంటూ చదువురాని గెరిల్లాలకు టీచర్‌గా, డాక్టర్‌గా, కొత్త సభ్యులకు మిలటరీ తర్ఫీదు ఇచ్చే ఇన్‌స్ట్రక్టర్‌గాను అనేక పనులు చేస్తూ, ప్రతి దానిని పట్టుబట్టి సాధించేవాడు.

తక్కువ కాలంలోనే పట్టుదల, సాధనతో అంచలంచలుగా ఎదిగి

ప్లాటున్ సెక్షన్‌లో డిప్యూటి కమాండర్‌గా నాయకత్వంలోకి వచ్చాడు. మైదానంలో ఉన్న నాయకత్వకొరత వల్ల మంథని ఎల్.జి.ఎస్ కమాండర్‌గా తీర్మానించిన పార్టీ ఆదేశాలను అందుకొని అక్కడి టెర్రయిన్, ప్రజలతో ఎలాంటి పరిచయం లేకున్నా బాధ్యతలు చేపట్టి 2004 చర్చల కాలంలో అమరుల స్థూపాల నిర్మాణానికి పూనుకొన్నాడు. ప్రజాసంఘ నిర్మాణాలు చేస్తూ బహిరంగ సభలు, సమావేశాలు విస్తృతంగా చేసి పార్టీ రాజకీయాలను ప్రజలలో ప్రచారం చేస్తూ మంథని ప్రజలకు మంచి నాయకుడుగా నిలిచాడు. ఆర్గనైజేషన్ విస్తరించాలనే జిల్లా కమిటి తీర్మానం మేరకు మళ్ళీ మంథని నుండి హుజురాబాద్ ఎల్.జి.ఎస్ కమాండర్‌గా బాధ్యతలు చేపట్టాడు. 3,4 నెలలకే ప్రభుత్వ వైఖరి మారి ఎన్‌కౌంటర్స్ మొదలయినాయి. మారిన రాజకీయ పరిస్థితి, శత్రువు పరిస్థితిని అధ్యయనం చేస్తూ, మన పార్టీకి వ్యతిరేకంగా మాజీలతో, లంపెన్‌లతో శత్రువు తయారు చేసిన మావోయిస్టు వ్యతిరేక కమిటీల దుష్ప్రచారాన్ని ఎండగట్టి నిర్వీర్యం చేయడంలో ప్రధాన పాత్ర పోషించాడు.



ప్రజలను పీడిస్తున్న భూస్వాములు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల మెడలు వంచాడు. వారికి గుండెల్లో గుబులు పుట్టించి, కొందర్ని లొంగి వచ్చేటట్టు చేశాడు. మాజీలకు హోంగార్డ్ ఉద్యోగాల ముసుగులో పార్టీని దెబ్బతీయడానికి శతృవు గ్రామాల్లో తయారు చేసిన ఇన్‌ఫార్మర్స్ టీంల బాధ్యుణ్ణి, మాణిక్యపూర్‌లో ఇన్‌ఫార్మర్ల క్యాంపు నాయకుణ్ణి, మహదేవ్‌పూర్ ఏరియాలో బొర్లగూడెంకు చెందిన సుదాటి రవీందర్‌రావులను శిక్షించటంలో ప్రధాన పాత్ర వహించి, ప్రజలను ఊపిరి పీల్చుకునేటట్టు చేశాడు. తుపాకుల ఎరతో శత్రువు చేసిన బూటకపు ఎన్‌కౌంటర్‌లో డి.సి.ఎం దమ్మల మల్లిఖార్జున్ (శ్రీను) అమరుడు కావటం, పరిమిత సంబంధాలు, పెరిగిన శత్రు నిర్బంధం వల్ల మళ్ళీ హుజురాబాద్ ఎల్.జి.ఎస్‌ను రిట్రీట్ చేయగా, పెద్దపెల్లి ఎల్.జి.ఎస్ కమాండర్‌గా కా. సంపత్ బాధ్యతలు చేపట్టాడు.

లెవీ కోసం కాంటాక్టుకు పంపిన కొరియర్ శత్రువుకు చిక్కి ఇచ్చిన సమాచారంతో 2006 జనవరిలో శత్రువు పకడ్బందీగా ఏరియా అంబుష్ ఏర్పాటు చేశాడు. మహదేవ్ పూర్ ఏరియా రాంపూర్ గ్రామం దగ్గర ఆంబుష్‌లో చిక్కుకున్న దళంపై శత్రువు జరిపిన రాపిడ్ ఫైరింగ్‌కు తూటాలతో అడ్డుకట్ట వేసి కా॥ సంపత్ దళాన్ని సురక్షితంగా బయట పడేశాడు. సంపత్ కురిపించిన తూటాలకు కానిస్టేబుల్ సూరిబాబు గాయపడి హాస్పటల్‌లో చనిపోయాడు.

ప్లాంక్‌లో వచ్చిన శత్రువును పసిగట్టక కాల్పుల్లో గాయపడిన సంపత్‌ను పట్టుకొని పోలీసులు కాళ్ళు, చేతులు విరిచి చిత్రహింసలు పెట్టినా పార్టీ రహస్యాలు బయటపెట్టకుండా, అమరుల ఆశయాలను ఎత్తిపడుతూ కర్తవ్య నిర్వహణలో తుదిశ్వాస విడిచి నేలకొరిగిన ప్రజావీరుడు కా॥ సంపత్.

అతడి నిరాడంబరత, క్రమశిక్షణ, పట్టుదల, కార్మికవర్గ దృక్పథం గెరిల్లాలకు సదా అనుసరణీయం.

## కా॥ సురేందర్ (సురేష్)

కా॥ సురేష్ తొర్రూరు మండలానికి చెందినవాడు. మధ్యతరగతి కుటుంబంలో జన్మించాడు. 10వ తరగతి వరకు చదువుకుని తన గ్రామం నుండి విప్లవోద్యమంలోకి పోయిన గోపన్న స్ఫూర్తితో కా॥ సురేష్ చదువు ఆపి గ్రామంలో టెంట్ హౌస్ పెట్టి నడుపుతూ యువతరాన్ని ఐక్యం చేసి అవినీతి, అన్యాయానికి, గూండాయిజానికి వ్యతిరేకంగా పోరాడాడు. కా॥ సురేష్ తను పార్టీలోకి పూర్తికాలం రావడానికి నాలుగు సంవత్సరాలు ప్రయత్నం చేశాడు. తూర్పుగోదావరిలో పనిచేస్తున్న గోపన్న (వినయ్‌తో) సత్సంబంధాలల్లో వుంటూ జిల్లా పార్టీకి కలువడానికి అనేక ప్రయత్నాలు చేశాడు. పార్టీ కాంటాక్టు సంపాదించడం కోసం తన మిత్రునితో అడవి ప్రాంతంలోకి వెళ్లి డాక్టర్‌గా పని చేసుకుంటూ కలుద్దామనే నిర్ణయానికి కూడా వచ్చి చివరకు 2004 మేలోవరంగల్ జిల్లా పార్టీ కాంటాక్టు దొరికిందే తడవుగా పార్టీ తనను రిక్రూట్ చేసుకోవాలని ప్రతిపాదన పెట్టాడు. అతని నిబద్ధత, పట్టుదల, గ్రామంలో అతని చరిత్రను ఆ ప్రాంతంలో వున్న సంబంధాల ద్వారా తెలుసుకొని జులైలో రిక్రూట్ చేసుకొని నర్సంపేట దళ సభ్యునిగా నియమించారు. కా॥ సురేష్ దళ జీవితంలో అడుగుపెట్టిన తర్వాత నడక, బరువులు మోయడం అలవాటులేక ఇబ్బంది పడినా లెక్క చేయకుండా వాటిని అధిగమించాడు. దళంలో చేరిన వెంటనే ఆ ప్రాంత ప్రజల జీవన పరిస్థితులను, ఈ ప్రాంతంలోని ఉద్యమ స్థితిని అర్థం చేసుకోవడానికి కృషి చేశాడు. పని పద్ధతులు, క్రమశిక్షణ, అలవర్చుకున్నాడు. కొద్ది కాలంలోనే జిల్లా క్యాడర్ల ఆదరాభిమానాలు చూరగొన్నాడు. నర్సంపేట ప్రాంతం తనకు కొత్తదే అయినా, పరిచయాలు లేకపోయినా చర్చల కాలంలో సభలకూ, రైతాంగ సమస్యలపై ప్రజలను కదిలించడానికి కృషి చేశాడు. ప్రజలతో విస్తృత సంబంధాలు ఏర్పరుచుకున్నాడు.



క్రమశిక్షణ, పట్టుదలతో పార్టీ సభ్యునిగా ప్రమోట్ అయ్యాడు. 2005 సెప్టెంబర్‌లో పాలకుర్తి ఏరియాకు పి.ఆర్ గా వెళ్లాడు. కొద్ది రోజుల్లోనే ఏరియాలో పరిచయాలు పెంచుకున్నాడు, ముఖ్యంగా యువకులను చేరదీసి సంబంధాలు విస్తృతం చేసుకొని సంఘాలను పెట్టడానికి కృషి చేశాడు. తన మిత్రుని ఇంట్లో షెల్టర్ తీసుకొని వుండగా సురేష్ కుటుంబ సభ్యులకు తెలిసి అక్కడికి వచ్చి ఇంటికి రమ్మని ఒత్తిడి

చేయగా రాలేనని, ప్రజల కోసం పని చేయడం అన్నింటికన్నా గొప్పదని చెప్పి పంపాడు.

కా॥ సురేష్ తన పట్టుదలకు మరింత పదును పెట్టుకుంటున్న సందర్భంలోనే కా॥ యాదన్న అమరుడైనాడు. తన గ్రామానికి చెందిన గోపన్న (ఎ.ఓ.బి రాష్ట్రకమిటి సభ్యుడు) లొంగిపోయినా నిబ్బరంగా వున్నాడు. కా॥ యాదన్న మార్గంలోనే ప్రయాణించాలి తప్ప శత్రువు ముందు మోకరిల్లడం విద్రోహమేనని గోపన్నను అసహ్యించుకున్నాడు. రాజకీయ పరిజ్ఞానం పెంచుకోవడం, చర్చించడం, కష్టపడి పని చేయడం ఎంతో ఇష్టం. ఆదర్శంగా వుండడానికి నిరంతరం కృషి చేశాడు. కా॥ సురేష్ చాలా తక్కువ కాలంలోనే నాయకత్వ స్థాయిలోకి ఎదిగివస్తున్నాడు. అతని శక్తి సమర్ధతలను గుర్తించి పార్టీ చిట్యాల దళానికి మార్చింది. కా॥ సురేష్ చిట్యాల ప్రాంతానికి ఎంతో ఉత్సాహంగా వెలుతున్న క్రమంలోనే 2005 జూలైలో ములుగు ఘనపూర్ మండలం మైలారం వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో అమరుడైనాడు. కా॥ సురేష్ త్యాగం, పట్టుదల, చొరవ, ఆదర్శం మనకెంతో స్ఫూర్తిదాయకం.

## కా॥ సురేందర్

కామ్రేడ్ సురేందర్ వరంగల్ జిల్లా పోరాటాల గడ్డలో పైడిపల్లి పోరుబిడ్డ. మధ్యతరగతి కుటుంబంలో పుట్టి పెరిగాడు. డిగ్రీ వరకు చదువుకున్నాడు. మొదట కా॥ సురేందర్ పిడిఎస్‌యులో చేరాడు. ఆ పార్టీ విధానాలు అసహ్యించుకొని, మావోయిస్టు పార్టీ కాంటాక్టులోకి వచ్చి విద్యార్థి రంగంలో పని చేశాడు. 2001లో పూర్తికాలం కార్యకర్తగా రిక్రూటై నర్సంపేట ప్రాంతంలో పని చేశాడు. శత్రువు దాడిని అర్థం చేసుకోలేక, దళ జీవితంలో వున్న కష్టాలను తట్టుకోలేక ఇంటికి వెళ్ళి, 2003లో మళ్లీ పార్టీ కాంటాక్టులోకి వచ్చి పార్టీ కార్యక్రమాలల్లో చురుకుగా పాల్గొన్నాడు. 2004 చర్చల కాలంలో పార్టీ కార్యక్రమాలల్లో చురుకుగా పాల్గొన్నాడు. సభలకు ప్రజలను కదిలించడం, ఖిలా వరంగల్‌లో అమరులు కా॥ రాజు, అల్లం మనోహర్, పైడిపల్లిలో చిన్నాలు, కృష్ణస్వామి స్థూపాలను నిర్మించడంలో ముందు వరుసలో వున్నాడు. కా॥ సురేందర్ 2005 డిసెంబర్‌లో తిరిగి పూర్తికాలం కార్యకర్తగా రిక్రూట్ అయినాడు.



కా॥ సురేందర్ పూర్తికాలం కార్యకర్తగా వచ్చిన తర్వాత పర్కాల, నర్సంపేట వరంగల్ సబర్బన్ ప్రాంతంలో వున్న విద్యార్థులను ఆర్గనైజ్ చేసే బాధ్యతను పార్టీ అప్పగించింది. పెరిగిన నిర్బంధంలో శత్రువు దాడిని దృష్టిలో పెట్టుకొని మైదాన ప్రాంతాల దళాలను, ఎఫ్.టిలను, పి.ఆర్‌లను రిట్రీట్ చేయడంతో సురేందర్ కూడా మార్చిలో అటవి ప్రాంతానికి వచ్చాడు. విషయాలను అర్థం చేసుకోవడం, చొరవతో కృషి చేయడం, పాటలు రాయడం చేసేవాడు.

కా॥ సురేందర్ చిట్యాల దళంలో వెళ్లి ఆ ప్రాంతం నుండి పనిమీద బయటకు పంపించే క్రమంలోనే 2005 జూలైలో ములుగు ఘనపూర్ మండలం మైలారం గ్రామం వద్ద జరిగిన దాడిలో అమరుడైనాడు. కా॥ సురేందర్ అనతికాలంలోనే తనశక్తి యుక్తులను పెంపొందించుకొంటూ, క్రమశిక్షణను అలవర్చుకుంటున్న తరుణంలోనే నేలకొరిగాడు. ఆ కామ్రేడ్స్ యొక్క ఉత్సాహం, కష్టించి పనిచేసేతీరూ, చొరవా, పట్టుదల మనకు ఆదర్శం కావాలి. అమరులు కన్నకలల్ని నిజం చేద్దాం. వారులేని లోటును పూడ్చడానికి కృషి చేద్దాం.

## కా॥ ఇస్రుబాయి అమర్ హై!

దాదాపు 25 సంవత్సరాల క్రితం 1981 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో జరిగిన పోలీసు కాల్పుల్లో ఎడమ కాలు కోల్పోయిన వెట్టి ఇస్రుబాయి(65సంవత్సరాలు) కొంత కాలంగా అనారోగ్యంతో వుండి 2005 డిసెంబర్ నెలలో మృతి చెందింది. కా. ఇస్రుబాయి ఇంద్రవెల్లి మండలంలోని పిట్టబొంగరం గ్రామానికి చెందినది. తమ సమస్యల పరిష్కారం కోసం ఇంద్రవెల్లిలో ఆదివాసులు జరుపుకుంటున్న సభకు వెళ్ళినప్పుడు సభను భగ్నం చేయడానికి పోలీసులు కాల్పులు జరుపుతూ తమ సహచరుల్ని పొట్టన పెట్టుకుంటుంటే చూసి సహించలేక పోయింది. హంతక పోలీసుల్లో ఒకణ్ణి హతమార్చిన ధైర్యశాలి కా॥ ఇస్రుబాయి. ఇంద్రవెల్లి సంఘటనలో 13మంది ఆదివాసీలు మరణించగా ఎంతో మంది క్షతగాత్రులయ్యారు. వారిలో ఇస్రుబాయి ఒకరు. ఆమె మృతికి ఆదివాసీ సంఘాల నాయకులు సంతాపం తెలిపారు. సి.పి.ఐ (మావోయిస్టు) పార్టీ ఆదిలాబాద్ జిల్లా కమిటి వెట్టి ఇస్రుబాయి మృతికి సంతాపం తెలిపింది.



# ఆంధ్రప్రదేశ్

## కా॥ మచ్చేందర్ (గిరి)

నల్గొండ జిల్లాలో నాటి తెలంగాణా సాయుధ పోరాటంలో రజాకార్లను హడలెత్తించిన రాజపేట మండలం బేగంపేట గ్రామంలో నిరుపేద దళిత కుటుంబంలో పుట్టాడు. బతుకుదెరువుకు కుటుంబం భూస్వాముల దగ్గర వెట్టిచాకిరీ చేస్తోంటే, మచ్చేందర్ కూడా చిన్నతనం నుండే వెట్టిచాకిరి చేశాడు. నిరక్షరాస్యుడైన మచ్చేందర్‌ను భూస్వాములు తమకు అనుకూలంగా మార్చుకోవడానికి చేసిన ప్రయత్నాలను తెలివిగా తిప్పికొడుతూ, భూస్వాముల ఆధిపత్యాన్ని కూలదోయాలనే కసితో బాలల సంఘంలో పని చేశాడు. చిన్న తనంలోనే దళానికి అనేక రకాలుగా సహాయపడుతూ బాలల సంఘ నాయకుడిగా ఎదిగి, యుక్త వయసులో రైతుకూలి సంఘంలో చేరాడు. రైతుకూలి సంఘంలో వుండే అన్యవర్గ ధోరణులను ఎప్పటికప్పుడు దళం దృష్టికి తీసుకువచ్చి సంఘాన్ని సరిదిద్దడానికి కృషి చేసేవాడు. స్థానిక సమస్యలపై నిరంతరం పరిష్కారం కోసం ఆలోచించేవాడు. గ్రామంలో జరిగిన కూలిరేట్ల పోరాటాలు, జీతాల పోరాటాలు, భూపోరాటాలల్లో చురుగ్గా పాల్గొనేవాడు. భూస్వామి కరుణాకర్

రెడ్డి భూమిని సంఘ నాయకత్వంలో ప్రజలకు పంచిన పోరాటంలో ముందు నిలిచాడు. అదే గ్రామం నుండి అమరులైన కా॥ జిట్ట సుదర్శన్ రెడ్డి, కా॥ రామదాసు, కా॥ శేషు(యాదగిరి)ల స్ఫూర్తితో 2001 చివరిలో పూర్తి కాలం కార్యకర్తగా గిరాయిపల్లి దళంలో చేరాడు. పోలీసు కౌన్సిలింగ్‌లు పెట్టి లొంగిపోవాలని తల్లిదండ్రులతో పత్రికల ద్వారా ప్రకటనలు ఇప్పించినా, కుటుంబంపై పోలీసులు వేధింపులు సాగించినా చలించలేదు. పార్టీని విడిచి రాలేనని, అధైర్యపడవద్దని, ప్రజలందరిలో భాగంగానే మీ బాగోగులు కూడా పార్టీ చూసుకుంటుందని తల్లిదండ్రులకు ధైర్యంచెబుతూ ఉత్తరం రాశాడు. మెదక్ జిల్లాలో నిత్యనిర్బంధ పరిస్థితుల్లో కూడా దృఢంగా నిలబడి దళసభ్యునిగా పని చేశాడు. తక్కువ కాలంలోనే ప్రజల్లో చెరగని ముద్ర వేశాడు. మెదక్ జిల్లాలో దళాలు తిరగలేని పరిస్థితిలో నల్లమలకు రిట్రీటై ఒకటవ ప్లాటూన్ సభ్యునిగా తనవంతు బాధ్యతలు నెరవేర్చాడు. పార్టీలోకి వచ్చి చదువు నేర్చుకున్నాడు. ప్లాటూన్ సభ్యునిగా పార్టీ నిర్ణయించిన ప్రతిఘటనా దాడుల్లో చురుగ్గా పాల్గొన్నాడు. దేశవ్యాప్తంగా శత్రువును బెంబేలెత్తించి, వందలాది తుపాకులు తెచ్చిన కోరాపుట్ దాడిలో కా॥ మచ్చేందర్ తనవంతు బాధ్యతను చక్కగా నిర్వహించాడు. ఒకటిన్నర సంవత్సరాలు రాష్ట్ర కమిటి సభ్యుని గార్డు బాధ్యతలు నిర్వర్తించి రిలీవ్ అయిన తర్వాత పార్టీ నిర్ణయం మేరకు ప్రతిఘటన దాడికి వెళ్ళి, ఒక ఇంటిలో వుండగా ద్రోహియిచ్చిన సమాచారంతో శత్రువుకి చిక్కి 2005 సం॥లో అమరుడయ్యాడు. కా॥ మచ్చేందర్ (గిరి) నిరాడంబరత, పట్టుదల, పోరాటతత్వం మనకు ఆదర్శం.

## కా॥ నర్సింహులు (మహేందర్)

మెదక్ జిల్లా కొండపాక మండలం దుద్దెడ గ్రామంలోని మధ్యతరగతి కుటుంబంలో పుట్టాడు. నాల్గవ తరగతి వరకు చదువుకుని, ఐస్‌క్రీం ఫ్యాక్టరీలో పనిచేస్తూ పార్టీకి పరిచయమై, బాలల సంఘంలో చేరి పార్టీ అప్పగించిన పనులు చురుగ్గా చేసేవాడు. ఆతర్వాత యువజన సంఘంలో పనిచేస్తూ గ్రామంలోని ప్రజావ్యతిరేకులైన బిజెపి నాయకులను సంఘనాయకత్వంలో ప్రజల సమక్షంలో దేహశుద్ధిచేసి, బుద్ధి చెప్పాడు.

2001లో పూర్తికాల కార్యకర్తగా దళంలో చేరి గిరాయిపల్లి దళసభ్యునిగా పని చేశాడు. ఇంటిదగ్గర చదువుకున్న కొద్దిపాటి చదువును దళంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి చేసుకున్నాడు. మెదక్ జిల్లా దళాల రిట్రీట్‌లో భాగంగా నల్లమల చేరి కేంద్రకమిటి సభ్యుని తాత్కాలిక గార్డుగా బాధ్యతలు నిర్వర్తించాడు. అవసరాల రీత్యా నల్లగొండలో కొంతకాలం పని చేశాడు. మెదక్ జిల్లాలో మళ్ళీ ఉద్యమాభివృద్ధి చేయాలనే పార్టీ నిర్ణయంమేరకు ఎల్ఓఎస్ కమాండర్‌గా బాధ్యతలు చేపట్టి, పనిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు తుపాకి పేలి కా॥ నర్సింహులు(మహేందర్) అమరుడయ్యాడు. పనిపట్ల ఆ కామ్రేడ్ నిబద్ధత, నిరాడంబరత మనకు ఆదర్శవంతమైనవి. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ విప్లవోద్యమాన్ని మరింత ముందుకు తీసుకుపోవడమే అమరులకు మనమర్పించే నిజమైన నివాళి.

## కా॥ మమత (అలీసా)

స్వగ్రామం ఇల్లెందు మండలం పోసారం గ్రామం. నిరుపేద కుటుంబంలో తల్లిదండ్రులకు రెండవ బిడ్డ. బతుకుదెరువు కోసం కుటుంబం ఇల్లెందులో ఇటుక బట్టీలు పెట్టి ఆర్థికంగా చితికిపోయిన పరిస్థితిలో మమత కుటుంబంతోపాటు స్వగ్రామానికి తిరిగి వచ్చి, తన అన్నతోపాటు తనుకూడ ధనిక రైతుల ఇండ్లల్లో పాలేరుగా మారిపోయింది. ఆ గ్రామంలో కొనసాగుతున్న న్యూడెమోక్రసీ ఆధిపత్యాన్ని అసహ్యించుకుంటూనే తలవంచుకుని మౌనంగా వుండేవాళ్ళు.

2004 జూలై చర్చల కాలంలో ఇల్లెందు ప్రాంతంలో మావోయిస్టు పార్టీ నాయకత్వంలో న్యూడెమోక్రసీ పార్టీ పునాదుల్ని కదిల్చివేస్తూ, దానికి



వ్యతిరేకంగా లేచిన ప్రజా పోరాట ప్రభావంతో పోసారం మేల్కొంది. న్యూడెమోక్రసీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడటానికి ప్రజలు సిద్ధమైనారు. ఆ పోరాటానికి మమత అన్న నాయకత్వం వహించాడు. అందులో మమత కూడా భాగస్వామి అయింది. న్యూడెమోక్రసీ వాళ్లను నిలదీసి, వారి అవినీతి, అరాచకాలను ఎండగడుతూ మమత పోరుబాటలో అడుగుపెట్టింది. రివిజనిస్టు గూండాలనూ, వారి విధానాలనూ ఎదుర్కోవడానికి తన అన్న ప్రోత్సాహంతో సాహసంగా ముందు నిలిచింది. ఆ తర్వాత అన్నా, చెల్లెలిద్దరూ దళంలోకి రావడానికి సిద్ధపడ్డారు. సెప్టెంబర్‌లో ఇద్దరూ ఇల్లెందు దళ సభ్యులయ్యారు.

కా॥ మమత దళంలోకి వచ్చినప్పటి నుండి రాజకీయాలు, మిలటరీ తర్ఫీదు నేర్చుకోవడంలో శ్రద్ధ పెట్టింది. దళంలోకి వచ్చిన కొద్ది రోజులకే చర్చల వాతావరణం ముగిసి శత్రు దాడులు పెరిగినా కా॥ మమత నిబ్బరంగా ముందుకు సాగింది. న్యూడెమోక్రసీ విధానాల గురించి చెప్తుతూ గలగల మాటలతో, నవ్వుతూ అందరినీ ఉత్సాహపరిచేది. తనకు తెలిసిన విషయాలు ప్రజలకు చెబుతూ అందరితో కలుపుగోలుగా వుండేది.

2005 మార్చిలో ప్రొటెక్షన్ దళంలోకి మారింది. ఒకసారి అనారోగ్యంతో హాస్పిటల్‌కు వెళ్ళి, దళాన్ని కలుసుకోవడానికి స్వంత వూరుకురాగా, మంచిగా వున్నట్లే నటిస్తూ తనను పోలీసులకు పట్టించాలనే న్యూడెమోక్రసీ ద్రోహుల కుట్రను పసిగట్టి, వాళ్ళను నమ్మించి రాత్రికిరాత్రి ఊళ్ళో నుంచి బయటపడి సురక్షితంగా వేరే గ్రామానికి చేరుకుంది. అన్నా, చెల్లెలిద్దరూ పార్టీలోకి పోవడంతో అటు న్యూడెమోక్రసీ వాళ్ళు, ఇటు

*(తరువాయి 47వ పేజీలో.....)*

# ప్రజా పోరాటాలు

## భారీ ప్రాజెక్టు - పోలవరం నిర్వాసితుల ఆందోళన

పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆదివాసీ ప్రజలు, వివిధ ఆదివాసీ సంఘాలు 9మండలాలలో ఎక్కడికక్కడ ఆందోళనా కార్యక్రమాలు కొనసాగిస్తున్నాయి. వివిధ ఆదివాసీ సంఘాలు కలిసి 18/12/2005నాడు "పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరు సాగిద్దాం! ఆదివాసీ ప్రాంతాలను, సంస్కృతిని కాపాడుకుందాం!'' అని ఖమ్మం జిల్లా భద్రాచలంలో సదస్సు నిర్వహించటం జరిగింది. ఈ సదస్సుకు దాదాపు 300మంది ప్రజలు హాజరయ్యారు. ఈ సదస్సులో తుడుందెబ్బ అధ్యక్షుడు వట్టం నారాయణ, ఆదివాసీ ఐక్యవేదిక కన్వీనర్ కుంజం పండు దొర, ప్రముఖ న్యాయ వాది బొజ్జా తారకం, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ ఎ.విద్యాసాగర్ రావు, మానవ హక్కుల వేదిక ఎమ్. కొదండరామ్, న్యాయవాది పి. త్రినాధరావు, ప్రజా భూకమీషన్ కన్వీనర్ చిక్కుడు ప్రభాకర్, కొండ దొరల సంఘం కార్యదర్శి ఇళ్ళ రాంరెడ్డి పాల్గొని ప్రసంగించారు. పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా అన్ని ఆదివాసీ సంఘాలు, కలిసి వచ్చే ఇతర పార్టీలను కలుపుకొని ఐక్యంగా మిలిటెంట్‌గా ఉద్యమించాలని సదస్సు పిలుపునిచ్చింది.

పోలవరం ప్రాజెక్టుతో ముంపుకు గురవుతున్న ప్రజలను సమీకరించడానికి జనవరి 20 నుండి 28/2005వరకు ఆదివాసీ సంఘాల నాయకులు పాదయాత్రలు నిర్వహించారు. చివరిగా జనవరి 28 నాడు పోలవరంలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో దాదాపు 3000మంది ఆదివాసీ ప్రజలు పాల్గొన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులను ఎక్కడికక్కడ మిలిటెంట్‌గా అడ్డుకోవాలని ఈ సభలో ఆదివాసీ నాయకులు, ఇతర నాయకులు ఆదివాసీ ప్రజలకు పిలుపునిచ్చారు.

పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆదివాసీ సంఘాలు, టి.ఆర్.ఎస్ కలిసి భద్రాచలంలో (ఫిబ్రవరి 20) 'పోలవరం గర్జన' పేరుతో బహిరంగ సభ నిర్వహించాయి. ఈ సభకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి దాదాపు 30వేల మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ బహిరంగ సభలో టి.ఆర్.ఎస్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు, తుడుందెబ్బ అధ్యక్షుడు వట్టం నారాయణ, ఆదివాసీ ఐక్యవేదిక నాయకులు కుంజం పండుదొర, నంగారభేరి నాయకుడు శేషానాయక్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా కలిసి వచ్చే సంఘాలను, పార్టీలను కలుపుకొని ఐక్య ఉద్యమం కొనసాగించాలని సభలో వక్తలు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే ఈ మధ్యకాలంలో 30 సంఘాలతో కలిసి 'పోలవరం ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటి' ఏర్పడింది. దీని నాయకత్వం క్రింద పోరాట కార్యక్రమం నిర్వహించటం జరిగింది.

19-3-2006 నాడు మంచిర్యాల పట్టణంలో (ఆదిలాబాద్) "తెలంగాణ-జలవనరులు'' అనే అంశం మీద ఆదివాసీ సంఘాలు సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో దాదాపు 1000 మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ సదస్సులు ఆదివాసీ నాయకులు సిడాం శంభు, కుంజం పండుదొర, జువ్వాడి లక్ష్మీనారాయణ, బొజ్జా తారకం, చిక్కుడు ప్రభాకర్, చీఫ్ ఇంజనీర్ విద్యాసాగర్‌రావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ జల వనరులను రక్షించుకోవాలని, పోలవరం ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఉద్యమించాలని, తెలంగాణ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలని వక్తలు ఈ సభలో పిలుపునిచ్చారు.

పోలవరం ప్రాజెక్టు పునాది-ఆదివాసులకు జల సమాధి!

ప్రభుత్వం చేస్తున్నది జలయజ్ఞం కాదు- ఆదివాసీ జల సమాధి!

## ఉట్నూర్‌లోని కొమురం భీం కాంప్లెక్స్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని 2005 ఆగస్టు 9న ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక కొమురం భీం కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి 16 రాష్ట్రాలకు చెందిన ఆదివాసీ ప్రతినిధులతో పాటు ఆదివాసులు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన భారీ సంఖ్యలో ఆదివాసీలు తరలి వచ్చారు. మొదటగా కొమురం భీం విగ్రహానికి పూల మాలలు వేసి ఆదివాసీ ప్రతినిధులు శ్రద్ధాంజలి ఘటించారు. ఆదివాసుల పతాకాలను ఆవిష్కరించారు. ఆదివాసులు సాంప్రదాయ నృత్యాలు చేశారు. బాజా భజంత్రీలతో, సన్నాయి వాయిద్యాలతో కొమురం భీం కాంప్లెక్స్ మారుమోగింది.

"జల్-జంగల్-జమీన్'' ఆదివాసుల సొత్తని ఆదివాసులే వాటికి యజమానులని జాతీయ ఎస్‌టి కమీషన్ చైర్మన్ కుంవర్‌సింగ్ అన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో నీరు, భూమి, అడవులు ఆదివాసులకు దక్కకుండా కుటిల ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో నీరు, భూమి, అడవులపై హక్కులను ఆదివాసులకు రాజ్యాంగమే ప్రసాదించిందని, అటవీ భూములపై ఆదివాసులకు హక్కులు కల్పిస్తూ రూపొందించిన ముసాయిదా బిల్లును చట్టం తీసుకు రావడానికి పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. అటవీ ఆధారిత షెడ్యూల్ ట్రైబ్ బిల్లు 2005ను కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టకపోతే భూమిపై హక్కులు రాకుండా పోతాయని దానికోసం పోరాటాలు చేయాల్సిన అవసరం వుందని ఆదివాసీ సంఘ నాయకులు అందరూ ముక్త కంఠంతో మాట్లాడారు. నోటిఫైడ్ గ్రామాలను ఎంపిక చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఇప్పటికీ జిల్లాలో 2000 ఆదివాసీ గ్రామాలు నోటిఫైడ్ కాకుండా మిగిలిపోయాయని, ఆదివాసులు సాగుచేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని అప్పుడే ఆదివాసులు వ్యవసాయ రంగంలో నిలదొక్కుకుంటారని జిల్లా ఆదివాసీ ఐక్య వేదిక కన్వీనర్ సిడాం శంభు అన్నాడు. స్థానికంగా పనిచేసే డాక్టర్ తోడసం చందు మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాలలో అభివృద్ధి జరగడం లేదని అన్నారు. ఐటిడిఏ ఖర్చు పెడుతున్న నిధులలో అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు.

## జోడెన్‌ఘాట్‌లో కొమురం భీం వర్ధంతి

కొమురం భీం అసువులు బాసి 65 సంవత్సరాలు కావస్తున్నా ఆదివాసుల పరిస్థితిలో, స్థితిగతుల్లో మార్పు రాలేదని ఆదివాసీ హక్కుల సాధన కోసం కొమురం భీం పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఉద్యమంగా చేపట్టాలని ఆదివాసులు కొమురం భీం స్థూపం వద్ద 17 అక్టోబర్ 2005నాడు సామూహికంగా శపథం చేశారు. ఈ ఉద్యమం జోడెన్‌ఘాట్ నుంచే శ్రీకారం చుడుతున్నట్టు గోండ్వాన్ పంచాయితీ రాయి సెంటర్ అధ్యక్షుడు సిడాం శంభు, కొమురం భీం మనుమడు సోనేరావులు ప్రకటించారు. ఈ సందర్భంగా భీం ఆశయ సాధనకు కృషి చేస్తామని ప్రతి ప్రజా దర్బార్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రకటనలు చేయడం తప్ప హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని అన్నారు. ఆదివాసుల అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు ప్రకటిస్తున్న ప్రభుత్వం ఆదివాసుల ఆరాధ్య దైవమైన కొమురం భీం సొంత గ్రామమైన జోడెన్‌ఘాట్‌కు రోడ్డు సౌకర్యం కల్పించకపోవడం చూస్తే ఆదివాసుల అభివృద్ధి పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతుందని మాట్లాడారు. నిరంతరం పోరాటాల ద్వారానే ఆదివాసుల సమస్యలు పరిష్కారమవుతాయని దీనికి ఆదివాసులంతా సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చారు. జోడెన్‌ఘాట్ సభలో కొమురం భీం వర్ధంతి సందర్భంగా "అటవీ హక్కుల కోసం పోరాటం" అనే బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు.

## అటవీ భూములపై హక్కు కొరకు ఛలో కలెక్టరేట్

ఆదివాసులు సాగు చేస్తున్న అటవీ భూములపై హక్కుకై 23/11/2005న ఆదిలాబాద్‌లో ఛలో కలెక్టరేట్ కార్యక్రమం తీసుకున్నారు. ఆదివాసీ సంఘాలన్ని కలిసి కార్యక్రమం రూపొందించాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి దాదాపు 5000మంది ప్రజలు కలెక్టరేట్‌కు వచ్చి విజ్ఞాపన పత్రం సమర్పించారు. ఆ తర్వాత ఊరేగింపు, బహిరంగ సభ నిర్వహించారు. ఆదివాసుల అటవీ హక్కు బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆదివాసులు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని, పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టి ఆమోదించిన దానిని కటాఫ్(ప్రామాణిక) తేదీగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు.

డిసెంబర్ నెలలో ఇంద్రవెల్లి, ఉట్నూరు, జైనూర్ మండల కేంద్రాలలో కూడా పంటలకు గిట్టుబాటు ధర చెల్లించాలని, సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని ఎమ్.ఆర్వో ఆఫీసు ముందు ధర్నా కొనసాగించారు.

## పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు
## టీచర్ గంగాభవాని హత్యపై గళం విప్పిన ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆదిలాబాద్ జిల్లా కోటపెల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామంలో 21/12/2005 నాడు టీచర్ గంగా భవానీని స్కూల్‌లోనే పిల్లలందరు చూస్తుండగానే ఉన్మాది సతీష్ కత్తితో పొడిచి హత్య చేసి అక్కడి నుండి పరారయ్యాడు. ఈ హత్య వార్త తెలిసిన లక్ష్మీపూర్, వెలమపల్లి, బబ్బర్ చెలక గ్రామ ప్రజలు కలిసి పారిపోతున్న ఉన్మాది సతీష్‌ను దొరక బట్టుకొని గ్రామ ప్రజలు కొట్టి చంపారు. ఈ సంఘటన జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. గ్రామ ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి గంగా భవాని శవం మీద ఎర్రగుడ్డ కప్పి ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంతో 16వ నెంబర్ హైవేపై ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి.

కోటపెల్లి, వేమనపల్లి, చెన్నూరు, జైపూర్ మండలాలకు చెందిన ఉపాధ్యాయులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు, పాఠశాల విద్యార్థులు కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. గంగా భవానిని హత్య చేసిన సతీష్‌ను గ్రామస్థులు కొట్టి చంపడంలో తప్పు లేదన్నారు. ఈ సందర్భంగా గంగా భవాని అమర్ హై! పోలీసుల మీద చర్య తీసుకోవాలని, మా రక్షకులు గ్రామస్థులేనని టీచర్లు నినాదాలు చేశారు. అనంతరం పాఠశాల ముందు సంతాపసభ నిర్వహించారు. నిందితుణ్ణి హతమార్చి గంగా భవానికి శాంతి కల్పించిన గ్రామస్థుల రుణం తీరనిదన్నారు. ప్రభుత్వం మృతురాలి కుటుంబానికి 10లక్షలరూపాయలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి, ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. బాధ్యులైన సి.సి.సి, కోటపెల్లి ఎస్.ఐలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం భవాని ఆత్మశాంతి కొరకు 2 నిమిషాలు మౌనం పాటించారు.

ప్రజలలో, ఉపాధ్యాయులలో, విద్యార్థులలో వచ్చిన నిరసన మూలంగా సిసిసి, కోటపెల్లి ఎస్.ఐలను ప్రభుత్వం వెంటనే సస్పెండ్ చేసింది. ఉన్మాది సతీష్‌ను అరెస్టు చేసి గంగా భవాని హత్యను ఆపలేక పోయిన పోలీసులు ఈ సంఘటన తరువాత ఉన్మాది సతీష్‌ను చంపినందుకు 20 మంది గ్రామస్తుల మీద కేసు బుక్ చేసి పోలీసు నైజాన్ని చాటుకున్నారు. ఇలాంటి ఉన్మాదులను వెంటనే చంపడాన్ని జిల్లా ప్రజలందరు స్వాగతించారు. గ్రామీణ ప్రాంతాలలో పని చేస్తున్న మహిళా ఉపాధ్యాయులకు భద్రతను దృష్టిలో ఉంచుకొని ఆయా పాఠశాలల్లో సెక్యూరిటీని ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి.

## ఆంధ్రప్రదేశ్‌లో 'రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం' ప్రోత్సాహంతో కొనసాగిస్తున్న 'కోబ్రాస్ దాడుల'ను తిప్పి కొట్టండి

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రగతి శీల సంస్థల నాయకులపై కార్యకర్తలపై అగస్టు 2005 నుండి రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం పోలీసుల ప్రోత్సాహంతోటి కొన్ని హంతక ముఠాలు ఏర్పాటు చేసి హత్యాకాండను కొనసాగిస్తున్నది. 'నర్సాకోబ్రాస్, నల్లమల్ల కోబ్రాస్, కాకతీయ కోబ్రాస్, రాయలసీమ టైగర్స్, కోల్‌బెల్ట్ లిబరేషన్ ఆర్మీ' పేర్లతో రాష్ట్ర వ్యాపితంగా వివిధ ప్రాంతాలలో రహస్యంగా ఈ ముఠాలను రాజ్యం సృష్టించింది. భయపెట్టడం కోసం హత్యలు చేయడం, ప్రజా సంఘాల కార్యకర్తలను చంపుతామని ప్రకటించడం, ఫోన్లుచేసి బెదిరించడం, ఇండ్లమీద దాడులు చేసి ఆస్తులను కాలబెట్టడం, వంటి భయోత్పాత పద్ధతులను ఈ ముఠాలు కొనసాగిస్తున్నాయి.

ప్రజా ఉద్యమాలపై చట్టబద్ధ నిషేధాలు, చట్ట వ్యతిరేక హంతక ముఠాల దాడులను రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం కొనసాగిస్తున్నది. ప్రత్యేక తెలంగాణ అస్థిత్వ ఆకాంక్షలను దెబ్బతీయడంలో భాగంగా తెలంగాణ ఉద్యమనేత కనాకచారిని ఆగస్టు 24 న హత్య చేశారు. ఈ హంతక

దాడులకు నిరసనగా సెప్టెంబర్ 26నాడు హైద్రాబాద్‌లో నిరసన సభ జరిగింది. ఈ సభకు రెండు రోజుల ముందు నుండి ఈ నిరసన సభను జరగనివ్వమని, మీటింగ్ హాలుపై బాంబులు వేస్తామని, సభకు వచ్చిన వాళ్ళను నరికేస్తామని పత్రికా ప్రకటనలు ఇచ్చినా, ఫోన్లు చేసినా ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ ఇంకా వివిధ జిల్లాల నుండి దాదాపు 1000 మంది ప్రజలు పాల్గొని పోలీసు, కోబ్రాల హత్యాకాండను నిరసించారు. ఈ సభలో ప్రముఖ పాత్రికేయుడు గౌతమ్ నవలక్కా, డాక్టర్ బాలగోపాల్, బొజ్జా తారకం, ఆకుల భూమయ్య, సంధ్య, ఆర్. క్రిష్టయ్య, ప్రొఫేసర్ శేషయ్య, గద్దర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

ఆంధ్రప్రదేశ్‌లో కొనసాగుతున్న కోబ్రాస్ దాడుల గురించి అధ్యయనం చేయడానికి 'అఖిల భారత నిజ నిర్ధారణ బృందం' 2005 సెప్టెంబర్‌లో రాష్ట్రంలో పర్యటించింది. వివిధ జిల్లాలలో కొనసాగిన 'కోబ్రాస్' దాడుల వాస్తవ విషయం సేకరించి గవర్నర్, ముఖ్యమంత్రిని కలిసి పత్రికా విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి సేకరించిన విషయాలను ప్రకటించింది. నిజ నిర్ధారణ బృందం ప్రకాశం జిల్లాకు పోయినపుడు సుమారు 40 మంది కారును అటకాయించి అడ్డుకున్నారు. వాస్తవ విషయాలు సేకరించకుండా పోలీసులు రకరకాల పద్ధతులలో ఆటంకాలు సృష్టించారు.

ఆంధ్రప్రదేశ్ విప్లవ ప్రజానీకానికి, ప్రజాస్వామిక వాదులకు, మేధావులకు, కవులకు, కళాకారులకు రాజ్యప్రేరేపిత హింస, నిషేధాలు, నిర్బంధాలు కొత్తేమి కాదు. అందుకని మరింత సంఘటితంగా రాష్ట్రంలో వున్న ప్రజా సంఘాలు ఐక్యమై కోబ్రాస్ దాడులను తిప్పి కొట్టవలసిన అవసరం వుంది.

# పార్టీ నాయకత్వంలో పోరాట-ప్రచార కార్యక్రమం

## ఉత్తర తెలంగాణ

### ప్రచార క్యాంపెయిన్

సి.పి.ఐ(మావోయిస్టు) పార్టీ ఆవిర్భావ మొదటి వార్షికోత్సవం, పి.ఎల్.జి.ఎ వార్షికోత్సవం, పార్టీ, ప్రజాసంఘాలపై నిషేధం సందర్భంగా సింగరేణిలోని గోదావరిఖని, రామగుండం, మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, మంగి, సిర్పూరు, చెన్నూరు ఏరియాల్లో, నిజామాబాద్ జిల్లాలోని కామారెడ్డి, సిర్నాపల్లి, సిరిసిల్ల ప్రాంతాల్లో కరపత్రాలు, పోస్టర్లు, బ్యానర్లు, పత్రికా ప్రకటనల ద్వారా విస్తృతంగా ప్రచారం జరిగింది.

### ఆగస్టు 15, 2005 నల్లజండాల ఎగురవేత, నిరసన కార్యక్రమాలు

2005 ఆగస్టు 15 బూటకపు స్వాతంత్ర్యాన్ని ఎక్స్‌పోజ్ చేస్తూ ఆదిలాబాద్, నిజామాబాద్ డివిజన్‌లలో పోస్టర్స్, బ్యానర్స్ ద్వారా ప్రచార కార్యక్రమం కొనసాగింది. బూటకపు స్వాతంత్ర్య దినాన్ని నల్ల జెండాలు ఎగరవేస్తూ బహిష్కరించాలని పత్రికా ప్రకటన ఇవ్వటం జరిగింది. కోటపల్లి, వేమనపల్లి మండలాల్లోని 15 గ్రామాలలో నల్లజెండాలు ఎగరవేశారు. మంగి ప్రాంతంలోని ఆరు గ్రామాలలో, సిర్పూరు ప్రాంతంలో 3 గ్రామాలలో నల్లజెండా ఎగరవేశారు. కామారెడ్డి ప్రాంతంలో 15 గ్రామాలలో, సిరిసిల్ల ప్రాంతంలో ఒక గ్రామంలో నల్లజెండా ఎగరవేసి నిరసన ప్రకటించారు.

### పార్టీ చేతిలో కోవర్టు సబితకు శిక్ష

మావోయిస్టు నాయకులను లక్ష్యంగా చేసుకొని(నవంబర్ 2005) పోలీసులు మాజీ దళ సభ్యుని సహకారంతో, ఇద్దరు గ్రామస్థులను అనుకూలంగా మార్చుకొని భోజనంలో విషాన్ని కలిపి ఇవ్వాలనే ప్రత్యేక వ్యూహాన్ని పన్నారు. ఆసిఫాబాద్ మండలం కౌటన్ మోవాడ గ్రామంలో ఈ పథకాన్ని పన్నారు. ఇప్పల్ నగాం గ్రామానికి చెందిన నానుబాయి (సబిత), హోటల్ వర్కర్‌గా పని చేస్తున్న మరో నడి వయసు మహిళను ఇందుకు వినియోగించుకున్నారు. ఈ ఆపరేషన్‌కు ఎస్.ఐ కొమురయ్య సూత్రధారి. ఈ సబితను గ్రామస్తుల ద్వారా దళంలోకి రిక్రూట్ చేయడానికి పథకం పన్నారు. దీనిలో భాగంగా మాజీ దళ సభ్యుడు సుభాష్ సబితను తీసుకొని కౌటన్ మోవాడ గ్రామానికి తీసుక వచ్చాడు. దళం నుండి పని మీద ఆ ఇంటికి దళ కామ్రేడ్స్ పోయే సరికి మాటలను గమనించి ఇంటి నుండి బయటికి రమ్మని వారిరువురిని అరెస్టు చేశారు. ఆ తరువాత వారిని ఇంటరాగేట్ చేసే లోపలే మాజీ సభ్యుడు సుభాష్ తప్పించుకొని పారిపోయాడు. అప్పటికే ఆ ప్రాంతమంత పోలీసుల కూంబింగ్ ప్రారంభం అయింది. కూంబింగ్‌ల మధ్యన ఎలక్ట్రానిక్ మీడియా ముందు సబితను హాజరు పరిచి ఆ తరువాత చంపివేయటం జరిగింది. కోవర్టుగా ఏ విధంగా పంపింది, అన్నంలో విషం పెట్టటం, ఇన్‌ఫార్మర్స్ నెట్‌వర్క్ మొదలైన విషయాలన్నింటిని బయట పెట్టింది. ఆతరువాత పోలీసులు పత్రిక ప్రకటన చేస్తూ సబిత కోవర్టు కాదని, అత్యాచారం చేసి మావోయిస్టులు చంపివేశారని ఎస్పీ ఉజేలా ప్రకటించాడు. జిల్లా వ్యాపితంగా మావోయిస్టు పార్టీకి వ్యతిరేకంగా చంద్రన్న, గణేష్, అరుణక్కల దిష్టి బొమ్మలను పెట్టించారు. మరునాడే ఆసిఫాబాద్ డాక్టర్ జాన్ భాస్కర్ అత్యాచారం జరుగ లేదని పత్రికా ప్రకటన చేశాడు. ఈ విధంగా పార్టీలోకి కోవర్టును పంపించి దళాలను, నాయకత్వాన్ని దెబ్బతీయడానికి పోలీసులు నానారకాలుగా తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు.

### జూలై 28 అమరవీరుల స్మారక వారం

2005 జులై 28 అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఉత్తర తెలంగాణాలో నిజామాబాద్ జిల్లాలోని కామారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాలోని మంగి, ఇంద్రవెల్లి ఏరియాల్లో, నార్నూర్, చెన్నూరు ప్రాంతాల్లో అమరవీరుల సంస్మరణ సభలు జరిగాయి. తీవ్ర నిర్బంధం, గ్రేహౌండ్స్ బలగాల కూంబింగ్‌ల మధ్యనే పోస్టర్లు, బ్యానర్ల ద్వారా ప్రచారం చేసి రెడిమేడ్ స్థూపాలు ఏర్పాటు చేసి విప్లవ ప్రజానీకం అమరవీరులను

సంస్మరించుకున్నారు. ఈ వారోత్సవాల సందర్భంగా పోలీసులు అనేక చోట్ల అరెస్టులు చేసి అడ్డుకోవాలని ప్రయత్నించారు.

## ఎ.ఓ.బి ప్రచారం-పోరాటాలు

### మల్కనగిరి జిల్లాలో పి.ఎల్.జి.ఎ వారోత్సవాలు

కలిమెల ఎ.సి పరిధిలో డిసెంబర్ 2 నుండి 8 వరకు జరిగిన పి.ఎల్.జి.ఎ వారోత్సవాల్లో భాగంగా కలిమెల బ్లాక్‌లో గ్రామ గ్రామాన పోస్టర్లు, కరపత్రాలు, బ్యానర్లతో విస్తృతంగా ప్రచారం జరిగింది. మోటు ఏరియాలో 300 మందితో ఊరేగింపు చేసి, పి.ఎల్.జి.ఎ జెండా రెపరెపల మధ్య ఉత్సాహవంతంగా జరిగింది. ఆట పాటల మధ్య పి.ఎల్.జి.ఎ సభ్యులు ప్రజలను ఉత్సాహపరుస్తూ సభ విజయవంతంగా ముగిసింది. పొట్టేరు ఏరియా పరిధిలోని బెజ్జంకిపాడు గ్రామంలో 100 మంది విప్లవ ప్రజానీకం, పి.ఎల్.జి.ఎ, మిలీషియా దళం కలిసి గంటపాటు ఊరేగింపు చేసి, పాటలు పాడుతూ గ్రామంలోని ప్రధాన దారులగుండా ప్రదర్శన కొనసాగింది.

కలిమెల ఏరియాలోని రోడ్డు ప్రక్క గ్రామాలలో పోస్టర్లు, కరపత్రాలు, ఎర్ర బ్యానర్‌ల మధ్య 350 మందితో దళం పాటలు పాడుతూ ప్రజలను పి.ఎల్.జి.ఎ సభ్యులను ఉత్సాహపరుస్తూ సభ ప్రారంభం అయింది. పి.ఎల్.జి.ఎ జెండాను అక్కడి పోలాసి అనే కామ్రేడ్ ఎగురవేయగా, పార్టీ జెండాను సంఘ సభ్యులు ఎగరవేయటంతో సభ ప్రారంభం అయింది. ఆ సభ సందర్భంగా ముందుగానే వ్యక్తిగత ఆయుధ పోటీ జరిపి అందులో విజయం పొందిన విప్లవ ప్రజానీకానికి, ప్రజాసంఘ కార్యకర్తలకు ఈ సభలోనే బహుమతులు ఇవ్వటం జరిగింది. ఈ పోటీల్లో మహిళా మిలిషియా సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

డిసెంబర్ 6 నాడు, పెద్ద టేక్‌గూడ గ్రామంలో జరిగిన పి.ఎల్.జి.ఎ సభ ప్రజలను విస్తృతంగా ఆకట్టుకుంది. మధ్యాహ్నం 11 గంటలకు సభ మొదలైంది. 1000 మందితో ఎర్రటి తోరణాల మధ్య చుట్టూరా ప్రజాసైన్యం బ్యానర్లు, పార్టీ జెండాలు, పి.ఎల్.జి.ఎ జండాలతో అర్ధ గంట పాటు ఊరేగింపు జరిగి పి.ఏ.డి(పితూరీ ఏందన దళం) కళాకారుల ఆట పాటల మధ్య సభ ఉత్సాహంగా ముగిసింది. అక్కడి లోకల్ కమాండర్ మాట్లాడి ప్రజాసైన్యం, పి.ఎల్.జి.ఏలోకి చేరాలని ప్రజలకు పిలుపునిచ్చాడు. డి.వి.సి.ఎమ్ ప్రజాయుద్ధం అవసరాన్ని, అందులోకి ప్రజలు రిక్రూట్ కావలసిన అవసరాన్ని గుర్తింపజేస్తూ ప్రజలకు పిలుపునిచ్చాడు. మధ్యమధ్యలో పితూరి ఏందన దళం ఆటపాటలతో సభను ఉత్సాహపరిచింది. అంతకుముందుగానే సామ్రాజ్యవాది, భూస్వామి, దళారీ నిరంకుశ బూర్జువాజీ బొమ్మలను తయారు చేసి వారిని టార్గెట్ చేస్తూ, బాణాలు వేసి తమ కసిని ప్రదర్శించారు. పాటలు పాడారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు పెట్టడం జరిగింది. ఇందులో విజేతలకు (మహిళలు, పురుషులకు, బాలలకు) బహుమతులు ఇవ్వడం జరిగింది. వారోత్సవాల సందర్భంగా పి.ఎల్.జి.ఎలోకి చేరడానికి సిద్ధంగా వున్న ఏడుగురిని రిక్రూట్ చేస్తూ వారితో ప్రమాణం చేయించడం జరిగింది. పి.ఎల్.జి.ఎ వర్ధిల్లాలి అనే నినాదాలతో సభ 5.30 గంటలకు ముగిసింది.

### గిట్టుబాటు ధరలకోసం రైతుల ర్యాలీ

2005, డిసెంబర్ 20 నాడు కలిమెల బ్లాక్‌లో తాము పండించిన పంటకు గిట్టుబాటు ధరలు కావాలంటు కలిమెల ఏరియా ప్రజలు 300 మందితో (మహిళలు, పురుషులు) కలిమెలలో ర్యాలీ తీశారు. వరి ధాన్యం, నువ్వులు, పెసలు, వెదురు రేట్లు పెంచాలంటూ నినాదాలు చేస్తూ, బ్యానర్లతో ఊరేగింపు చేసి బ్యాంకు ఛైర్మన్‌కు మెమోరాండం సమర్పించారు.

### కేంద్రకమిటి సభ్యుల అరెస్టుకు నిరసనగా ర్యాలీ

మల్కనగిరి జిల్లా కలిమెల ఏరియాలోని బెజ్జంకిపాడు గ్రామంలో పార్టీ కేంద్ర కమిటి నాయకులు కామ్రేడ్స్ బరుణ్, తపస్, విజయ్‌లను విడుదల చేయాలని వారిమీద మోపిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, వారిని పోలీసులు చిత్రహింసలకు గురిచేయటాన్ని నిరసిస్తూ జనవరి 15 నాడు, 150 మంది ప్రజలు బ్యానర్లు చేతబూని ఊరు మధ్యలో నుండి అన్ని దారులను కలుపుతూ ర్యాలీ నిర్వహించి, గ్రామంలో బ్యానర్లు కట్టారు.

### దేశవ్యాపిత బందులో భాగంగా మల్కనగిరి జిల్లా బంద్

దండకారణ్యంలో సల్వాజుడూం పేరుతో పోలీసులు, పాలకవర్గ గుండా అయిన మహేంద్ర కర్మ నాయకత్వంలో భూస్వాములు, ప్రజావ్యతిరేకులు, తెగ పెద్దలు గ్రామాలపై పడి, వందలాది ఇండ్లను, పంటలను తగులుపెట్టడమే గాకుండా, వందకు పైగా ప్రజలు, కార్యకర్తలు, వృద్ధులు, పిల్లలను చంపారు. అదేవిధంగా ఆదివాసీ మహిళలను అత్యాచారం చేసి చిత్రహింసలు పెట్టి చంపారు, గర్భిణితో వున్నవారిని అత్యాచారం చేసి చంపి, కడుపులో వున్న శిశువును తీసి చంపారు. ఈరకంగా వికృతరూపాన్ని దాల్చిన హత్యలకు నిరసనగా కేంద్రకమిటి పిలుపులో భాగంగా మల్కనగిరి జిల్లాలో గ్రామగ్రామానా పోస్టర్లు, కరపత్రాలతో ప్రచారం చేసి, 2006 జనవరి 26న బంద్‌కు మిలిషియా టీములవారిగా వెళ్ళి మల్కనగిరి మెయిన్ రోడ్డుకు అడ్డంగా పలుచోట్ల చెట్లను నరికి, బ్యానర్లు కట్టి రావడంతో మొత్తంగా బందు విజయవంతం అయింది. కలిమెలలో దుకాణాలు, బందు చేశారు. ❐

---

*(43వ పేజీ తరువాయి.....)*

పోలీసులూ మమత కుటుంబాన్ని రకరకాలుగా ఇబ్బందులు పెట్టి ఇద్దర్నీ లొంగిపోయేలా చేయాలని వేధించారు. తల్లిదండ్రుల బాధలు తనముందు ఏకరువుపెట్టి ఏడ్చినా మమత చలించక, పోరాట బాట విడవనన్నది. కుటుంబ సమస్యలు పార్టీ పరిష్కరిస్తుందని తల్లిదండ్రులకు, కొంత మనసు చలించిన అన్నకు కూడా చెప్పింది. కుటుంబ సమస్యను పరిష్కరిద్దామిని పార్టీ కూడా చెప్పడంతో మనసు కుదుటపడి ఉత్సాహంగా ప్రతిఘటన కోసం వెళుతున్న క్రమంలో 2005 నవంబర్‌లో లింగగూడెం గుట్టపై జరిగిన పోలీసుల మాటుదాడిలో కా॥ మమత శత్రుదాడిలో అమరురాలైంది. కా॥ మమత అంకితభావం, పట్టుదల, నిత్యనూతన ఉత్సాహం విప్లవకారులకు ఎంతో స్ఫూర్తిదాయకమైనవి. ❍

# సామ్రాజ్యవాద దోపిడీని సుగమం చేయడానికే 'గంగవరం' కాల్పులు

పేద ప్రజలకు ఉపాధి కల్పించడం తమ ధ్యేయమని అందుకోసం పథకాలు రూపొందించామనీ గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, ఉపాధి కోసం ఆందోళన చేసిన గంగవరం మత్స్యకారుల పై తూటాలు కురిపించింది. ఒక నిండు ప్రాణాన్ని తీసింది. అలా అది తన హంతక చర్య ద్వారా పేద ప్రజల ఉపాధి పట్ల తన అసలు వైఖరిని చాటుకుంది. అంతేకాదు హక్కుల కోసం పోరాడే ప్రజలను తానెంత బరితెగించి అణచివేస్తుందో మరోసారి తెగేసి చెప్పింది.

విశాఖ నగరంలోని స్టీల్ ప్లాంట్‌కు దగ్గర్లో గంగవరం పోర్టును నిర్మించతలపెట్టింది ఒక ప్రయివేటు సంస్థ. రాష్ట్రాన్నంతా ప్రయివేటుమయం చేసిన చంద్రబాబు పాలనలోనే ఈ ఆధునిక, భారీ పోర్టును నిర్మించాలనే నిర్ణయం జరిగింది. పెట్టుబడిదారులకు కోట్లకు కోట్ల లాభాల్ని ఆర్జించి పెట్టబోయే ఈ పోర్టు అయిదారు గ్రామాల ప్రజల ఉపాధిని అమాంతంగా మింగేస్తుంది. ఉపాధినే కాదు అదొక గ్రామాన్ని కూడా నామరూపాలు లేకుండా మింగేస్తుంది. ప్రస్తుతం దిబ్బపాలెం అనే తీరప్రాంత గ్రామం ఉన్నచోట ఈ పోర్టును నిర్మిస్తున్నారు. అంటే ఇక అక్కడ గ్రామం వుండదు. అక్కడి ప్రజలను తరిమేస్తారు. దిబ్బపాలెం, చేపలు పట్టడానికి అనువైన ప్రదేశం. అందుకని అక్కడ దిబ్బపాలెం వాసులే కాక గంగవరం, పల్లెపాలెం, జాలరిపల్లిపాలెం, పెద్దపల్లి పాలెం, చిన్నపల్లి పాలెం వాసులు కూడా తమ పడవల్ని పెట్టుకొని చేపలవేట చేస్తారు. కాబట్టి అక్కడ పోర్టు కడితే తమ ఉపాధి పోతుందని ఈ ప్రజలంతా పోర్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ వచ్చారు. ఫలితంగా దాదాపు పదేళ్లకు పైగా ఈ పోర్టు నిర్మాణం వివాదస్పదంగా మారింది.



పోలీసులపై రాళ్లు విసురుతున్న మత్స్యకారులు

అయినప్పటికీ ప్రభుత్వం ఏకపక్షంగా ఒక పునరావాస పథకాన్ని ప్రకటించి దిబ్బపాలెం గ్రామాన్ని ఖాళీ చేసి పోర్టు యాజమాన్యం చేతిలో పెట్టదల్చుకుంది. అది ప్రకటించిన పునరావాస పథకం ఎవ్వరికీ ఆమోదయోగ్యంగా లేదు. అది ఖాళీ చేసి ఇస్తున్నది కేవలం దిబ్బపాలెం గ్రామాన్నే కనుక దిబ్బపాలెం వాసులకు మాత్రమే అది 'పునరావాసాన్ని' ప్రకటించింది. అయితే అది ఆ గ్రామ వాసులకు ఎంత మాత్రమూ ఆమోదయోగ్యంగా లేదు. ఇక దిబ్బపాలెం వద్దే పడవలు పెట్టుకొని చేపల వేట చేసే మిగతా గ్రామవాసులకు పునరావాసం కల్పించవల్సిన అవసరం లేదంది. ఒక రకంగా అది మత్స్యకారులను విభజించి తన ప్రయోజనం నెరవేర్చుకోవాలనుకుంది. కానీ మత్స్యకారులు చీలిపోకుండా ఐక్యంగా పోరాడుతూ వస్తున్నారు.

ప్రజల్లో ఎంత వ్యతిరేకత వచ్చినా పెట్టుబడిదారులు తమ లాభాల్ని వదులుకోవడానికి సిద్ధంగా వుండరు. పెట్టుబడిదారుల చేతుల్లో కీలుబొమ్మలయిన పాలకులు వారికి దాసోహం అనకనూ మానరు. నిర్మాణపు పనులు మొదలు పెట్టడానికి అనుకూలంగా అక్కడున్న పడవల్ని తొలగించాలని ప్రభుత్వం సంకల్పించింది. అందుకే 2005 జూలైలో విశాఖ ఆర్డీవో, దిబ్బపాలెం తీరం వద్ద వారం రోజులలోగా చేపల వేట ఆగిపోవాలని ఒక నోటీసును జారీ చేశాడు. ఫలితంగా మత్స్యకారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

2005 ఏప్రిల్‌లో రాష్ట్ర ప్రభుత్వం సహాయ పునరావాస విధానం అనే జీవోను విడుదల చేసింది. ఈ జీవో ప్రకారం నివాస స్థలాలు కోల్పోకున్నా ఉపాధి అవకాశాలు కోల్పోయేవారు కూడా బాధితులే.

ఇటువంటి ఒక జీవోను కొద్దినెలల ముందే తయారు చేసిన ప్రభుత్వం, తాను చేసిన జీవోను తానే బేఖాతరు చేస్తూ, దిబ్బపాలెమేతర ప్రజలకు పునరావాసం కల్పించనవసరం లేదని చెప్పింది. అంటే ఉన్నాయని చెప్పుకోవడానికి చట్టాల్ని కాగితాల్లో రాసిపెట్టుకోవడం తప్ప అమలు చేసే చిత్తశుద్ధిని ప్రభుత్వం ఎన్నడూ కల్గి ఉండదని మరోసారి అర్థమౌతుంది. అయితే ఈ జీవోను అమలు చెయ్యాలని మత్స్యకారులు తమ వాదనలో పేర్కొన్నారు.

ప్రతిగా ప్రభుత్వం, ఆర్.డి.ఓ జారీ చేసిన నోటీస్‌ను అమలు చెయ్యబోవనీ, నిర్వాసితులను సంప్రదించి, వారికి

ఆమోదయోగ్యమైన పునరావాస పథకాన్ని రూపొందించి, ఆ తర్వాతే పడవలను అక్కడి నుండి తరలిస్తామని చెప్పింది.

అయితే ప్రభుత్వ పునరావాస ప్రతిపాదనలేవీ మత్స్యకారులకు ఆమోదయోగ్యంగా లేవు. ప్రభుత్వం యారాడ వద్ద జెట్టీ కట్టిస్తానంటోంది. కానీ దగ్గర్లో వున్న నల్లమారమ్మ పతాలు దగ్గర జెట్టీ కట్టియ్యాలని మత్స్యకారులు అడుగుతున్నారు. అక్కడ కట్టియ్యడానికి పోర్టు యాజమాన్యం ఒప్పుకోవడం లేదు. వారి అడుగులకు మడుగులొత్తే ప్రభుత్వం వారి ఇష్టానికి భిన్నంగా ఎలా వ్యవహరిస్తుంది ? బాధితులైన మత్స్యకారుల గుర్తింపు కూడా సమగ్రంగా జరుగలేదని మత్స్యకారుల ఆరోపణ. మత్స్యశాఖ జారీ చేసే గుర్తింపు కార్డుల ఆధారంగా ప్రభుత్వం బాధితులను లెక్కవేసింది. కానీ గుర్తింపు కార్డులు లేని చేపల వేట వృత్తిలో ఉన్న మత్స్యకారులు చాలా మందే ఉన్నారు. ఇక ఒక్క దిబ్బపాలెం వాసులకే ప్రభుత్వం ఇండ్లు కట్టిస్తానంటోంది. గంగవరం మత్స్యకారులు కూడా ఇండ్లు కట్టించాలని డిమాండ్ చేస్తున్నారు. దిబ్బపాలెం వారికి కూడా ఇండ్లు కట్టిస్తానంటోన్నది, గాజువాకలో. చేపలు పట్టే స్థలానికి దగ్గర్లో మత్స్యకారులకు నివాసాలుండడం అవసరం, అనుకూలం కనుక అలా దూరంగా ఇండ్లు కట్టియ్యడం వారికి ఆమోదయోగ్యంగా లేదు. ఇట్లా ప్రభుత్వ పునరావాసం పట్ల మత్స్యకారులకు ఆమోదయోగ్యం కాని విషయాలెన్నో వున్నాయి.

వారి అసంతృప్తి ఇలా వుంటుండగానే మరోవైపు పోర్టు నిర్మాణపు పనులు మొదలయ్యాయి. దానితో మత్స్యకారుల ఆందోళన సహితం ఉధృతమైంది. రిలే నిరాహారదీక్షలూ, వేల సంఖ్యలో కలెక్టర్ కార్యాలయ ముట్టడి వంటి ఆందోళనా కార్యక్రమాల్ని చేపట్టారు. కాగా మార్చి 25న మత్స్యకారుల పడవల్ని తొలగించడానికి ప్రభుత్వ అధికారులు పూనుకున్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన పునరావాస పథకాన్ని రూపొందించిన తర్వాతే పడవలను తరలిస్తానని న్యాయస్థానానికి హామీ ఇచ్చిన ప్రభుత్వం తన హామీని విస్మరించి పడవల్ని తొలగించే పనికి ఎందుకు పూనుకున్నట్టు ? ఇందులో పెద్ద రహస్యం ఏమీ లేదు. పోర్టు నిర్మాణం పూర్తయి ఎప్పుడు అది వినియోగంలోకి రాబోతున్నదో దాని యాజమాన్యం తేదీలు ప్రకటించింది. ఇకవారు ఎంతమాత్రమూ ఆలస్యాన్ని సహించలేరు. 'మా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టండి, అన్ని మౌలిక సదుపాయాలూ ఆయాచితంగా కల్పిస్తాం' అంటూ దేశ విదేశీ పెట్టుబడిదారులకు విజ్ఞప్తులు చేస్తున్న ప్రభుత్వం పోర్టు యాజమాన్యానికి కలిగే 'అసౌకర్యాన్ని' ఎలా భరించగలదు ? ఈ విషయం రాబోయే పెట్టుబడులను ప్రభావితం చేస్తే ఎలా ? అందుకే తన హామీని తానే తుంగలో తొక్కింది.

అయితే పడవలను తొలగించకుండా మత్స్యకారులు తీవ్రంగా ప్రతిఘటించారు. వారి ప్రతిఘటన వల్ల అధికార్లు పడవల్ని తరలించలేకపోయారు. ఈ సంఘటన తర్వాత తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేయదలిచారు మత్స్యకారులు. తమకు సరైన పునరావాస పథకాన్ని ప్రకటించే వరకూ పోర్టు నిర్మాణ పనులను నిలిపివేయాలని పలు మత్స్యకార సంఘాలు డిమాండ్ చేసాయి. మార్చి 28న ఈ నిర్మాణపు పనులను అడ్డుకునే కార్యక్రమాన్ని కూడా తీసుకున్నాయి. పలు కాంగ్రేసేతర పార్టీలు కూడా మత్స్యకారులకు మద్దతునిచ్చాయి.

ఈ నేపథ్యంలో మార్చి 28న ఉదయం 5.30 గం॥లకే గంగవరం గ్రామం నిండా పోలీసుల్ని దింపింది ప్రభుత్వం. 144 సెక్షన్‌ను విధించింది. అయినప్పటికీ మత్స్యకారులు వెనక్కి తగ్గకుండా గుమికూడారు. తమ శాంతియుత పోరాటానికి అనుమతివ్వాలని డిమాండ్ చేసారు. పోలీసులు ససేమిరా అన్నారు. దీంతో వాగ్వివాదం పెరిగి ఘర్షణ మొదలైంది. పోలీసుల దౌర్జన్యానికి వ్యతిరేకంగా మత్స్యకారులు రాళ్లతో, తెడ్లతో తీవ్రంగా ప్రతిఘటించారు. ఈ ప్రతిఘటనలో ఏసీపీ సహా కొందరు పోలీసులకు గాయాలయ్యాయి. ప్రజలను కొట్టి చంపే అధికారం తమకు మాత్రమే ఉందని భావించే పోలీసులు, అసలు కొట్టడానికే, చంపడానికే తమకు ఉద్యోగాలున్నాయని భావించే పోలీసులు, తమకు రెండు దెబ్బలు పడేప్పటికి సహించలేక పోయారు. వాళ్ల అహం దెబ్బతిన్నది. తనకు అధికారం లేకున్నా డిసిపి కాల్పులు జరపమని ఆజ్ఞాపించాడు. అంతే వందలాది పోలీసులు ఒక్కసారిగా కురిపించిన తూటాల వర్షంలో పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. నూకరాజు అనే మత్స్యకారుడు మరణించాడు. కాల్పుల వల్ల చెల్లా చెదురైన మత్స్యకారులను పోలీసులు, 'మమ్మల్నే కొడతార్రా' అంటూ వెంటబడి తరిమి తరిమి కొట్టారు. ఇండ్లల్లోకి దూరి మహిళలను సహితం విచక్షణా రహితంగా కొట్టారు. నాలుగు రోజుల క్రితమే ప్రసవించిన బాలింతను సహితం ఉన్మాదుల్లాగా కొడితే ఆమె తీవ్రంగా గాయపడి రక్తస్రావంతో చావుబతుకుల మధ్య ఆస్పత్రిలో చేరింది.

ఈ సంఘటన శాసనసభలో గలాభాకు దారితీసింది. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని దుయ్యబట్టాయి. దీనికి స్పందిస్తూ జానారెడ్డి మత్స్యకారులు తీవ్రంగా ప్రతిఘటించారు. పోలీసులు ఆత్మరక్షణ కోసమే కాల్పులు జరిపారని చెప్పి ఎప్పటిలాగే పోలీసులను వెనకేసుకొచ్చి తప్పంతా మత్స్యకారుల మీదికే నెట్టేసాడు. పలువురు అధికారపక్ష నేతలు దురదృష్టవశాత్తు, అనుకోకుండా జరిగిన కాల్పులని మాట్లాడారు. నిజానికి ఇవి అనుకోకుండా జరిగిన కాల్పులు కావు. మత్స్యకారుల నుంచి

తీవ్రమైన ప్రతిఘటన వస్తుందని అధికారులకూ, నాయకులకూ తెల్సు, రెండు రోజుల ముందే ప్రతిఘటనను ఎదుర్కొనే వున్నారు కనుక. అయినప్పటికీ ప్రాణాలు తీసయినా సరే ఆ ప్రతిఘటనను ఎదుర్కోవాలని ప్రభుత్వం ముందే నిశ్చయించుకొని, పథకం ప్రకారమే వందల సంఖ్యలో పోలీసుల్ని మోహరించింది. అంతేకాదు రెండు రోజుల క్రితం డిప్యూటీ కలెక్టర్ స్థాయిలోనున్న పునరావాస అధికారి కాల్పులు జరువుతామని బెదిరించాడు కూడా.

జానారెడ్డి చెప్పినట్టు మత్స్యకారుల ప్రతిఘటన తీవ్రంగానే వుంది. సరైన మాటల్లో చెప్పుకోవాలంటే వీరోచితంగా వుంది. మరి ఈ ప్రతిఘటనకు నేపథ్యం ఏంటీ ?

సముద్రంలో చేపలు పట్టడం అనేది, ప్రకృతే కాదు, రాజ్యాంగం కూడా మత్స్యకారులకు ఇచ్చిన హక్కు. కానీ, ఈ హక్కుకు అడుగడుగునా భంగం కల్గుతూనే వుంది. తమ హక్కును కాపాడుకోవడం కోసం మత్స్యకారులు అడుగడుగునా పోరాడాల్సే వస్తున్నది. విశాఖను పారిశ్రామిక నగరమని గొప్పగా చెబుతారు. కానీ తీర ప్రాంతాన వెలిసే కర్మాగారాలన్నీ మత్స్యకారులను తరిమేసే వెలుస్తున్నాయి. ఇప్పుడు పోర్టు కోసం తరలించబోతున్న మత్స్యకారులను ముందు స్టీల్ ప్లాంట్ కోసం తరలించారు. పెరుగుతున్న కర్మాగారాలు మత్స్యకారులకు ఒక స్థిర నివాసం అంటూ లేకుండా చేస్తున్నాయి. విశాఖను పర్యాటక కేంద్రంగా మలచాలనే పాలకుల ఉబలాటం మత్స్యకారుల పాలిట శాపంగానే మారుతున్నది. మత్స్యకారులను తరిమేసి సముద్రతీరాన, పార్కులను ఆధునిక రిసార్ట్‌లను కడుతున్నారు. అంతేకాదు సుందరమైన సాగరతీరాన మత్స్యకారుల పూరిగుడిసెలూ, పడవలూ, వాళ్లు ఆరవేసే వలలూ, చేపలూ అన్నీ వికారంగా కనబడుతున్నాయట. ఈ 'వికారాలన్నీ' పర్యాటక రంగానికి దెబ్బకనుక ఈ పల్లెలను తొలగించి పారెయ్యాలని ప్రభుత్వం ఎప్పుడూ ఏదో సాకుతో రకరకాల ప్రయత్నాలు చేస్తూ వీరి బతుకులను నిరంతర అభద్రతలో ఉంచుతోంది. మరపడవలతో హద్దూ, ఆంక్షలు లేకుండా పెద్ద ఎత్తున చేసే చేపల వేట కూడా మత్స్యకారుల పొట్టలు కొడుతోంది.

ఇలా సమస్యలతో సతమతమౌతూ, ప్రభుత్వంపై విసిగిపోయి వున్న మత్స్యకారులకు తాజాగా పోర్టు సమస్య వచ్చిపడింది. ఈ విషయంలోనూ, ప్రభుత్వం తమకు మేలు చేస్తుందన్న విశ్వాసాన్ని కోల్పోయారు. ప్రజల శ్రేయస్సును పట్టించుకోవాల్సిన ప్రభుత్వం ఆ బాధ్యతను మరిచి పోర్టు యాజమాన్యానికి తొత్తులుగా వ్యవహరించడం ప్రజలకు స్పష్టంగా అర్థమౌతున్నది. ఈ సమస్యలో పునరావాస అధికారిగా మోహన్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. పునరావాస అధికారిగా ఉన్నవారు నిర్వాసితుల పక్షపాతిగా ఉండాలి, లేదంటే నిష్పాక్షికంగానైనా ఉండాలి. అప్పుడే నిర్వాసితులకు కనీస న్యాయం జరుగుతుంది. కానీ ఇతను పోర్టు యాజమాన్యానికి తొత్తుగా వ్యవహరిస్తున్నాడని ఎప్పుడినుండో మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. అందుకే సామరస్యంగా వ్యవహరించాల్సింది పోయి మత్స్యకారుల మీదకు కాల్పులు జరిపిస్తానన్నాడు. ఇటువంటి పాలకుల, అధికార్ల చేతిలో తమకు న్యాయం జరగదని గ్రహించిన మత్స్యకారులు తమ జీవించే హక్కును కాపాడుకోవడం కోసం జీవనోపాధి సాధనాలైన తెడ్లను తిరగేసి ప్రతిఘటించాల్సి వచ్చింది. జీవనోపాధి కోసం ఆరాటపడిన నూకరాజు జీవించే హక్కునే కోల్పోవల్సి వచ్చింది.

ఇంత ప్రతిఘటన ఎదుర్కొంటూ, ప్రజల ప్రాణాల్ని సహితం తీస్తూ కడుతున్న పోర్టు ఎవరి ప్రయోజనాల కోసం ? తీరప్రాంతాన వెలిసే ఈ పోర్టు వల్ల తీరప్రాంత వాసులకే కాదు, మెజారిటీ దేశ ప్రజానీకానికీ వీసమెత్తు ప్రయోజనం కూడా లేదు. ఎగుమతులు, దిగుమతులకు ఉపయోగపడే ఈ పోర్టు, సామ్రాజ్యవాద దేశాలూ, బహుళజాతి సంస్థలూ మన సంపదను దోచుకొని తేలికగా తరలించుకుపోవడానికి ఉపయోగపడుతుంది. అవి తయారు చేసే సరుకులను భారత మార్కెట్లలో మరింత సులువుగా నింపి దేశాన్ని దోచుకోవడానికీ, దేశీయ మార్కెట్‌ను మరింత దెబ్బతీయడానికీ ఉపయోగపడుతుంది. సామ్రాజ్యవాదులకే కాక ఈ పోర్టు దేశీయ దళారీ పెట్టుబడిదారులకూ ఉపయోగపడుతుంది. పోర్టు ద్వారా ప్రభుత్వానికి ఆదాయమన్నా వస్తుందా అనుకుంటే దీన్ని నిర్మిస్తున్నది విదేశీ పొత్తుతో ఒక ప్రయివేటు సంస్థ. పోనీ ప్రజలకు ఉద్యోగాలన్నా వస్తాయా అనుకుంటే అత్యాధునిక యంత్రాల మీద ఆధారపడి నడిచే ఈ భారీ పోర్టులో మొత్తం ఉద్యోగాలు వెయ్యిలోపే ఉంటాయని పోర్ట్ యాజమాన్యం చెప్పేసింది. అంటే దేశ ప్రజలకు ఏ మాత్రం ప్రయోజనాన్ని చేకూర్చని, పైగా నష్టం కలిగించే పోర్టు కోసం దేశ ప్రజల ప్రయోజనాలను బలిపెడుతున్నది ప్రభుత్వం.

తమకేమాత్రం ప్రయోజనాన్నివ్వని, తమను తరిమేసే, తమ పొట్టలు కొట్టే, పోర్టును కట్టడానికి మత్స్యకారులు అసలు ఎందుకు ఒప్పుకోవాలి ? ఎవరైనా తాము పుట్టి పెరిగిన ప్రాంతాలను వదిలి మరోచోటికి వెళ్లాలంటే మరింత మెరుగైన జీవితం దొరుకుతుందనే హామీనో, ఆశనో వుండాలి. మరి ఈ చోటును ఖాళీ చేస్తే తమ బతుకు మరింత దుర్భరం అవుతుందని తెల్సీ ఈ మత్స్యకారులు తమ నివాసాలను ఎందుకు వదిలిపెట్టాలి ? ఇప్పుడు పాలకవర్గాలు జపిస్తున్న 'అభివృద్ది' కాక,

నిజమైన అభివృద్ధి కోసం కొన్ని సార్లు ప్రజలను ఒకచోటి నుండి మరోచోటికి తరలించాల్సి రావొచ్చు. అయితే అప్పుడు ఆ ప్రజలకు ప్రస్తుతం ఉన్నదానికంటే మెరుగైన పునరావాసం కల్పించాలి. మరోచోట వాళ్లు ఇమిడిపోయేలాగా అన్ని రకాల సహాయ సహకారాలు అందించాలి. కానీ దేశవ్యాప్తంగా పాలకులు అమలు చేస్తున్న ఒక్క పునరావాస పథకం కూడా నిర్వాసితులకు న్యాయం చేసేదిగా లేదు. ప్రజలను అక్కడి నుండి తరిమేశాక ఇక వారిని పట్టించుకునే పాపానికి పోవడం లేదు. ఎక్కడిదాకానో అక్కర్లేదు, విశాఖనగర ఉదాహరణలోనే ఈ విషయాన్ని చూడొచ్చు. స్టీల్‌ప్లాంట్ కోసం **28** గ్రామాల్లోని **5,511** కుటుంబాలను తరలించారు. వారి భూములకూ, ఇండ్లకూ ఇచ్చిన నష్టపరిహారం చాలా తక్కువ. స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగాలిస్తామని చెప్పి **15,300** ఆర్ కార్డులను ఇచ్చారు. (ఆర్ కార్డులంటే నిర్వాసితులు అనే గుర్తింపు కార్డులు. ఈ కార్డులు పొందిన వారికి క్రమంగా ఉద్యోగాలిస్తామని అప్పట్లో చెప్పారు ). అయితే ఇప్పటికి **6,241** మందికి మాత్రమే ఉద్యోగాలిచ్చారు. అవీ కళాసీ వంటి చిన్నా చితకా ఉద్యోగాలే. ఇక ఖాళీలు లేవు గనుక ప్లాంటులో ఉద్యోగాలిచ్చే అవకాశాలు లేవు. ఉద్యోగాల కోసమే కాదు, అప్పుడు ప్రభుత్వం వాగ్దానం చేసిన పునరావాసం కోసమూ నిర్వాసితులు ముప్పై ఏళ్లుగా పోరాడుతూనే ఉన్నారు. తమ జీవితంలో ఇటువంటి చేదు అనుభవాలుండగా మరోసారి మోసపోవడానికి మత్స్యకారులు ఎలా సిద్ధంగా ఉంటారు ?

మత్స్యకారులు ప్రయివేటీకరణకూ, పారిశ్రామీకరణకూ వ్యతిరేకం కాదనీ, కేవలం ఉపాధి కోసమే పోరాడుతున్నారని కొన్ని పత్రికలు రాశాయి. కానీ వీరి సమస్య మూలాలను ప్రయివేటీకరణలో, అసంబద్ధమైన పారిశ్రామీకరణలో, మొత్తంగా సామ్రాజ్యవాదానికి దాసోహం అంటున్న పాలకవర్గాల విధానాల్లోనే చూడాలి. సామ్రాజ్యవాద ప్రయోజనాలను నెరవేర్చడంలో భాగంగా దేశంలో వేగవంతమైన, ఆధునిక, రవాణా మార్గాలను నిర్మిస్తున్నాయి ప్రభుత్వాలు. విశాలమైన రోడ్లనూ, ఆధునికమైన భారీ నౌకా, విమానాశ్రయాలను నిర్మిస్తూ సామ్రాజ్యవాద దోపిడీకి రాచబాటలు వేస్తున్నాయి. ఈ 'రాచబాట'కు అడ్డువచ్చిన ఊర్లనూ, మనుషులనూ, ఉద్యమాలను నిర్దాక్షిణ్యంగా తొలగించి పారెయ్యాలని చూస్తున్నాయి. వాటి విధానాల్లో భాగంగా సామ్రాజ్యవాదుల, దళారీ పెట్టుబడిదారుల, భూస్వాముల ప్రయోజనాల కోసం పేద ప్రజల ప్రయోజనాలను బలిపెట్టడం అనేది రోజురోజుకు పెరుగుతున్నది. అందులో భాగంగానే కోస్తా ప్రాంత ధనిక, భూస్వామ్య వర్గాల ప్రయోజనాలకోసమూ వేగవంతమైన రవాణా మార్గం కోసమూ వేలాది ప్రజల ప్రయోజనాలను బలిపెడ్తూ పోలవరం ప్రాజెక్టును చేపట్టారు పాలకులు. ఎంతోకాలంగా ఆందోళనను ఎదుర్కొంటూ కూడా నర్మదా డ్యాం ఎత్తును పెంచుతూనే ఉన్నారు.

విధానాల అమలులో అన్ని పార్టీల ప్రభుత్వాలు ఒకే తీరుగ నడుస్తున్నాయి. అందరినీ ఆడించే రిమోట్ సామ్రాజ్యవాదపు చేతిలో వుంది కనుక, విధానాల అమలులో తేడాలేం ఉండే అవకాశం లేదు. గంగవరం కాల్పుల సంఘటన సందర్భంగా వై.ఎస్ ఈ విషయాన్ని బాహాటంగానే చెప్పాడు. కాల్పుల విషయంలో వాగ్వివాదం చేస్తోన్న తెలుగుదేశం ఎమ్మెల్యేను, 'కారంచేడు, నీరుకొండ, బషీర్‌బాగ్‌లలో ఏం జరిగింది ?' అని ఎదురు ప్రశ్నించాడు. అంటే 'మీలాగే మేం చేస్తున్నాం దీంట్లో మనం మనం వాదించుకోవడం అనవసరం' అని నిస్సిగ్గుగా చెప్పాడు. గంగవరం పోర్టును ప్రయివేటు సంస్థకు అప్పగించారని వామపక్షాలు చేసిన విమర్శకు తన హయాంలో అప్పగించలేదనీ, పాలకపార్టీ ఏదయినా ప్రభుత్వం అనేది నిరంతర పాలనా వ్యవస్థ కనుక ముందే ప్రయివేటుపరం అయినదాన్ని అలాగే కొనసాగిస్తున్నానని చెప్పాడు. అంతేకాదు, నిర్మాణానికి అనుమతినిచ్చిన తెలుగుదేశం ప్రభుత్వాన్ని మెచ్చుకున్నాడు కూడా.

ఇటువంటి లొంగుబాటు విధానాల్లో భాగంగా వేసే విశాలమైన రోడ్ల కిందా, కట్టే నౌకా, విమానాశ్రయాలూ, ఆనకట్టలూ, కర్మాగారాల కిందా తవ్వే కాలువల కిందా లక్షలాది ప్రజల భవిష్యత్తు నలిగిపోతున్నది, మాయమవుతున్నది. అయినప్పటికీ దీన్ని అభివృద్ధి అని పాలకులు నిస్సిగ్గుగా చెప్తున్నారు.

ప్రభుత్వాలు ప్రకటిస్తున్న ఈ 'అభివృద్ధి' పథకాల్లో భాగంగా సమీప భవిష్యత్‌లో నిర్వాసితుల సమస్య మరింత తీవ్రంగా ముందుకు రాబోతున్నది. ఆ సమస్యను ఎలా పరిష్కరించదలుచుకుంటున్నాయో 'కళింగనగర్', 'గంగవరం'లను మచ్చుతునకలుగా చూపించాయి ప్రభుత్వాలు.

అయినప్పటికీ బతుకు కోసం పోరాడడం తప్ప ప్రజల ముందు మరే మార్గమూ లేదు. సామ్రాజ్యవాదానికి దోచిపెట్టడంలో భాగంగా పాలకవర్గాలు తలపెడుతున్న ఫ్యాక్టరీలూ, ప్రాజెక్టులూ, రోడ్లు, నౌకా, విమానాశ్రయాల నిర్మాణానికి వ్యతిరేకంగా, గనుల తవ్వకానికి వ్యతిరేకంగా మొత్తంగా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున కదిలి పోరాడాలి. పాలకవర్గాల ఈ సామ్రాజ్యవాద అనుకూల విధానాలను ఓడించాలి. అప్పుడే 'కళింగనగర్'లనూ, 'గంగవరం'లనూ నిరోధించగలరు. సమస్త వనరులపై ప్రజలు తమ అధికారాన్ని నిలుపుకోగలరు. ❑

# పొలిట్‌బ్యూరో సభ్యులు,కామ్రేడ్ సునీల్ రాయ్( శోమ్, అశోక్, బరుణ్), కామ్రేడ్ నారాయణ సన్యాల్ (విజయ్, ప్రసాద్), కేంద్రకమిటీ సభ్యుడు కామ్రేడ్ పతిత్ పవన్ హల్దార్(తపస్) తదితర కామ్రేడ్స్‌ను ప్రభుత్వం బేషరతుగా జైళ్ళ నుండి విడుదల చేయాలి !

పశ్చిమ బెంగాల్ సి.పి.ఐ(ఎం) నేతృత్వంలోని ప్రభుత్వం 2005, మే 21న సి.పి.ఐ(మావోయిస్టు) నాయకులైన కామ్రేడ్ సునీల్ రాయ్ (వయస్సు 66 సంవత్సరాలు), కా॥ పతిత్ పవన్ హల్దార్‌లతోపాటు మరికొంత మందిని కోల్‌కతాలో అరెస్టు చేసి వారిపై ఝార్ఖండ్, బెంగాల్‌లోని మిడ్నాపూర్‌లకు సంబంధించిన కేసులు బనాయించి జైలులో పెట్టింది. అరెస్టుల సందర్భంగా వీరిని శారీరకంగా, మానసికంగా పోలీసులు హింసించారు. వీరి అరెస్టులను ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు తీవ్రంగా ఖండించి, వీరిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసారు. అయితే ప్రజాందోళనను పెడచెవిన పెట్టిన ప్రభుత్వం వారిపై మెదినిపూర్ కోర్టులో బూటకపు విచారణ జరిపి కఠిన శిక్షలు విధించింది. వీరిని విప్లవోద్యమానికి దూరంగా నాలుగు గోడల మధ్యనే ఉంచాలనే కుట్రతో ప్రభుత్వం పచ్చి ఫాసిస్టు చర్యకు తలపడింది. సి.పి.ఐ.(ఎం) నాయకత్వంలోని ప్రభుత్వం, అణచివేత చర్యల్లో కాంగ్రెస్, బిజెపి, తెలుగుదేశం పార్టీలతో పోటీ పడుతున్నది.

ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర రాజధాని రాయ్‌పూర్‌లో 2005, డిసెంబర్ 28న సాయంత్రం 3.30 గంటలకు లోకల్ పోలీసుల సహకారంతో ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ఇంటలిజెన్స్ బ్యూరో కామ్రేడ్ నారాయణ సన్యాల్ (వయస్సు 67 సంవత్సరాలు)ను అరెస్టు చేసి, ప్రజాందోళన అనంతరం జనవరి 4న ఖమ్మం జిల్లా భద్రాచలంలో అరెస్ట్ చేసినట్టుగా చూపించి, కొత్తగూడెం కోర్టులో హాజరుపరిచింది. ఆయన పోలీస్ కస్టడీలో ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ ఎస్.ఐ.బి, ఇతర రాష్ట్రాల ఇంటలిజెన్స్ అధికారులు తీవ్రంగా వేధించారు. ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్ డిజిపి స్వరణ్‌జిత్ సేన్, ఎస్ఐబి చీఫ్ అరవిందరావులు మానసికంగా తీవ్రంగా హింసించారు.

పార్టీలో అత్యంత సీనియర్లయిన, గత నలభై సంవత్సరాలకు పైగా విప్లవోద్యమంలో అహర్నిశలు కృషి చేస్తూ, వయసు పైబడిన పొలిట్‌బ్యూరో సభ్యుల పట్ల అనుసరించిన హింసాత్మక చర్యలను తీవ్రంగా ఖండించాలి.

కామ్రేడ్ సన్యాల్ పై జహనాబాద్ జైలు బ్రేక్, అలిపిరి కేసులు పెట్టి హైదారాబాద్ చర్లపల్లి జైలులో నిర్బంధించారు. ఏప్రిల్ నెలలో కా॥ నారాయణ సన్యాల్‌కు భద్రాచలం కేసులో బెయిల్ మంజూరు కాగా, ఆయనను విడిపించడానికి మేధావులు, జర్నలిస్టులు జైలు దగ్గరకు వెళ్ళగా,పోలీసులు ఇతర కేసుల ఆధారాల సాకుతో జైలులోనే అరెస్టుచేసి నిర్బంధించారు. జైలర్ కారులో దొంగచాటుగా ఎక్కడికో తరలించారు. ఆయన ఆచూకీ ఇంతవరకూ తెలియదు.

దేశంలో ఎన్నటికంటే త్వరత్వరగా పెద్ద పెద్ద అంగలతో పురోగమిస్తున్న మావోయిస్టు ఉద్యమాన్ని అణచివేయాలనే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి మావోయిస్టు పార్టీ నాయకత్వం పట్ల అరెస్టులకూ, బూటకపు ఎన్‌కౌంటర్లకూ పాల్పడుతున్నది. వేలాది మంది పారామిలటరీ, ప్రత్యేక పోలీసు బలగాలు నిరంతరం ఉద్యమ ప్రాంతాలన్నింటా కూంబింగ్‌లు జరిపి బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. చరిత్రలో అత్యంత పాశవిక నిర్బంధానికి రంగం సిద్ధం చేస్తున్నాయి. అయితే ఈ నిర్బంధ చర్యలేవీ విప్లవోద్యమాన్ని ఆపలేవు. నిర్బంధం ప్రతిఘటనకు దారితీసి పాలకవర్గాలను కుదిపి వేయడం తప్పనిసరిగా జరుగుతుంది.

కా॥ నారాయణ సన్యాల్ ఆచూకీ తెలపాల్సిందిగా, అప్రజాస్వామిక, బూటకపు విచారణలతో అక్రమంగా మావోయిస్టు నాయకులపై కఠిన శిక్షలు విధించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యలను వ్యతిరేకించి, వారి విడుదల కోసం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాల్సిందిగా ప్రజలకూ, ప్రజాస్వామికవాదులకూ, మేధావులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

**సెంట్రల్ రీజినల్ బ్యూరో**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

పత్రికా ప్రకటన

# న్యూడెమోక్రసీ సాయుధ గూండాల ఫాసిస్టు దాడుల పరాకాష్ట ఫలితమే కారుకొండలో - ప్రజల తీర్పు

2004 ఆగస్టు నుండి నేటి వరకు ఖమ్మం జిల్లా ఇల్లెందు ప్రాంతంలో న్యూడెమోక్రసీ పార్టీ రివిజనిస్టు విధానాలను, వారి అవినీతి, అరాచకాలను, భూస్వాముల తొత్తుగిరి, వారి జులుంను వ్యతిరేకిస్తూ ప్రజలు ఉద్యమించడంతో వారి కార్యకర్తలు, సాయుధ దళాలు, పార్టీ నాయకులు ప్రజలను బెదిరించి దాడులు చేసి అడ్డుకోవడానికి పూనుకున్నారు. కొంజర్ల మండలం రాంనర్సయ్య నగర్‌లో ప్రజలపైన దాడిచేసి మహిళలపై అత్యాచారం చేసి గ్రామం నుండి వెళ్ళగొట్టారు. అదే తరహాలో కొమురారం ప్రాంతాల్లో దాడి చేయడానికి పూనుకున్నారు. కొమురారం, మాణిక్యారంలో ప్రజలు ప్రతిఘటించడంతో తోకముడిచారు. ఆ తర్వాత రెండు పార్టీల మధ్య ఘర్షణ నివారించుకుందామంటూ న్యూడెమోక్రసీ నేతలు ఉత్తరాలు వ్రాయడం, మరోప్రక్క బెదిరింపులు చేయడంతోపాటు తాటి చెట్ల కల్లు గీత బందుపెట్టి, భూములు సాగుచేసుకోనివ్వకుండా ఆక్రమించారు. మరోప్రక్క పోలీసు ఇన్‌ఫార్మర్‌గా పనిచేస్తూ కార్యకర్తల సమాచారం పోలీసులకు అందించారు.

ఈ ఘర్షణలను నివారించడానికి 2005 జనవరి నుండి ఏప్రిల్ వరకు మా పార్టీ వైపు నుండి ప్రయత్నాలు చేసినప్పటికి ఫలితం లేదు. కొమురారం ప్రాంతంలో ఎర్ర భూస్వాములుగా తమ ప్రతాపాన్ని చూపించారు. అయినప్పటికి ఘర్షణలు నివారించడానికి రెండు పార్టీలు చర్చించుకుందామని మేము ఉత్తరాలు పంపాం. అయినప్పటికి కొమురారం, పోసారం, పోలారం, మాణిక్యారం దాని చుట్టుపట్ల తండాలపై న్యూడెమోక్రసీ సాయుధ గూండాలు 2005 మేలో దాడిచేసి బీభత్సాన్ని సృష్టించి 70 మందిని కొట్టారు, ఆస్తులను ధ్వంసం చేసారు, సాంఘీక బహిష్కరణ చేశారు. వీరి భయానికి ప్రజలు గ్రామాన్ని వదిలి వలస పోయారు. ఆ తర్వాత 70 మంది పై కేసులు పెట్టారు. ఈ దాడులు ఇంతటితో ఆగకుండ టేకులపల్లి మండలం కొండెంగల బోడు గ్రామం దాని చుట్టుపట్ల తండాలపై దాడి చేసి వృద్ధులు, మహిళలు అనే తేడా లేకుండ కొట్టారు. బయ్యారం మండలం కారుకొండలోని ప్రజలపై కాల్పులు జరిపి పర్షిక బర్రయ్యను హత్య చేశారు. అనేక మందిని గాయపర్చారు. తిరిగి 2005 అక్టోబర్‌లో మావైపు నుండి చర్చల కోసం మళ్ళీ ప్రయత్నం చేయడంతో చర్చలు చేద్దామంటూ ఉత్తరాలు వ్రాసారు. మరోప్రక్క బయ్యారం ప్రాంతంలో దాడులకు శ్రీకారం చుట్టి వినోబానగర్, కారుకొండ గ్రామాలలో దాడులకు పూనుకున్నారు. మాణిక్యారం, కొమురారం నుండి 600 మందితో కారుకొండ దాని చుట్టుపట్ల గ్రామాలలో గల చేపల చెరువులను లూటి చేశారు. భూకమీషన్ మెంబర్ చేపూరి కృష్ణను చంపడానికి పూనుకున్నారు.

ఈ ఘర్షణలను నివారించడం కోసం మేము ప్రయత్నం చేస్తుండగానే 15-03-2006 నాడు 20 మందితో కూడిన సాయుధ గూండాలు అశోక్ నాయత్వంలో కారుకొండలో భూకమీషన్ సభ్యుడైన కృష్ణను చంపడానికి పూనుకోగా ఆ దాడిని పసిగట్టిన ప్రజలు దళాన్ని అడ్డుకొని ఆయుధాలు స్వాధీనం చేసుకొని వారిని శిక్షించాలని డిమాండ్ చేయగా ప్రజల తీర్పుమేరకు విచారించి  మా పార్టీ వారి ఆయుధాలు తీసుకొని తెల్లవారి వదిలి వేశారు.

అసలువిషయం చెప్పకుండా వారిని చర్చలకంటూ పిలిచి కిడ్నాప్ చేసి ఆయుధాలు గుంజుకొని వదిలివేశారని, మా ఆయుధాలు మాకు అప్పగించాలని. న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు మధు, అశోక్, కెచ్చల రంగయ్యలు అవాస్తవాలతో కూడిన ప్రకటనలు విడుదల చేశారు. ఇది అసలు విషయాన్ని మసిపూసి మారేడుకాయ చేసి ప్రజలను, ప్రజాస్వామికవాదులను నమ్మించడానికి పూనుకోవడం మాత్రమేతప్ప మరొకటి కాదు.

న్యూడెమోక్రసీ దళం తుపాకులు ప్రజలు స్వాధీనం చేసుకొని పోరాడే పార్టీకి అప్పగిస్తే, ఖమ్మం జిల్లా ఎస్.పి మావోయిస్టులకు అప్పగించిన ఆయుధాలను తీసికొచ్చి న్యూడెమోక్రసీ నాయకుడు గౌని అయిలయ్యకు అప్పగించాలని కారుకొండ ప్రజలకు హెచ్చరిక చేశాడు. న్యూడెమోక్రసీ నేతలు తమ ఆయుధాలు తమకు కావాలని డిమాండ్ చేస్తూ గ్రామాలల్లో ర్యాలీలు, ప్రదర్శనలు చేయడం చాలా విడ్డూరంగా వుంది. పోలీసులు, న్యూడెమక్రసీ సాయుధ ముఠా సంయుక్తంగా ఆయుధాలు ఇవ్వమని కోరడం అంటే ఆ ఆయుధాలతో ప్రజలపై మరిన్ని దాడులు చేయడమే దానివెనకున్న ఉద్దేశ్యం.

కారుకొండ ప్రజలు న్యూడెమోక్రసీ సాయుధ గూండాల ఆయుధాలు గుంజుకొని మావోయిస్టు పార్టీకి అప్పగించడం సమంజసమైనదే. సాయుధ రివిజనిస్టు గూండాలు, పోలీసులు సంయుక్తంగా ఇల్లెందు, కొత్తగూడెం, బయ్యారం ప్రాంతంలో హత్యాకాండకు పూనుకోగా, దాన్ని ఆపడానికి ప్రజలు పూనుకొన్నారు. ఆ ప్రజల రక్షణగా మావోయిస్టు పార్టీ, పి.ఎల్.జి.ఎ అండగా వుంటుంది, వారిని కాపాడుతుంది.

న్యూడెమోక్రసీ నాయకులారా ! చర్చలంటూనే ప్రజలపై హంతక దాడులు చేయడం మానండి. దాడులు కొనసాగినంత వరకు ప్రజల ప్రతిఘటన తప్పదు. దాడులు ఆపండని తెలియజేస్తున్నాం.

న్యూడెమోక్రసీ కార్యకర్తలారా ! సాయుధ దళ సభ్యులు ! క్రింది స్థాయి నాయకులారా ! విప్లవ ముసుగులో న్యూడెమోక్రసీ పార్టీ నాయకత్వం కొనసాగిస్తున్న విధానాలను వ్యతిరేకించండి. పోరాడేవారు న్యూడెమోక్రసీ పార్టీని, సాయుధ దళాలను విడిచిపెట్టి మావోయిస్టు పార్టీలో, పిఎల్‌జిఎలో చేరండని పిలుపునిస్తున్నాం.

విప్లవాభివందనాలతో

కా॥ జంపన్న (కార్యదర్శి)

ఉత్తర తెలంగాణ స్పెషల్ జోనల్  కమిటీ

సి.పి.ఐ.(మావోయిస్టు)

మార్చి 18, 2006

# న్యూడెమోక్రసీ ఫాసిస్టు దాడులకు ప్రతిఫలమే "బీరోనిమడుగు" ప్రజల ప్రతిఘటన

## సాయుధ రివిజనిజాన్ని తిప్పికొట్టండి-న్యూడెమోక్రసీ దుష్ప్రచారాన్నిఖండించండి!!

ఇంతకాలం విప్లవ ముసుగులో న్యూడెమోక్రసీ పార్టీ అరాచకాలు సాగాయి. ఇక ప్రజలు వారిని అడ్డుకుంటుండడంతో వారికి స్వేచ్ఛ, శాంతి, కరువైపోయింది. అందుకే ఇల్లెందు డివిజన్‌లో ప్రజలు మావోయిస్టు పార్టీ నేతృత్వంలో సాయుధ రివిజనిస్టులపై ప్రతిఘటనకు పూనుకున్నారు. దాదాపు రెండు సంవత్సరాల కాలంగా న్యూడెమోక్రసీ కోటలు బీటలు వారుతున్నాయి.

కొమురారం ప్రాంత ప్రజలు గత సంవత్సరం జూలైలో న్యూడెమోక్రసీ పార్టీ అరాచకత్వానికి , అవినీతికి అడ్డుకట్ట వేయడానికి తిరగబడ్డారు. దాదాపు రెండు సం॥రాల కాలంలో ఇటు న్యూడెమోక్రసీ, అటు రాజ్యం అణచివేతలను లెక్క చేయకుండ మొక్కవోని ధైర్యంతో పోరాడుతున్నారు. నేడు బయ్యారం మండలం ప్రజలు ముందుకు వచ్చారు. 'బీరోనిమడుగుపల్లిలో న్యూడెమోక్రసీ సాయుధ గూండాయిజానికి తగిన బుద్ధి చెప్పారు. ఫాసిస్టు దాడుల పరాకాష్టగా భూకమీషన్ కమిటీ సభ్యుడు చేపూరి కృష్ణను హత్య చేయడానికి కమాండర్ అశోక్ నేతృత్వంలో 10 మంది సభ్యుల దళం మార్చి 15, 2006నాడు ప్రయత్నించగా బీరోని మడుగు గ్రామ ప్రజలు న్యూడెమోక్రసీ సాయుధ గూండాలకు ఎదురుతిరిగి ఆయుధాలను స్వాధీనం చేసుకోవడానికి ఉపక్రమించగానే వారి కమాండర్ పట్టుకున్న ఆయుధాన్ని వదిలేసి కాలికి బుద్ధి చెప్పాడు. మిగతా 8మంది సభ్యులు మమ్మల్ని చంపవద్దని చేతులెత్తారు. ప్రజలు వాటిని స్వాధీనం చేసుకొని ఆ గూండాలకు తగిన బుద్ధి చెప్పాలని పార్టీ ముందు డిమాండ్ చేశారు. ప్రజల తీర్పు మేరకు ఆయుధాలు లాక్కొని విచారించి వారిని వదిలేశారు.

ప్రజలు న్యూడెమోక్రసీ సాయుధ దళం ఆయుధాలు స్వాధీనం చేసుకోవడాన్ని అర్థం చేసుకోవడానికి గత సం॥కాలంగా ఆ పార్టీ ప్రజలపైన కొనసాగించిన దాడులనూ పరిశీలించాలి.

న్యూడెమోక్రసీ పార్టీ సాయుధ పోరాటాన్ని నీరుగార్చుతూ ఎత్తుగడల పేరిట పార్లమెంటరీ పార్టీ అవతారమెత్తింది. సాయుధ పోరాటం పేర ప్రజలను తమ ఆధీనంలో వుంచుకోవడానికి బూర్జువా పార్టీలను తలదన్నే విధంగా సంస్కరణలను అమలు చేస్తూ పైరవీల పార్టీగా మారిపోయింది. వారి కార్యకర్తలు, నాయకులు అవినీతిపరులు, లంచగొండులుగా మారి కాంట్రాక్టర్లు, ఫైనాన్సియర్లుగా, రియల్ ఎస్టేట్ వ్యాపారులుగా అవతారమెత్తారు. కోట్లాది రూపాయల ఆస్తులు సంపాదించుకున్నారు. వీరి అవినీతిని, అక్రమాలను ప్రశ్నించిన వారిపై దాడులు చేశారు. గ్రామ బహిష్కరణ, సాంఘీక బహిష్కరణ చేశారు. భూస్వాములతో చెట్టాపట్టాలేసుకొని తిరిగారు . తమ ఎం.ఎల్.ఎ సీటును కాపాడుకోవడానికి కాంగీ, టిడిపి నాయకులతో మిలాఖత్ అయినారు. ఒక్క మాటలో చెప్పాలంటె ఎర్ర భూస్వాములుగ అవతారమెత్తి ప్రజలకు గుదిబండగా తయారయ్యారు. తాము చెప్పిందే వేదం, తాము చేస్తున్నదే సాయుధ పోరాటం అంటూ గోబెల్స్ ప్రచారానికి పూనుకున్నారు. ఈ 30 సం॥రాల కాలంలో న్యూడెమోక్రసీ పార్టీ విధానాలు ప్రజల్లో పూర్తిగా బట్టబయలయిపోయాయి. వారి జాగీర్ సాయుధ పోరాటం, దళల సిద్ధాంతం బహిర్గతమైంది. నీతి నిజాయితీ మంటగలిశాయి. వారి విధానాలు ప్రజలల్లో వెగటు పుట్టించాయి. అందుకే న్యూడెమోక్రసీ నేతలు చెప్పుకునే వారి విప్లవ కేంద్రాలను బద్దలు కొడుతున్నారు.

2004 జులైలో న్యూడెమోక్రసీ పార్టీ చివరి కోట "ఇల్లెందుకు" కొమురారం ప్రాంత ప్రజలు నిప్పుపెట్టడంతో ఎన్‌డి నేతల గుండెల్లో రైళ్ళు పరిగెత్తాయి. తమ కోటను కాపాడుకోవడానికి సామ, దాన, భేద, దండోపాయాలను అనుసరించారు. అయినా ప్రజలు తిరుగుబాటు బావుటాను ఎగురవేశారు. న్యూడెమోక్రసీ పార్టీని వ్యతిరేకించి మావోయిస్టు పార్టీలో చేరారు. మరికొందరు వారి విధానాలను భరించలేక టిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ 15సం॥రాల కాలంలో న్యూడెమోక్రసీ నేతలు, వారి సాయుధ దళాలు ప్రజలపై వేధింపులు, బెదిరింపులు చేశారు. టి.ఆర్.ఎస్ ముసుగులో వున్న మావోయిస్టులని దుష్ప్రచారానికి పూనుకున్నారు.

ఒకపక్క వీరి సాయుధ దళాల బెదిరింపులూ, మరోపక్క వీరి నాయకులు పోలీస్ ఏజెంట్లుగా మారి మావోయిస్టు కార్యకర్తల పేర్లు కరపత్రాలలో ప్రకటించి బహిరంగ ఇన్‌ఫార్మర్స్‌గా పనిచేస్తే, వీరి కార్యకర్తలు రహస్యంగా మావోయిస్టు కార్యకర్తల, దళాల సమాచారం చేరవేస్తూ ఇన్‌ఫార్మర్స్‌గా పనిచేస్తున్నారు. మరోప్రక్క పార్టీని రాజకీయంగా దెబ్బతీయడానికి "విప్లవ కేంద్రాలల్లో మావోయిస్టులు బూర్జువా పార్టీల జెండాలు ఎగురవేస్తూ విప్లవోద్యమానికి తూట్లు పొడుస్తున్నారు. పాలక వర్గాలకు తోడ్పడుతూ వారికి కాపలా కుక్కల్లా పనిచేస్తున్నారు. ఇది ఏ మార్క్సిజమో తెలియజేయాలని, నమ్ముకున్న సిద్ధాంతం కొరకు ప్రజలకు సేవచేయాలనే దృఢ సంకల్పం ఉంటే విప్లవ చైతన్యంతో

మార్క్సిస్టు జెండాను ఎందుకు మోయడం లేదు'' అని దుష్ప్రచారం చేశారు. మరోపక్క ప్రదర్శనలు చేస్తూ ఎప్పటికప్పుడు అబద్ధాలతో కూడిన కరపత్రాలు అందంగా ప్రచురిస్తూ ప్రజలను, మేధావులను నమ్మించడానికి పూనుకున్నారు. అబద్ధాలతో నమ్మించడంలో న్యూడెమోక్రసీ నేతలది అందెవేసిన చేయి. దాడులకు, బెదిరింపులకు, అబద్ధాల ప్రచారానికి న్యూడెమోక్రసీ ముందు పీఠిన వుంటుంది. రెండు పార్టీల మధ్యన తలెత్తిన ఘర్షణలను నివారించుకోవడానికి సిద్ధమేనంటూ మేధావులకు, మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీకి లేఖలు వ్రాసింది.

ఈ ఘర్షణలను నివారించుకోవడానికి గాను చర్చలకు తాము కూడా సిద్ధమేనంటూ మావోయిస్టు పార్టీ ఉత్తర తెలంగాణా స్పెషల్ జోనల్ కమిటీ 2005 జనవరిలో లేఖలు రాసింది. కాని 'న్యూడెమోక్రసీ' వారు కుంటిసాకులు చెప్పి చర్చలకు రాలేదు. ఏప్రిల్‌లో కూడా మావోయిస్టు పార్టీ ప్రయత్నాలు చేసింది. న్యూడెమోక్రసీ నేత మధు ఎంపిపి బొర్ర వీరస్వామిని హత్యచేసి, తన కామవాంచకు అడ్డులేకుండ చేసుకొని మావోయిస్టులే పథకం ప్రకారం హత్యచేసి తన మీదకు నెట్టి వేస్తున్నారని అబద్ధాల ప్రచారానికి పూనుకున్నాడు. ఈ హత్యా నేరాన్ని మావోయిస్టు కార్యకర్తలపై నెట్టివేయడానికి దొంగ సాక్ష్యాలు చెప్పించడానికి మధు, వీరి ఆర్గనైజర్లు కలిసి చేయరాని ప్రయత్నమంటూ లేదు. అక్రమ కేసులు పెట్టి చివరకు అబాసుపాలైనారు.

ప్రభుత్వ దాడి తీవ్రతరం కాగానే న్యూడెమోక్రసీ పార్టీ, కార్యకర్తలు, నాయకులు దీన్ని అవకాశంగా తీసుకొని మావోయిస్టు కార్యకర్తల పేర్లు పోలీసులకు అందించారు. అనేకసార్లు ఇన్‌ఫార్మర్ గిరికి స్వస్తిపలకాలని ఆ పార్టీకి, ప్రజలకు బహిరంగంగా మావోయిస్టులు తెలియజేశారు. అయినా ఫలితం లేదు.

న్యూడెమోక్రసీ పార్టీ టిఆర్ఎస్ పార్టీని అడ్డుకునే పేర మావోయిస్టు పార్టీ కార్యకర్తలను మానసికంగా, ఆర్థికంగా క్రుంగదీయాలని ప్రయత్నించారు. జగిత్యాల పల్లెల్లో భూస్వాములకు ప్రజలు సాంఘిక బహిష్కరణ చేసి లొంగదీసుకుంటె ఈ ఎర్ర భూస్వాములు రడం శ్రీను హోటల్‌కు ఎవ్వరు వెళ్ళవద్దని హుకుం జారీ చేశారు. నల్లమాస కృష్ణ అక్కా, బావల దుకాణాలకు వెళ్ళవద్దని, సామాను ఎవరూ తీసుకోవద్దని, వారి రైస్ మిల్లుకు వెళ్ళవద్దని హుకుం జారీ చేశారు. చిర్ర కృష్ణ (గతంలో వీరి కార్యకర్త) గ్రామ సమిష్టికి ఇవ్వాలని అప్పుకింద తను న్యూడెమోక్రసీ పార్టీలో వున్నప్పుడు ఆక్రమించుకున్న పోడు భూమిని అమ్మకోడానికి ప్రయత్నించగా, చిర్ర కృష్ణ భూమిని ఎవ్వరు కొనడానికి వీలులేదని డప్పు చాటింపు చేయించారు. ఆ భూమిలో ఎర్ర జెండాలు పాతి 40 నాగళ్ళతో దున్నించారు. పోలారంలో టిఆర్ఎస్‌లో చేరిన గౌడ్స్ తాళ్ళను బందు పెట్టించారు. తాళ్ళకు పోవాలంటె టిఆర్ఎస్ పార్టీకి రాజీనామ చేసి రావాలి లేకుంటె గిరిజనులు తాళ్ళు ఎక్కుకుతారని 1/70 చట్టాన్ని అమలు చేయిస్తామని ప్రకటించి మధు శరతు పెట్టాడు. విధిలేక 5,6 కుటుంబాలు లొంగిపోయినాయి. టి.ఆర్.ఎస్ పార్టీకి రాజీనామాలు చేశారు. ఇదేతరహాలో కొమురారంలో గిరిజనుల భూముల్లో తాళ్ళు వాళ్ళే ఎక్కే విధంగా మోకు మొత్తాదులు కట్టించి ఎక్కించారు. కొమురారంలో ఎవరూ లొంగి రాకపోవడంతో తాటి గెలలు కోసేశారు. గౌడ్స్, ఆదివాసీలను తిట్టారని మధు అబద్ధాల ప్రచారం చేసి గౌడ్స్‌కు ఆదివాసులకు ఘర్షణలు సృష్టించాడు. తాళ్ళు కావాలనుకునేవాళ్ళు టి.ఆర్.ఎస్ కు రాజీనామ చేయాలని హెచ్చరించారు. కుల సమస్యను రెచ్చగొట్టవద్దని, అలాంటి సమస్యల్లో తలదూర్చడం సరైంది కాదని నిలదీయడంతో మధు పక్కకు తప్పుకున్నాడు. వారి కార్యకర్తలతో ప్లాన్ ప్రకారం సమస్యను జటిలం చేయడంతో తాళ్ళు ఎండిపోయి 40 కుటుంబాలు 25,000 నష్టం పొందాయి. పోలారంలో రంగన్న బోర్‌వెల్‌ను రాళ్ళతో నింపి పగులగొట్టారు. నల్లమాస కృష్ణకు చెందిన 4 ఎకరాల పొలంకు నీటి సౌకర్యం లేకపోవడంతో మరో బావి వద్ద నుండి తన పొలం వరకు వేరే రైతుల భూమిలో పైపులైన్ వేసుకుంటె ఆ పైపులను పీకివేసి పంట పండించుకోకుండ అడ్డుకున్నారు. కృష్ణ తండ్రి, తమ్ముడు, అక్కలు, బావలు ఎన్‌డి నాయకులను కలిసి ప్రాధేయపడితే కూడా పైపులు వేసుకోనీయలేదు. కృష్ణను చంపుతామని హెచ్చరించారు. చివరకు కృష్ణ తండ్రి మధు కాళ్లు పట్టుకోవడంతో వదిలిపెట్టారు. ఆసమస్యలను వేధింపులను భరించలేక కృష్ణ తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆర్థికంగా, మానసికంగా, రాజకీయంగా ఎన్నివిధాల వేధింపులు చేసిన కొమురారం, పోలారం ప్రజలు లొంగిపోకపోవడంతో మరింత రెచ్చిపోయారు. 2005 ఏప్రిల్ 15 తేదీనాడు పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా పనిచేస్తున్న పోసారంకు చెందిన హతిరాం రాఘవులు, జరపల రాంబాబు తమ్ముణ్ణి దళం శిక్షించింది. దీన్ని సాకుగా తీసుకొని మధు నేతృత్వంలో ఏప్రిల్ 16 నాడు 70 మంది గూండాలతో కొమురారం, పోలారం, పోసారం, బొంబాయితండా, సర్వేతండా, గొర్రెల బొంత తండాలపై ఒకే సారి దాడిచేసి 38 మందిని కొట్టారు. ఇందులో 8 మంది పరిస్థితి తీవ్రంగా మారింది. మహిళలు వృద్ధులు అనే తేడా లేకుండ చిత్రహింసలు పెట్టారు. ఆస్తులను విధ్వంసం చేశారు. ఇండ్లలోని సామాను ధ్వంసం చేసారు, ఫర్నిచర్, టెలిఫోన్స్, దుకాణాల అద్దాలు

పగులగొట్టారు. పోలారంలో ఒజ్జ రంగన్న బోర్‌వెల్‌ను బండలతో నింపి పాడు చేశారు. బుచ్చన్న ట్రాక్టర్ ధ్వంసం చేశారు. గౌడ్స్ తాటి గెలలను కోసివేశారు. టిఆర్ఎస్ వాళ్ళు ఇండ్లకు, కూలర్స్‌కు గులాబిరంగు వేస్తే వాటిని గీకించి ఎర్ర రంగు వేయించారు. ఆటో డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వర్ రావును నెక్కర్‌పై చేతులు కట్టేసి కొట్టుకుంటూ గ్రామమంతా తిప్పారు. ఈ గ్రామాలు ఒకనాడు భూస్వాములను ఎదిరించి గడగడలాడించాయి. నేడు ఈ ఎర్ర దొరలే ప్రజలపై తెల్లబీభత్సాన్ని సృష్టించారు.

అకస్మాత్తుగా జరిగిన ఈ దాడిలో చెల్లాచెదరయిన ఈ గ్రామ ప్రజలను ఎల్లనగర్‌కు చెందిన సంతు వెంకటరాం కలిసి మసివాగువద్దనుండి వెనక్కు తీసుకొచ్చి కొట్టి వదిలివేశారు. ఈ దాడిలో మర్రి గూడెం రమేష్ (మాజీ దళ కమాండర్, గూండా) పోలీసులకు ఫోన్ చేసి దళం గుట్టపై వుందని సమాచారం ఇచ్చాడు. చెట్టుపల్లి, శంబునిగూడెం, కాచనపల్లి గ్రామాలవద్ద మనం దాడిచేస్తే కౌంటర్ దాడి చేయాలని పాయం లక్ష్మయ్య నేతృత్వంలో దాడి చేయడానికి కార్యకర్తలను సిద్ధం చేసుకొని ఉన్నారు. ఈ దాడి చేయడమేకాకుండా ఏనుగుల రాంబాబును శిక్షించినందుకు అతని భార్యను రేప్ చేశారని 14 మందిపై కేసులు పెట్టారు. ఇదే క్రమంలో శంబునిగూడెం వద్ద పోలీసులపై మందుపాతర పేల్చడంతో మరో 60 మందిపై కేసులు పెట్టారు. ఈ దాడి తర్వాత మధు నాటకీయంగా అరెస్టై జైళుకు వెళ్లాడు. ఆతర్వాత న్యూడెమక్రసీ పార్టీ టేకుపల్లి, బయ్యారం మండలాలపై కొమురారం తరహాలో దాడి చేయడానికి అశోక్ నేతృత్వంలో 20 మందితో దళాన్ని ఏర్పాటు చేసి దాడులకు శ్రీకారం చుట్టారు. 2005 మేలో టేకుపల్లి మండలం కొండెంగల బోడు గ్రామం, దాని చుట్టుపట్ల తండాలపై దాడిచేసి ముసలీ, ముతక, స్త్రీలనే తేడా లేకుండా జనాన్ని కొట్టారు. మోటార్ సైకిల్ ను కాలబెట్టారు.

బయ్యారం మండలంలో జరిగిన కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో పరాభవంపాలైన ఎన్‌డి నేతలు ఈ ప్రాంతాన్ని తమ ఆధీనంలో తెచ్చుకోవడానికి దాడులకు పథకరచన చేశారు. కారుకొండకు పనులపై వెళ్ళిన మా కార్యకర్తలపై దాడి చేయడానికి పూనుకున్నారు. ఆ దాడిలో టి.ఆర్.ఎస్ నాయకుడు చేపూరి రవిని చంపడానికి వెళ్లామని తప్పుడు ప్రచారానికి లంకించుకున్నారు. 2005 ఆగస్టు 13న కారుకొండలో చేపూరి రవి ఇంటిపై ఈ సాయుధ ముఠా దాడి చేయగా చేపూరి రవి తప్పించుకోగా పర్షిక బర్రయ్య చనిపోగ అనేక మంది గాయాలపాలైనారు. ఒక్కదెబ్బతో రెండు పిట్టలనే విధానాన్ని అవలంభించి బయ్యారం మండలంలో మావోయిస్టులను బలపడకుండా చేయడం, టిఆర్ఎస్ అడ్డు తొలగించుకోవడం లక్ష్యంతో బయల్దేరారు. కాని వారి లక్ష్యం నెరవేరలేదు. కారుకొండ ప్రజలు న్యూడెమోక్రసీ గూండాల దాడిని పసిగట్టి అడ్డుకోవడంతో వాది పథక రచన విఫలమైంది.

న్యూడెమోక్రసీ నేతలు చర్చలంటూనే తమ యుద్ధ నీతిని ప్రదర్శించారు. అయినప్పటికి ఎన్‌డి పార్టీతో ఘర్షణలు నివారించుకోవడానికి మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ నుండి మళ్ళీ చర్చలకోసం 2005 అక్టోబర్‌లో ఉత్తరం రాయడం జరిగింది. చర్చలకు తాముకూడా సిద్ధమేనంటు ఎన్‌డి పార్టీ వాళ్లు ఉత్తరం రాశారు. కాని అక్టోబర్ నుండి జనవరి వరకు శత్రు దాడుల మూలంగా చర్చలకు వెళ్లలేని అనివార్య పరిస్థితి ఏర్పడింది. కాని న్యూడెమక్రసీ పార్టీ తమ బెదిరింపులు, వేధింపులు, దాడుల విధానాన్ని మానలేదు. తాజాగా బయ్యారం మండలంలో ఘర్షణలకు పూనుకుంది. ఈ మండలం నుండి ప్రజలు హైదరాబాద్‌లో జరిగిన నల్ల కోబ్రాల వ్యతిరేక మీటింగ్‌కు వెళ్ళినందుకు ప్లాన్ ప్రకారంగానే న్యూడెమక్రసీ నేతలు వారి గ్రామ కార్యకర్తలతో బెదిరింపులు చేసి దాడి చేశారు. ఆతర్వాత ప్రజలు తిరగబడి దాడి చేయడంతో తోక ముడిచారు. అయినప్పటికి ఆదాడుల పరంపర కొనసాగించడానికే పూనుకున్నారు. ఈ మండలంలో చేపల చెరువులను కాంట్రాక్ట్ పట్టిన వారిని బెదిరించారు. ఆ తర్వాత ఆ నాలుగు చెరువులను లూటి చేయడానికి కొమురారం, మాణిక్యారంల నుండి 600మంది వారి కార్యకర్తలను, సానుభూతిపరులను తీసుకెళ్ళారు. ఆ తర్వాత కారుకొండలో భూకమిషన్ కృష్ణను చంపడానికి అశోక్ నేతృత్వంలో 10 మందితో కూడిన దళం 15.03.2006న ప్రయత్నించి, అతను అక్కడ దొరకకపోవడంతో అదేరోజు రాత్రి బీరోని మడుగు గ్రామంలో అనారోగ్యంతో ఉన్న కృష్ణను చంపడానికి ఆ గ్రామానికి చేరుకున్నారు. వీరు కృష్ణను చంపడానికే వస్తున్నారని తెలిసి మావోయిస్టు దళం ఈ దాడిని ఆపడానికి ప్రయత్నించింది. ఏ సమస్యలైనా చర్చల ద్వారా పరిష్కరించుకుందామని మావోయిస్టు దళ కమాండర్ అశోక్‌కు ఉత్తరం ద్వారా తెలిపాడు. కాని వారు తప్పుకొనిపోయి కృష్ణ వున్న ఇంటిని చుట్టుముట్టి దాడి చేయడానికి పూనుకోగా ప్రజలు వారిని పసిగట్టి అడ్డుకున్నారు. మావోయిస్టు పార్టీ నాయకులు, దళాలు అక్కడికి చేరుకోగానే ప్రజలు ఎన్‌డి దళానికి చెందిన 9 తుపాకులను గుంజుకొని శిక్షించాలని డిమాండ్ చేయడంతో వారి తీర్పుమేరకు ఆయుధాలను స్వాధీనం చేసుకొని దళ సభ్యులను విచారించి వదిలివేయడం జరిగింది. న్యూడెమోక్రసీ పార్టీ, అటుపోలీసులు కలిసి ప్రజలపై దాడులు

*(మిగతా 23వ పేజీలో.....)*

*(60 వ పేజీ తరువాయి.....)*

ఇటువంటి దుర్భర పరిస్థితిపై చెలరేగే అశాంతిని అక్కడి రాజరిక వ్యవస్థ నిరంకుశంగా అణచివేస్తూ వచ్చింది. దీనిలో భాగంగానే 1961లో అప్పటి రాజు త్రిభువన్ అన్ని రాజకీయ పార్టీలను నిషేధించాడు, ఎన్నో అణచివేత చట్టాలను తెచ్చాడు. అట్లా దేశమంతా ఒక చీకటి రాజ్యంగా మారిన పరిస్థితిలో 1990లో దేశంలో పెద్ద తిరుగుబాటు వచ్చింది. అప్పుడు రాజుగా వున్న బీరేంద్రకు ప్రజా ఉద్యమానికి తలవంచక తప్పలేదు. ఫలితంగా పార్టీలపై ఆంక్షలను సడలించాడు. అన్ని అణచివేత ఆర్డినెన్స్‌లనూ ఉపసంహరించాడు. ఎన్నికలను జరిపి, పార్లమెంట్‌ను ఏర్పాటు చేశాడు. నూతన రాజ్యాంగాన్నీ ఏర్పాటుచేశాడు. ఈ రాజ్యాంగానికి లోబడే రాజు అధికారాలు ఉండేవిధంగా చర్యలు తీసుకున్నాడు.

అయితే 2001లో సామ్రాజ్యవాదం కుట్రచేసి బీరేంద్రను హతమార్చి అతని తమ్ముడు జ్ఞానేంద్రను గద్దెనెక్కించింది. సామ్రాజ్యవాద అండతో గద్దెనెక్కిన జ్ఞానేంద్ర పచ్చి నియంతలా వ్యవహరించాడు. అతను రాజరికాన్ని రాజ్యాంగబద్ధమైనదిగా భావించలేదు. తనకు చిత్తం వచ్చినట్లుగా అధికారాలను వినియోగించాడు. 2002 అక్టోబర్‌లో ప్రజా పార్లమెంటును రద్దుచేసి తాను నియమించిన నామమాత్రపు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాడు. 2005 ఫిబ్రవరిలో ఆ నామమాత్రపు ప్రభుత్వాన్ని కూడా రద్దుచేసి సర్వాధికారాలను తానే చేపట్టాడు. దేశంలో ఎమర్జెన్సీ విధించి, ప్రసారమాధ్యమాల నోళ్లునొక్కి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను తెచ్చుకున్నాడు. ఆ వ్యతిరేకత నేడు దావానలమై రాజ భవనాన్ని చుట్టు ముట్టింది.


## దావానలాన్ని సృష్టించిన సి.పి.ఎన్.(మావోయిస్ట్)

భారతదేశం వంటి దేశాల్లో రివిజనిజంపై జరిగిన పోరు, ముఖ్యంగా నక్సల్బరీ పోరాట ప్రభావం నేపాల్ విప్లవకారులపై పడింది. ఆ ప్రభావంతో రివిజనిజం పై గట్టి పోరాటం చేసి 1988లో నేపాల్ కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్ట్) ఏర్పడింది. ఎన్నికలను ఒక ఎత్తుగడగా వినియోగించుకోవాలనే ఉద్దేశ్యంతో 1991లో జరిగిన ఎన్నికల్లో పాల్గొని 11 పార్లమెంట్ సీట్లను గెలుచుకుంది. 1995 కల్లా దేశ నిర్దిష్టపరిస్థితులకు అనుగుణమైన వ్యూహాన్ని రూపొందించుకుంది. నూతన ప్రజాస్వామిక విప్లవ రాజకీయాలను విశేషంగా ప్రచారం చేసి 1996 ఫిబ్రవరి 13 నుంచి ప్రజాయుద్ధాన్ని మొదలుపెట్టింది. ప్రజాయుద్ధాన్ని మొదలుపెట్టేముందు పార్లమెంట్‌లో వున్న తన సభ్యులను వెనక్కి తీసుకుంది. పార్టీ యావత్తూ రహస్యమైపోయింది. ప్రజాయుద్ధం ప్రారంభంలోనే అనేక సంచలనాత్మక దాడులకు పాల్పడింది. మొత్తం చిన్నవీ పెద్దవీ కలిపి జరిగిన 5,550 దాడులు శత్రు వర్గాల్లో తీవ్ర కలవరాన్ని సృష్టించాయి. పార్లమెంట్‌ను సంక్షోభంలో పడవేశాయి.

ఆ తర్వాత క్రమంగా కోలుకున్న రాజ్యం పార్టీపై తీవ్రమైన అణచివేతను ప్రయోగించింది. ముఖ్యంగా జ్ఞానేంద్ర అధికారంలోకి వచ్చాక సామ్రాజ్యవాద మద్దతుతో తీవ్ర అణచివేతను ప్రయోగించాడు. అతని హయాంలోనే రాయల్ నేపాల్ ఆర్మీ విచ్చలవిడి హింసకు పాల్పడింది. మహిళలపై జుగుప్సాకరమైన అత్యాచారాలకు పాల్పడింది. వేలాది మంది ప్రజలను హత్య చేసింది. ఈ హింస కోసం ఇంగ్లాండ్, అమెరికాలు 22 మిలియన్ డాలర్ల సహాయం అందించాయి. అమెరికా 12 మంది సైనిక నిపుణులను నేపాల్‌కు పంపింది. భారతదేశం ఆయుధాలూ, మందుగుండూ, అనేక హెలీకాప్టర్లను పంపింది. అంతేకాక సి.పి.ఎన్.(మావోయిస్ట్) కేంద్రకమిటి సభ్యులతో సహా కొంతమంది విప్లవకారులను భారత్‌లో అరెస్ట్‌చేసి నేపాల్‌కు అప్పగించింది. ఇంత హింసను ప్రయోగించినా ఉద్యమాన్ని అణచివేయడంలో నేపాల్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. రాజ్య నిరంకుశ పాలనపట్ల ప్రజల్లో మరింత కసిని పెంచడంలో మావోయిస్ట్ పార్టీ సఫలమైంది. ఫలితంగా నేడు 80 శాతం భూభాగంపై మావోయిస్ట్‌లు అధికారం సాధించారు. రెండున్నర కోట్ల మంది వున్న నేపాల్ జనాభాలో కోటి మంది ప్రజలు మావోయిస్టు పార్టీ బలమైన ప్రభావంలో ఉన్నారు. రైతుకూలీలు, కార్మికులు, పెటీ బూర్జువా, జాతీయ బూర్జువాలనూ, వివిధ మైనారిటీలనూ, జాతులను ప్రజాయుద్ధం తనలో విలీనం చేసుకుంటూ పెద్ద పెద్ద అంగలతో పురోగమిస్తూ నేడు వ్యూహాత్మక ఎదురు దాడి స్థితికి చేరుకుంది. అందులోనూ మొదటి దశను విజయవంతంగా పూర్తి చేసింది. నేడు దేశం రెండు కేంద్రాలుగా చీలిపోయింది. ఒక కేంద్రం రాయల్ ప్యాలెస్ (రాజ భవనం) అయితే, మరొక కేంద్రం మావోయిస్టు అధికారం కొనసాగుతున్న రోల్పా.

నేడు ఉద్యమం ఈ స్థాయికి చేరుకుందంటే భౌతిక పరిస్థితికి అనుగుణమైన వ్యూహం, ఎత్తుగడలను మావోయిస్టు పార్టీ అవలంబించడమే కారణం. దీర్ఘకాలిక ప్రజాయుద్ధ వ్యూహాన్ని ఎంచుకోవడం, దేశ భౌగోళిక పరిస్థితిని అధ్యయనం చేసి వ్యూహాత్మక ప్రాంతాలను ఎంచుకొని బేస్ ఏరియాలను ఏర్పాటు చేయడం, ప్రాంతాలవారిగా అధికారాన్ని హస్తగతం చేసుకోవడం, సాహసోపేతమైన, కీలకమైన మిలటరీ దాడులకు పాల్పడి విజయవంతం చేయడం, ఇవన్నీ ఉద్యమ స్థాయిని త్వరితగతిన అభివృద్ధి చేశాయి. ఉద్యమాభివృద్ధికి దోహదం చేసే ఎత్తుగడల్లో భాగంగానే 2001లో అది దేవ్‌బా ప్రభుత్వంతో చర్చలకు వెళ్లింది. చర్చల నియమావళికి తాను బాధ్యతాయుతంగా కట్టుబడి వుంటూ ప్రభుత్వం చిత్తశుద్ధిని ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజల, ప్రజాస్వామికవాదుల, మేధావులపై మంచి ప్రభావాన్ని వేసింది. చర్చలు ఇంక కొనసాగడం అనవసరం అని భావించినప్పుడు చర్చల నుండి ఉపసంహరించుకుంటున్నామని ప్రకటించి వెంటనే మూడు జిల్లా కేంద్రాలపై భారీ దాడులకు పాల్పడి శత్రువుకు తన శక్తిని చాటింది.

ఈ రకంగా ప్రజలను గెలుచుకుంటూ ముందుకు పోతున్న ఉద్యమం నేడు ఒక కీలకమైన దశలో వుంది. అయితే 80 శాతం భూభాగంపై మావోయిస్టుల అధికారం ఉన్నప్పటికీ శత్రువుకు బలమైన కేంద్రాలైన పట్టణాలు ఇంకా స్వాధీనంలోకి రావల్సే వుంది. శత్రు సైన్యం, దాని ఆయుధ సంపత్తి, దానికున్న సామ్రాజ్యవాదుల అండను పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుతం ప్రపంచంలో ఎక్కడా సోషలిస్టు శిబిరం లేని పరిస్థితిలో రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకోవడం మావోయిస్ట్ పార్టీకి అంత సులువైన విషయం కాదు. ఇంకా కొన్ని సెక్షన్ల ప్రజలను, ముఖ్యంగా వివిధ రాజకీయ పార్టీల వెనుక వున్న ప్రజలను గెల్చుకోవాల్సిన అవసరం వుంది.




## రాజుపట్ల వెల్లువెత్తిన నిరసన - ప్రస్తుత పరిణామాలు

మావోయిస్ట్ ఉద్యమ స్థితి ఇలా వుండగా 2002లో పార్లమెంట్ రద్దునుండి జ్ఞానేంద్ర నిరంకుశ వైఖరిపట్ల ప్రజల్లో తీవ్ర నిరసన వ్యక్తంకాసాగింది. కనీస ప్రజాస్వామ్య వాతావరణంలేని, నామమాత్రపు పార్లమెంటరీ వ్యవస్థ కూడా అమలులో లేని స్థితిలో, పార్లమెంటరీ వ్యవస్థ పునరుద్ధరణ, రాజ్యాంగ సభ ఎన్నిక వంటి కనీస ప్రజాస్వామిక డిమాండ్ల సాధన కోసం చేసే పోరాటం ప్రజల్లో మంచి కదలికను తీసుకువస్తుందనీ, ప్రజలందరిని ఒక్కతాటిపైకి తెస్తుందనీ పార్టీ ఆశించింది.

అందుకే గత కొన్ని నెలలుగా ఎన్నో ప్రజా ఆందోళనలను నిర్వహిస్తూ వచ్చిన పార్టీ, తాజాగా ఏడు పార్టీల కూటమితో 12 అంశాలతో కూడిన కార్యక్రమంతో ఐక్య సంఘటన కట్టింది. మొత్తంగా వీటన్నింటి సారధ్యంలో ఉధృతమైన ప్రజాందోళనలు చెలరేగాయి. ఈ ఉద్యమాన్ని జ్ఞానేంద్ర నిషేధాలూ నిర్బంధాలతో అణచివేయాలని చూశాడు. ఏ ఇద్దరు కూడినా నేరమని నిషేధాజ్ఞలు విధించాడు, కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులను జారీ చేశాడు. అయినా లెక్కచేయని ప్రజలు వేలు, లక్షలుగా కదిలి అనేక ర్యాలీలు, సభలు, ప్రదర్శనలు నిర్వహించారు. నాలుగు రోజులపాటు దేశవ్యాప్త బందును పాటించారు. రాజు తన సైనిక మూకలతో ఈ ప్రదర్శనలపై కాల్పులు జరిపించాడు. మొత్తంగా మూడు వారాల పోరాటంలో 14 మంది ఉద్యమకారులు చనిపోయారు, వందల సంఖ్యలో గాయపడ్డారు, అనేక మంది అరెస్టులకు గురయ్యారు. అయినా వెనక్కి తగ్గని ప్రజలు ఏప్రిల్ 20వ తేదీన, 10 లక్షల మంది ప్రభంజనంలా కదిలి ఖాట్మండ్‌ను చుట్టు ముట్టారు. అలా చుట్టుముట్టి రెండు రోజులు దిగ్బంధనం చేశారు.ఆ తర్వాత రాజ భవనం వైపుకి కదిలారు. అడుగడుగునా అడ్డుకుంటున్న సైన్యాన్ని ఎదుర్కొంటూ ముందుకు కదిలారు. వీరిపై సైన్యం జరిపిన కాల్పుల్లో నలుగురు చనిపోగా, 100 మంది గాయపడ్డారు. అయినా ప్రజలు వెనుతిరగలేదు, చెల్లాచెదురు కాలేదు. మొక్కవోని దృఢదీక్షతో ముందుకు కదిలి రాజభవనాన్ని సమీపించారు. ముందుకు సాగుతున్న ప్రజలపై సైన్యం భాష్పవాయు గోళాల్ని విచ్చలవిడిగా ప్రయోగించింది. వాటి ప్రభావం లేకుండా చేయడానికి స్థానిక ప్రజలు దారి పొడవునా ఆందోళనాకారులపై నీళ్లు చల్లుతూ పోరాటానికి తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

ఇక లొంగిరాక తప్పలేదు జ్ఞానేంద్రకు. లేకుంటే ప్రజల కోపాగ్నిలో తన ప్యాలెస్ నేలమట్టం అవుతుందనీ, సింహాసనం కుప్పకూలిపోతుందని అర్థం చేసుకున్నాడు. అమెరికా, ఇంగ్లాండ్, భారత దేశాలు కూడా ప్రస్తుత పరిస్థితి నుంచి గట్టెక్కడం కోసం తలవంచమని ఆదేశించాయి. దానితో ఏప్రిల్ 21వ తేదీన జ్ఞానేంద్ర తాను రాజకీయ అధికారాన్ని వదులుకుంటున్నాననీ, త్వరలో ఎన్నికలు జరిపిస్తాననీ, అప్పటిదాకా ప్రస్తుత మంత్రిమండలి కొనసాగుతుందని ప్రకటించాడు. అంతవరకూ ఎవరినైనా ప్రధానిగా ఎన్నుకోమని 7 పార్టీల కూటమిని కోరాడు. రాజు ప్రతిపాదనను ప్రజా ఉద్యమం నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. పార్లమెంట్ పునరుద్ధరణ, రాజ్యాంగ సభ ఎన్నిక, రాజరికానికి స్వస్తి, మావోయిస్ట్‌లతో చర్చలు తప్ప మరే ప్రతిపాదనను ఒప్పుకునేది లేదని తేల్చి చెప్పింది. మావోయిస్టులతో సంబంధం లేకుండా ఏడు పార్టీల కూటమితోనే ఒప్పందం కుదుర్చుకునే ప్రయత్నం చేశాడు జ్ఞానేంద్ర. కానీ ఇంత ప్రజా ఉద్యమానికి మూలకారణమైన మావోయిస్టు పార్టీ ప్రమేయం లేకుండా రాజుకు ఒప్పందం చేసుకునే అవకాశం లేకుండా పోయింది. దానితో ఏప్రిల్ 27వ తేదీన పార్లమెంటును పునరుద్ధరిస్తున్నట్టు ప్రకటించక

తప్పలేదు జ్ఞానేంద్రకు. ఆ తర్వాత పార్లమెంట్ సమావేశంలో నేపాలీ కాంగ్రెస్ పార్టీకి చెందిన గిరిజా ప్రసాద్ కొయిరాలను ప్రధానిగా ఎన్నుకున్నారు. నూతన ప్రభుత్వం రాజ్యాంగ సభకు ఎన్నికలు జరుపుతామని పార్లమెంట్‌లో తీర్మానం చేసింది. పార్లమెంటు పునరుద్ధరణ జరగగానే మావోయిస్టు పార్టీ కాల్పుల విరమణను ప్రకటించింది. కొయిరాల ప్రభుత్వం దీనికి ప్రతిస్పందనగా తాను కూడా కాల్పుల విరమణను ప్రకటించి, పార్టీపై నిషేధాన్ని ఎత్తివేసింది. అమెరికా వేసిన టెర్రరిజం ముద్రను తొలగించి, చర్చలకు పిలుపునిచ్చింది. కొన్ని షరతులకు లోబడి చర్చలు జరుపుతామని చర్చలు విజయవంతమైతే ఎన్నికల్లో పోటీ చేస్తామని మావోయిస్టు పార్టీ ప్రకటించింది.

అయితే ఇక్కడ ఏడు పార్టీల కూటమి స్వభావాన్ని అర్థం చేసుకోవడం అవసరం. ఇందులోని నేపాలీ కాంగ్రెస్ పార్టీ, సి.పి.ఎన్ (యు.ఎం.ఎల్) వంటి పార్టీలు ఇన్నాళ్లూ రాజరికాన్ని బలంగా సమర్థించినాయి. దళారీ నిరంకుశ బూర్జువావర్గానికి చెందిన కొయిరాల మావోయిస్టు పార్టీ వ్యతిరేకి. నేపాలీ కాంగ్రెస్ పార్టీ, మావోయిస్టు పార్టీపై అణచివేతను ప్రయోగిస్తే, యు.ఎం.ఎల్ ఆ అణచివేతను బలంగా సమర్థించింది. రాజుతో అధికారంలో వాటాకోసం కుమ్ములాటలు తప్ప ఇతర విభేదాలు లేవు వీటికి. అయినప్పటికీ ప్రజాభిప్రాయానికి ప్రాతినిధ్యం వహించక తప్పని పరిస్థితుల్లో రాజరిక వ్యతిరేక పోరులో చురుగ్గా పాల్గొన్నాయి. ఈ పార్టీలపట్ల మావోయిస్టు పార్టీకి స్పష్టమైన అవగాహననే వుంది. 2003లో కా॥ ప్రచండ ప్రవేశపెట్టిన "ప్రస్తుత పరిస్థితి మన చారిత్రక కర్తవ్యం" అనే పత్రంలో " రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రత్యేకించి రాజకుటుంబ ఊచకోత తర్వాత రాజరికం, పార్లమెంటరీ శక్తులను ఒకటి జాతీయతా, ప్రజాస్వామ్యం కలది, మరొకటి కాదు అని చూడడం సరైనది కాదు, ప్రత్యేకించి నష్టదాయకం అన్నది పార్టీ మొత్తానికి స్పష్టత ఉండాలి. వారి మధ్య వైరుధ్యాలను నిర్దిష్ట పరిస్థితిలో ఉపయోగించుకోవడం తప్ప రాజరికంతోగానీ, పార్లమెంటరీ గ్రూపులతోగానీ మనకు ఎటువంటి సిద్ధాంత, రాజకీయ సంబంధం లేదని నేటి నేపాల్ పరిస్థితిలో మరింత స్పష్టమైంది. రాజరిక శక్తులు చర్చల పేరుతో మనల్ని ఉపయోగించుకొని, అమెరికా సామ్రాజ్యవాద సహాయంతో మన ఉద్యమాన్ని చుట్టుముట్టి, తమ ప్రభుత్వాన్ని బలోపేతం చేసుకొనే వ్యూహంతో ముందుకు పోతున్నాయని వరుసగా జరుగుతున్న పరిణామాలు నిరూపిస్తున్నాయి. అదే విధంగా ప్రధాన పార్లమెంట్ శక్తులు కూడా మనల్ని ఉపయోగించుకొని కాలం చెల్లిన విధానాలతో పోరాడుతున్నామనే పేరుతో, పాత ప్రభుత్వ గద్దెనెక్కడానికి, ఆ తర్వాత విదేశీ అభివృద్ధి నిరోధకులతో కలిసి మన ఉద్యమాన్ని నాశనం చేసే వ్యూహంతో ముందుకు పోతున్నాయి. ఇటువంటి పరిస్థితిలో వాళ్ళ వ్యూహాత్మక కుట్రలను బహిర్గతపర్చడం, వాళ్ల మధ్య వైరుధ్యాలను ఉపయోగించుకుంటూ ప్రజలను సమీకరించి ప్రజా విప్లవాన్ని ఉన్నతస్థాయికి పెంపొందించడం మినహా విప్లవకారులకు మరో వ్యూహం ఏదీ ఉండదు" అని పేర్కొన్నారు.

ఈ అవగాహనలో భాగంగానే మావోయిస్టు పార్టీ తాత్కాలిక ప్రభుత్వం, రాజ్యాంగ సభ ఎన్నిక, రిపబ్లిక్ తదితర ఉమ్మడి డిమాండ్ల పై ఈ పార్టీలతో కలిసి ఉద్యమించింది, విజయమూ సాధించింది. అయితే రాజరికంపట్ల ఈ బూర్జువా పార్టీల మెతకవైఖరి ఇప్పుడు కూడా అర్థమౌతూనే వుంది. ఎన్నో దుర్మార్గాలకు పాల్పడిన చరిత్ర పాత ప్రభుత్వానిది. అది తాజా రాజరిక వ్యతిరేక ఉద్యమాన్ని కూడా తీవ్రంగా అణచివేతకు గురిచేసింది. ఇటువంటి అకృత్యాలకు పాల్పడిన మంత్రులనూ, సైనికాధికారులను అరెస్టు చేసి జైల్లో పెట్టవచ్చు, ఉరితీయవచ్చు కూడా. కానీ నూతన ప్రభుత్వం ఐదుగురు మంత్రులను అరెస్టు చేసి ప్రజలను మభ్యపెడుతున్నది.

అంతేకాదు మావోయిస్టు పార్టీ ప్రకటించిన 10 అంశాలతో కూడిన రోడ్ మ్యాప్ పథకంలో భాగమైన ప్రస్తుత ప్రభుత్వ, రాజ్యాంగ రద్దు, మధ్యంతర ప్రభుత్వ ఏర్పాటు, తమ సహచరుల విడుదల వంటి అంశాల మీద ఏడు పార్టీల మధ్యన అంగీకారం కుదరడం లేదు. ప్రస్తుత ప్రభుత్వ, రాజ్యాంగ రద్దు సాధ్యం కాదని కొందరు మంత్రులు బాహాటంగానే మాట్లాడుతున్నారు. అంటే చర్చలు ఎంతమేరకు జరుగుతాయనేది సందేహాస్పదమే.


ఒకవేళ ప్రస్తుత ప్రభుత్వం ప్రజాభిప్రాయాలకు లోబడి, మావోయిస్టులు ప్రకటించిన రోడ్ మ్యాప్‌పై అంగీకారానికి వచ్చి, చర్చలు జరుపుతే రేపు మావోయిస్టులు ప్రభుత్వంలోనూ రాజ్యాంగ సభలోనూ భాగస్వాములైతే, అప్పుడు ఏర్పడే రాజ్యాంగమూ, ప్రభుత్వమూ ప్రజలకు అనుకూలంగా వుంటుందనే గ్యారెంటీ ఏమీలేదు. ఎందుకంటే ఫ్యూడల్, బూర్జువావర్గ ప్రతినిధులైన మిగతా పార్టీలూ, అమెరికా సామ్రాజ్యవాదం, భారత పాలకవర్గాలూ తమ ప్రయోజనాలను దెబ్బతిననీయవు కనుక. అందుకే సి.పి.ఎన్ (మావోయిస్టు) బూర్జువా పార్లమెంటరీ వ్యవస్థను ఒక పరిష్కార మార్గంగా పరిగణించడం లేదు. దీన్ని ఒక విప్లవ దశగానూ భావించడం లేదు. ఈ పోరాటాన్ని ఒక ఎత్తుగడగా మాత్రమే ముందుకు తెచ్చాయి.

ఇక సమీప భవిష్యత్తులో జరుగబోయే పరిణామాలు పార్లమెంటరీ పార్టీల అసలు రంగును బయట పెడతాయి. ఫలితంగా ఈ బూర్జువా పార్లమెంటరీ పార్టీ పట్లా, పార్లమెంటరీ వ్యవస్థ పట్లా ప్రజల్లో వున్న భ్రమలు పూర్తిగా తొలిగిపోయే అవకాశం ఏర్పడుతుంది. ఈ అవకాశాన్ని వినియోగించుకొని నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని మరింత వేగంగా విజయవంతం చేయడానికి మావోయిస్టు పార్టీకి పరిస్థితి అనుకూలంగా పరిణమిస్తుంది.

❑

# హిమశిఖరాలను తాకిన నేపాల్ పోరు కెరటం

రాజుల యుద్ధోన్మాదమే చరిత్రగా ఒకనాడు చలామణిఅయ్యింది. కాని ఆ తర్వాత ఆ 'చరిత్ర'ను కూలదోయడమే అసలు చరిత్రగా ముందుకు వచ్చింది. ఆ చరిత్రను మరింత సంపద్వంతం చేస్తూ నేపాల్ ప్రజలు, ప్రజలే చరిత్ర నిర్మాతలన్న మావో సూక్తిని నిజం చేశారు.



శనివారం ఖాట్మండులోని రాజప్రాసాదం వైపు ప్రవాహంలా వస్తున్న ప్రజాస్వామ్య అనుకూల ప్రదర్శకులు

రాజును గద్దెదించాలనే ఏకైక లక్ష్యంతో మూడు వారాలపాటు నిర్విరామంగా పోరాడి వారు విజయం సాధించారు. సోషలిస్టు దేశాలు పెట్టుబడిదారీ దేశాలుగా మారిపోయిన తర్వాత 'చరిత్ర అంతమైంది', 'ప్రజా ఉద్యమాలకు అవకాశం లేదు', 'విప్లవాలు అనవసరం', 'పెట్టుబడిదారీ విధానమే శాశ్వతం' అని సామ్రాజ్యవాదులూ దాని తైనాతీలు చేస్తున్న ప్రచారాన్ని ఈ ప్రజాందోళన తుత్తునియలు చేసింది. సమకాలీన చరిత్రలో గొప్ప పోరాటంగా నిలిచి గతంలో జరిగిన అనేక గొప్ప విప్లవ పోరాటాలను తలపింప చేసింది. ఈ పోరాటంలో వెల్లువలా కదిలిన జనం ఎంతటి నిరంకుశ శక్తి అయినా ప్రజాశక్తి ముందు తలవంచక తప్పదని నిరూపించి ప్రపంచ ప్రజలందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారు.

అయితే ఈ పోరాటానికి బలమైన నేపథ్యం ఉంది. ఈ చారిత్రాత్మక పోరాటం ప్రజలు అనుభవించిన దుర్భరమైన జీవితంలోంచి పుట్టింది.

### నిరంకుశ రాజుల పాలనలో దుర్భరమైన ప్రజా జీవితం

ప్రపంచానికంతా రాజుల చరిత్ర గత కాలానికి సంబంధించినదైపోయింది. ప్రపంచ దేశాలన్నింటా రాజరికం పునాదులు కూలిపోయాయి. కాని నేపాల్‌లో రాచరికం నేటిదాకా బలంగా వేళ్ళూనుకొని వుంది. ఫలితంగా అక్కడ ఉత్పత్తి శక్తులు కుంటుబడి దారిద్ర్యం రాజ్యమేలుతున్నది. 1,47,181చ.కి.మీ విస్తీర్ణమూ, 2.46కోట్ల జనాభా వున్న నేపాల్‌లో 70 శాతం ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువన వున్నారు. తలసరి జాతీయోత్పత్తి 180 డాలర్లు. అంటే ప్రపంచంలో ఇది చివరి నుండి రెండవ స్థానం. ఇక ఇక్కడ దోపిడీకి కొదవేలేదు. జాతీయ ఆదాయంలో 46.5 శాతం ఆదాయాన్ని జనాభాలో 10 శాతంగా వున్నవారు హస్తగతం చేసుకుంటున్నారు. 65 శాతం సాగుభూములు ఈ 10 శాతం మంది చేతుల్లోనే వున్నాయి. ఈ దారిద్ర్యం నుంచి తప్పించుకునే మార్గంగా బతుకుదెరువు కోసం నేపాల్ ప్రజలు భారతదేశానికి వలస రావడం అనేది ఒక సాధారణ రూపంగా వుంది.

ఇక్కడి రాజరికాన్ని ఆసరా చేసుకొని అమెరికా, బ్రిటన్ వంటి సామ్రాజ్యవాద దేశాలు నేపాల్‌ను తమ చెప్పుచేతల్లో ఉంచుకుంటున్నాయి. ముఖ్యంగా భారతదేశం విస్తరణవాద కాంక్షతో నేపాల్ పై పెత్తనం చేస్తున్నది. ఈ దేశపు సహజ వనరులను కొల్లగొడుతోంది. అంతేగాక నేపాల్‌ను స్వంత మార్కెట్‌లాగా ఉపయోగించుకుంటున్నది. ఇట్లా మార్కెట్‌గా ఉపయోగించుకోవడం కోసం 1950లో రెండు దేశాల మధ్య 'శాంతి-స్నేహ ఒప్పందం' పేరిట ఒక ఒప్పందం జరిగింది. దీని ప్రకారం నేపాల్ ప్రజలకు అవసరమైన పారిశ్రామిక ఉత్పత్తులన్నీ భారతదేశం నుంచి సరఫరా అవుతాయి. నేపాల్‌లో పరిశ్రమల ఏర్పాటు అభివృద్ధిని తీవ్రంగా దెబ్బతీసింది ఈ ఒప్పందం. 1965లో చేసుకున్న ఒక ఒప్పందం ప్రకారం నేపాల్ సైన్యానికి అవసరమైన ఆయుధాలు, మందుగుండును భారత్ సప్లయ్ చేయాలి. ఇట్లా భారతదేశం నేపాల్‌లో ఒక స్వతంత్ర్య ఆర్థిక వ్యవస్థ ఏర్పడకుండా అడ్డుకుంటున్నది. ఫలితంగా తమ దేశ అభివృద్ధిలో భాగం కావాల్సిన నేపాల్ యువత భారతదేశంలో వలస కూలీలుగా భారత దళారీ బూర్జువా వర్గానికి తమ శ్రమను చౌకగా అమ్ముకుంటున్నది.

( తరువాయి 57వ పేజీలో......)